# నిజమైన
# శిష్యత్వము

విలియం మెక్ డొనాల్డ్

అనువాదం :
రెవ. విక్టర్ పి.యల్. ఆంజనేయులు

GOSPEL FOR ASIA
PUBLICATIONS
Tiruvalla, Kerala, India

NIJAMAINA SHISHYATHVAMU
Telugu
Translation of the book, 'True Discipleship' by
William MacDonald
ISBN 81 - 7377 - 085 - 9
Copyright 2000 Author
First Impression 2000
Printed in India
Price Rs. 72.00

# ముందు మాట

కొన్నినూతననిబంధన శిష్యత్వ సూత్రాలను వెలుగులోకి తేవటమే ఈ చిరుపుస్తక ప్రయత్నము. మాలో చాలామందిమి-వాక్యములో నిక్షిప్తమైన ఈ సూత్రాలను సంవత్సరాల తరబడి చూస్తూనే వచ్చాం. మనం జీవిస్తున్న ఈ సంకట తరంలో పాటించుటకు ఇవి మరీ హెచ్చు స్థాయిలో వున్నాయనీ, క్రియాత్మకంగా కూడా లేవనీ ఏదో విధంగా మన మొక నిర్ణయానికి వచ్చాం. తత్కారణంగా మన ఆధ్యాత్మిక జీవితాలు శీతల వాతావరణానికి అప్పగింప పడ్డాయి.

అటు పిమ్మట మేము కొందరు యువ విశ్వాసుల్ని కలిశాము. రక్షకుడు ప్రకటించిన శిష్యత్వనియమాలు అత్యంత క్రియాత్మకములేగాక అవి ప్రపంచ సౌవార్తీ కరణను ప్రతిఫలింప జేసేవిగా కూడా వుంటాయని వారు ప్రయోగాత్మకముగా చేసి చూపెట్ట నారంభించారు.

ఇందులో ఉదహరించబడిన ఆనేక సత్యాలకు సంబంధించి సజీవ ఆదర్శాలను మాకు అందించి, సహకరించిన ఈ యువకులకు మేమెంతో రుణపడి వున్నామని తెలియ జేస్తున్నాము.

ఈ సత్యాలు ఇంకా మాసొంత వ్యక్తిగత అనుభవాలుగా మారక పోయినప్పటికీ వీటిని మా హృదయ వాంఛలుగా పాఠకుల ముందు వుంచుతున్నాము.

– విలియం మెక్ డొనాల్డ్

# పరిచయము

ఒక వ్యక్తి తిరిగి జన్మించినప్పుడు నిజ శిష్యత్వానికి కాలిబాట ఆరంభమవుతుంది. ఆరంభంలో ఈ క్రింది సంఘటనలతో అది మొదలవుతుంది :

1) ఒక వ్యక్తి తాను పాపియనీ, తప్పి పోయిన వాడనీ, గ్రుడ్డి వాడనీ, దేవుని ముందు దిగంబరుడనీ గుర్తెరిగినప్పుడు.

2) తన సౌశీల్యత చేత గానీ, సత్క్రియల వలన గానీ తన్నుతాను రక్షించుకొన జాలడని గుర్తించి నప్పుడు.

3) పాపి యైన తనకు బదులు, తన స్థానంలో యేసు క్రీస్తు ప్రభువు శిలువ పై మరణించాడని విశ్వసించినప్పుడు.

4) ఒక నిర్దిష్ట తీర్మానము మూలంగా యేసు క్రీస్తును ఏకైక ప్రభువుగానూ, రక్షకుడిగానూ అతడు గుర్తించినప్పుడు.

ఈ విధంగా ఓ వ్యక్తి క్రైస్తవుడవుతాడు. ఆరంభంలోనే ఈ సత్యాన్ని నొక్కి చెప్పటం చాలా ముఖ్యము. నీవు క్రైస్తవ జీవితం జీవించటము ద్వారా నీవు క్రైస్తవుడవవుతున్నావని చాలా మంది భావిస్తారు. అలా కానే కాదు ! క్రైస్తవ జీవితం ఆరంభించక ముందే నీవు మొట్ట మొదట క్రైస్తవుడివి కావాలి.

రాబోయే ఈ పుస్తక పుటల్లో పేర్కొన బడిన శిష్యత్వ జీవితం, ఒకానొక సహ జాతీతమైన జీవితము. ఈ జీవితాన్ని అనుభవ పూర్వకంగా జీవించుటకు అవసరమైనంత శక్తి మనలో లేదు. మనకు దివ్య శక్తి కావాలి. మనము తిరిగి జన్మించి నప్పుడు మాత్ర మే యేసు క్రీస్తు బోధించిన ప్రకారం జీవించేందుకు అవసరమైన బలం మనం పొందుకుంటాము.

ఈ పుస్తక పఠనలో ముందుకు సాగక ముందు నిన్ను నీవు ఈ విధంగా ప్రశ్నించుకో,'' నే నెన్నడైనా తిరిగి జన్మించానా? యేసు క్రీస్తు నందు విశ్వాసముంచుట ద్వారా నేను దేవుని బిడ్డగా మారానా ?''

ఈ అనుభవాన్ని ఇంకా సంతరించుకోకపోతే, ఇప్పుడే నీవు ఆయన్ను నీ ప్రభువుగానూ, రక్షకుడి గానూ స్వీకరించు. ఆతర్వాత ఆయన ఆజ్ఞలన్నింటికీ విధేయత చూపుటకు నిశ్చయించుకో; అది ఎంత ఖరీదైనా సరే !

- విలియం మెక్ డొనాల్డు

# శిష్యత్వపు నియమాలు

నిజమైన క్రైస్తవత్వమనేది ప్రభువైన యేసుక్రీస్తుకు జీవితాన్ని బహిరంగంగా అప్పగించుకోవటమే. తమ సాయంకాల తీరిక సమయాలను - లేదా, తమ వారాంతాలను - లేదా, తమ ఉద్యోగ విరమణ తరువాయి జీవితాలను ప్రభువుకు ఇచ్చివేసేందుకు ఇష్టపడే కొంత మంది స్త్రీ , పురుషుల కోసం రక్షకుడు ఎదురుచూడటం లేదు. తమ జీవితాల్లో అయనకు ప్రథమ స్థానం ఇవ్వాలని ఆశిస్తున్న వారి కోసం దేవుడు వెదుకుతున్నాడు. ''ఆయన ఎల్లప్పుడూ ఆకాంక్షించినట్లే- ఈ నాడు కూడా దైవ మార్గంలో గమ్యం లేకుండా కొట్టుమిట్టాడు తున్న జనసమూహాల కోసం కనిపెట్టటం లేదు గానీ, తాను వారిముందు నడిచి చూపించిన స్వయం- విసర్జన (త్యాగ) పథాన్ని అవలంబించుటకు తాముకూడా సిద్ధపడి వుండాలని ప్రభువు ఆశిస్తున్నాడని గుర్తెరిగిన జీవితాల నుండి పెల్లుబికి వచ్చే సజీవ సంబంధ ప్రవాహం గల కొందరు విడి విడి స్త్రీ పురుషులకోసం ఆయన చూస్తున్నాడు'' [1] **ఎచ్. ఎ. ఇవాన్ హాప్ కిన్స్.** ఆయన కల్వరిగిరిపై చేసిన త్యాగానికి సరిగ్గా సరి పోయే స్పందన - బేషరత్తుగా స్వయం సమర్పణ చేసుకోవటం కన్నా మించి మరేదీ కాదు. మన ఆత్మలతోనూ, జీవితాలతోనూ, మన సమస్తము తోనూ, మరి దేని తోనూ సంతృప్తి చెందని ఆశ్చర్యకరమైన, దివ్యప్రేమ అది.

శిష్యులైన వారికి యేసు ప్రభువు కఠిన నియమాలను నిర్దేశించాడు

1. ఐ.వి.యఫ్. 1954 పుట 20.

- అయితే సుఖభోగ సమ్మిళితములైన ఈ నాటి జీవితాల్లో ఇటువంటి నిబంధనలు సంపూర్ణంగా తృణీకరింప బడ్డాయి. తరచుగా మనం క్రైస్తవ్యాన్ని నరకం నుంచి తప్పించుకునే ఒక మార్గంగానూ, పరలోక ప్రాప్తి విషయంలో ఓ నిశ్చయత గానూ దృష్టిస్తావు. అంత మాత్రమేగాక, ఈ లోకమిచ్చే సమస్త సుఖ భోగాలు అనుభవించి, ఆనందించుటకు మనకు సర్వహక్కులున్నాయని కూడా మనం భావిస్తాం. శిష్యత్వమును గూర్చి బైబిల్లో కఠినమైన క్రమశిక్షణా పూరిత లేఖన భాగాలున్నాయని, అయితే క్రైస్తవం విషయంలో మనకున్న ఆలోచనా ధోరణిలో వాటితో మనం రాజీ పడటం అతి కష్టముగా వున్నదని మనకు తెలుసు.

సైనికులు దేశ భక్తి కోసం తమ ప్రాణాలు సమర్పిస్తారని మనమందరం సమ్మతిస్తాము. కమ్యూనిష్టులు రాజకీయాల కోసం తమ ప్రాణాలు ఫణంగా పెడతారని భావించుట పెద్ద వింతవిషయ మేమీ కాదు. ఒక క్రీస్తు అనుచరుని జీవితంలో స్వభావ సిద్ధంగా వుండాల్సిన ''రక్తం, చెమట మరియు కన్నీరు'' ఈ నాడు కంటికి కనిపించటం లేదు, వాటిని గూర్చిన అవగాహన కూడా కష్ట సాధ్యమై పోయింది.

అయినప్పటికీ యేసు ప్రభువు మాటలు మాత్రం తగినంత స్పష్టముగానే వున్నాయి. ముఖవిలువ ఆధారంగా వాటిని మనం ఒప్పుకున్నపక్షంలో అపార్థానికి ఎటువంటి తావు వుండనేవుండదు.

లోక రక్షకుడు నియమించిన శిష్యత్వపు నిబంధనలు ఈ క్రింద పొందుపర్చ బడ్డాయి :



**1. యేసు క్రీస్తు కోసం విశిష్ట ప్రేమ :**

**''ఎవడైనను నాయొద్దకు వచ్చి తన తండ్రిని, తల్లిని, భార్యను పిల్లలను అన్నదమ్ములను అక్కచెల్లెండ్రను తన ప్రాణమును సహా ద్వేషింపకుంటే వాడు నా శిష్యుడు కానేరడు'' (లూకా 14:26).** అంత మాత్రంచేత మన హృదయాల్లో బంధువులయెడల భయంకర శత్రుత్వముగానీ, ద్వేషభావము గానీ నిండివుండాలని దీనిభావముకాదు గానీ క్రీస్తుపై మనకున్న ప్రేమతో పోల్చినప్పుడు ఇతరప్రేమలన్నీ ద్వేషములుగానే కనబడాలి. వాస్తవానికి ఈ వాక్యభాగంలోని అతిక్లిష్టమైన సూత్రం ఏమిటంటే అందులో వినయోగించబడిన ఉచ్చారణ విధానమే, ''తన ప్రాణమును సహా'' అను పదజాలము. శిష్యత్వం ఎదుర్కొనే అత్యంత మొండి ఆటంకాలలో ''స్వయంప్రీతి'' అనేది ఒకటి. ప్రభువుకోసం మన ప్రాణాలు సయితం అర్పించేందుకు సిద్ధం కానంతవరకు ఆయన వుండమని చెప్పిన స్థలంలో మనం వుండజాలము.

**2. స్వయం ఉపేక్ష :**

**''ఎవడైనను నా వెంబడి రాగోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని...'' (మత్తయి 16:24).** స్వయం ఉపేక్ష అంటే స్వార్థరాహిత్యం లాంటిది కాదు. స్వార్థరాహిత్యమంటే ఏవో కొన్ని పదార్థాలు తినకుండా మానివేయుట, కొన్ని సుఖాలకు దూరంగా వుండుట, లేక కొన్నిటిని సంపాయించుకోవటం మానుకొనుట మాత్రమే. కానీ స్వయం - ఉపేక్ష అంటే క్రీస్తు అధికారానికి సంపూర్ణంగా అప్పగించుకొనుట. ఇంతెంత మాత్రము, మానవ అహమునకు హక్కులుగానీ, అధికారాలు గానీ వుండనే వుండవు. స్వార్థము సింహాసనాన్ని విడిచిపెట్టుట అని దీని భావము. హెన్రీ మార్టిన్

ఇలావ్యక్తపర్చాడు, "ప్రభువా, నా సొంత ఇష్టం నాలో వుండనీయకు; లేదా బాహ్యాలోకమునుండి నాపైబడు దేనిలోనూ నేను కొంచెంకూడా సంతోషించకుండా వుండేలా నాకు సహాయంచేయి; కానీ, నీచిత్తానికి నన్ను నేను సంపూర్ణంగా అప్పగించుకొనుటకు నాకు నీ కృప అనుగ్రహించు."

నా మహిమాన్విత విజయా, దివ్యరాజకుమారా,
లొంగిపోయిన ఈ హస్తాలను నీలో హత్తుకో ఇక
నా చిత్తం సమస్తమూ నీ సొంతమే, రక్షకుడి
సింహాసనం చెంత ఆనందదాసులు.

- ఎచ్. జి. సి. మోలే

**3. బాహాటంగా శిలువను ఎంచుకోవటం :**

" ఎవడైనను నావెంబడి రాగోరినయెడల తన్నుతాను **ఉపేక్షించుకొని తన సిలువనెత్తుకొని." (మత్తయి 16:24).** శిలువ అంటే ఏదో శరీర రుగ్మతగానీ, మానసిక క్షోభగానీ కాదు; ఇవి సర్వమానవులకూ సామాన్యవిషయాలే. శిలువ అనేది బాహాటంగా ఎంచుకున్న జీవనబాట. ఇది, **"ఈ లోక విధానంలో అగౌరవమైనది, అవమానకరమైనది"** సి.ఎ.కోట్సు. శిలువ సిగ్గుకు, శ్రమకు, దూషణకు గుర్తుగావుంది. వీటినే ఈ లోకము దేవుని కుమారుడిపై కుప్పలుగా కుమ్మరించింది. కెరటానికి ఎదురు నిల్చుటకు కంకణం కట్టుకున్న ఎవరిమీదనైనా ఈ లోకం వీటినే కమ్మరిస్తుంది. లోకాన్ని, లోక మార్గాల్ని అంటిపెట్టుకున్న ఏ విశ్వాసియైనా శిలువను అతిసులువుగా తప్పించుకోవచ్చు.



**4. క్రీస్తు అనుసరణలో గడిపిన జీవితం :**

**"ఎవడైనను నావెంబడి రాగోరిన యెడల తన్నుతాను ఉపేక్షించుకొని, తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను" (మత్తయి 16:24).**

దీని అర్థమేమిటో ఎవరైనా తెలుసుకోవాలంటే తనకు తాను ఈ ప్రశ్నవేసుకోవాలి. " యేసుప్రభువు జీవితస్వభావాన్ని వర్ణించింది ఏమిటి?" ఆ జీవితం దైవచిత్తానికి విధేయత చూపిన జీవితం. అది పరిశుద్ధాత్మ శక్తిలో జీవించిన జీవితం. అది పరుల కోసం ప్రతిఫలాపేక్షలేని పరిచర్యచేసిన జీవితం. దారుణఅపరాధాలు ఎదురైనప్పుడు సహనం, దీర్ఘ శాంతులతో జీవించిన జీవితం. త్యాగము, ఆశానిగ్రహము, సాత్వికము, దయాళుత్వము, నమ్మకత్వము మరియు ఆరాధనలకోసం ఆసక్తి కనుపర్చిన జీవితం (గలతీ, **5:22, 23**). **మనము ఆయన శిష్యులముగా వుండాలనుకుంటే ఆయన నడిచిన విధంగా మనముకూడా నడవాలి. క్రీస్తు స్వభావమును పోలిన ఫలాన్ని మనము ప్రదర్శించాలి (యోహాను 15 : 8).**

**5. క్రీస్తుకుచెందిన వారందరిపై అచంచల ప్రేమ :**

**" మీరు ఒకని యెడల ఒకడు ప్రేమగలవారైన యెడల దీనిబట్టి మీరు నా శిష్యులని అందరును తెలుసుకొందురు" (యోహాను 13:35).** ఇది ఇతరులను తనకంటే ఉన్నతంగా హెచ్చించే ప్రేమ. ఇది విస్తారమైన పాపాల్ను, అపరాధములను కప్పిపుచ్చే ప్రేమ. ఇది దీర్ఘశాంతము, దయాళుత్వము గలప్రేమ. ఇది తనగూర్చి తాను డంబములాడదు; ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు;

స్వప్రయోజనమును విచారించు కొనదు; త్వరగా కోపపడదు; దుర్నీతి విషయమై సంతోషించదు; అన్నిటిని తాళుకొనును; అన్నిటిని నమ్మును; అన్నిటినీ నిరీక్షించును; అన్నిటిని ఓర్చుకొనును (**1కొరింథీ13:4 - 7**) ఇటు వంటి ప్రేమ లేకపోతే శిష్యత్వము కేవలం ఒక శీతల శాసనాత్మక సాంప్రదాయక సన్యాసంలాగే వుంటుంది.

**6. దైవ వాక్యములో ఏకాగ్రతతో నిలుచుట:**

**" మీరు నావాక్యమందు నిలిచిన వారైతే నిజముగా నాకు శిష్యులైయుండి" (యోహాను 8 : 31).** నిజమైన శిష్యత్వంలో కొన సాగింపు వుండితీరాలి. ఆరంభించటం, వైభవోపేతంగా ముందుకు సాగటం సులభమైన కార్యాలే. అయితే, అసలైన వాస్తవ పరీక్ష - చివరిదాకా భరించి ఓపికతో నిలుచుటే. "నాగటిపై చెయ్యి వేసి వెనుక తట్టు చూచువాడు ఎవడును దేవుని రాజ్యమునకు అర్హుడు కాడు" (లూకా **9:62**). లేఖన వాక్యములకు అయిష్ట పూర్వకమైన విధేయత అసలు పనిచేయదు. తనను వెంబడించు వారందరూ నికరముగా నిలిచి వుండు వారుగానూ, ఎదురు ప్రశ్న వేయకుండా, విధేయత కలిగిన వారుగానూ వుండాలని క్రీస్తు ఆశిస్తున్నాడు.

వెనుదిరుగ కుండా నన్ను కాపాడు ;
నా నాగటి కొమ్ములు కన్నీటితో తడిసివున్నాయి;
కర్రులు తుప్పు పట్టి పాడై పోయాయి,
అయినా- నా దేవా ! నా దేవా ! వెను దిరుగ కుండా
నన్ను కాపాడు.



**7. ఆయనను వెంబడించుట కోసం సమస్తమును విడిచి పెట్టుట:**

**" ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతయు విడిచి పెట్టని వాడు నా శిష్యుడు కానేరడు" (లూకా 14:33).** బహుశా, శిష్యత్వము గూర్చి క్రీస్తు నిర్దేశించిన నియమములన్నింటి లోనూ అత్యధిక అపఖ్యాతి పొందిన నియమము ఇదే కావొచ్చు; అదే విధంగా బైబిలంతటిలోనూ అత్యం అయిష్టతకు గురైన లేఖన వాక్యముగా ఈనియమము నిరూపితమై వుండొచ్చుకూడా. తెలివైన వేదాంత పండితులు, దీని అసలు భావము అది కాదని వెయ్యి కారణాలు చూపగలరు, కానీ సామాన్య శిష్యులు మాత్రం - తాను ఏమి చెబుతున్నాడో యేసు ప్రభువుకు బాగా తెలుసని భావించి - దీనిని వున్నది వున్నట్టుగానే స్వీకరిస్తారు. సమస్తమును విడిచి పెట్టుట అంటే భావ మేమిటి? సువార్త ప్రకటనలో ఉపయోగ్యములైనప్పటికీ, శిష్యత్వములో మాత్రం అత్యవసరములు కానటు వంటి ఇహలోక ఆస్తిపాస్తులు, వస్తు సామాగ్రులను ఒకడు తన జీవితంలో సంపూర్ణముగా విసర్జించుట అని దీని భావము. సమస్తమును విడిచి పెట్టువాడు పని లేని సోమరి పోతు మాత్రం కాడు. తన కోసం, తన కుటుంబం కోసం దైనందిన అవసరతలు తీర్చు కొనుటకు గాను అతడు ఎంతో కష్టపడి పనిచేస్తాడు. క్రీస్తు కోసమైన కార్యముల్లో ముందుకు సాగుటే అతని జీవితాసక్తి కావటం చేత తాను ప్రభువు పనిలో దైనందిన అవసరతల్ని అధి గమించి సమస్తం ఖర్చు చేస్తాడు; అటు పిమ్మట భవిష్యత్తును దేవునికి విడిచి పెడతాడు. మొదట అయన రాజ్యమును, నీతిని వెదకుట వలన తనకు అన్న వస్త్రముల లోపము ఎన్నడూ వుండ బోదని అతడు గట్టిగా నమ్ముతాడు. సువార్త లేమితో అత్మలు నశిస్తున్న సమయంలో అతడు మనస్సాక్షి పూర్వకంగా అధిక ధనమును గట్టిగా పట్టుకొని వుండ జాలడు. తన భక్తుల కోసం క్రీస్తు మళ్ళీ వచ్చినప్పుడు సాతాను చేతుల్లో పడిపోయేధన కనక

వస్తువాహనాదుల్ని సంపాయించు కోవటంలో తన జీవితాన్ని వృధా చేసుకోడు. భూలోకంలో ధనసంపాదనకు వ్యతిరేకంగా నిర్దేశించబడిన ప్రభువు ఆజ్ఞకు విధేయుడుగా వుండాలని అతడు ఆశిస్తాడు. సమస్తమును విడిచి పెట్టి ఆకార్యములో తాను ఏవిధంగానూ వుంచుకోలేని, తాను ఇంకెంత మాత్రము ప్రేమించ లేని వాటిని అతడు అర్పిస్తాడు.

• • •

కాబట్టి ఈ ఏడు క్రైస్తవ శిష్యత్వ నియమ నిబంధనలు బహుస్పష్టములు, నిస్సందేహాత్మకములు. వీటిని వెల్లడి చేసే ప్రయత్నంలో తానొక నిరుప యోగ సేవకుడిగా ఈ గ్రంథ రచయిత తన్నుతాను నిందించుకున్నాడు. అయితే దేవుని ప్రజల ఓటమి కారణంగా దైవ సత్యం శాశ్వతంగా అణచివేయ బడుతుందా? సందేశకుడి కన్నా సందేశమే ఎల్లప్పుడు మిన్న అనుమాట నిజంకాదా? దేవుడు మాత్రమే సత్యవంతుడు, ప్రతి మానవుడూ అబద్ధికుడే అను మాట సరైనది కాదా? ''నేను ఏమీ చేతగాని వాడ్ని, అయినప్పటికీ - నీచిత్తమే సిద్ధించు గాక'' అను పాత కాలపు సాంప్రదాయ పదంతో మనము ఏకీభవించకూడదా ?

మన గత అపజయాన్ని ఒప్పుకుంటూ మనపై వున్న క్రీస్తు హక్కుల్ని, ఆజ్ఞల్ని ధైర్యంగా ఎదుర్కొందాం, మహిమాన్వితమైన మన ప్రభువుకు నిజ శిష్యులుగా వుండేందుకు ఆశిద్దాం.

నా యజమానుడా, నీ తలుపు దగ్గరకు నన్ను నడిపించు.
ఇష్టపడుతున్న ఈ చెవిని ఇప్పుడు మరోసారి గుచ్చు.
నీబంధములు స్వేచ్ఛా స్వతంత్రములే;
శ్రమించుటకు, భరించుటకు, విధేయత చూపు టకు
నన్ను నీతో వుండనీ.

-ఎచ్. జి. సి. మౌలే

# సమస్తమును విడిచి పెట్టుట

''ఆ ప్రకారమే మీలో తనకు కలిగిన దంతయు విడిచి పెట్టనివాడు నా శిష్యుడు కానేరడు'' (లూకా **14:33**).

యేసు ప్రభువుకు శిష్యుడుగా వుండాలను కున్నవాడు, అన్నింటినీ విడిచి పెట్టాలి. రక్షకుడి మాటల్లో పొరపాటు లేని సరైన భావం ఇదే. హక్కులోని ''తీవ్రత'' ను మన మెంత అభ్యంతరపర్చినప్పటికీ 'అసాధ్యమైన', 'అవివేకమైన' ఈ విధానమును మన మెంత వ్యతిరేకించి నప్పటికీ ఇది ప్రభువు మాట అనే ఫలితార్థము మాత్రము అలాగే మిగిలి పోతుంది; అయన చెబుతున్న దేమిటో, దాని భావం ఏమిటో అయనకు బాగా తెలుసు.

ఆరంభంలోనే ఈ క్రింద పేర్కొన్న కొన్ని సత్యాల్ను మనం తప్పనిసరిగా ఎదుర్కొని తీరాలి. ఈ సత్యాలు ఎన్నడూ తలవంచనివి, లొంగనివి.

అ) క్రైస్తవ పనివారిలో ఎంపిక చేయబడ్డ ఒక వర్గం వారికి మాత్రమే యేసు ఈ నిర్దేశం ఇవ్వటం లేదు. ''మీలో ఎవడైనను...'' అని ఆయన అన్నాడు.

ఆ) అన్నింటినీ విడిచి పెట్టుటకు మనం సర్వదా సంసిద్ధమై వుండాలని అయన మనకు చెప్పలేదు. ''మీలో... విడిచి పెట్టని వాడెవడైనను''... అని ఆయన అన్నాడు.

ఇ) మన ధన సమృద్ధిలో ఒక భాగం మాత్రమే మనం విడిచి పెట్టాలని ఆయన చెప్పలేదు. ''మీలో ఎవడైనను తనకు కలిగిన దంతయు విడిచి

పెట్టని యెడల...'', అని ఆయన అన్నాడు.

ఈ) తన ఆస్తి పాస్తులను, ధనమును అంటి పెట్టుకొని వుండేవాడు శక్తి హీన మైన శిష్యత్వము కలిగి వుంటాడని ఆయన చెప్ప లేదు ''వాడు నా శిష్యుడు కానేరడు,'' అని యేసు ఖచ్చితంగా చెప్పాడు. వాస్తవానికి బైబిల్లో ఇటువంటి అధికారయుత మైన నిర్దేశం ఇదొక్కటే నని మనం అశ్చర్యపోకూడదు.

యేసు ఈ క్రింది విధంగా చెప్పలేదా ?

'' భూమి మీద మీ కొరకు ధనమును సమకూర్చుకొనవద్దు; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును. దొంగలు కన్నము వేసి దొంగిలెదరు. పరలోక మందు మీ కొరకు ధనమును సమకూర్చుకొనుడి'' (మత్తయి **6:19-20**).

ఈ విషయంలో వెస్లీ భక్తుడు సరిగ్గా వక్కాణించాడు; ''భూలోకంలో ధనము కూడబెట్టుట అనే కార్యాన్ని మన ప్రభువు, - వ్యభిచారము, నరహత్యల వంటి పాపాలతో సమానంగా ఎంచి మొహమాటం లేకుండా నిరసించాడు.''

యేసు ఇలా కూడా చెప్పలేదా? :

'' మీకు కలిగిన వాటిని అమ్మి ధర్మము చేయుడి....'' (లూకా **12:33**).

యువకుడు, ధనవంతుడైన అధికారిని యేసు ఇలా హెచ్చరించలేదా? :

'' నీకు కలిగినవన్నియు అమ్మి బీదలకిమ్ము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును, నీవు వచ్చి నన్ను వెంబడించుము (లూకా **18:22**).''



తాను చెప్పింది ఏమిటో తనకే అర్థం కాకపోతే ఇక ఆయన భావమేమిటి?

ఆది సంఘంలోని విశ్వాసులు చేసిన పని వాస్తవంకాదా? ''వారు తమ చరస్థిరాస్తులను అమ్మి అందరికిని వారి, వారి అక్కరలకొలది పంచి పెట్టిరి. '' (అపొ. కా. **2:45**)

అంతేగాక, గతంలో సంవత్సరాలతరబడి దేవుని భక్తులు యేసును వెంబడించుట కోసం మిగతా వాటినన్నిటినీ అక్షరాలా విడిచిపెట్టిన విషయం యదార్థంకాదా?

బాగ్దాద్‌కు మొట్టమొదట మిషనెరీలుగా వెళ్ళిన అంథోనీ నారీస్ గ్రోవ్స్, ఆయన సతీమణి ఈ విషయాన్ని స్వీకరించారు, ''తాము భూలోకంలో ధనము కూర్చుకోవటము మాని, వారికిగల సమృద్ధమైన ఆదాయాన్ని... ప్రభువు సేవకు సమర్పించాలని తీర్మానించుకొన్నారు.''[1] ఈ విషయంలో గ్రోవ్స్‌గారి దృఢనమ్మకాలు ''క్రైస్తవ భక్తి జీవితము'' అనే తన చిరుపొత్తములో పొందుపర్చాడు.[2]

సి.టి. స్టడ్ ''తన భాగ్యమంతటినీ క్రీస్తుకు ఇచ్చివేసి, బైబిలు గ్రంథంలో - లభించిన తరుణాన్ని పోగొట్టుకున్న ధనవంతుడైన యువకుడి స్థానంలో తన అవకాశాన్ని వినియోగించుకోవాలని నిశ్చయించుకున్నాడు... ఇది దేవుని వాక్యానికి అక్షరార్థమైన సామాన్య విధేయత మాత్రమే.''[3]

ప్రభువు సేవకోసం వేలాది డాలర్ల ద్రవ్యం వెంచ్చించిన పిమ్మట

1. ''ఆయన పడి చేతి వైపున వున్న మనషులు,'' డివిడెన్స్ మాగజైన్, జనవరి 1961
2. వాల్టరిక్ పబ్లిషర్సు, బాక్సు 2216, కె సి కె 66110
3. గ్రబ్బ్, నార్మన్, సి.టి.స్టడ్. లుట్టర్ వర్తు ప్రెస్, 1957, పేజీ 64

ఆమెుత్తానికి సమానమైన డబ్బు **9588** డాలర్లు తనకు కాబోయే పెండ్లికూతురు కోసం దాచిపెట్టాడు. దాతృత్వం విషయంలో ఆయువతి తన భర్తను మించిపోయింది. ''చార్లీ, ధనవంతుడైన యువకుడితో ప్రభువు ఏమి చెప్పాడు?'' ఆమె తన భర్తను నిలదీసి అడిగింది.

''ఉన్నదంతా అమ్మివేయుమని'', అతడు జవాబిచ్చాడు. ''అలాగైతే, మనం మన వివాహ సమయంలోనే ప్రభువుతో స్పష్టమైన జీవితం ఆరంభిద్దాం'', అంతే - ఫలితంగా, దాచిపెట్టిన ఆ డబ్బంతా క్రైస్తవపరిచర్యలకు విరాళంగా పంపటం జరిగింది.

జిమ్ ఎల్లియట్ జీవితంలో కూడా ఇదే భక్తి భావము సజీవంగా ప్రదర్శితమైంది. అతడు తన డైరీలో ఇలా వ్రాసుకున్నాడు.

''తండ్రీ, అశాశ్వతమైన ప్రతి దానిపై నాకున్న అధికారాన్ని నేను కోల్పోయి, బలహీనుడినయ్యేలా నాకు సహాయంచేయి. ప్రభువా, నాజీవితం, కీర్తి ప్రతిష్టలు, ఆస్తులు - వీటన్నిటినీ ఆశించి అందుకోవాలని చావుతున్న నా చేతి ఉద్రిక్తత నుండి బైట పడేలా నాకు సహాయంచేయి. తండ్రీ, వీటిపై నాకున్న ప్రీతి భావాన్ని కూడా నేను కోల్పోతాను. ప్రమాద రహిత కోరికతోనూ, ప్రీతికరమైన స్పర్శతోనూ నేను తరచుగా శాశ్వత మైన వాటినే అందుకున్నాను. దీనికి బదులు, ప్రస్తుతం నన్ను బంధించివున్న పాశములన్నింటి నుండి కట్లు త్రెంచు కొని, నాతో పాటు అందరూ విడుదల పొందాలనే దీక్షతో చాప బడిన క్రీస్తు చెయ్యివలె కల్వరి మేకును స్వీకరించుటకు నా చేతిని చాపుతాను. ఏ పాశమూ లేని పరలోకము, దేవునితో సమాన స్థానమని ఆయన భావించినందుచేత నన్ను దానిని అందుకోనివ్వు.'' [4]

4. ఎల్లియాట్, ఎలిస బెతు, సర్వశక్తుని నీడ, హార్పర్ & బ్రదర్స్ **1958**, పేజీ **246**



ప్రభువు మాటల్ను వున్నపాటున స్వీకరించి, అక్షరాలా పాటించుట బహుదుర్లభ కార్యమని మన అవిశ్వాసహృదయాలు మనకు దుర్బోధ చేస్తూవుంటాయి. ఉన్నసమస్తం విడిచి పెడితే, ఇక మనం పస్తులుండవలసిందే, ఆకలితో ఆలమటించి చావాల్సిందే. కనీసం మన భవిష్యత్తుకోసం, మన ప్రియుల భవిష్యత్తుకోసం కొంతైనా సంపాదించి. సమకూర్చిపెట్టాలి గదా ! క్రైస్తవులందరూ తమకున్న సమస్తాన్ని వదిలి వేస్తే ఇక ప్రభువు పని నిమత్తం ద్రవ్యసహాయం ఎవరు చేస్తారు ? ధనవంతులైన క్రైస్తవులు కొంత మందైనా లేక పోతే సమాజంలోని ఉన్నత స్థాయి ప్రజలకు సువార్త ఎలా అందుతుంది ? అంచేత ఈ సందర్భంగా ఇటువంటి వాదముల వరద ముంచుకొస్తుంది. యేసు ప్రభువు తన బోధనల్లో చెప్పిన మాటలన్నీ వాస్తవానికి ఆయన హృదయపు లోతుల్లోంచి వెలువడిన ఉద్దేశాలు కాక పోవొచ్చు అని రుజువు చేయుటంకోసమే ఇదంతా.

దేవుని ఆజ్ఞకు విధేయత చూపుటే అసలైన ఫలితార్థము; హేతుబద్ధ జీవితము కూడా - అటువంటి జీవితంలో మహదానందం పంటగా పండుతుంది. క్రీస్తు కోసం త్యాగ పూరిత జీవితాలు జీవించిన వారు, ఎన్నడూ ఎటువంటి లోపాలతో బాధపడరని లేఖనములతో పాటు అనుభవములుకూడా సాక్ష్యమిస్తున్నాయి. ఒక మానవుడు దేవునికి విధేయుడైనప్పుడు అతని జీవిత మంతటికీ ఆ ప్రభువే బాధ్యత వహిస్తాడు.

క్రీస్తును వెండించుట కోసం సమస్తం విడిచి పెట్టిన మనిషి, తన తోటి క్రైస్తవుల ద్రవ్య సహాయముతో పోషించ బడాలని ఆశించే నిత్యకాల దరిద్రుడు ఎంత మాత్రంకాదు.

1. అతడు కష్టజీవి. తన అవసరతలు, కుటుంబ అవసరతలు తీర్చుకునేందుకు వివేకముతో పని చేస్తాడు.

2. అతడు డబ్బును మితంగా ఖర్చుచేస్తాడు. సాధ్యమైనంత మట్టుకు జాగ్రత్తగానూ, మితంగానూ జీవిస్తూ తన అత్యవసరాలన్నీ తీరిన తదుపరి మిగిలిన సొమ్మంతా ప్రభువు పరిచర్యలోనే పెట్టుబడి పెడతాడు.

3. అతడు ముందు చూపు గలవాడు. భూలోకములో ధనము సమకూర్చుకునే బదులు తన ధనమును పరలోకంలో ఆధికంగా నిలువజేసుకుంటాడు.

4. భవిష్యత్తు విషయంలో అతడు దేవుని లో మాత్రమే నమ్మిక వుంచి ఆయన పైనే ఆధారపడతాడు. తన జీవిత శ్రేష్ఠ భాగాన్ని విని యోగించి, వృద్ధాప్యంలో తన భద్రత కోసం విస్తార ధన నిల్వలను సమకూర్చుకునేబదులు తన జీవిత విశిష్ట భాగాన్ని క్రీస్తు సేవకు సమర్పించి, భవిష్యత్తు విషయంలో యేసునే నమ్ముకుంటాడు. మొదట దేవుని రాజ్యమును, ఆయన నీతిని వెదికితే అన్నవస్త్రముల లోపము ఎన్నటికీ తనకు కలుగ బోదని అతడు నమ్ముతాడు (మత్తయి **6:33**).

సంకటు దినం కోసం ధనము సమకూర్చి పెట్టు కోవటం అతని దృష్టికి నిష్కారణ కార్యము. అతడు ఈ క్రింది విధంగా వాదిస్తాడు:

1. ఆత్మల రక్షణ నిమిత్తము డబ్బు ఖర్చు చేయగల అనుకూల సమయం ఇదే అయినప్పుడు మనస్సాక్షి పూర్వకంగా మనం మనకోసం అధిక ధనాన్ని ఎలా నిలువ చేసుకో గలం ?..... **" ఈ లోకపు జీవనోపాధి గలవాడై యుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు, అతని యెడల ఎంత మాత్రమును కనికరము చూపని వానియందు**



**దేవుని ప్రేమ ఏలాగు నిలుచును? " (1 యోహాను 3:17). " మరి యొక సారి ఈ ముఖ్య ఆజ్ఞను గమనించండి - నిన్నువలె నీ పొరుగు వానిని ప్రేమింప వలెను " ( లేవీ. కాం. 19:18).** మనకు సమృద్ధముగా వుండి, ఇతరులకు కూడా పెట్టగలిగి నంత మిగిలి వున్నప్పుడు మన పొరుగువాడు పస్తులుపడి ఆకలితో అలమటిస్తుండగా మనం మనవలె మన పొరుగువాడ్ని ప్రేమిస్తున్నామని యదార్ధంగా చెప్పగల మంటారా ? " ఈ జ్ఞానమును... నూరు లోకాలకు సరఫరాచేస్తారా?" అని - మాటలకందని దేవుని వరం గూర్చి తెలుసుకొని, ఆనందాన్ని అనుభవించిన ఓ వ్యక్తిని మీరు అడిగి తెల్సుకుంటారా ? ఈ ప్రక్షాళిత జ్ఞానాన్ని, పరలోక ఓదార్పును ఇతరులు కూడా పొందే విధంగా దీని అధారాన్ని మనం ఆపివేయకూడదు". -ఎ. యన్. గ్రోవ్స్

2. క్రీస్తు రాకడ అవశ్యము అని మనం నిజంగా నమ్మితే, వెంటనే మనం మన డబ్బును సద్వినియోగం చేసుకోవాలని ఆశిస్తాము. అలాకాని పక్షంలో ఆ అవకాశం కాస్తా సాతాను హస్తాల్లో పడే ప్రమాదముంది - పరలోక దీవెన కోసం వినియోగించాల్సిన డబ్బు సాతాను వశం కాగలదు.

3. మనమే మన సొంత డబ్బును దైవ కార్యార్థము వినియోగించుటకు ఇష్టపడ నప్పుడు, క్రైస్తవ పరిచర్య నిమిత్తము ద్రవ్యమును అను గ్రహించమని దేవుణ్ణి నీవు ఏ విధముగా మనస్సాక్షి పూర్వకంగా ప్రార్థించ గలవు ? క్రీస్తు కోసం అన్నింటినీ ఉపేక్షించుట అను ప్రక్రియ ప్రార్థనలో వేష ధారణ నుండి మనల్ని కాపాడు తుంది.

**4.** ఇటు వంటి సత్యాలకు మనమే విధేయత చూపనప్పుడు ఇక సంపూర్ణ దైవ మార్గాన్ని మనం ఇతరులకెలా బోధించ గలము? అటు వంటి పరిస్థితుల్లో మనం నోరు కూడా మెదప లేము.

**5.** లోకజ్ఞానులు తమ భవిష్యత్తు నిమిత్తం సమృద్ధ ధనాన్ని సమకూర్చి పెట్టుకున్నారు. ఇది విశ్వాసజీవితం కాదుగానీ ముందు చూపు జీవితమే. ప్రతి క్రైస్తవుడూ అందరిలా భూలోకంలో తనకోసం ధనం సమకూర్చుకుంటూ వుంటే ఇక తాను లోకానికీ, లోకమార్గాలకు ఏ విధంగా విభిన్నంగా వుండ గలడు ?

మన కుటుంబాల భవిష్యత్తు అవసరతల నిమిత్తం మనం కొంత ధనాన్ని సమకూర్చి పెట్టు కోవటం తప్పనిసరి; అలా చేయకపోతే మనము అవిశ్వాసుల కన్నా దౌర్భాగ్యులం ; అనే పిడివాదాన్ని మనం అనేక సార్లు వింటూ వుంటాము. ఈ దృక్పధాన్ని బలపర్చుటకు ఈ క్రింది లేఖన వాక్యాల్ని ఉపయోగించటం కూడా జరుగుతూ వుంటుంది:

**''... పిల్లలు తల్లిదండ్రుల కొరకు కాదు, తల్లిదండ్రులే పిల్లల కొరకు ఆస్తి కూర్చదగినది గదా ?'' (2 కొరింథీ 12:13).**

'' ఎవడైనను స్వకీయులను, విశేషముగా తన ఇంటి వారిని సంరక్షింపక పోయిన యెడల వాడు విశ్వాసత్యాగము చేసినవాడై అవిశ్వాసికన్నా చెడ్డవాడైయుండును'' (1 తిమోతి 5:8).

పై వాక్యాల భావాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే అవి ప్రస్తుత అవసరతల గూర్చి చెబుతున్నాయే గాని భవిష్యత్తు అవశ్యకతల గూర్చి మాత్రం కాదని స్పష్టమవుతుంది.

మొదటి వాక్యంలో పౌలు భాషాపరమైన విరుద్ధ అలంకారమును



వినియోగిస్తున్నాడు. ఆయన కొరింథు సంఘానికి తండ్రి లాంటి వాడు, కొరింథీయులు తనకు పిల్లల్లాంటి వారు. ఒక దైవ సేవకుడిగా తనకు సర్వహక్కులు వున్నప్పటికీ ఆయన వారిపై ఆర్థిక భారాన్నిమోపలేదు. వాస్తవానికి ఆయన వారికి విశ్వాసపరంగా ఆత్మీయ తండ్రి; సాధారణంగా తల్లిదండ్రులు పిల్లలకోసం సంపాయించి పెడతారు, గానీ దీనికి విరుద్ధ విధానంలో జరుగదు. పిల్లలు భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు సంపాయించి పెట్టు సాధారణ విధానమును ఇది ఏ మాత్రము ప్రశ్నించటంలేదు. ఈ వాక్యభాగము పౌలు భక్తుని ప్రస్తుత అవసరతల గూర్చి మాత్రమే చెబుతుందిగానీ, ఆయన యొక్క భవిష్యత్తుకు సంబంధించిన ఆవశ్యకతల గూర్చి కానే కాదు.

1 తిమోతి **5:8** లో అపొస్తలుడు పేద విధవ రాళ్ళ భద్రతా విషయాన్ని చర్చిస్తున్నాడు. అటువంటి వారి పోషణ విషయంలో తమ బంధువులే బాధ్యత వహించాల్సి వుంటుందని ఆయన నొక్కి చెబుతున్నాడు. ఒక వేళ వారికి బంధువు లెవ్వరూ లేని పక్షంలో గానీ, ఒకవేళ బంధువులు తమ బాధ్యతల్లో తప్పిపోయి నప్పుడు గానీ అటువంటి క్రైస్తవ విధవ రాళ్ళ పోషణభారము వహించుటకు సంఘమే ముందుకు రావాలి. కానీ, ఈ సందర్భములో కూడా ముఖ్యఅంశము ప్రస్తుత అవసరతలే గానీ, భవిష్యత్తు అవశ్యకతలు మాత్రం కాదు.

క్రీస్తు శరీర మైన సంఘంలోని సభ్యులు తమ సహవిశ్వాసుల దైనందిన జీవితావసరతల్ని తీర్చుటలో బాధ్యత వహించాలి అనేది దేవుని ఆదర్శము:

**'' నిండుగా కూర్చు కొనిన వానికి ఎక్కువ మిగుల లేదనియు కొంచె ముగా కూర్చుకొనిన వానికి తక్కువ కాలేదనియు, వ్రాయబడిన ప్రకారము అందరికీ సమానముగా**

వుండు నిమిత్తము, ప్రస్తుతమందు మీ సమృద్ధి వారి అక్కరకును మరియెుకప్పుడు వారి సమృద్ధి మీ అక్కరకును సహాయమై వుండవలెనని ఈలాగు చెప్పుచున్నాను'' (II కొరింథీ **8: 15**).

భవిష్యత్తు అవసరతల నిమిత్తం ధనము సమకూర్చిపెట్టాలని ఆలోచించే క్రైస్తవుడు ఎంత సంపాయించాలి అను క్లిష్ట సమస్యను ఎదుర్కొంటాడు. అంచేత అతడు అనంత ధన సముపార్జనలో అదృష్టాన్ని వెదుక్కుంటూ తన జీవితమంతా గడుపుతాడు, ఫలితంగా తన జీవితంలో శ్రేష్ట భాగాన్ని క్రీస్తు ప్రభువుకు సమర్పించుకునే భాగ్యాన్ని పోగొట్టుకుంటాడు. ఈ ప్రయత్నంలో అతడు తన వృధా జీవిత అంచుకు చేరుకుంటాడు; అప్పుడతడు - తన జీవితంలో రక్షకుడి కోసం హృదయపూర్వకంగా జీవించివుంటే ఇప్పుడు తన అవసరతలన్నీ తీరివుండేవేనని తెలుసుకుంటాడు.

క్రైస్తవులందరూ యేసు ప్రభువు మాటల్ని అక్షరాల స్వీకరిస్తే ప్రభువు పనిలో ఇక ఎంత మాత్రం ఆర్థిక లోపమువుండనే వుండదు. అప్పుడు సువార్త అధిక శక్తితోనూ, అత్యధిక పరిమాణం లోనూ బైటికి వెళ్ళగలదు. ఒక శిష్యుడు ఏదైనా అవసరతలో వున్నప్పుడు ఆ అవసరతను ఇతర శిష్యులు తమకున్నవాటితోనే తీర్చాలి అను కార్యము వారికి అమితానంద దాయకమైన ఆధిక్యతగా వుంటుంది.

ప్రపంచంలోని ధనవంతులను సువార్తతో సంధించుటకు ధనవంతులైన క్రైస్తవుల అవసరత ఎంతో వుందని చెప్పటం ఇంగిత జ్ఞానానికి విరుద్ధమైన సలహా మాత్రమే. చెఱసాలలో బందీగావున్న పౌలు కైసరు కుటుంబాన్ని సందర్శించాడు (పిలిప్పీ . **4:22**). మనము దేవునికి విధేయులమైతే, ఇతర విషయాల్ను సాధించుటకు మనం దేవుడ్ని నమ్మగలము.



దీనికి ముగింపు యేసు ప్రభువు చూపిన ఆదర్శమే, దాసుడు యజమానుడి కన్నా ఎక్కువైన వాడు కాడు. '' తన ప్రభువు ఈ లోకములో పేదవాడై, దీనుడై, దూషణ పాలై పోగా సేవకుడైన వాడు ధనవంతుడు గానూ, ఘనుడి గానూ, గొప్పవాడిగానూ కావాలని ఆశించటమే అతిముఖ్యమైన దోషము'' జార్జిముల్లర్.

''క్రీస్తు శ్రమలలో దరిద్రత కూడా వుండెను'', **2** కొరింథీ **8:9.** చింపిరి బట్టలు, మురికి జీవితం మొదలైనవే దరిద్రతకు సూచకములు కావు. కానీ దారిద్ర్యములో సుఖజీవన మార్గము గానీ, ధనసంపదగానీ వుండనేవుండవు అనేది ఖచ్చితము... దాదాపు ముప్పై ఏళ్ళ క్రితము... ఆంద్రూముర్రే ఇలా చెప్పాడు; ప్రభువుగానీ, ఆయన శిష్యులుగానీ, వాస్తవ దరిద్రతను అనుభవించి వుండక పోతే తాము తల పెట్టిన కార్యాన్ని విజయ వంతంగా సాధించి వుండే వారు కారు. ఇతరులను ఉద్ధరించువాడు మంచి సమరయుడి వలె క్రిందికి దిగి రావాల్సివుంది. గతకాలంలో వలె ఈ నాడు కూడా మానవ జాతి దారిద్ర్యంలో మ్రగ్గిపోతూనే వుంది''.

- ఎ.యన్ . గ్రోవ్స్

కుటుంబజీవితానికి నిర్ధిష్టమైన కొంత వస్తు సంపద కూడా అవసరమని జనులు కోరుకుంటున్నారు. ఇది వాస్తవమే .

ఈనాటి క్రైస్తవ వ్యాపారవేత్తలు తమ వ్యాపారం నిమిత్తం కొంత పెట్టుబడి కలిగివుండాలని అభిప్రాయపడుతున్నారు. ఇదికూడా నిజమే.

దేవుని మహిమార్థం వినియోగించబడగల వాహనములవంటి ఇతర వస్తువాహన సంపదలు కూడా ప్రభువు పనిలో అవసరమని కొందరు అడుగుతుంటారు. అదికూడా వాస్తవమే.

అయితే క్రైస్తవుడు ఈ న్యాయ సమ్మతమైన అవసరతల్నిమించిన విధంగా సువార్తవ్యాప్తినిమిత్తమై త్యాగ పూరితంగా జీవించాలి. అతని గమ్యం ఇదైవుండాలి: ''కష్టించి శ్రమించు, తక్కువగా తిను, ఎక్కువగా ఇవ్వు, సమస్తం క్రీస్తుకే సమర్పించు'', - ఎ. యన్. గ్రోవ్స్.

సమస్తమును విడిచిపెట్టుట అను విషయభావానికొస్తే, మనలో ప్రతి ఒక్కరము దేవునిముందర బాధ్యులముగా నిలబడతాము. ఒక విశ్వాసి మరో విశ్వాసిపై అధికారము చెలాయించలేడు; ప్రతి ఒక్కరూ ప్రభువుముందు తన సొంత అభ్యాసఫలితానుసారంగా జీవించాలి. ఇది ఓ మహత్తరమైన వ్యక్తిగత విషయము.

అటువంటి అభ్యాసఫలితంగా ఇంతవరకు ఎరుగని భక్తి జీవితస్థాయికి ఒక విశ్వాసిని నడిపించాలంటే ఇక వ్యక్తిగత గర్వమునకు తావు వుండకూడదు. కల్వరి కాంతిలో చూచినప్పుడు మనమెన్నిత్యాగాలు చేసినా అవి త్యాగాలు కానేకావు. ఇదంతా గాక, మనదగ్గర ఇంకెంతమాత్రం వుంచుకొనలేని దానిని, మనం ప్రేమించుటమానివేసిన దానినే ప్రభువుకు ఇచ్చివేస్తున్నాము.

''లాభదాయకము కాని, నష్టము కలిగించని దానిని ఇచ్చి వేయువాడు బుద్ధిహీనుడు కానేకాడు.''

— జిమ్ ఎల్లియట్

# శిష్యత్వానికి అవరోధాలు

క్రీస్తును అనుసరించుటకు సిద్ధమైన వాడెవడైనా తనముందు తప్పించుకునే మార్గాలు అసంఖ్యాకంగా అల్లుకొని వుండటం తప్పని సరైన విషయమని గ్రహించగలుగుతాడు. వెనుదిరగటానికి లెఖ్కలేనన్ని అవకాశాలు అతనికి అందుబాటులో వుంటాయి. శిలువను అనేక అంగుళం ముక్కలుగా నరికి, ధ్వంసంచేయమని చెప్పే ఇతర స్వరాలు అతణ్ణి పిలిచి రెచ్చగొడతాయి. స్వీయ - సన్యాసం, త్యాగమార్గం నుండి అతడ్ని విడిపించుటకు పన్నెండు అక్షౌణుల దూతలు కాచుకొనివుంటారు.

తామూకూడా యేసు శిష్యులుగా మారాలని ఆశించిన ముగ్గురిజీవితాల్లో ఈ వృత్తాంతము మహాద్భుతంగా వర్ణించబడింది. వారు ఇతర స్వరాలను తమ హృదయాల్లో అనుమతించిన కారణంగా క్రీస్తుస్వరాన్ని వ్యతిరేకించవలసి వచ్చింది.

''వారు మార్గమున వెళ్లుచుండగా ఒకడు-నీవెక్కడికి వెళ్ళినను నీవెంట వచ్చెదనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు - నక్కలకు బొరియలును, ఆకాశపక్షులకు నివాసములును కలవు గానీ మనుష్యకుమారునికి తలవాల్చుకొనుటకైననూ స్థలము లేదని అతనితో చెప్పెను. ఆయన మరియొకనితో - నావెంట రమ్మని చెప్పెను. అతడు నేను వెళ్ళి మొదట నాతండ్రిని పాతిపెట్టి వచ్చుటకు సెలవిమ్మని మనవిచేసెను. అందుకాయన - మృతులు తమ మృతులను పాతిపెట్టుకొననిమ్ము; నీవు వెళ్ళి దేవుని రాజ్యమును ప్రకటించుమని వానితో చెప్పెను. మరి యొకడు ప్రభువా, నీవెంట వచ్చెదను గానీ నా ఇంటనున్న వారియొద్ద సెలవుతీసుకొని వచ్చుటకు మొదట నాకు సెలవిమ్మని అడుగగా యేసు - నాగటిమీదచెయ్యిపెట్టి వెనుక తట్టు చూచు వాడెవడును

దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడని వానితో చెప్పెను'' **(లూకా 9 : 57-62).**

పైవాక్యసందర్భములో పేర్లు పేర్కొనబడని ముగ్గురు మనుష్యులు యేసు క్రీస్తును ముఖాముఖిగా ఎదుర్కొంటున్నట్లు చూస్తాము. వారి అంతరంగంలో ఒక స్వరం ఆయనను వెంబడించమని చెబుతూ బలవంతపెడ్తూవుంది. అయితే వారు తమ ఆత్మల దేవుని నిమిత్తం సంపూర్ణ అంకితభావములకూ మధ్య అడ్డుగా నిలబడిన మరో స్వరాన్ని కూడా తమలోకి అనుమతించారు.

**మిస్టర్ అతిదుడుకు :**

మొదటివాడిపేరు మిస్టర్ అతిదుడుకు, ఇతడు ప్రభువును వెంబడించేందుకు ఎక్కడికైనా వెళ్ళేందుకు సిద్ధమేనని ఉత్సాహంగా స్వచ్ఛంద తీర్మానము చేసిన వాడు. '' నీవెక్కడికి వెళ్ళినను అక్కడికి నేనను నిన్ను వెంబడించెదను.'' ఖరీదెంతైనా అది గొప్ప విషయమేమీకాదు; ఎటువంటి శిలువైనా అధిక భారమేమీ కాదు. ఏ మార్గమైనా అతి కరకు కాదు.

హృదయపూర్వకంగా, సమర్పణాయుతంగా ముందుకొచ్చిన ఈ మిస్టర్. అతిదుడుకు స్వభావికి రక్షకుడిచ్చిన జవాబు మొదట్లో ఎటువంటి అవినాభావ సంబంధం లేనట్టు కనిపిస్తుంది. యేసు ఇలా అన్నాడు; **''నక్కలకు బొరియలున్నాయి, ఆకాశ పక్షులకు గూళ్ళున్నాయి, అయితే మనుష్యకుమారుడు తలవాల్చుటకు స్థలములేదు.''** వాస్తవానికి ప్రభువు జవాబు సందర్భసహితంగా సరిగ్గా సరిపోయింది. ''నేను ఎక్కడికి వెళ్ళినా నన్ను వెంబడించుటకు సిద్ధంగా వున్నట్టు నీవు గట్టిగా చెబుతున్నావు. అయితే జీవితంలో వస్తువాహన సంపదతోనూ, సుఖభోగసదుపాయాలతోనూ తులతూగుతున్న నీవు



వాటన్నిటినీ విడిచి నన్ను వెంబడించుటకు నీవు ఇష్టపడుతున్నావా? నక్కలు నాకంటే అధికమైన లోకసంబంధ సుఖభోగాల్ను అనుభవిస్తున్నాయి. తమది అని చెప్పుకునేందుకు ఆకాశపక్షులకు ఒక గూడువుంది. అయితే నా చేతులారా నేను సృష్టించుకొన్న ఈ లోకంలో నేనుఇల్లు, వాకిలిలేని ఒక బాటసారిని మాత్రమే. నన్ను వెంబడించాలంటే నీ భద్రమైన ఇంటిని త్యాగం చేయాలి; అలా చేసేందుకు నీవు ఇష్టపడుతున్నావా? నన్ను భక్తియుతంగా సేవించుటకు గాను జీవితంలో కొన్ని న్యాయ సమ్మతమైన సుఖాలను, సదుపాయాలను వదులుకునేందుకు నీవు ఇష్టపడుతున్నావా?''

వాస్తవానికి ఈ మనిషి పై షరత్తుల విషయంలో ఇష్టపూర్వకంగాలేడు. ఎందుచేతనంటే పవిత్రలేఖన భాగాల్లో ఇతడ్ని గూర్చి ఇంతకంటే ఎక్కువగా మరేమీ వినము, కనము. క్రీస్తుయెడల తనకున్న సమర్పణ కన్నా లోక సంబంధమైన సుఖములు, సదుపాయాలపైన అతనిప్రేమ మిన్నగా వున్నది !

**మిస్టర్ అతి నిదాని :**

రెండవ మనిషిపేరు అతి నిదానుడు. ఇతడు మొదటి వాడిలా స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వాడు కాడు; కానీ తన్ను వెంబడించమని రక్షకుడే స్వయంగా ఇతడ్ని పిలిచాడు. ఇతడు ప్రభువుకు జవాబు చెబుతూ - నిర్మొహమాటంగా తిరస్కారం వ్యక్తం చేయలేదు. వెంబడించుటలో ఇతనికేమాత్రం ఆసక్తి లేదని దీని భావము కాదు. అయితే ఇతడు మొట్టమొదటిగా చేయాలని ఆశించిన కార్యము ఒకటుంది. ఇతడు చేసిన మహాపాపము ఇదే. క్రీస్తు హక్కులమీద ఇతడు తన సొంత హక్కుల్ని వుంచుతున్నాడు. ఇతని జవాబును పరిశీలించండి; ''ప్రభువా, నేను వెళ్ళిమొదట నాతండ్రిని పాతిపెట్టిరానిమ్ము''.

ఒకకుమారుడు తల్లిదండ్రులను గౌరవించి సన్మానించుట సంపూర్ణన్యాయ సమ్మతమే. ఒక తండ్రి మరణించినప్పుడు క్రైస్తవ విశ్వాసం ప్రకారం ఆ వ్యక్తి మృత దేహాన్ని గౌరవ ప్రదముగా భూస్థాపన చేయాలి.

అయితే మన జీవితాల్లో యేసు ప్రభుని నిర్దేశములను అధిగమించి వాటి స్థానాన్ని మానవ సంబంధ న్యాయ సమ్మతమైన మర్యాదలు అతిక్రమించుట చేత అవి దోషములుగా పరిణమిస్తున్నాయి. ఇతని నగ్నవిన్నపముద్వారా ఈ మనిషిలోని అసలైన నిజమైన ఆశ వెల్లడి చేయబడింది. ''ప్రభువా..... మొదట నేను'' అని ఇతడు చెప్పిన మాటలు కపట భూయిష్టములుగానూ, తనలో దాగివున్న అసలైన భూసంబంధ కోర్కెను కప్పిపుచ్చినట్టు కనబడుతూ స్వార్థమును మొదటి స్థానములో ఆవిష్కరిస్తున్నట్టు గానూ కనబడుతున్నాయి.

''ప్రభువా... మొదట నన్ను'' అని తాను పలికిన మాటలు నైతిక ఇంగిత జ్ఞానానికి విరుద్ధములుగానూ, అసాధ్యములుగానూ వున్నట్టు ఇతడు అసలు గ్రహించలేదు. క్రీస్తు నిజంగా ప్రభువైనట్లయితే అయన ప్రథమ స్థానము నలంకరించాలి. వ్యక్తిగతమైన ''నేను'' అను సర్వనామము సింహాసనము నధిష్ఠించినప్పుడు క్రీస్తు ఇంకెంతమాత్రము అధికారములో లేడన్నమాట.

మిస్టర్. నిదాని సాధించాల్సిన కార్యము ఒకటుంది. కానీ, ఇతడు యేసుకు ఇవ్వాల్సిన ప్రథమ స్థానాన్ని తన సొంత కార్యానికి ఇచ్చివేస్తున్నాడు. అంచేత యేసు ఇతనితో చెప్పిన మాటలు ఇతనికి సరిగ్గా సరిపోతాయి. ''మృతులు వారి మృతులను పాతిపెట్టు కొననిమ్ము; అయతే నీవు వెళ్ళి దేవుని రాజ్యమును ప్రకటించుము'' ప్రభువు చెప్పిన పై మాట లన్నిటిని మనం ఈ క్రింది విధంగా వివరించవచ్చు: ''ఆధ్యాత్మికంగా చనిపోయిన వాళ్ళు కూడా విశ్వాసులను పోలి చేయగలిగిన



కొన్నిపనులున్నాయి. అయితే ఒక్క విశ్వాసి మాత్రమే చేయగలిగిన కొన్ని జీవిత కార్యాలు కూడా వున్నాయి. మారు మనస్సు పొందిన సామాన్యమానవుడు చేసే పనుల్నే నీవు కూడా చేస్తూ జీవితాన్ని వృధాగా గడప కుండా జాగ్రత్తగా చూచుకో. ఆధ్యాత్మికంగా మరణించిన వారు భౌతికంగా చచ్చిపోయిన వారిని పాతపెట్టనీయండి, నీవట్టుకైతే - ఖచ్చితంగా వుండు. భూలోకంలో నా కోసమైన కార్యసాధనే నీ జీవిత ప్రధాన ధ్యేయంగా వుండేలా చూచుకో.''

మిస్టర్. నిదానస్తుడు చెల్లించాల్సి వున్న ఖరీదు విపరీతంగా వున్నట్టు గోచరిస్తుంది. ఓ నామ హీన నిశ్శబ్దత లోకి తనకు ఇవ్వబడిన తరుణాన్ని పోనిచ్చుకుంటున్నాడు ఇతడు. భూలోకవస్తుసంపదలు, సుఖ భోగాలు శిష్యత్వానికి అవరోధముగా వుంటున్నట్టు మొదటివాడు సాదృశ్యంగా వున్నాడు; క్రైస్తవుని ఉనికి నిమిత్తమైన ప్రధాన హేతువుకు ఒక ఉద్యోగము, ఒక కార్యము, ఒక వృత్తి ఆటంకంగా వుంటున్నట్టు రెండవ వాడు ఉదాహరణగా వున్నాడు. లోక సంబంధమైన ఉద్యోగం చేయటంలో ఏదో తప్పు వున్నదని దీని భావము కాదు; తన అవసరతలు, కుటుంబ అవసరతలు తీర్చుకునేందుకు గాను మానవుడు కష్టించి పని చేయాలని దేవుని చిత్తము. అయితే శిష్యుడైన వాడు మొట్టమొదట దేవుని రాజ్యమును, ఆయన నీతిని వెదకాలని మారుమనస్సు పొందని వారు కూడా చేయగలిగిన పనులనే అతడు చేస్తూ జీవితం గడపకూడదని ; ఉద్యోగం చేయుట కేవలం దైనందిన అవసరతలు తీర్చుకోవటం కోసమేనని క్రైస్తవుని అసలైన కార్యము దేవుని రాజ్యమును ప్రకటించుటేనని నిజ శిష్యత్వము ఆదేశిస్తున్నది.

**మిస్టర్ అతి సులభి :**

ఇక మూడవ మనిషి పేరు మిస్టర్. అతి సులభి. ప్రభువును వెంబడించుటలో స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన ఇతడు మొదటి వానిని

పోలి వున్నాడు. అయితే, ''ప్రభువా,... మొదట నేను...'' అను విరుద్ధమైన మాటలు పలుకుటలో ఇతడు రెండవ వాడిలా కనబడుతున్నాడు. ఇతడు ప్రభువుతో ఇలా అన్నాడు; ''ప్రభువా, నేను వెంబడిస్తాను; కానీ నేను మొదట వెళ్ళినా ఇంటనున్న వారి సెలవు తీసుకొని వస్తాను.''

మరో సారి పై వచనాన్ని వున్నది వున్నట్టుగా స్వీకరిస్తే ఇతడు చేసిన మనవిలో ప్రాథమికముగా ఎటువంటి తప్పు లేదు. బంధువుల యెడల ప్రేమాసక్తులు ప్రదర్శించుట గానీ, విడిచి వెళ్ళు సమయంలో వారి యెడల గౌరవ మర్యాదలు ప్రకటించటం గానీ దైవశాసనానికి విరుద్ధమేమీ కాదు. ఈ మనిషి పరీక్షలో తప్పిపోవుటకు గల ముఖ్యకారణం ఏమిటి? ఇది- క్రీస్తు స్థానాన్ని అధిగమించుటకు ఇతడు ప్రకృతి సిద్ధమైన మృదు బంధుత్వాలను తన జీవితంలోకి అనుమతించటమే.

అంచేత లోతుగా దూరిపోయే అంతర్దృష్టితో యేసు ప్రభువు ఇలా చెప్పాడు;''నాగటి పై చెయ్యివేసి వెనుదిరిగి చూచు వాడు దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడు''. మరో విధంగా చెప్పాలంటే, ''నీవు ప్రదర్శించిన విధంగా- నా శిష్యులు స్వార్థకేంద్రిత, బలహీన పదార్థముతో తయారు చేయబడ లేదు. కుటుంబ సంబంధ బంధుత్వాలను విడిచి పెట్టుటకు ఇష్టపడేవారు, మానసిక మృదు భావాలతో బంధు ప్రీతి చేత లాగ బడనివారు తమ జీవితాల్లో అందరి కన్నా ఉన్నత స్థానంలో నన్ను వుంచు కొనే వారు నాకు కావాలి'', అని ప్రభువు చెబుతున్నాడు.

మిస్టర్. అతి సులభి కూడా యేసును వెంబడించలేక ఆయన్ను విడిచి దూరంగా వీధి దిగువకు విచారంతో నడిచి వెళ్ళాడని ముగింపులో మనం గ్రహించాలి. ప్రభువుకు శిష్యుడు కావాలని తన అతి నమ్మక ఆశయాలు ఇప్పుడు అతి కుటుంబ బంధుప్రీతి కుటుంబ బంధాల బండల



మీద పడి ముక్కలు ముక్కలు గా పగిలి పోయాయి. బహుశా, దుఃఖంతో కన్నీరు కార్చే తల్లి వుండొచ్చు,''నన్ను విడిచి సువార్త సేవకు వెళ్తే నువ్వు నీ తల్లి హృదయాన్ని బ్రద్దలుచేసినట్లే'', అని ప్రలాపించవచ్చు. కారణమేదైనా కావొచ్చు; మనకు తెలియదు. బలహీనమైన గుండెగల ఇతని పేరు చెప్పటంలో బైబిలు వెనుకంజ వేసిందని మాత్రం మనకు తెలుసు. ప్రభువు నుండి వెనుదిరిగి వెళ్ళటంవల్ల తన జీవితంలో అనుగ్రహించబడిన ఒక గొప్ప అవకాశాన్ని పోగొట్టు కున్నాడు; అంతమాత్రమేగాక చేదు జ్ఞాపకార్థంగా ఓ చెడు వ్రాతను కొని తెచ్చుకున్నాడు, ''దేవుని రాజ్యమునకు పాత్రుడు కాడు''.

**సంగ్రహము :**

కాబట్టి యేసుక్రీస్తుతో దీర్ఘ ప్రయాణము చేయుటకు ఇష్టము లేని ముగ్గురు మనుషులతో పోల్చబడిన ఈ మూడు స్వభావములు నిజ శిష్యత్వానికి ప్రాథమిక అవరోధములుగా వున్నాయి.

మిస్టర్. అతి దుడుకు- భూసంబంధసుఖభోగాలపై ఆసక్తి;

మిస్టర్ అతి నిదాని-చేయవలసిన ఓ ఉద్యోగం, వృత్తి లేదా కార్యానికి ప్రాధాన్యత ;

మిస్టర్ అతి సులభి - మృదువైన కుటుంబ బంధాలకు ముందు స్థానము.

స్త్రీలు, పురుషులు వీరోచితంగానూ, త్యాగపూర్వకంగానూ ఆయన్ను వెంబడించాలని పూర్వం నుండి పిలుస్తున్నట్లే ఇప్పుడు కూడా యేసు ప్రభువు అందరినీ పిలుస్తూనే వున్నాడు.

అయితే, తప్పించే మార్గాలు ఇంకా ప్రబలుతూ నీతో అమితా సక్తికరమైన మాటలు పలుకుతున్నాయి- ''నిన్ను నీవు కాపాడుకో! అది నీకు దూరమగును గాక!''

పిలుపుకు స్పందించు వారు కొద్ది మంది మాత్రమే:

యేసూ, నేను నా శిలువను ఎత్తు కొన్నాను,
ఇదంతా సమస్తం విడిచి నిన్ను వెంబడించుటకే,
దిగంబరత్వం, పేదరికం, దూషణలు, విసర్జనం,
నా సమస్తం ఇప్పట్నుంచి నీవే,
అతి ప్రియమైన కోరికలన్నీ నశించుగాక,
నేను ఆశించిన, నిరీక్షించిన, తెలుసుకున్న వన్నీ.
అయినా, నా పరిస్థితి ఎంత సమృద్ధం,
దేవుడు ; పరలోకము ఇంకా నా సొంతమే.

లోకం నన్ను దూషించి, విడిచి పెట్టనీ;
వారు నా రక్షకుడ్ని కూడా విడిచినట్టే;
మానవహృదయాలు, చూపులునన్నుమోసగిస్తాయి
నీవు వాటివలె అవాస్తవము కావు.
ఆహా ! నీవు నావైపు చూచి నవ్వుతావు,
జ్ఞానియైన దేవా, ప్రేమామయా, శక్తిస్వరూపా,
శత్రువులునన్ను ద్వేషించవచ్చు, స్నేహితులు నన్ను విడువొచ్చు,
నీ ముఖం మాత్రం నాకు చూపించు,
అప్పుడు నాకంతా వెలుగు మయమే.

-ఎచ్.ఎఫ్.లైటు.

# శిష్యులు గృహ నిర్వాహకులు

లూకా 16:1-13 చదవండి

అన్యాయపు గృహనిర్వాహకుడి గూర్చిన ఉపమానం శిష్యుల కోసమే చెప్పబడింది. ఇందులో అన్నికాలాలకు చెందిన శిష్యులకు అన్వర్తించే సూత్రాలను రక్షకుడు బహిర్గతం చేస్తున్నాడు. ఈ భూలోకంలో దేవుని ఆస్తిపాస్తులన్నిటినీ పరిరక్షించేందుకు గృహనిర్వాహక బాధ్యత పొందినవారు క్రీస్తు శిష్యులే గదా!

ఈ ఉపమానం నొప్పికలిగించే పదజాలముతో బహుబాధాకరంగా వుంది. అపనమ్మకత్వము, కపటములను ప్రోత్సహిస్తున్నట్టు అగుపిస్తుంది గానీ సరిగ్గా అర్థం చేసుకుంటే ఎంతో ప్రాముఖ్యమైన హెచ్చరిక ఇందులో వున్నట్టు మనం గ్రహిస్తాము.

ఇందులోని కథా సంగ్రహం ఇలా వుంది. ఒక ధనవంతుడైన యజమాని తన వ్యాపారాన్ని పర్యవేక్షించేందుకు ఒక మనిషిని ఉద్యోగంలో పెట్టుకున్నాడు. కాలగమనంలో ఈ పనివాడు తన డబ్బంతటినీ దొంగిలిస్తున్నట్టు అతడు తెల్సుకున్నాడు. వెంటనే అతడు ఆ ఉద్యోగి లెఖ్కలు తనిఖీ చేసి అతణ్ణి ఉద్యోగంలో నుంచి తీసిపేస్తున్నట్టు ఒక ప్రకటన ద్వారా తెలియ జేశాడు.

దీంతో ఆ ఉద్యోగి తన భవిష్యత్తు ఇక సున్నగా మిగిలి పోతుందని గుర్తెరిగాడు. అతడు వయసులో పెద్ద వాడైనందుచేత శారీరకంగా కష్టించి పని చేయలేడు ; అడుక్కుందామంటే సిగ్గు, అంచేత అతడొక పథకం పన్నాడు. తన యజమాని ఖాతాదారుల్లో ఒకని దగ్గరకు వెళ్ళి,

'' నాయజమానికి నీవెంత అప్పు వున్నావు?'' అని అడిగాడు, ''ఏడు వందల యాబై గ్యాలన్లనూనె'' అని సమాధాన మొచ్చింది, ''సరే మంచిది, అందులో సగం నాకు చెల్లించు, ఇక ఆ లెఖ్క ముగిసిపోతుంది;'' అని వాడికి చెప్పాడు, అలాగే అతడు మరో రుణస్థుడి దగ్గరకు వెళ్ళి, ''నువ్వెంత బాకీ వున్నావు ? ''అని అడిగాడు. అందుకా వ్యక్తి, '' ఎనిమిది వందల శేర్ల గోధుమలు,'' అని జవా బిచ్చాడు, అలాగైతే నువ్వు నాకు ఆరువందల నలభైశేర్లు ఇచ్చివేయ్, నీ ఖాతా అంతటితో ముగుస్తుంది, '' అని చెప్పాడు.

అపనమ్మకస్థుడైన ఈ ఉద్యోగి చేసిన పనికంటే భయంకరమైన వ్యాఖ్య ఈ క్రింద గమనించండి :

> **''అన్యాయస్థుడైన ఆ గృహ నిర్వాహకుడు యుక్తిగానడుచుకొనెననివాని యజమానుడు వానిని మెచ్చుకొనెను, వెలుగు సంబంధులు తమ తరమును బట్టి చూడగా యుక్తి మంతులై యున్నారు''.(8వచనం)**

ఇటువంటి అపనమ్మక వ్యాపారపుటలవాట్లను మెచ్చుకొని ఆమోదించుటను మనమెలా అవగాహన చేసుకోవాలి?

అయితే ఒక విషయం మాత్రం ఖచ్చితం, ఆయజమానుడుగానీ, మన ప్రభువు గానీ ఇటువంటి కపట బుద్ధిని మెచ్చుకొని ఆమోదించలేదు. వాస్తవానికి ఈ కారణం చేతనే మొదట్లో ఆ పనివాడు పదవి నుండి తొలిగించ బడ్డాడు. యదార్థవంతుడైన వాడెవ్వడూ ఇటువంటి మోసాన్ని, అపనమ్మకత్వాన్ని ఆమోదించడు. పై ఉపమానము ఏ విధంగా బోధిస్తున్నప్పటికీ మరొకరి ఆస్తిని దోచుకునే కార్యాన్ని అది ఎన్నడూ సమ్మతించదు.



భవిష్యత్తు కోసం ఓ ప్రణాళికను తయారు చేసుకొనుట అనే ఒకానొక విషయంలో మాత్రమే అన్యాయపు గృహనిర్వాహకుడు ప్రోత్సాహం పొందగలడు. తన గృహ నిర్వాహక బాధ్యత ముగిసిం తర్వాత కూడా తన స్నేహితులు తనతో వుండేలా అతడు తగిన చర్యలు తీసుకున్నాడు, ''ప్రస్తుతానికి '' బదులు ''భవిష్యత్తు'' కోసం చర్య తీసుకున్నాడు.

ఈ ఉపమానంలో కనిపించే ముఖ్యవిషయం ఇదే. లోకస్థులు రాబోవు రోజుల్లో తమ పోషణార్థము కొన్ని బలవంతపు చర్యల్ని చేపడాతారు. తమ విచారానికి కారణ భూతమైన విషయాలు వారి వృద్ధాప్యము, పదవీ వరమణ కాలము లాంటివి. ధనసంపాదనార్థం యోగ్యమైన ఉద్యోగం లేని వయస్సులో సుఖమయ జీవితం కోసం తాము జ్ఞానయుక్తంగా కృషి చేస్తారు. తమ జీవితాల్లో సాంఘిక భద్రత సాధించుకోవటంలో సర్వకార్యాలు చేస్తారు.

ఈ విషయంలో, రక్షణ పొందని లోకస్థులు క్రైస్తవుల కన్నా తెలివైన వారుగా కనబడుతున్నారు. ఏది ఏమైనప్పటికి ఇలా ఎందుకు జరుగుతుందో కారణం తెలుసుకునేందుకు మనం ప్రయత్నించి- క్రైస్తవుని భవిష్యత్తు ఈ భూలోకములో లేదుగాని పరలోకంలో మాత్రమే వున్నదని గుర్తెరగాలి. ఇదో కీలక సూత్రము. ఓ అవిశ్వాసి దృష్టిలో భవిష్యత్తు అంటే- ప్రస్తుతానికీ , సమాధికి వున్న మధ్య కాలమే.

### దేవుని బిడ్డలకు గల భవిష్యత్తు భావము క్రీస్తులో నిత్య జీవము:

పరలోక జీవితం కోసం సిద్ధ పడుతోన్న క్రైస్తవుల కన్నా, భూలోకంలో తమ భవిషత్తు కోసం తీవ్రంగా ప్రాకులాడుతూ కార్య

సాధన చేసుకుంటున్న మారుమనస్సు లేని అన్యజనులు ఎక్కువ తెలివైన వారని ఈ ఉపమానము బోధిస్తున్నది.

ఇటువంటి నేపథ్యంలో యేసు ప్రభువు మానవులకు క్రియాత్మక పాఠాన్ని ప్రబోధిస్తున్నాడు:

**''అన్యాయంపు సిరివలన మీకు స్నేహితులను సంపాయించుకొనుడి, ఏలయనగా ఆ సిరి మిమ్ములను వదిలి పోవునప్పుడు వారు నిత్యమైన నివాసములలో మిమ్ము చేర్చుకొందురని మీతో చెప్పుచున్నాను.''** డబ్బు లేక ఇతరమైన చరస్థిరాస్తుల సంపాదనే ఈ లోక ధనదేవత అని చెప్పొచ్చు. అయితే యేసు కోసం ఆత్మల సంపాదన కార్యములో మనం వీటిని వినియోగించవచ్చు. నమ్మకమైన రీతిగా డబ్బు ఖర్చు చేయటం ద్వారా మనం సంపాయించి, సమకూర్చిన ప్రజలే ఈ సందర్భంలో 'స్నేహితులు' అని పిలువబడుతున్నారు. మనం ఇంతెంత మాత్రము ఇటువంటి పని చేయలేని దినమొకటి రాబోతున్నది (మనం మరణించ వచ్చు), అప్పుడు మన వస్తు సంపదను విచక్షణాయుతంగా వినియోగించుట ద్వారా మనం సంపాయించిన స్నేహితులందరూ పరలోకపు శాస్వత నివాసాల్లో మనల్ని అహ్వానించే ఓ కూటమిగా తయారవుతారు.

ఈ విధంగా తెలివైన గృహ నిర్వాహకులు భవిష్యత్తు కోసం ప్రణాళికలు వేసుకుంటారు. భూలోకంలో తమ కొద్దిపాటి జీవితాలను తాత్కాలిక భద్రత కోసం వృధాగా గడపరు గానీ తమ ద్రవ్యమును వెచ్చించుట ద్వారా సంపాయించ బడిన స్నేహితుల గుంపు మధ్య పరలోకంలో వుండాలనే తీవ్ర ఆకాంక్ష కలిగి వుంటారు. మన డబ్బు - బైబిళ్ళు, క్రొత్త నిబంధనలు, లేఖన భాగములు, పత్రికలు, ఇతర క్రైస్తవ వాఙ్మయంగా రూపాంతరము చెందుతుంది. ఈ డబ్బు సువార్త సేవ కుల్ని,



ఇతర క్రైస్తవ పని వారిని పోషించుటకు వినియోగించబడుతుంది. క్రైస్తవ రేడియో కార్యక్రమాలకు, ఇతర అర్థమైన క్రైస్తవ కార్యక్రమాలకు ఈ డబ్బు దోహదపడుతుంది. సంక్షిప్తంగా చెప్పాలంటే ఈ డబ్బు సర్వ విధాల సువార్త కోసం వినియోగించ బడుతుంది. ''పరలోకములో మన ధనమును సమకూర్చు కొన గలుగుటకు గల ఏకైక మార్గ ము - వాటిని పరలోకానికి వెళ్ళే వాహకములో జొప్పించటమే''.

ఓ క్రైస్తవుడు తన వస్తు సంపదను ప్రశస్త ఆత్మల రక్షణ కోసం వినియోగించ గలుగుట చూచి నప్పుడు అతడు వస్తు 'సంపద' పైవున్న తన ప్రేమను కోల్పోతాడు. తన కడుపులో పరిస్థితి చేదుగా మారి సుఖభోగము, ధనము, వస్తు సంపద మీద ఆకర్షణ అను వాటిపై అతనికి విరక్తి జనిస్తుంది. ధన సంపద అను దేవతను ఆరాధించే అన్యులు ఇప్పుడు దైవ కార్యము చేత మార్చబడి శాశ్వత కాలంగా గొర్రె పిల్ల ఆరాధకులుగా చేయ బడాలని అతడు ఆకాంక్షిస్తాడు. మానవ జీవితాల్లో దేవునికి నిత్య మహిమ మరియు మానవులకు నిత్యాశీర్వాదము కలిగించే ఓ కార్యము సాధ్యపడాలని అతడు తీవ్రంగా కోరు కుంటాడు. రూథర్ ఫోర్డు గారికి కలిగిన దప్పిక లాంటి దప్పిక క్రైస్తవునిలో కలుగుతుంది.

అయ్యో, ఒక్క ఆత్మ అన్వర్త్ ప్రాంతం నుండి వచ్చి
దేవుని కుడి చేతి వైపున నన్ను కలుసు కుంటే,
నా పరలోకము రెండు పరలోకాలుగా
ఇమ్మానుయేలు భూభాగంలో వుండును గదా !

-ఆన్నీ ఆర్. కజిన్

వజ్ర వైఢూర్యములు, ముత్యములు, ధన నిధులు, బీమా పత్రములు, భవనములు, విలాస పడవలు, వైభవోపేతమైన కార్లు ఇవన్నీ కలిసి ఇతనికి ఒక అవినీతి మయమైన ధన దేవతగానే కనబడుతుంది. వీటిని సొంతజీవితం కోసం ఉపయోగిస్తే నశిస్తాయి, అయితే క్రీస్తు కోసం వెచ్చిస్తే నిత్యత్వమంతటి లోనూ లాభాల పంట కోస్తాయి. వస్తు సంపదతో మనము వ్యవహరించే విధానం గానీ, వాటిని మనము అర్థంచేసుకొనే స్థాయి గానీ మన ప్రవర్తనకు ఓ పరీక్షగా నిలిచి పోతుంది. 10 వచనంలో ప్రభువు దీనిని ఖచ్చితంగా చెబుతున్నాడు:

**"మిక్కిలి కొంచెములో నమ్మకముగా వుండువాడు ఎక్కువలోను నమ్మకముగా వుండును. మిక్కిలి కొంచెములో అన్యాయముగా నుండు వాడు ఎక్కువలోను అన్యాయముగా వుండును."**

ఇక్కడున్న అతి చిన్న విషయం - వస్తు సంపద విషయంలో గృహనిర్వాహకత్వమే. నమ్మక యోగ్యులు వీటిని దేవుని మహిమ కోసం, తోటి మానవుల ఆశీర్వాద నిమిత్తం వినియోగిస్తారు. నమ్మకత్వం లేని వారు తమ ఆస్తులను సుఖభోగ జీవితాల కోసం, స్వార్థా నందాల కోసం ఉపయోగించు కుంటారు. ఒకడు తక్కువ వస్తు సంపదల్లో నమ్మదగిన వాడుగా వుండని పక్షంలో ఎక్కువ వాటిలో (ఆధ్యాత్మికగృహ నిర్వాహకత్వ విషయాలు) నమ్మక పాత్రుడుగా వుండ నేరడు. అవి నీతి ధన సముపార్జనతో నమ్మక యోగ్యుడు కాని వాడు క్రీస్తు సేవకుడి గానూ, దైవమర్మాల గృహనిర్వాహకుడిగానూ ఎలా నమ్మకంగా వుండగలడు?

**(1కొరింథీ 4:1)**



అంచేత ఈ వాదాన్ని రక్షకుడు మరో మెట్టు ముందుకు నెట్టుతున్నాడు:

**"కాబట్టి మీరు అన్యాయపు సిరి విషయములో నమ్మకముగా వుండనియెడల సత్య మైన ధనమును ఎవడు మీ వశము చేయును?"**

**(11వచనము)**

భూసంబంధమైన ధనము నిజమైన ధనము గాదు, దాని విలువ అత్యల్పము, అది అశాశ్వతము, లేఖన సంబంధమైన ధనము వాస్తవ మైన ధనము, దాని విలువ కొలువ నశక్యము కానిది, అది అనంత మైనది. వస్తుసంపద విషయంలో ఓ మనిషి నమ్మదగిన వాడు కాని పక్షంలో ఈలోక జీవితానికి సంబంధించి ఆధ్యాత్మిక సమృద్ధి విషయంలో గానీ, పరలోక ధననిధుల విషయంలో గానీ దేవుడతణ్ణి నమ్మలేడు.

మళ్ళీ ప్రభువు తన వాదాన్ని ఇలా పొడిగిస్తున్నాడు:

**"మీరు పరుల సొమ్ము విషయములో నమ్మకముగా వుండని యెడల మీ స్వంతమైనది మీకు ఎవడిచ్చును?"**

**(12 వచనము)**

వస్తు సంపదలు మన సొంతములు కావు, అవి దేవునికి చెందినవి. మనము కలిగి వున్న ప్రతిదీ దేవుని నుండి లభించిన పవిత్రగృహ నిర్వాహకత్వమే. ఈ లోకంలో మన విచక్షణాయుతమైన అధ్యయనము, పరిచర్య మరియు ఆలోకములో నమ్మక యోగ్యమైన గృహ నిర్వాహకత్వ బహుమానాల ఫలములన్నీ మన సొంతములే అని చెప్పుకోవచ్చు. దేవుని ఆస్తిని జాగ్రత్తగా చూచుకోవటంలో మనము నమ్మదగిన వారముగా లేని పక్షంలో ఈలోక జీవితంలో దేవుని లోతైన సత్యాల్లోకి మనం ప్రవేశించ నేరము; అంతేగాక రాబోవు లోకములో బహుమానాలు కూడా పొంద లేము.

పరిస్థితుల ప్రభావము చేత ఈ ఉపమాన బోధమొత్తాన్ని ప్రభువు ఈ విధంగా సంగ్రహ పరుస్తున్నాడు;

**''ఏ సేవకుడును ఇద్దరు యజమానులను సేవింపలేడు, వాడొకని ద్వేషించి యొకని ప్రేమించును, లేక యొకని అనుసరించి యొకని తృణీకరించును, మీరు దేవునిసిరిని సేవింపలేరని చెప్పెను''.**

**(13** వచనము**)**

అక్కడ భగ్న సంబంధం వుండనేరదు. ఒక శిష్యుడు రెండు లోకాల కోసం జీవింపజాలడు. ఒక గృహనిర్వాహకుడు దేవుడినైనా ప్రేమించాలి లేదా సిరినైనా ప్రేమించాలి. అతడు సిరిని ప్రేమిస్తే దేవుణ్ణి ద్వేషిస్తాడు.

జాగ్రత్తగా గమనించండి, ఈ లేఖనము శిష్యుల కోసం వ్రాయ బడింది గానీ రక్షణ పొందని వారి కోసం కాదు.

# ఆసక్తి

ఉన్నత మనో సామర్థ్యము లేని శిష్యుడు క్షమార్హుడే. అతడు విశిష్ట భౌతిక శక్తిని ప్రదర్శించక పోయినప్పటికీ క్షమాపణ పొందగలడు. గానీ ఆసక్తి లేని శిష్యుడు మాత్రము ఎన్నటికీ క్షమార్హుడు కాడు. తన హృదయం రక్షకుడి కోసం మండ కుంటే అతడు శిక్షకు పాత్రుడే.

క్రైస్తవులు ఎవరిని వెంబడిస్తున్నారో చెబుతూ ఆయన ఇలా సెలవిస్తున్నాడు; **'' నీ ఇంటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించును'' (యోహాను 2:17).** దేవుని కోసం, దేవుడి కార్యాల కోసం అనంతమైన ఆవేదనతో వారిరక్షకుడు నిండుగా వుండినాడు. ఆయన శిష్య సమూహంలో అర్థ హృదయాలకు అసలు తావు లేదు.

యేసు ప్రభువు ఓ ఆధ్యాత్మిక కలవర స్థితిలో జీవించాడు.

ఆయన తన మాటల ద్వారా దీన్ని సూచించాడు, **''నేను పొందవలసిన బాప్తిస్మమున్నది, అది నెరవేరు వరకు నేనెంతో ఇబ్బంది పడుచున్నాను'' (లూకా 12:50).** మరువ జాలని మరో మాట, ''పగలున్నంతవరకు నన్ను పంపిన వాని క్రియలు మనము చేయుచుండవలెను, రాత్రి వచ్చుచున్నది, అప్పుడెవడును పని చేయలేడు''. **(యోహాను 9:14)**

బాప్తిస్మ మిచ్చు యోహాను కున్న ఆ సక్తిని గూర్చి ప్రభువు ఇలా వుద్రించి చెప్పాడు; ''అతడు ప్రజ్వలించుచు, ప్రకాశించుచు దీపమైయుండెను.''

**(యోహాను 5:35)**

అతనికి స్నేహితులు అవసరంలేదు, లోక సంబంధమైన ఆశగానీ. కోరిక గానీ అతనికి అసలు లేదు, లోకసంబంధమైన నష్టము అతనికి పట్టలేదు, జీవితమంటే లక్ష్యమేమీలేదు, మరణమంటే భయంకూడాలేదు. అతడు ఓస్థాయికి గానీ, దేశానికి గానీ, పరిస్థితులకు గానీ చెందిన వాడు కాడు. అతనిలో వున్న ఏకైక ఆలోచన, క్రీస్తు సువార్తను గూర్చియే. ఇతడి ఉద్దేశమొక్కటే - దేవుడు మహిమ పర్చబడాలనేది. అతడు ఓ వెర్రివాడు, క్రీస్తు కోసం వెర్రివాడిగా పరిగణించ బడుటలో సంతృప్తిచెందినవాడు. లోకం ఇతణ్ణి - అత్యాసక్తిపరుడు, మతోన్మాది, వదరుబోతు, అని పిలుస్తూ ఇంకా ఇతరత్రమైన దేశాంతర భాషా ప్రయోగాలతో ఒక గుంపుకు చెందిన వాడని లెఖ్కగట్టినా ఫరవాలేదు. వారతణ్ణి వ్యాపారి, కుటుంబసభ్యుడు, పౌరుడు, ధనవంతుడు, విశ్వమానవుడు, పండితుడు, ఇంగిత జ్ఞాని అనే పేర్లతో పిలువగానే అతని ప్రవర్తనావళి గూర్చిన మొత్తము వర్ణణ సంపూర్ణమైనట్టే. అతడిక మాట్లాడనైనా మాట్లాడాలి లేదా మరణించాలి. ఒక వేళ మరణించినా అతడు తప్పని సరిగా మాట్లాడతాడు. అతనికి విసుగు విరామమంటూ లేదు, భూప్రపంచం లోనూ, సముద్రంమీదనూ, కొండప్రాంతాల్లో, దారులు లేని ఎడారుల్లోనూ సంచరిస్తాడు. అతడు బిగ్గరగా అరిచిప్రకటిస్తాడు. ఎవ్వరినీ వదిలి పెట్టడు. అతని కెవ్వరూ అడ్డురారు, చెరసాలలో సైతం తన గొంతెత్తి ప్రకటిస్తాడు, సముద్రగాలి తుఫానుల్లో అతడు మౌనం వహించడు. భయకంపితమైన ఉన్నతాధికారుల సమావేశంలో, సింహాసనాలపై ఆసీనులైన రాజుల ముందు అతడు సత్యం పక్షంగా సాక్ష్యమిస్తాడు. మరణం తప్ప మరేదీ అతని స్వరాన్ని అపలేదు. మరణ సమయంలో కూడా ఖడ్గం తన శిరస్సును శరీరం నుంచి వేరు చేయకముందు అతడు మాట్లాడి తీరుతాడు, ప్రార్థిస్తాడు, సాక్ష్యమిస్తాడు, ఒప్పుకుంటాడు, బతిమాలుతాడు, పోరాటం సల్పుతాడు, క్రూరులైన ప్రజల్ని దీర్ఘంగా ఆశీర్వదిస్తాడు.''



దేవుణ్ణి సంతోష పెట్టే విషయంలో ఇతర దైవజనులు కూడా ఇదే రకమైన రగిలే కోరికను ప్రదర్శించారు. ఒకసారి సి.టి. స్టడ్ ఇలా వ్రాశాడు:

కొంత మంది - సంఘం లేదా గుడి గంట  
శబ్దంలోనే జీవించాలని ఆశిస్తారు  
నేనైతే నరకానికి గజం దూరంలో  
ఒక రక్షణ దుకాణాన్ని నడపాలని ఆశిస్తున్నాను.

ఒక నాస్తికుడు రచించిన వ్యాసము మూలంగా స్టడ్ కదిలించబడి క్రీస్తుకు తన్నుతాను బాహాటంగా సమర్పణచేసుకున్నాడు. ఆవ్యాసము ఈ క్రింది విధంగా వుంది.

''లక్షలాది వుంది చెప్పుకుంటున్నట్టు ఈ జీవితంలో మతానుసరణ, దాని జ్ఞానము మరో లోక జీవితం మీద ప్రభావం కలిగి వుంటుందని నేను దృఢంగా నమ్మినట్లైతే, అప్పుడు మతం అనేది నా జీవన సర్వస్వమై పోతుంది. భూసంబంధ సుఖభోగాలన్నింటినీ అప్పుడు నేను చెత్తవలె ఎంచి వాటిని పారేస్తాను, భూసంబంధ భయా లన్నిటినీ వెర్రివని తలంచి విడిచి పెడతాను, భూసంబంధ ఆలోచనలు, అనుభూతులు వ్యర్థములని వదిలేస్తాను. మతం అనేది నా మొదటి నిద్రమేల్కొలుపు తలంపు. నేను గాఢనిద్రలో మునిగి పోకముందు అది నా కళ్ళముందు నిలిచే చిట్టచివరి రూపము. దాని కోసమే నేను శ్రమించాలి. రేపటి నిత్యత్వము కోసమే నేను ఆలో చిస్తూవుండాలి. పరలోకంకోసం ఒక్క ఆత్మను సంపాయించ గలిగితే అది ఒక జీవిత కాలమంతా అనుభవించిన శ్రమకు సరితూక మని నేను ఆనందిస్తాను. భూసంబంధ ప్రతి ఘటనలు నా చేతిని ఎన్నటినీ ఆపనేరవు, నా పెదవులను మూయవు. భూలోకము,

దాని ఆనందములు, దుఃఖములు నా మనోభావాల్లో ఒక్క క్షణము కూడా చోటు చేసుకోవు. కేవలం నిత్యత్వము పైనే నా దృష్టిని కేంద్రీకరించుటకు నేను ప్రయాస పడతాను. అనతి కాలంలో నిత్య సంతోషంలోనో, నిత్యనరకంలోనో కాలం గడపబోయే నా చుట్టూరావున్న శాశ్వత ఆత్మల మీదనే నా దృష్టి వుంటుంది. అటువంటప్పుడు నేను లోకంలోకి వెళ్ళి సమయమందును, అసమయమందును ఈ విధంగా ప్రకటిస్తాను, ఒకడు లోకమంతా సంపాదించుకొని తన ప్రాణమును పోగొట్టు కుంటే అతనికి ఏమి లాభము?''

జాన్ వెస్లీ గొప్ప ఆసక్తి పరుడు. అతడు ఇలా అన్నాడు, ''పాపమునకు తప్ప మరిదేనికీ భయపడని, హృదయపూర్వకంగా దేవుని ప్రేమించే వంద మందిని నా కివ్వండి, నేను ప్రపంచాన్ని కదిలించి వేస్తాను''.

ఈక్వడార్‌కు చెందిన హతసాక్షి జిమ్ ఎల్లియట్ క్రీస్తు కోసం దివిటీగా వెలిగినవాడు. ఒక రోజు అతడు వాక్యధ్యానము చేస్తూ, ''ఆయన తన దూతలను వాయువులు గాను, తన సేవకులను అగ్ని జ్వాలలుగాను చేసుకొనువాడు'' (హెబ్రీ. 1:7) అను వాక్యాన్ని చూచి తనడైరీలో ఇలా వ్రాసుకున్నాడు:

''దేవా, నేను మండుతానా? ''ఇతరపదార్థాలతో'' మిశ్రితమైన మరణ కరమైన పదార్థము నుంచి నన్ను విడిపించుము. నేను జ్వాలగా వుండేలా నన్ను నీ ఆత్మనూనెతో నింపుము. నా ప్రాణమా, ఈ సత్యాన్ని - ఈ అల్పజీవితాన్ని నీవు భరించగలవా?'' దేవుని ఇంటి విషయమైన అసక్తి మండించిన ఆ గొప్ప వ్యక్తి ఆత్మ నాలో నివసిస్తున్నది. ''ఓ దేవుని జ్వాలా, నన్ను నీ నూనెగా మార్చుము''.



చివరి వచనము అమ్మీ కార్‌మైకెల్ రచించిన తీవ్ర పద్యము నుండి సంగ్రహింప బడింది. జిమ్ ఎల్లియట్ దీని నుండి ప్రోత్సహించ బడుట ఒక అద్భుత విషయమే:

నీ మీద కొడుతున్న గాలుల నుండి నాకు భద్రత కల్పించమని
నా ప్రార్థన అడుగుతున్నది
నా ఆత్మ కోరుకోవలసి వచ్చినప్పుడు భయం నుంచి తప్పించు
నేను ఎత్తుగా ఎక్కవలసి వచ్చినప్పుడు తప్పుచేయ కుండా కాపాడు
ఓ సైన్యాధి పతీ, జారుడు స్వార్థము నుంచి
నిన్ను వెంబడించే నీ సైనికుడనైన నన్ను విడిపించు
కపట ప్రేమతో కూడిన మృదు విషయాల నుండి
సులభ అవకాశాలు, బలహీన పర్చు వాటి నుండి;
ఆత్మలు ఈ రీతిగా భద్రత పొంద లేదు
శిలువ వేయబడిన వారు ఈ మార్గాన వెళ్ళలేదు
నీ కల్వరిని చీకటి క్రమ్మ జేసే సమస్తము నుండి
ఓ గొర్రెపిల్ల దేవా, నన్ను తప్పించు.
నన్ను మార్గాన నడిపించే ప్రేమ నాకు అను గ్రహించు.
ఏదీ నన్ను నిరాశ పర్చకుండా విశ్వాసము నాకిమ్ము
ఎటువంటి నిరుత్సాహములు నన్ను అలయ జేయకుండా
నిరీక్షణ, అగ్ని వలె మండు ఆవేదనను అనుగ్రహించు
చల్లబడి పోయేలా నన్ను మునగ నీయకు
ఓ దైవ జ్వాలా, నన్ను నీ నూనెగా చేయి.

ఇరవయ్యో శతాబ్ద సంఘంలో ప్రబలిన అవమానకర విషయం ఏమిటంటే- క్రైస్తవుల మధ్య వుండాల్సిన దాని కంటే కమ్యూనిష్టులలోనూ, అన్యుల గుంపుల్లోనూ ఎక్కువైన ఆసక్తి స్పష్టముగా కన బడుతున్నది. **1903** సంవత్సరంలో ఒక వ్యక్తి కేవలం పది ఏడు మంది అనుచరులతో

ప్రపంచంపై దండెత్తాడు. అతని పేరు లెనిన్. **1918** నాటికి అతని అనుచరుల సంఖ్య నలభై వేలకు పెరిగింది; ఆ నలభై వేల మందితో అతడు రష్యా దేశంలోని నూట అరవై మిలియన్ల ప్రజల్ని తన ఆధీనం లోకి తెచ్చుకున్నాడు. ఆ ఉద్యమం అలాగే కొనసాగింది, ఇప్పుడది, వారిసూత్రాలను ఎంత వ్యతిరేకించినా, వారి ఆసక్తిని ఎవరైనా పొగడకుండా వుండ లేరు.

మెక్సికోలో ఓ అమెరికా కళాశాల విద్యార్థి కమ్యూనిష్టుగా మారిం తర్వాత అతడు రాసిన ఉత్తరాన్ని బిల్లీగ్రేహం గారు మొట్ట మొదటి సారి ఈ క్రింది విధంగా చదువగా అసంఖ్యాక క్రైస్తవులు అదిరిపోయారు. తాను వివాహము చేసుకో బోతున్న అమ్మాయితో ప్రధానము ఎందుకు తెగిపోవాల్సి వుందో తెలియ జెప్పుట మే ఈ ఉత్తరం యొక్క ఉద్దేశం:

''కమ్యూనిష్టుల మైన మాకు ప్రమాదాలు హెచ్చుగావున్నాయి. తుపాకి కాల్పులకు గురవు తున్నాము, ఉరి తీయబడుతున్నాము, చట్ట విరుద్ధంగా చంపబడుతున్నాము, తారుతో పూయబడి శ్రవుల పాలవుతున్నాము; చెరసాలలో పెట్టబడి కొట్టబడుచున్నాము, ఎగతాళి చేయబడుతున్నాము, మా ఉద్యోగాల నుండి తొలగింపబడుచున్నాము, సాధ్యమైనంత రీతిలో అన్ని విధాల మేము బాధలకు గురిచేయబడుతున్నాము, మాలో కొంత శాతం మట్టుకు చంప బడుతున్నారు లేదా చెరసాల పాలవుతున్నారు. మేము భయంకర దరిద్రత అనుభవిస్తున్నాము. బ్రతకటానికి అవసరమైన దానికంటే అధికంగా సంపాయించిన ప్రతి రూపాయిని మేము పార్టీకే ఇచ్చి వేస్తున్నాము. కమ్యూ నిష్టులమైన మాకు సినిమాలు, కచ్చేరీలు, రుచిగల భోజనాలు, సుఖప్రదమైన ఇల్లు, కొత్త కార్లు - ఇటు వంటి వాటిని సంపాయించి, అను భవించటానికి డబ్బుగానీ, సమయం గానీ లేదు. మేము పిచ్చోళ్ళముగా పరిగణించబడ్డాము. అవును, మేము ఉన్మాదులమే. ఒకే



ఒక మహాఛాయా ప్రదమైన గమ్యము మా జీవితాలను పరిపాలిస్తోంది, అదే - ''విశ్వవ్యాప్త కమ్యూనిజం కోసం పోరాటము''.

మా కమ్యూనిష్టుల జీవిత ధ్యేయాన్ని ఎంత డబ్బైనా కొన లేదు. జీవితంలో ఓ నిర్దిష్ట ఉద్దేశాత్మక సమస్య కోసం పోరాటం సల్పుతున్నాం. మా చిల్లర మల్లర వ్యక్తిగత స్వార్థచింతనలు మహా గొప్ప మానవతా ఉద్యమంలో చేరి పోయాయి. మా వ్యక్తి గత జీవితాలు కాఠిన్యముగా కనబడ్డా, పార్టీ సేవలో మా స్వాభిమానాలు దెబ్బతిన్నట్టు అగుపించినా అప్పుడు, మాలో ప్రతి ఒక్కరూ తన చేతనైనంత మట్టుకు ఏదో కొంత మెరుగైన నూతన వాస్తవ మేలు కార్యాన్ని మానవ జాతికి చేస్తున్నామనే భావంతో మేము సంతృప్తి చెందుతాం. చచ్చేంత తీవ్రతతో నేను కృషి చేసే ఏ కైక విషయం ఒక్కకమ్యూనిజమే. ఇది నా జీవితం, నా వ్యాపారము, నామతము, నా క్రీడ, నా మాంసము నాసమస్తం. పగలంతా దీని కోసం కష్టించి పని చేస్తాను, రాత్రులందు దీని గూర్చి కలలు గంటాను. కాలంగడుస్తూ వుండగా దీని పట్టు పెరుగుతూనే వుంటుంది గానీ తరగదు. అంచేత నాజీవితాన్ని నడిపించి, నా మీద నాకు మార్గం చూపించే ఈ శక్తికి సంబంధం లేని ఏ స్నేహితముగానీ, ఏ ప్రేమ సంబంధం గానీ, కనీసం సంభాషణ గానీ నేను ఇంతెంత మాత్రం చేయ జాలను. కమ్యూనిష్టు ఉద్యమం యెడల తమకున్నవైఖరిద్వారా తాము ఎలా ప్రభావితం చేస్తారో నని నేను ప్రజల్ని, పుస్తకాల్ని, మనోభావాల్ని, కార్యాల్ని లెఖ్ఖ కడతాను. నా భావాలకారణంగా నేనిప్పటికే జైలుకు వెళ్ళాను, అవసరమైతే తుపాకి గుళ్ళకు నా రొమ్ము నొడ్డుటకు కూడా నేను సిద్ధమే.''

తమ ఉద్యమముకోసం కమ్యూనిష్టులు ఇటువంటి సమర్పణ ప్రదర్శించగలిగితే ఇక క్రైస్తవులు తమ మహిమాన్వితుడైన ప్రభువుకోసం తమ్మును తాము ప్రేమలోనూ, ఆనందమయభక్తిలోనూ, ఎంతగా సమర్పించుకోవాలో గమనించండి. యేసు ప్రభువు మనకు ఏదైనా అయ్యుంటే ఆయన మన జీవితాల్లో సమస్తంలో సమస్తమైవున్నాడు. ''క్రైస్తవ విశ్వాసం నమ్ముటకు యోగ్యమైనదైతే అది వీరోచితమైన నమ్మకము కూడా.'' - ఫిండ్లే.

''ప్రపంచ ప్రజల రక్షణకు ఆధారభూతమైన కార్యమేదైనా క్రీస్తు జరిగించి వుంటే, ఆకార్యమును ఆయన వెల్లడి చేసివుంటే- అప్పుడుదానిని పట్టించు కోకుండా తృణీకరించి, తేలికగా తీసిపారవేసే ప్రతీ దాని విషయంలో అసహనముతో, అవిశ్రాంతముగా వుండుట ఒక క్రైస్తవ బాధ్యత.''
-జేమ్సు డెన్నీ

పరిశుద్ధాత్మ స్వాధీనమునకు సంపూర్ణముగా మళ్ళించబడిన మనుషులు దేవుడికి కావాలి. ఈ మనుషులు ఇతరులకు మద్యముతో మత్తులై వున్నట్టు అగుపిస్తారు, కానీ వీరిని సన్నిహితంగా ఎరిగిన వారు- వీరు దేవుని ''ఓ లోతైన, భారభరిత ప్రత్యక్షత, తీరని దాహముల'' చేత నడిపించ బడుతున్నారని గుర్తెరుగుతారు.

శిష్యుడు కాగోరే ప్రతీ ఒక్కడు తన జీవితంలో ఆసక్తి ఆవశ్యకత గూర్చి హృదయంలోకి తక్షణంగా తీసుకోవాలి. బిషప్ రైల్ [1]వర్ణించిన రీతిగా శిష్యుడు కాగోరే ప్రతీవాడు నెరవేర్చి తీరాలి.

1. క్రియాత్మక మతము, లండన్: జేమ్స్ క్లార్కే & కం., లిమిటెడ్., 1959, పేజి. 130.



''మతములో అత్యంత ఆసక్తి గల మనిషి మొట్టమొదటిగా ఒకే ఒక విషయానికి అంకితమైవుంటాడు. ఆ వ్యక్తి తీవ్ర ఆసక్తి పరుడనీ, రాజీ పడని వాడనీ, ముక్కుసూటిగావెళ్ళే వాడనీ, హృదయపూర్వకంగా చేసే వాడనీ, దృఢచిత్తుడనీ ఊరకే చెప్పుకుంటూ పోవటం సరిపోదు. అతడు చూచేది ఒక్కటే, అతడు పరిగణించేది కూడా ఒక్కటే; అతడు జీవించేది ఒక్క విషయం కోసమే. ఒక్క దానిలోనే అతడు మునిగి పోయి వుంటాడు- దేవుని సంతోష పెట్టుటే ఆ ఒక్క విషయం. బ్రతికినా, చచ్చినా- ఆరోగ్యమైనా , అనారోగ్యమైనా- ధనవంతుడైనా, దరిద్రుడైనా- మనిషిని సంతోష పెట్టినా, బాధపెట్టినా - తెలివైన వాడనుకున్నా, బుద్ధిహీనుడను కున్నా- నిందించబడినా, పొగడ్తలు పొందినా- సన్మానమైనా- అవమానమైనా- ఇవన్నీ ఆసక్తిపరుడైన వ్యక్తికి లెఖ్కలోకి రావు. ఒకే ఒక్క కార్యార్థమై అతడు రగులుతూ వుంటాడు; అదేమిటంటే- దేవుని సంతోషపెట్టుట, దైవమహిమను వ్యాప్తిచేయుట. మంటల్లో కాలిపోవలసి వచ్చినా అతడు లెఖ్క చేయడు- అతడు సర్వదా సంతృప్తిపరుడు. ఒక దీపంలా అతడు మండుతూ వుండాల్సి వుంది, మండుటలో కాలిపోవాల్సి వచ్చినా దేవుడతనికి అప్పగించిన పనిని తాను చేసినట్టే. అటువంటి వ్యక్తి అన్నివేళలా ఒక ఆసక్తి వలయాన్ని చూస్తాడు. ఒకవేళ అతడు బోధించలేకపోతే, దాని చేయలేకపోతే, డబ్బు ఇవ్వలేక పోతే - విలపిస్తాడు; నిట్టూరుస్తాడు , ప్రార్థిస్తాడు . అవును. అతడు కడు పేదవాడైతే, అనారోగ్యంతో, మంచం పట్టి వుంటే, ఆ పరిస్థితి కోసం ఎడ తెగకుండా పార్థిస్తూ తన చుట్టూ పాపపు చక్రాలు భారంగా కదిలి పోయేలా చేస్తాడు. యెహోవాతో కలిసి లోయలో యుద్ధం చేయలేనిపక్షంలో అతడు మోషే, అహరోను, హూరులవలె కొండమీద చేసిన పని చేస్తాడు (నిర్గ 17:9-13). తనకు తానుగా ఏ పని చేయలేని

నిస్సహాయ తరుణంలో మరో దిశ నుండి సహాయం వచ్చేదాకా అతడు ప్రభువు విశ్రాం తి నివ్వడు, చివరకు కార్యసాధన జరుగుతుంది. మతంలోని 'ఆసక్తి' అని నేను చెప్పటంలో నా భావం ఇదే.''

# విశ్వాసము

జీవము గల దేవునిలో ప్రగాఢమైన, నిస్సందేహమైన విశ్వాసం లేకుండా నిజ శిష్యత్వము వుండనేరదు. దేవుని కోసం గొప్ప కార్యములు చేయువాడు దేవునిలో విధేయతా పూర్వకంగా విశ్వాసముంచాలి. ''దేవుని మహా గొప్ప వీరులందరూ బలహీనులైన మానవమాత్రులే, వారంతా తమతో దేవుడున్నాడని నమ్మి దేవుని కోసం గొప్ప కార్యాలు చేశారు'' -హడ్సన్ టేలర్.

నిజమైన విశ్వాసం ఎల్లప్పుడూ ఏదో ఒక దైవ వాగ్దానము పై, దైవ వాక్య భాగము పై ఆధార పడి వుంటుంది. ఇది ముఖ్య విషయము. విశ్వాసి మొట్టమొదట ఏదో ఒక ప్రభువు వాగ్దానాన్ని చదువుతాడు, లేదా వింటాడు, పరిశుద్ధాత్మ దేవుడు ఆ వాగ్దానామును అతని హృదయానికి, మనస్సాక్షికి బహువ్యక్తిగతంగా వర్తింప జేస్తాడు. దేవుడు తనతో నేరుగా మాట్లాడినాడనే విషయంలో క్రైస్తవుడు అప్రమత్తంగా వుంటాడు. వాగ్దానము చేసిన వానిలో గాఢమైన నమ్మకంతో- మానవ రీతిగా అసాధ్యమైనప్పటికీ ఆ వాగ్ధానము అప్పటికే నెరవేరినట్టు పరిగణిస్తాడు.

ఒక్కోసారి అది వాగ్దానానికి బదులు ఆజ్ఞ అయ్యుండొచ్చు, విశ్వాసానికి ఎటువంటి తేడా లేదు. దేవుడు ఆజ్ఞాపిస్తే దానికి అనుగుణంగా ఆయన తన శక్తిని కూడా ప్రసాదిస్తాడు- నీళ్ళ పై నడవమని అయన పేతురును ఆజ్ఞాపిస్తే దానికి అవసరమైన శక్తి అనుగ్రహించ బడుతుందనే అభయం కూడా పొందాడన్న మాట (మత్తయి 14:28). సర్వ సృష్టికి సువార్త ప్రకటించమని ఆయన మనల్ని ఆదేశిస్తున్నట్లైతే

అందుకు అవసరమైన కృపాయుత సామర్థ్యము కూడా లభిస్తుందనే అభయం మనకు అందుబాటులోనే వుంది (మార్కు 16:15).

విశ్వాసము సాధ్యవలయంలో పనిచేయదు. మానవ సాధ్యములైన వాటిలో దేవునికి మహిమ రాదు. మానవ బలం ముగింపు నుండి విశ్వాసం అరంభమవుతుంది, '' విశ్వాస సామ్రాజ్యము సాధ్యములు ముగిసిన చోటు నుండి, దృష్టి, ఇంద్రియ జ్ఞానము ఓడిపోయిన చోటు నుండి మొదలవుతుంది''. -జార్జి ముల్లర్.

''అసాధ్యము'' అనేది కేవలం అభ్యంతరమే అయితే అది స్వార్థమే !'' అని విశ్వాసము చెబుతుంది.

''విశ్వాసము దేవుణ్ణి కార్యరంగంలోకి దించుతుంది; అంచేత దానికి క్లిష్ట సమస్యల గూర్చి అసలు ఏమీ తెలియదు-అవును, అసాధ్యములను చూచి విశ్వాసము నవ్వుతుంది. విశ్వాసపు తీర్పులో ప్రతి ప్రశ్నకూ దేవుడే మహా జవాబు-ప్రతి క్లిష్ట సమస్యకూ మహా పరిష్కారము కూడా ఆయనే. సమస్తము అయననే సూచిస్తోంది. అంచేత విశ్వాసానికి అరు లక్షల రూపాయలే కాదు, అరు కోట్ల రూపాయలైనా లెఖ్ఖ లేదు; దేవుడు సర్వసమృద్ధుడని విశ్వాసమునకు తెలుసు. అది తనకు కావలసిన వనరులన్నింటినీ ఆయనలోనే కనుగొంటుంది. 'అదెలా? ఇదెలా?' అని విశ్వాసం అంటుంది. 'ఎలా?' అనే ప్రశ్నలే దాని నిండా వుంటాయి. అటు వంటి 'ఎలా?' అనే పదివేల ప్రశ్నలకు మహా జవాబు విశ్వాసానికి అతి సమీపంగా వుంది; ఆ జవాబే-దేవుడు''. -సి.ఎచ్. మాకింటోష్.



మానవ రీతిగా చెప్పాలంటే అబ్రహాము, శారాలకు సంతానం కలగటం అసాధ్యము, అయితే దేవుడు వాగ్దానము చేశాడు, అబ్రహాము ఎదుట ఇప్పుడు ఒకేఒక అసాధ్యమున్నది- 'దేవుడు అబద్ధమాడతాడు' అనేదే ఆ అసాధ్యము.

**''-నీ సంతానము ఈ లాగు ఉండునని చెప్పిన దాని బట్టి తాననేక జనములకు తండ్రియగునట్లు నిరీక్షణకు ఆధారము లేనప్పుడు అతడు నిరీక్షణ కలిగి నమ్మెను. మరియు అతడు విశ్వాసమునందు బలహీనుడు కాక రమారమి నూరేండ్ల వయసు గలవాడై వుండి, అప్పటికి తన శరీరము మృతతుల్యమైనట్టును, శారా గర్భమును మృత తుల్యమైనట్టును ఆలోచించెను గానీ అవిశ్వాసము వలన దేవుని వాగ్దానమును గూర్చి సందేహింపక దేవుని మహిమ పరిచి ఆయన వాగ్దానము చేసిన దానిని నెరవేర్చుటకు సమర్థుడని రూఢిగా విశ్వసించి విశ్వాసము వలన బలము నొందెను.'' (రోమా 4:18-21)**

విశ్వాసము-మహా విశ్వాసమును, వాగ్దానమును చూస్తుంది.
ఒక్క దేవుని వైపు మాత్రమే దృష్టి సారిస్తుంది
అసాధ్యములవైపు చూచి నవ్వుతుంది.
''అది అవశ్యము జరుగును'' అని కేక వేస్తుంది.

అసాధ్యములను సాధ్యములను చేయుటలో నిపుణుడు మన దేవుడు (లూకా 1:37). అయనకు అసాధ్యమైనది ఏదియును లేదు (ఆ.కాం. 18:14). '' మానవునికి అసాధ్యములైన విషయములు దేవునికి సాధ్యములు'' (లూకా 18:27).

విశ్వాసము దేవుని వాగ్దానమును ఎత్తిపడుతుంది; ''నమ్మువానికి సమస్తము సాధ్యము'' (మార్కు 9:23); అనే వాక్యము పౌలుతో అంగీకరిస్తుంది. ''నన్ను బలపర్చు క్రీస్తునందు నేను సమస్తమును చేయగలను''. (పిలిప్పీ 4:13)

సందేహమునకు అవరోధములు గోచరిస్తాయి -
విశ్వాసము మార్గమును దృష్టిస్తుంది!
సందేహము అంధకార రాత్రిని చూస్తుంది -
విశ్వాసము పట్టపగలును చూస్తుంది!
సందేహము ఒక్క అడుగు వేసేందుకు భయపడుతుంది-
విశ్వాసము శిఖరాలను అధిరోహిస్తుంది;
''విశ్వసించే వారెవరు?'' అని సందేహం ప్రశ్నిస్తుంది -
''నేను!''అని విశ్వాసము జవాబిస్తుంది.

ఎంచేతనంటే విశ్వాసము-సహజాతీత, దివ్య విషయాలతో వ్యవహ రిస్తుంది. ఇది ఎల్లప్పుడూ హేతుబద్ధంగా కనబడదు. అబ్రహాము ఎక్కడికి వెళ్తున్నాడో ఎరుగక, కేవలం దేవుని ఆజ్ఞకు అతి సామాన్య విధేయత చూపుతూ బైటికి వెళ్ళటంలో విశ్వాసము 'ఇంగిత జ్ఞానము' ను వినియోగించుట లేదు (హెబ్రీ. 11:8). మారణాయుధాలు లేకుండా యెహోషువా ఎరికో పై దండెత్తుటలో ఇది కఠినత్వాన్ని ప్రదర్శించలేదు (యెహోషువా 6:1-20). ఇటువంటి 'చాదస్తము' ను చూచి లోకస్థులు ఎగతాళి చేస్తారు. కానీ విశ్వాసం పని చేసింది!

వాస్తవానికి విశ్వాసం బహుహేతుబద్ధమైనది. స్పష్టము సృష్టికర్తను నమ్ముకొనుట కంటే హేతుబద్ధమైన విషయం మరేముంటుంది?



అబద్ధమాడని, ఆడి తప్పని, తప్పుచేయని ఒకని యందు నమ్మికవుంచుట ఛాందసమా? మానవుడు చేయగలిగిన అత్యంత తెలివైన, వివేకమైన, హేతుబద్ధమైన కార్యము దేవుని నమ్మకొనుటే. అది అంధకారంలోకి దూకటం కాదు, విశ్వాసము అవశ్యమైన ఆధారం కోసం వెదకి దేవుని తప్పిపోని వాక్యంలో దానిని కనుగొంటుంది. ఆయన యందు నమ్మక ముంచిన వారి ప్రయాసము వృధాకాలేదు, వారెన్నడూ నష్టపోరు. ప్రభువులో విశ్వాస ముంచుట లో ఎటువంటి ప్రమాదము లేదు.

విశ్వాసము దేవుణ్ణి యదార్థంగా మహిమ పరుస్తుంది, అది ఆయనకు సంపూర్ణంగా నమ్మదగిన వాడుగా యోగ్యమైన స్థానాన్ని కల్పిస్తుంది. అయితే అవిశ్వాసము దేవుణ్ణి అగౌరవ పరుస్తుంది. అది ఆయన్ను అబద్ధికుడిగా నేరారోపణ చేస్తుంది ( యోహాను 5:10). ఇశ్రాయేలీయుల పరిశుద్ధదేవుణ్ణి అది తక్కువ చేస్తుంది (దా. కీ. 78:41). విశ్వాసము మనిషికి ఓ యోగ్యమైన స్థానాన్ని కల్పిస్తుంది - ప్రభువులకు ప్రభువైన సార్వభౌముని సన్నిధిలో - దుమ్ములో దీనుని గా వంగి ప్రార్థించుటే ఇతని స్థానం.

విశ్వాసము భౌతిక దృష్టిని వ్యతిరేకిస్తుంది. ఈ విషయాన్ని పౌలు మనకు గుర్తు చేశాడు, ''మనము విశ్వాసమూలముగా నడుచువారమే గాని దృష్టిచేత కాదు.'' (II కొరింథీ 5:7) దృష్టిచేత నడుచుట అనగా దృశ్యమైన రీతిలో బలాధారము కనబడుట, భవిష్యత్తుకు సరిపోయేంతగా నిధుల్ని సమకూర్చుకొనుట, అదృశ్యమైన ప్రమాదాల నుంచి భద్రత కోసమైన మావన జ్ఞానాన్ని వినియోగించుట. అయితే విశ్వాసము తో నడుచుట దీనికి పూర్తి విరుద్ధము; ప్రతి క్షణం దేవునిపై మాత్రమే ఆధారపడివుండుట దీని విధానము, ప్రభువు పై ఆధారపడుట అనే ఎడ

తెగని పరిస్థితి ఇది, ఒక అదృశ్య దేవునిపై పూర్తిగా ఆధారపడటం వల్ల శరీరం కృషించి పోతుంది, నష్టాల విషయంలో బాధానివృత్తి కలుగ జేయాలని విశ్వాసం కోరుకుంటుంది. తానెక్కడికి వెళుతున్నది తనకే తెలియక పోతే విశ్వాస జీవితం పూర్తిగా దెబ్బతిన్నట్టే, అయితే విశ్వాసము దైవవాక్యానికి విధేయత చూపి ముందడుగు వేస్తుంది, పరిస్థితులను అధిగమిస్తుంది; జీవితావసరతలన్నింటి కోసం ప్రభువును నమ్ముతుంది.''

విశ్వాసం చేత నడవాలని నిశ్చయించుకున్న ఏ శిష్యుడైనా తన విశ్వాసం పరీక్షకు గురవుతుందని తెలుసుకోవాలి. ఏదో ఒక సమయంలో తన మానవ వనరులన్నితరిగి పోయే పరిస్థితికి అతడు తప్పనిసరిగా చేరుకుంటాడు. ఇక తట్టుకోలేని పరిస్థితిలో తనతోటి వారి సహాయాన్ని అర్థించేలా శోధింపబడతాడు. అయితే అతడు నిజంగా ప్రభువును నమ్మిన వాడైతే దేవుని వైపు మాత్రమే చూస్తాడు.

''ప్రత్యక్షంగానో, పరోక్షంగానో నా కోరికలను ఒక మానవ మాత్రునికి తెలియ జేయటం విశ్వాస జీవితం నుండి వైదొలగటమే; అది దేవుని యెడల అగౌరవ కార్యము. అది దేవుణ్ణి అప్పగించుటతో సమానము. దేవుడునాకు సహాయం చేయటంలో తప్పిపోయాడు, అంచేత నేను నా తోటి మానవుడి సహాయం కోరుకుంటున్నానని చెప్పటంతో ఇది సమానం. జీవజల ఊటను విడిచి, పగిలిపోయిన ఓ తొట్టి వైపు మళ్ళినట్టుగా వుంటుంది; నా ఆత్మకు దేవునికి మధ్య ఓ సామాన్య ప్రాణిని నిలబెట్టినట్టుగా వుంటుంది; ఆత్మకు కావాల్సిన సమృద్ధ ఆశీర్వాదము, దేవునికి చెందాల్సిన మహిమ రెండూ దొంగిలించబడుతున్నాయి'' - సి.ఎచ్. మాకింటోష్.

తన విశ్వాసం అధికం కావాలని కోరుకోవటం శిష్యునిలో వుండే సాధారణ వైఖరి (లూకా 17:5). అతడు ఇప్పటికే రక్షణ కోసం క్రీస్తును



నమ్ముకున్నాడు, ఇప్పుడతడు దేవుని ఆధీనమునకు అప్పగించిన తన జీవిత విభాగములన్నీ విస్తరించాలని కోరుకుంటాడు. రోగము, శ్రమలు, విషాద సంఘటనలు, మరణసంబంధిత ఎడాబాట్లు ఎదురైనప్పుడు అతడు దేవుణ్ణి మరింత నూతనమైన, సన్నిహిత విధానంలో తెల్సుకుంటాడు; అతని విశ్వాసం మరింత బలపడుతుంది, అతడు వాగ్దాన సత్యాన్ని రుజువు చేస్తాడు; ''యెహోవాను గూర్చిన జ్ఞానము సంపాదించు కొనుటకు ఆయనను అనుసరించుదము రండి'' (హోషేయ 6:3), అతడెంత ఎక్కువగా దేవుణ్ణి నమ్మదగినవాడిగా కనుగొంటాడో అంత ఎక్కువగా గొప్ప విషయాల కోసం అయన్ను నమ్మాలని ఆశిస్తాడు.

వినుటవలన విశ్వాసము కలుగును, వినుట దేవుని మాటవలనే గనుక విశ్వాసి తాను లేఖనములతో నింపబడాలని ఆశించాలి- లేఖనములు చదవుటకు, అధ్యయనము చేయుటకు, కంఠస్థము చేయుటకు, రాత్రింబవళ్ళు వాటిని ధ్యానము చేయుటకు అతనిలో కోరిక కలగాలి. ఆ లేఖనములు అతనికి మార్గసూచిక, మార్గదర్శిని, ఆదరణ, దీపము, వెలుగులుగా వుంటాయి.

విశ్వాస జీవితంలో అభివృద్ధికి ఎప్పుడూ అవకాశముంటుంది, విశ్వాసం వలన ఏది సాధ్యమో చదివింతర్వాత మనం హద్దులు లేని సముద్రం అంచున ఆడుకుంటున్న చిన్నపిల్లల్లా వున్నట్టు గుర్తెరుగుతాం. విశ్వాస కార్యముల గూర్చి హెబ్రీ పత్రికలో వివరించబడింది. 11 అధ్యాయం 32-40 వచనాల్లో ఆ కార్యాలు ఓ మహత్తర పతాక స్థాయికి ఎగిశాయి.

''ఇకను ఏమి చెప్పుదును? గిద్యోను, బారాకు, సంసోను, యెఫ్తా, దావీదు, సమూయేలుల గూర్చియు, ప్రవక్తలను గూర్చియు వివరించుటకు సమయము చాలదు. వారు విశ్వాసము ద్వారా రాజ్యములను జయించిరి; నీతి కార్యములను

జరిగించిరి, వాగ్దానములను పొందిరి, సింహముల నోళ్ళను మూసిరి; అగ్ని బలమును చల్లార్చిరి; ఖడ్గధారను తప్పించుకొనిరి; బలహీనులుగా వుండి బలపరచబడిరి, యుద్ధములో పరాక్రమశాలులైరి; అన్యుల సేనలను పారదోలిరి. స్త్రీలు మృతులైన తమ వారిని పునరుత్థానము వలన మరల బ్రతికించుకొనిరి. కొందరైతే మరి శ్రేష్ఠమైన పునరుత్థానము పొందగోరి విడుదల పొంద నొల్లక యాతన పెట్టబడిరి; శోధింపబడిరి, ఖడ్గముతో చంపబడిరి; గొర్రెచర్మములును మేక చర్మములను వేసికొని, దరిద్రులై యుండి శ్రమపడి హింస పొందుచు, అడవులలోను, కొండల మీదను, గుహలలోను, సొరంగములలోను తిరుగులాడుచు సంచరించిరి. అట్టివారికి ఈ లోకము యోగ్యమైనది కాదు. వీరందరు తమ విశ్వాసము ద్వారా సాక్ష్యము పొందిన వారైనను మనము లేకుండా సంపూర్ణులు కాకుండు నిమిత్తము దేవుడు మనకొరకు మరి శ్రేష్ఠమైన దానిని ముందుగా సిద్ధపరచెను గనుక వీరు వాగ్దాన ఫలము అనుభవింపలేదు''.

చివరిగా ఒక్క మాట! విశ్వాస మూలముగా నడుచు శిష్యుడు కలలు కనువాడని, మత ఛాందసుడని లోకము చేతనూ, ఇతర క్రైస్తవుల చేతను పిలువ బడతాడనేది నిస్సందేహాత్మకమైనదని మనం ఇంతకు ముందే చెప్పుకున్నాం. అయితే ''దేవునితో నడుచుటకు ఒక వ్యక్తిని సమర్థుడిగా చేసే విశ్వాసము'' తన గూర్చి జనులు ఆలోచించే ఆలోచనలకు కూడా తగిన విలువల్ని ఆపాదించేలా శక్తిని ప్రసాదిస్తుందని గుర్తుంచు కొనుట మంచిది'' -సి.ఎచ్. మాకింటోష్.

# ప్రార్థన

ప్రార్థన అను అంశం మీద సంపూర్ణ సంతృప్తికరంగా లిఖించబడిన ఏకైక గ్రంథము బైబిలు మాత్రమే. ఇతరత్రా విధానాల్లో -చేరలేని లోతులు, ఎక్కలేని ఎత్తులు వున్నట్టు మనం అనుభూతి చెందుతాము. ప్రార్థన గూర్చి వివరించటంలో ఈ గ్రంథములో మేము ఇతరుల కన్నా విస్తరించి వ్రాయాలని మా అభిమతం కాదు. ప్రార్థన అంశానికి సంబంధించి కొన్నిముఖ్య సూత్రాలను సంగ్రహ పర్చటమే మేము చేయగలిగిన పని; ఎంచేత నంటే ఆ సూత్రాలు క్రైస్తవ శిష్యత్వము అనే అంశానికి సంబంధించి వున్నాయి.

1. బలమైన అంతరంగ అవసరత నుండి విశిష్టమైన ప్రార్థన బయలు వెడలుతుంది. ఇది నిజమని మనమందరం రుజువు చేశాము. మన జీవితాలు ముడుత, కళంకం లేనివిగా వున్నప్పుడు మన ప్రార్థనలు మందకొడిగానూ, సంఖ్యాపరంగా అత్యల్పంగానూ వుంటాయి. ఒక ఆపద, ఒక ప్రమాద పరిస్థితి, ఒక తీవ్ర అస్వస్థత, ఓ భార భరిత ఎడబాటు (మరణము) లాంటి పరిస్థితుల్లో మన ప్రార్థనలు తీక్షణములు గానూ, శక్తివంతములుగానూ వుంటాయి. ''ఆకాశంలోకి చొచ్చుకొని పోయేలా బాణం వేయాలంటే సంపూర్తిగా వంచబడిన విల్లునుండి అది ప్రయోగించబడాలి '' అని ఒక వ్యక్తి అన్నాడు. ఓ అత్యవసర పరిస్థితి ఎరుక, ఓ నిస్సహాయస్థితి, ఓ అవశ్యకతల గర్భం నుండి విశిష్ట ప్రార్థనలు జనిస్తాయి.

దురదృష్ట వశాత్తు మనం మన జీవితాల్ను వివిధ సదుపాయాల మెత్తటి పరుపుల్ని పర్చుకొను ప్రయత్నంలోనే గడుపుతుంటాం. ప్రతి ఊహాత్మకమైన పరిస్థితిలోనూ, తెలివైన వ్యాపార విధానాల్ను వినియోగించి కావలసినన్ని నిధుల్ని మనం అందిస్తాము. కేవలం మానవ తెలివి తేటలతోనే మనం ధనవంతులుగా చేసుకొని, సర్వసంపదలు కలిగి, ఏ కొరత లేకుండా వుంటాము. అప్పుడు న ప్రార్థనా జీవితం నిస్సారము గానూ, నిర్జీవముగానూ ఎందుకు మారిందో పరలోకం నుండి అగ్ని ఎందుకు దిగిరావటంలేదో అని ఆశ్చర్యపడిపోతాం. మనం దృష్టిచేత గాక యదార్థమైన విశ్వాసమూలంగా నడిచిన పక్షంలో మన ప్రార్థనా జీవితాలు విప్లవాత్మకంగా మారిపోతాయి.

**2.** విజయవంతమైన ప్రార్థనకుగల షరత్తులలో ఒకటి- మనం ''యదార్థహృదయముతోచేరువ కావటము'' (హెబ్రీ **10:22**). అంటే మనం ప్రభువు సమ్ముఖంలో సత్యవంతులముగానూ, నమ్మకస్థులముగానూ వుండాలని దీని భావము. వేషధారణ అసలు వుండకూడదు. ఈ షరత్తును నెరవేర్చాలంటే మన సామర్థ్యముతో సులువుగా చేసుకోగల ఒక పనిని చేసి పెట్టమని మనమెన్నడూ దేవుణ్ణి అడగనే అడగము. ఉదాహరణకు క్రైస్తవ పరిచర్య ప్రణాళికకు అవసరమైన అమిత ధననిధి మన దగ్గరే వుంచుకొని మళ్ళీ ఇదే ప్రణాళిక నిమిత్తం కొంత డబ్బును సమకూర్చమని మనం దేవుణ్ణి ఎన్నడూ అడగం. దేవుడు వెక్కిరింపబడడు. అప్పటికే ఆయన మనకు జవాబిచ్చినప్పటికీ దానిని వినియోగించుటకు మనం ఇష్టపడక పోయినప్పుడు అటువంటి ప్రార్థనలకు దేవుడు జవాబివ్వడు.



ఇదే సందర్భంలో- దేవుని పనికోసం పోవటానికి మనమేఇష్టపడనప్పుడు అదేపనికోసం మరెవ్వరినైనా పంపమని మనం ప్రభువును ప్రార్థించకూడదు. ముస్లిములు, హిందువులు, బౌద్ధులు- వీరిపక్షంగా కూడా వేలాది ప్రార్థనలు చేయబడుతున్నాయి. అయితే ఇటువంటి ప్రార్థనలు చేసిన వారందరూ ఆ ప్రజలకు సువార్త అందించుటలో దేవుని చేత వాడబడాలని ఆశించినట్లైతే క్రైస్తవపరిచర్యలు చరిత్ర మరెంతో ప్రోత్సాహకరంగా వుండేది.

**3.** ప్రార్థన అతిసామాన్యమైనది గానూ, నమ్మదగినది గానూ, ఎదురు ప్రశ్నలు లేనిది గానూ వుండాలి. ప్రార్థనకు సంబంధించిన వేదాంతం సమస్యలలో మునిగిపోయే అవకాశం కూడా వుంది. ఇది ఆధ్యాత్మిక జ్ఞానాన్ని మొద్దుబార జేస్తుంది. ప్రార్థనకు సంబంధించిన సమస రహస్యాల్ను విప్పి చెప్పటం కన్నా ప్రార్థన చేయుటే ఉత్తమం. దైవ విద్యలో పాండిత్యము సంపాయించిన వారు ప్రార్థన గూర్చి సూత్రాలను వల్లించనీయండి. కానీ సామాన్య విశ్వాసి పసిబిడ్డలాంటి నమ్మకంతో పరలోక గుమ్మాలను బ్రద్దలు కొట్టనీయండి. అగస్టీన్ ఇలా అన్నాడు. ''పాండిత్యహీనులు పరలోకాన్ని బలవంతంగా పొందుతారు, మయమైతే మన పాండిత్యమంతటితో శరీర రక్తాల్ను అధిగమించి పోవటం లేదు.''

ఏ విధానాలచేతనో నాకు తెలియదు,
కానీ నాకు తెలిసిందల్లా ఇదే-దేవుడు ప్రార్థనకు జవాబిస్తాడు.

ఆయన వాక్కును ఎప్పుడు పంపిస్తాడో నాకు తెలియదు
తీవ్ర ప్రార్థన వినబడుతుందని అది చెబుతుంది.

శీఘ్రమో, ఆలస్యమో - అది వస్తుందని మాత్రం నాకు తెలుసు
అంచేత మనము ప్రార్థిస్తూ కనిపెట్టుట అవసరం.

ఆశించిన ఆశీర్వాదం నేననుకున్న విధంగా
మరో రూపంలో వస్తుందో లేదో నాకు తెలియదు.

నా చిత్తం కన్నా జ్ఞానదాయక చిత్తము గల
ఆయన చెంతనే నా ప్రార్థనలనన్నింటినీ వుంచుతున్నాను
-లోలా సి. హెన్సన్.

**4.** ఎంచేత నంటే, నిజమైన ప్రార్థనా శక్తి దేనికీ వెనక్కిలాగదు, క్రీస్తు చెంత నీకు నీవుగా లొంగిపో. ఆయనకోసం బాహాటంగా బైటికి వెళ్ళు. రక్షకుని వెంబడించేందుకు సమస్తాన్ని విడిచిపెట్టు. క్రీస్తును అందరికీ ప్రభువుగా కిరీటాలంకరణ చేసే భక్తి విధానాన్నే ఆయన అతి ప్రియంగా ఘనపరుస్తాడు.

**5.** మనకేదైనా ఖర్చు అయ్యేప్పుడే మన ప్రార్థనకు దేవుడు ఒక ప్రత్యేక విలువను నియమిస్తున్నట్టు అగుపిస్తుంది. తమలాగా ఉదయాన్నే నిద్రలేచినవారు ఆ రోజు నిమిత్తమైన సూచనలు తండ్రి నుండి పొందుట కోసం పెందల కడనే లేచిన వాడితో సంతోషసహవాసం అనుభవిస్తారు. అదే విధంగా రాత్రంతా ప్రార్థన చేయాలనే తీవ్రమైన అశగలవారు నిస్సందేహమైన దైవశక్తిని అనందిస్తారు. వెలలేని ప్రార్థనకు విలువ వుండదు. అటువంటి ప్రార్థన చౌకబారు క్రైస్తవ్యానికి ఉత్పాదకము మాత్రమే.



క్రొత్త నిబంధనలో ప్రార్థన తరచుగా ఉపవాసవముతో అనుబంధం చేయబడింది. ఆధ్యాత్మిక అభ్యాసాల్లోతిండికి దూరంగా వుండటం విలువైన సాధనమే. మానవ పక్షం నుండి ఇది విస్పష్టతను, ఏకాగ్రతను, తీవ్రమనోగమనాన్ని బలపరుస్తుంది. దైవనియమాను సారంగా ప్రార్థనను మన దైనందిన భోజనానికి ముందుగా వుంచినప్పుడు ప్రభువు అటువంటి ప్రార్థనకు ప్రత్యేకించి జవాబిచ్చేందుకు ఇష్టపడుతున్నట్టు గోచరిస్తోంది.

**6.** స్వార్థ ప్రార్థనలు చేయొద్దు, ''మీరడిగినను మీభోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో అడుగుదురు గనుక మీకేమియుదొరుకుటలేదు'' (యాకోబు **4:3**). ప్రాథమికముగా మీ ప్రార్థనలభారము ప్రభువును గూర్చిన ఆసక్తియైవుండాలి. మొట్టమొదట మనం ఇలా ప్రార్థించాలి; ''నీ రాజ్యము వచ్చు గాక, నీ చిత్తము పరలోకమునందు నెరవేరినట్లు భూలోకమునందును నెరవేరునుగాక''. అటుతర్వాత ఈ మాటలు చేర్చాలి. '' నేటి దిన ఆహారము నేడు మాకు దయచేయుము''.

**7.** గొప్పమనవులతో మనం దేవుణ్ణి సన్మానించాలి; ఎంచేతనంటే ఆయన గొప్ప దేవుడు. ''దేవుని దగ్గర నుండి గొప్పవాటి కోసం కనిపెట్టుటకు మనం విశ్వాసము కలిగి వుండాలి.''

నీ వొక రాజు దగ్గరకు వస్తున్నావు
పెద్ద పెద్ద మనవులు నీతో తెస్తున్నావు
ఎంచేతనంటే ఆయన ప్రేమ, శక్తి అటువంటివి
నీవు అమితంగా ఎన్నడూ అడుగనేరవు -జాన్ న్యూటన్.

ఆయన నుండి అతి తక్కువగా అత్యల్పమైన వాటిని ఆశిస్తూ మనమెన్ని సార్లు ప్రభువును బాధపెట్టలేదు? ఉన్నత విషయాల అనంతరం అత్యల్పమైన లబ్ధులు, బలహీనమైన కోరికలతో, అతి తక్కువ విజయాలతో మనల్ని మనము సంతృప్తి పర్చుకుంటున్నాము. మన దేవుడు గొప్ప దేవుడనే భావనతో మన చుట్టూరా వున్న ప్రజల్ని మనం ప్రభావితుల్ని చేయటం లేదు. మనుషుల కన్నుల ఎదుట ఆయన్ను మనం మహిమ పర్చటం లేదు. ''వారు నాలోని దేవుణ్ణి మహిమ పర్చారు'' అని అపొస్తలుని గూర్చి చెప్పినట్టు మన గూర్చి తరచుగా చెప్పబడ లేదు.

– ఇ.డబ్ల్యు. మూర్

**8.** ప్రార్థనా ప్రక్రియలో మొట్టమొదట మనం దేవుని చిత్తము లో వున్నామో లేదో సరిగ్గా చూచు కోవాల్సి వుంది. అప్పుడు ఆయన మన ప్రార్థనలను వింటాడని నమ్ముతూ ప్రార్థించాలి.

''ఆయనను బట్టి మనకు కలిగిన ధైర్యమేదనగా ఆయన చిత్తాను సారముగా మనమేది అడిగినను ఆయన మన మనవి ఆలకించు నునదియే, మనమేమి అడిగినను ఆయన మన మనవి అలకించునని మన మెరిగిన యెడల మనమాయనను వేడుకొనినవి మనకు కలిగినవని యెరుగుదుము''. (I యోహాను **5:14-15**)

ప్రభుయేసు నామమున ప్రార్థించుట అంటే ఆయన చిత్తములో ప్రార్థించుట అని అర్థము. మనం నిజంగా ఆయన నామములో ప్రార్థించినప్పటికీ వాస్తవానికి ఆయన మన మనవిని తండ్రియైన దేవునికి



చెబుతున్నట్టు గా వుంటుంది, ''మీరు నా నామమును బట్టి దేని నడుగుదురో తండ్రి కుమారుని యందు మహిమ పర్చబడుటకై దాని చేతును'' (యోహాను **14:13**). ''ఆదినమున మీరు దేని గూర్చియు నన్ను అడుగరు; మీరు తండ్రిని నా పేరట ఏమి అడిగినను ఆయన మీకు అనుగ్రహించునని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను'' (యోహాను **16:23**). ''మరియు మీలో ఇద్దరు తాము వేడు కొను సంగతిని గూర్చి యైనను భూమిమీద ఏకీభవించిన పక్షమున అదిపరలోకమందున్న నా తండ్రి వలన వారికి దొరుకునని మీతో చెప్పుచున్నాను. ఏలయనగా ఇద్దరు ముగ్గురు నానామమున ఎక్కడ కూడి యుందురో అక్కడ నేను వారి మధ్య వుందును.''

(మత్తయి **18:19-20**)

''ఆయన నామమున అడుగుట అంటే ఆయన చేతితో ప్రార్థనలోకి నడిపించబడుట. దీని భావం ఏమిటంటే, ఆయన ప్రక్కనే మోకరించుట, ఆ యన కోరికలు మన హృదయాల ద్వారా ప్రసరించుట, దీని అర్థం ఇదే;'-'ఆయన నామములో' ఆయన నామము అంటే ఆయన ఏమైయున్నాడో అది, దాంతో పాటు ఆయన స్వభావము; అందుచేత క్రీస్తు నామమున ప్రార్థించుట అంటే ఆయన దీవెన కరమైన చిత్తాను సారంగా ప్రార్థించుట అని వాస్తవ భావము. దైవకుమారుని నామమున నేను చెడు కోసం ప్రార్థించగలనా? నా ప్రార్థనాంశములు ఆయన స్వభావాన్ని వ్యక్త పర్చేవిగా వుండాలి. నా ప్రార్థనలో ఆ పని నేను చేయగలనా? పరిశుద్ధాత్మశక్తి, క్రీస్తుమనస్సు, మన కోసం మనలో వున్న క్రీస్తు కోరికలు మన ప్రభువేమనకు అత్యధికంగా నేర్పిస్తాడు. ఈ మాటలు పలుక కుండా మన ప్రార్థన ముగియగా నేర్పిస్తాడు. ఈ

మాటలు పలక కుండా మన ప్రార్థన ముగియ కూడదు;'దివ్యమైన మా ప్రభువు నామమున. అప్పుడు ప్రార్థన సారాంశమంతా యేసు దీవెనకరమైన నామం ద్వారా వడగట్టబడి, ఆయన నామముగుండా జల్లెడ పట్టబడాలి-సమస్తము ఆ నామమును బట్టి మాత్రమే జరగాలి''-శామ్యూల్ రిడౌట్.

**9.** మన ప్రార్థనా జీవితం నిజంగా ప్రభావితంగా వుండాలంటే దేవునితో మన లెఖ్ఖలు సరిగ్గా వుండాలి. దీని భావమేమిటంటే, పాపస్వభావము మన బ్రతుకుల్లోకి ప్రవేశించిందనే ఎరుక కలిగిన వెంటనే దానిని మనం ఒప్పుకోవాలి, విడిచిపెట్టాలి, ''నా హృదయములో నేను పాపమును లక్ష్యము చేసిన యెడల నా ప్రార్థనను ప్రభువు వినడు'' (కీ. **66:18**). మనలో క్రీస్తు నివసించాలి ''నా యందు మీరును, మీ యందు నా మాటలును నిలిచి వుండిన యెడల మీకేది ఇష్టమో అడుగుడి, అది మీకు అనుగ్రహింపబడును'' (యోహాను **15:7**). క్రీస్తులో నివసించు వ్యక్తి ఆయనకు అతి సన్నిహితంగా వుంటాడు, అతడు ప్రభువు చిత్తానికి సంబంధించిన జ్ఞానముతో నింపబడి వుంటాడు. అలా అతడు జ్ఞాన యుక్తంగా ప్రార్థించగలడు, జవాబులు పొందగలడు. ఆయనలో నిలిచివుండే జీవితం ఆయన ఆజ్ఞలను శిరసావహిస్తుంది. ''మరియు మనమాయన ఆజ్ఞలను గైకొనుచు ఆయన దృష్టికి ఇష్టమైనవి చేయుచున్నాము గనుక మనమేమి అడిగినను అది ఆయన వలన మనకు దొరుకును'' (I యోహాను **3:22**). మీ ప్రార్థనలు ఆయనకు వినబడి, వాటికి జవాబులు లభించాలంటే మీఆత్మీయ స్థితి సరైందిగా వుండి తీరాలి (I యోహాను **3:20**).



**10.** రోజంతటిలో ఏవో కొన్ని నిర్ణీత సమయాల్లో మాత్రమే ప్రార్థించరాదు. వీధిలో నడిచేటప్పుడు, కారు నడిపేటప్పుడు, కార్యాలయంలో పనిచేసేటప్పుడు, ఇంటి పనుల్లో వున్నప్పుడు కూడా మనం ప్రభువు తట్టుచూచే విధంగా మన ప్రార్థనా వైఖరిని అభివృద్ధి చేసుకోవాలి. ఇటువంటి నిరంతర ప్రార్థనా విధానానికి నెహెమ్యా ఒక విశిష్ట ఆదర్శప్రాయుడు (నెహెమ్యా **2:4**). ప్రార్థనలో ఆయా సమాయాల్లో దేవుని ముఖదర్శనం చేసుకునేబదులు ''మహోన్నతుడైన దేవుని రహస్యస్థలంలో నివసించుట ఎంతో మంచిది.''

**11.** చివరిదిగా మన ప్రార్థనలు నిర్దిష్టముగా వుండాలి. నిర్దిష్ట విషయాల కోసం ప్రార్థించినప్పుడే, నిర్దిష్ట జవాబుల్ని చూడగలుగుతాం.

''ప్రార్థన ఓ అద్భుత ఆధిక్యత"- దీని భావమేమిటంటే, హడ్సన్ టేలర్ చెప్పినట్లు"-దేవుని ద్వారా మనిషిని కదిలించు''. ఆశ్చర్యకరమైన ప్రార్థనా రాజ్యంలో అద్భుత కార్యాలు జరగవలసిన ఏయే పరిచర్యలు మీ హస్తాల్లో వున్నాయి? శీతలమైపోయి, మందకొడిగా మారిన ప్రదేశాల్లోకి మనమిప్పుడు సూర్య కాంతిని ప్రసరింప జేయొచ్చు. విషాద ఛాయలు అలుముకున్న చెరసాల గృహంలో నిరీక్షణాజ్యోతిని వెలిగించవచ్చు. సుదూర దేశంలోకి కాంతికిరణాలను, కుటుంబ భావాలను మనం తీసుకు పోవొచ్చు, ఆధ్యాత్మికంగా బలహీనులైన వారు సముద్రాలకు ఆవల కాయ కష్టం చేస్తున్నప్పటికీ వారికి మనం పరలోకపు సుహృద్భావాలను అందించవచ్చు. ప్రార్థనకు స్పందనగా లభించే అద్భుతాలు ఇవే!''-జె.ఎచ్.జోవెట్.

ఈ వ్యాఖ్యకు వెన్హామ్ అనుపేరుగల ఓ రచయిత తన సాక్ష్యాన్ని జత చేస్తున్నాడు: ''బోధించుట అనేది ఓ అసాధారణ వరము; ప్రార్థనావరము దానికంటే విశిష్టమైనది. బోధించుట అనేది ఓ ఖడ్గం లాంటిది, సమీపంగా వున్నవారిపై మాత్రమే ప్రయోగించుటకు సాధ్యపడుతుంది; దూరంగా వున్నవారిని ఇది చేరలేదు. అయితే ప్రార్థన ఓ తుపాకీ గుండులా సుదూర ప్రాంతాలకు కూడా వెళ్ళగలదు, కొన్ని పరిస్థితుల్లో ఇది ఎక్కువ శక్తివంతంగా పని చేస్తుంది.''

ప్రభువా, మాలో ఎంతటి మార్పుకలిగింది,
నీ సన్నిధిలో గడిపిన ఒక్క గంట సమయం ఎంత సాధించి పెట్టింది!
మా హృదయ భారాలు ఎంతగా తీసివేయబడ్డాయి!
ఒక్క తొలకరి వర్షంతో ఎండిన భూములు ఎంతగా తడిసినవి !
మేము మోకరిస్తాము , మా చుట్టూరా వున్న సమస్తం
వంగినట్టుగా కనిపిస్తుంది,
మేము లేచి నిలబడతాము, సమీపస్థులు, దూరస్థులంతా
సూర్య కాంతిలో నిర్మలముగా, ధైర్యంగా నిలబడతారు,
మేము మోకరించగా ఎంత బలహీనులమో !
మేము లేవగా ఎంతటి శక్తి సంపన్నులమో !

కాబట్టి, ఎందుకు మాకు మేముగా గానీ ,
ఇతరులు గానీ ఇంతటి తప్పు చేయాలి ?
మేమెందుకు నిత్యం బలవంతులముగా వుండము?
మేమెన్నడైనా అతిజాగ్రత్తగా జన్మించామా ?
మేమెల్లప్పుడూ బలహీనులుగానూ,



హృదయ విహీనులుగానూ వుండాలా?
అతృత, ఇబ్బందులతో సతమతం కావాలా ?
మాతో ప్రార్థన వున్నప్పుడు ఆనందం, బలం, ధైర్యం
నీతో ఎందుకు వున్నాయి ? -ట్రెంచ్

# యుద్ధము

క్రొత్త నిబంధన గ్రంథాన్ని చదివినవాడు, భూలోకంలో క్రీస్తు కార్యాన్ని వర్ణించుటకు వినియోగించిన పదము 'యుద్ధము' ను గ్రహించ కుండా వుండడు. వినోదాత్మకమైన ఆధునిక ఆటపాటల క్రైస్తవ్యం నుండి నిజ క్రైస్తవము తొలిగించబడి దూరంగా పెట్టబడింది. ఈ నాడు బహుగా ప్రబలి పోతోన్న సుఖభోగాలు సౌఖ్యజీవితాల కోసం ఆత్రులుచాస్తున్న ప్రజలతో కలిసి నిజక్రైస్తవము గందరగోళ పరిస్థితిని అనుభవించదు. మరో మాటలో చెప్పాలంటే ఇది నరకపు శత్రువులతో చేసే మరణ పర్యంత పోరాటము, నిరంతర యుద్ధము. యుద్ధం ఇప్పటికే ఆరంభమైందనీ, ఇక వెనుదిరుగుట అనేది వుండరాదని గుర్తెరగని శిష్యుడెవడైనా సరే ఉప్పుకు కూడా కొరగాడు.

యుద్ధంలో ఐక్యత తప్పనిసరిగా వుండాలి. చిన్న చిన్న కొట్లాటలకు, అసూయ ద్వేషాలతో విడిపోవుటకు, విభజించబడిన నమ్మకత్వాలకు ఇది సమయం కాదు. తనపై తాను, స్వయం విరుద్ధంగా పేర్పాటుకు దిగిన ఇల్లు ఎన్నటికీ నిలువదు. అంచేత క్రీస్తుసైనికులు ఐక్యత కలిగి వుండాలి. దీనత్వమే ఐక్యతకు సరైన మార్గము. పిలిప్పీ పత్రిక **2**వ అధ్యాయం ఈ సత్యాన్ని అతి స్పష్టంగా నేర్పుతుంది. నిజమైన దీనుడితో అపార్థం, తగాదా ల్లాంటి అనుభవాలు పొందుట అసాధ్యము. యుద్ధానికి ఇద్దరు వ్యక్తులు కావాలి. ''గర్వము ద్వారానే యుద్ధము కలుగును''. ఎక్కడ గర్వముండదో అక్కడ పంతాలు, పట్టింపులు, తగాదాలకు తావుండనే వుండదు.

యుద్ధ జీవితానికి కఠినత్వం, త్యాగ జీవనం అవసరము. ఎంతటి ప్రమాదకర యుద్ధము లోనైనా ఓ విస్తార ఆహార పంపిణీ వ్యవస్థ వుంటుంది. మనమిప్పుడు యుద్ధంలో వున్నామని, మన ఖర్చులన్నీ బాగా తగ్గించుకొని సాధ్యమైనంత వరకు మన వనరులన్నింటినీ పోరాటంలో వినియోగించాల్సి వుందని క్రైస్తవులు గ్రహించవలసిన సమయం ఆసన్నమైనది.

ఓ అనామక యువ శిష్యుడు ఈ పోరాటాన్ని అతి స్పష్టంగా చూచాడు. 1960లో అతడు ఓ క్రైస్తవ పాఠశాలలో తన తరగతికి నాయకుడిగా వుండేవాడు. తన పదవీ కాలంలో క్లాసులో నిర్వహించ బడే ఆయా సమావేశాలు, సందర్భాల్లో అవసరమైన దుస్తులు మరియు బహుమానాల కోసం డబ్బు ఖర్చు చేయాల్సిందిగా ప్రస్తావించబడింది. సువార్త ప్రకటనకు ప్రత్యక్షంగా దోహదం చేయని విధానమంటే అసలు ఇష్టం లేని ఆయువనాయకుడు తన పదవికి రాజీనామా చేశాడు. అతని రాజీనామా పత్రం బహిరంగంగా ప్రకటించబడింది. అదే రోజున అతడు తన తరగతి మిత్రులందరికీ ఈ క్రింది లేఖ వ్రాసి పంచి పెట్టాడు.

ప్రియ సహవిద్యార్థులారా,

తరగతి సమావేశాలు, విందులు, దుస్తులు, బహుమానాల గూర్చిన ప్రస్తావన మన కార్యవర్గ సమావేశంలో వచ్చినప్పుడు తరగతి నాయకుడిగా నేను వీటన్నిటి గూర్చి క్రైస్తవ వైఖరితో ఆలోచించాను.

మన డబ్బు, మన సమయం, మన సమస్తం, మనల్ని మనం కూడా క్రీస్తు కోసం, ఇతరుల కోసం వెచ్చించి, ఇచ్చి వేసుకున్నప్పుడు మన జీవితాల్లో అసలైన అమితానందం కలుగుతుందని నా భావన. అలా



చేసినప్పుడు మనం ఆయన మాటల్ని నెరవేర్చిన వారమవుతాం: ''నా కోసం తన ప్రాణమును పోగొట్టు కొనువాడు దానిని తిరిగి పొందును''.

ఓ అవిశ్వాసికి నిర్ధిష్ట సాక్ష్యం ప్రకటించలేని విషయాల కోసం క్రైస్తవులు తమ డబ్బును, సమయాన్ని వెచ్చిస్తూ క్రీస్తునందు జన్మించిన పసి పాపలను బలపర్చుటకు తమ వనరుల్ని వినియోగించక పోతే- రోజుకు 7000 మంది ఆకలి చావులు చస్తున్నారని, ప్రపంచ జనాభాలో సగం కంటే ఎక్కువ భాగం మానవ జాతికి గల ఏకైక నిరీక్షణ గూర్చిన సువార్త ఒక్కసారి కూడా ప్రకటించ బడలేదను సత్యాలకు వారు అను గుణంగా జీవించ లేరు.

మనకు మనంగా విందులు, వినోదాలు, సమావేశాలు నిర్వహించుకుంటూ మనలో మనమే స్నేహ సంబంధాలు కలిగివుంటూ మన డబ్బును, సమయాన్ని మన సొంత సుఖసంతోషాలకు వెచ్చించుటకు బదులు ప్రపంచ జనాభాలో ఇంకా సువార్త వినని 60% ప్రజలకు, అసంఖ్యాక ఇరుగు పొరుగు కుటుంబాలకు సువార్త ప్రకటిస్తే దేవునికి మనం మరింత మహిమ తెచ్చిన వారమవుతాం.

యేసు క్రీస్తు మహిమ నిమిత్తము, స్వదేశ- విదేశ వాసులైన పొరుగువారికి సువార్త ప్రకటన నిమిత్తం మన డబ్బును వినియోగించు నిర్ధిష్ట అవసరతలు, అవకాశాలు, నాకు తెలుసు గనుక మన తరగతి నిధులను అనవసరంగా కేవలం మన కోసం ఖర్చు చేయుటకు నేను కూడా అంతటి గొప్ప అవసరతలో వున్నట్లయితే అప్పుడు నా అవసరత తీర్చగల సామర్థ్యమున్నవారు తమ సమస్తాన్ని వినియోగించి నాకు సువార్త అందించాలని, దాంతో పాటు ఇతరమైన నా భౌతిక అవసరతలు కూడా

తీర్చాలని నేను కోరుకుంటాను.

''మనుషులు మీకేమి చేయవలెనని మీరు కోరు కుంటున్నారో ఆలాగున మీరును వారికి చేయుడి''.

''అయితే ఎవడైనను ఈ లోక సంబంధమైన వస్తువులన్నీ వుండియు తన సహోదరుడు అవసరతలో వుండుట చూచియు అతనికి విరుద్ధముగా తన హృదయమును మూసుకొనిన యెడల దేవుని ప్రేమ అతనిలో ఎట్లు నిలుచును?''

కాబట్టి ప్రేమ, ప్రార్ధనల వల్లనే యేసు క్రీస్తు తన సర్వస్వమును ఇచ్చివేయుట నీవు చూస్తావు (**II** కొరింథీ **8:9**); ఇందుమూలంగా నేను **1963** తరగతి నాయకుడి పదవి నుంచి రాజీనామా సమర్పిస్తున్నాను.

ఇట్లు,

మీతో క్రీస్తులో, మీ సహవిద్యార్థి ..

యుద్ధంలో బాధపడటం అవసరం. ఈనాటి యువ జనులు తమ దేశం కోసం తమ ప్రాణాల్ని సమర్పించేందుకు ఇష్టపడితే, క్రైస్తవులు ఇంకెంత అధికంగా క్రీస్తు కోసం, సువార్త కోసం తమ ప్రాణాలు పోగొట్టుకునేందుకు ముందుకు రావాలో గమనించండి. వెలలేని విశ్వాసానికి ఎటువంటి విలువలేదు. యేసు ప్రభువు మన జీవితాల్లో ఏ కొంచెమైనా అర్థవంతంగా మారినట్లైతే అప్పుడు మన వ్యక్తిగత భద్రత, బాధానివారణ వంటి భావములు ఆయన నిమిత్తమైన పరిచర్య నుండి మనల్ని వేరు చేయవు.



సంకుచిత భావాలు గల విమర్శకులు ఎదుర్కొన్న సందర్భంలో అపొస్తలుడైన పౌలు తన అపొస్తలత్వమును కాపాడు కొనుట కోసం అతడు తన కుటుంబ చరిత్రను గాని, తన పాండిత్యము గూర్చి గాని, తనలోక సంబంధ ప్రతిభల గూర్చి గానీ నొక్కి చెప్పలేదు. యేసు క్రీస్తు ప్రభువు నిమిత్తము తాను అనుభవిస్తున్న శ్రమల గూర్చి గట్టిగా చెప్పాడు:

''వారు క్రీస్తు పరిచారకులా? వెర్రి వాని వలె మాటలాడుచున్నాను, నేనును మరి ఎక్కువగా క్రీస్తు పరిచారకుడను. మరి విశేషముగా ప్రయాసపడితిని; మరి అనేక పర్యాయములు చెరసాలలో వుంటిని; అపరిమితముగా దెబ్బలు తింటిని, అనేక మారులు ప్రాణాపాయములో వుంటిని; యూదుల చేత అయిదు మారులు ఒకటి తక్కువ నలువది దెబ్బలు తింటిని, ముమ్మారు బెత్తములతో కొట్టబడితిని, ఒక సారి రాళ్ళతో కొట్టబడితిని, ముమ్మారు ఓడ పగిలి శ్రమ పడితిని; ఒక దివారాత్రము సముద్రములో గడిపితిని. అనేక పర్యాయములు ప్రయాణములలోను, నదుల వలననైన ఆపదలలోను, దొంగల వలనైన ఆపదలలోను, నాస్వజనుల వలనైన ఆ పదలలోను, పట్టణములో ఆపదలలోను, ఆరణ్యములో ఆపదలలోను, సముద్రములో ఆపదలలోను, కపట సోదరుల వలన ఆపదలలోను వుంటిని, ప్రయాసతోను, కష్టములతోను, తరచుగా జాగరణములతోను, ఆకలి దప్పులతోను, తరచుగా ఉపవాసములతోను, చలితోను, దిగంబరత్వము తోను ఉంటిని. ఇంకను చెప్పవలసినవి అనేకములున్నవి. ఇవియుగాక సంఘము లన్నిటి గూర్చిన చింతయు కలదు. ఈ భారము దిన దినము నాకు కలుగుచున్నది''. (**II** కొరింథీ **11:23-28**)

ఈ మంచి సవాలును తన ఆత్మీయ కుమారుడు తిమోతికి అందిస్తూ పౌలు ఇలా అన్నాడు, ''క్రీస్తు యేసు యొక్క మంచి రాణువ వాని వలె నాతో కుడా శ్రమ అనుభవించుము''.(II తిమోతి **2:3**) యుద్ధము చేయాలంటే అత్యంత విధేయత అవసరం. ఒక నిజ సైనికుడు తన పై అధికారి ఆజ్ఞను ఎటువంటి ఎదురు ప్రశ్నలు లేకుండా, ఆలస్యం చేయకుండా అనుసరిస్తాడు. క్రీస్తు దీని కన్నా తక్కువైన విధేయతతో తృప్తి పడతాడని భావించుట ఇంగిత జ్ఞానానికి విరుద్ధం. సృష్టికర్తగా, విమోచకుడిగా తనను వెంబడించువారు యుద్ధంలో తన ఆజ్ఞలకు సరిగ్గానూ, సంపూర్ణంగానూ విధేయత చూపాలని ఆశించుటకు ఆయనకు సర్వహక్కులున్నాయి.

యుద్ధంలో అస్త్రప్రయోగ నిపుణత కావాలి. ప్రార్థన, దైవ వాక్యము ఈ రెండు క్రైస్తవుని ఆయుధాలు. అతడు తనను తాను తీవ్ర, నమ్మక పాత్రమైన, భద్రత నిచ్చే ప్రార్థనకు అప్పజెప్పుకోవాలి. అలా చేయటం ద్వారానే బలమైన శత్రుగోడలు కూలిపోతాయి. అప్పుడు కూడా అతడు ఆత్మ ఖడ్గమైన దేవుని వాక్యాన్ని వినియోగించుటలో వైవిధ్యం సాధించాలి - శత్రువు తన సమస్త కుయుక్తిని వినియోగించి క్రైస్తవుడు తన ఖడ్గాన్ని విడిచి పెట్టు విధంగా మోసం చేస్తాడు. విరుద్ధ భావాత్మక విషయాల్ను వాడు వ్రేలు పెట్టి చూపుతాడు. తత్త్వ శాస్త్రము, విజ్ఞానము, మానవ సాంస్కృతుల నుండి వివాదాలను రేకెత్తింప జేస్తాడు. కానీ క్రీస్తు సైనికుడు యుద్ధ రంగంలో స్థిరంగా నిలబడి తన ఖడ్గాన్ని అన్ని సమయాల్లోనూ ఉపయోగిస్తూ దాని శక్తిని నిరూపిస్తూ వుండాలి.

లోకసంబంధమైన వాడి దృష్టికి క్రైస్తవ యుద్ధంలో ప్రయోగించ బడే ఆయుధాలు హాస్యాస్పదంగా వుంటాయి. యెరికో ప్రయోగంలో



నిరూపించబడ్డ శక్తివంతమైన యుద్ధపథకాన్ని ఈ నాటి యుద్ధ శాస్త్ర నిపుణులు హేళన చేస్తారు, గిద్యోను నాయకత్వంలోని అత్యల్పసైన్యం అపహాస్యం పాలవుతుంది. దావీదు వడిసెల వేటు గూర్చి, షంగోరు ముల్లుగర్ర దెబ్బ గూర్చి శతాబ్దాల తరబడి దేవుని నాయకత్వంలో నడుపబడ్డ వెర్రివెంగలప్పల సైన్యాల గూర్చి ఇక మన మేమి చెబుతాం? మహా గొప్ప సైన్య సమూహాల పక్షంగా దేవుడు నిలువడని ఒక్క ఆధ్యాత్మిక మనసుకే తెలుసు. కానీ దేవుడు, ఈ లోకంలోని బలహీనులను, పేదలను, తృణీకరించబడ్డ వారిని తన హస్తాల్లోకి తీసుకొని వారి ద్వారా మహిమ పొందాలని ఇష్టపడతాడు.

యుద్ధం చేసేవాడు శత్రువును గూర్చి మాత్రమే గాక వాడి పన్నాగముల గూర్చి కూడా ఎరిగి వుండాలి. క్రైస్తవ యుద్ధంలో ఇదే విధానం అవసరం. '' ఏలయనగా మనము పోరాడునది శరీరులతో కాదు, ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోక నాధులతోను, ఆకాశ మండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నావము'' (ఎఫెసీ. **6:12**). '' సాతాను తానే వెలుగు దూత వేషము ధరించుకొనుచున్నాడు, గనుక వాడి పరిచారకులును, నీతి పరిచారకుల వేషము ధరించు కొనుట గొప్ప సంగతి కాదు, వారి క్రియలచొప్పున వారి కంతము కలుగును'' (II కొరింథీ **11:14,15**); అని మనకు తెలుసు. త్రాగుబోతులు, దొంగలు, వేశ్యల నుండి బద్ధవైరము ఉత్పన్నం కాదని, అటువంటి శతృత్వం కేవలం మత సంబంధ వృత్తిగల నాయకుల నుండి మాత్రమే తలెత్తుతుందని సుశిక్షితుడైన ఓ క్రైస్తవ సైనికుడికి తెలుసు. దేవుని చేత పంపబడ్డ క్రీస్తును శిలువ వేసి మేకులతో కొట్టింది ఆనాటి మతనాయకులే గదా! ఆది సంఘాన్ని అనేక శ్రమలకు గురి చేసింది కూడా మత నాయకులే. దేవుని

సేవకులుగా పిలువబడిన వారి నుండే పౌలు తీవ్ర దాడులను ఎదుర్కొన్నాడు. సంవత్సరాల తరబడి జరుగుతూ వచ్చింది ఇదే. సాతాను సేవకులు నీతి పరిచారకులుగా మార్చబడ్డారు; వారు మత సంబంధ భాషమాట్లాడతారు. మత సంబంధ వస్త్రధారణ చేస్తారు, ఎంతో దైవ భక్తి గలవారుగా నటిస్తారు గానీ వారి హృదయాలు క్రీస్తును గూర్చి, సువార్త గూర్చి ద్వేషంతో నిండి వుంటాయి.

యుద్ధంలో ఏకాగ్రత అత్యంత అవసరం. ''రాణువ వాడెవడును యుద్ధమునకు పోవునప్పుడు తన్ను దండులో చేర్చుకొనిన వానిని సంతోష పెట్ట వలెనని యీజీవన వ్యాపారములలో చిక్కుకొనడు'' (II తిమోతి 2:4). క్రీస్తు శిష్యుడు-తన ఆత్మకూ, యేసు క్రీస్తు యెడల తనకున్న సంపూర్ణ భక్తి జీవితానికీ మధ్య అడ్డుగా నిలుచు దేనినైనా అసహ్యించు కోవటం నేర్చుకొంటాడు. ఇతడు ఎవ్వరినీ నొప్పించని విధానంలో నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తాడు; ఇతరుల యెడల దయాపూర్ణుడై స్థిరంగా వుంటాడు. ఏకైక, ఆవేదనా పూరితుడై వుంటాడు.

యుద్ధంలో ప్రమాద పరిస్థితి ఎదురైనప్పుడు ధైర్యం కావాలి. ''అందుచేతను మీరు ఆపద్దిన ముందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చిన వారై నిలువబడుటకును శక్తి మంతులగునట్లు దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించు కొనుడి.......నిలువబడుడి.''

**(ఎఫెసీ. 6:13-15)**

ఎఫెసీ 6:13-18 వాక్య భాగం ప్రకారం క్రైస్తవ సైనికుని కవచం యుద్ధరంగంలో వెన్నుచూపుటకు గానీ, వెనుదిరుగుటకు గానీ అవకాశం కలిగించదని చాలా సార్లు చెప్పబడింది. వెనుదిరుగుట ఎందుకు? ''మనలను ప్రేమించిన వాని ద్వారా మనము అత్యంత విజయులమైతే''



దేవుడు మన పక్షంగా వున్నందు చేత ఎవ్వరూ మనల్ని వ్యతిరేకించి జయం పొందలేక పోతే యుద్ధం ఆరంభించక ముందే విజయం విషయం హామీ పొంది వున్న వారమైతే ఇక వెనుదిరిగి పారి పోవుట గూర్చి మనమెలా ఆలోచించగలం?

నేను విజయులతో నిలిచినా లేక ఓడి
పడి పోయిన వారితో నశించినా ఏమి?
పాపులే పిరికి పందలు యుద్ధము చేస్తూ కొనసాగటమే సమస్తము.
నా మీదికి వస్తున్న శత్రువు బలవంతుడు
ఓ ప్రభువా, నా ఖడ్గము విరిగి పోతుంది
అతిశయిస్తున్న వారి పతాకములను, కత్తులను చూడు
కానీ మిగిలి పోయిన ఖడ్గపు ముక్కనైనా నాతో వుంచు.

-ఆమీకార్ మైకెల్.

# ప్రపంచ అధికారము

ప్రపంచ అధికారం కోసం దేవుడు మనల్ని పిలిచాడు. మనం ''మనుష్యులముగా పుట్టి కొన్ని తినుబండారాల్ని అమ్ముకునే వ్యాపారులముగా మరణించాలని దేవుడెన్నడూ ఉద్దేశించలేదు.'' ''తాత్కాలిక ప్రణాళికల్లో చిన్న పాటి అధికారులముగా'' మనం మన జీవితాల్ని గడపాలని దేవుని ఉద్దేశం కాదు.

ఆదిలో దేవుడు మానవుడ్ని సృష్టించినప్పుడు ఆయన అతనికి భూమ్మీద సర్వాధికారం అనుగ్రహించాడు. మహిమ, గౌరవాలతో అతణ్ణి కిరీటధారిగా జేసి సమస్తమును అతని పాదాల క్రింద వుంచాడు. మానవుడ్ని ఘనత, సార్వ భౌమత్వాలతో ధరింపజేశాడు-దేవదూతల కన్నాకొంచెం తక్కువ వాడిగా మాత్రమే నరుడు చేయబడ్డాడు.

ఆదాము పాపము చేసి, దివ్య శాసనం ద్వారా తాను సొంతంచేసుకొన్న అధికారంలో చాలా మట్టుకు పోగొట్టుకున్నాడు, ఎటువంటి పోటీలేని విధంగా ఏలుటకు బదులు అతడు ఓ అనిశ్చిత రాజ్యాన్ని అనిశ్చితంగానే పరిపాలించాడు.

మనం తిరిగి అధికారం పొందగలిగే భావం సువార్తలో ప్రస్ఫుటమవుతున్నది. ప్రస్తుతం మనముందున్నది మొరిగే కుక్కల్ని, విషపూరిత సర్పాలను అదుపుచేసే సమస్య కాదు గానీ- మన స్వాస్థ్యము కోసం అన్యుల్ని సంపాదించి సమకూర్చుట, మన ఆక్రమిత భూభాగ పరిధిలోకి భూది గంతాలను కూడా తెచ్చుటే. ''నీతి యుక్తమైన,

ఆధ్యాత్మిక సార్వభౌమత్వముల చేతనే నిజమైన సామ్రాజ్య సరిహద్దుల విస్తరణ సాధ్యమవుతుంది. అంటే-నిర్మలమైన పవిత్ర జీవనా కర్షణాయుతమైన కాంతి చేత ఆనందింప జేసే అధికారము''

-జె.ఎచ్. జోవెట్.

వాస్తవానికి ఆదాముకు గౌరవ ప్రదమైన క్రైస్తవ పిలుపు గూర్చి ఏమీ తెలియదు. విశ్వ విమోచన కార్యం లో మనం దేవునితో జతపని వారలము. ''జీవిత సార్వ భౌమత్వానికీ, స్వార్థముపై ఏలుబడికీ, సామ్రాజ్య పరిచర్యకూ ప్రభువు నామమున మనుషులను నియమించుట-మన ప్రత్యేక ప్రణాళిక'' -**డిన్స్‌డేల్ టి. యంగ్.**

ఈ నాటి జీవిత విశేష భాగమేమిటంటే-మనకు లభించిన ఉన్నత పిలుపును మనం మెచ్చు కోక పోవటమే. ''ద్వితీయశ్రేణికి చెందిన వాటిని'' హత్తుకోవటంలోనో, లేక చిన్న వాటిలో పెద్దవాటిని చూచుకోవటంలోనో అనేక సంవత్సరాలు గడపటంలోనే మనం సంతృప్తి చెందుతున్నాము. గాలిలో ఎగురుటకు బదులు మనం భూమి మీద ప్రాకుతున్నాం. రాజులుగా వుండుటకు బదులు బానిసలుగా బ్రతుకుతున్నాం. క్రీస్తు కోసం దేశాల్ను సంపాయించే దర్శనం ఏదో కొద్ది మందికి మాత్రమే లభ్యమైంది.

స్పర్జన్ ఓ ప్రత్యేకమైన వ్యక్తి. అతడు తనకుమారుడికి ఈ క్రింది విధంగా ఓశక్తివంతమైన సందేశాన్ని వ్రాశాడు:

''దేవుని చేత సువార్త సందేశకుడిగా పంపబడి, ఓ కోటీశ్వరుడిగా మరణించాలని భావిస్తే నేను నిన్ను ఇష్టపడకూడదు. సువార్తికుడిగా తయారు చేయబడి బుద్ధిహీనుడిలా మాట్లాడుతూ రోజు కావాలనుకుంటే



నేను నిన్ను ఇష్టపడకూడదు. మరొకరి పునాది మీదగాక సుదూర ప్రాంతాలకు క్రీస్తు సువార్త ప్రకటించుట ద్వారా క్రీస్తు రాజ్య నిర్మాణం చేయటంలోగల ప్రత్యేక గౌరవముతోనూ-క్రీస్తు కోసం ఆత్మల్ని సంపాయించటంలో గల ఘనత తోనూ పోల్చి చూస్తే మీ రాజులు అధిపతులు, రత్నఖచితకిరీటాలు ఇవన్నీ కలిసి వీటి ముందు ఎంత?''

ప్రఖ్యాత సౌవార్తిక వక్త జాన్ మోట్ట్ మరో ప్రత్యేక వ్యక్తి . అధ్యక్షుడు, కూలిడ్జ్ అతణ్ణి జపాను దేశానికి రాయబారిగా వెళ్ళమన్నప్పుడు మోట్ట్ ఇలా జవాబిచ్చాడు; "అధ్యక్షా, దేవుడు తన రాజ్య దౌత్యాధికారిగా వుండమని నన్ను పిలిచిన కారణంగా ఇతరత్రమైన పిలుపులు, విషయాలకు నా చెవులు చెవిటివైపోయాయి''.

బిల్లీ గ్రేహం మరో ప్రత్యేకత గూర్చి మాట్లాడుతున్నాడు. ''సుదూర తూర్పు'' దేశాల్లో తమ రాయబారిగా పని చేసేందుకు స్టాండర్డ్ ఆయిల్ కంపెనీ వారు ఓ అర్హత గల వ్యక్తి కోసం వెదకుతూ చివరకు ఓ సువార్తికుణ్ణి ఎంపిక చేశారు. అతనికి పదివేల డాలర్లు వేతనం చెల్లిస్తామని చెప్పారు; దానికతడు సమ్మతించలేదు, ఇరవై ఐదు వేల డాలర్లు ఇస్తా మన్నారు; అతడు త్రిప్పికొట్టాడు; ఏభైవేల డాలర్లు ఇస్తామని ఆశ పెట్టారు, అతడు ససేమిరా ఒప్పుకోలేదు. ''సమస్య ఏమిటి?'' అని వారతణ్ణి అడిగారు. అప్పుడతడు ఇలా సమాధానమిచ్చాడు; '' మీ రేటు బాగానే వుంది, కానీ మీరిస్తున్న ఉద్యోగమే చాలా చిన్నది, దేవుడు నన్నొక మిషనరీగా వుండమని పిలిచాడు.''

క్రైస్తవునికి గల పిలుపు అన్నిటికన్నా ఘనమైనది, దానిని గనక మనం గుర్తిస్తే మన జీవితాలు నూతన శిఖరాల్ను అధిరోహిస్తాయి.

అప్పుడు మనం మన గూర్చి ఇంతెంత మాత్రం కొళాయి మరమ్మత్తు పనివాడిగా, డాక్టరుగా, దంతవైద్యుడుగా పిలువ బడ్డామని చెప్పుకోము. కానీ, అపొస్తలులుగా పిలువ బడ్డట్టు మనల్ని మనం చూచుకోగలుగుతాము'' - పైచెప్పబడ్డ మిగతా పనులన్నీ పొట్టపోషణకు మాత్రమే పని కొస్తాయి.

సర్వ సృష్టికి సువార్త ప్రకటించటానికి, సమస్త దేశనివాసుల్ని శిష్యులుగా చేసేందుకు, ప్రపంచ సౌవార్తీకరణోద్యమం కోసం పిలువబడ్డట్టు మనల్ని మనం చూస్తాం.

ఇది ఓ మహోన్నత కార్యం, నీవేమంటావ్? అవును, మహోన్నతకార్యమే, ఈ క్రింద విభిత్తమైన సంక్షిప్త ప్రపంచ వర్ణనలో సూచించబడిన రీతిగా ఈ కార్యము బహు భీతికరంగా గోచరిస్తుంది.

''ప్రస్తుతం మూడు బిలియన్లు మించిన ప్రపంచ జనాభాను ఒకే పట్టణంలో నివసిస్తున్న వెయ్యి మంది ప్రజలుగా మనం ఊహించి కుదించి చెబితే ఈ క్రింది విరుద్ధ చిత్రపటాన్ని మనం స్పష్టంగా తిలకిస్తాం.

ఈ వెయ్యి మందిలో అరవైమంది, అమెరికా దేశ జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తారు; మిగతా దేశాలకు **940** మంది ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ అరవైమంది అమెరికన్లు అపట్టణ ప్రజల ఆదాయం మొత్తంలో **35%** సంపాయిస్తారు. మిగతా **65%** ఆదాయాన్ని **940** మంది పంచుకోవాల్సి వుంటుంది.

ఈ అమెరికన్లలో **36** మంది క్రైస్తవ విశ్వాసులు; క్రైస్తవ సంఘ సభ్యులు; **24** మంది క్రైస్తవేతరులు. ఈ పట్టణ జనాభామొత్తములో



విశ్వాసులైన క్రైస్తవుల సంఖ్య **290**; మిగతా **710** మంది క్రైస్తవులు కాని వారు. ఈ పట్టణమంతటిలో కనీసం **80** మంది కమ్యూనిజంలో నమ్మక ముంచే వారు; **370** మంది కమ్యూనిష్టు ఏలుబడిలో వున్నవారు. ఈ పట్టణమంతటిలో విశ్వాసులైన ప్రొటెస్టంటు క్రైస్తవులు **70** మంది దాకా వుండొచ్చు.

పట్టణం మొత్తం మీద **303** మంది తెల్లవాళ్ళు, **697** మంది వేరే జాతి వాళ్ళు నివసిస్తున్నారు. **60** మంది అమెరికన్ల సగటు జీవిత ప్రాయంవము **70** సంవత్సరాలు, మిగతా **940** మంది సగటు ఆయుర్దాయమునకు **15½** రెట్లు అధికంగా అమెరికన్లలో ప్రతీ వ్యక్తి కలిగి వుంటాడు. ఆ పట్టణానికి అవసరమైన మొత్తము ఆహార సరఫరాలో **16%** పంటను అమెరికన్లు ఉత్పత్తిచేస్తారు. దానంతటిలో కేవలం **1½%** వాళ్ళు తిని మిగతా ఆహార పదార్థాల్ని భవిష్యత్తు కోసమై అమిత ఖర్చుతో కూడిన భద్రపర్చు స్థలాల్లో దాచుకుంటారు. ఇక ఈ పట్టణంలో అమెరికన్లు కానటువంటి **940** మందిలో అనేకులు ఎల్లప్పుడూ అకలిగొని, చాలినంత భోజనం వారి కెప్పుడు దొరుకుతుందో తెలియకుండానే వుంటారు. ఆహార పదార్థాల పంపిణీ విధానంలో సృష్టించబడిన ఈ పరిస్థితితో పాటు, విస్తార ఆహార పదార్థాల నిల్వల ఉనికి కూడా బహు స్పష్టముగా కనబడుతుంది. లభ్యమయ్యే ఆహారపదార్థాల్లో ప్రత్యేకించి అమెరికన్లు **72%** మించి అప్పటికే తినివేస్తారనే సత్యం స్పష్టమై పోతుంది. వాస్తవానికి మిగిలిన ఆహార పదార్థాల్ని ఇచ్చి వేయటం ద్వారా వాళ్ళు చాలా డబ్బు పొదుపు చేయవచ్చు; ఎంచేతనంటే వాటిని భద్రపర్చుటకు అయ్యే ఖర్చు తప్పుతుంది. అలా ఇచ్చివేసే పద్ధతి బహు ప్రమాద కరమైందని వారు భావిస్తారు.'

పట్టణానికి అవసరమైన సరఫరా మొత్తం ఇప్పుడు అమెరికన్లు పొందినట్టే; మిగతా వాళ్ళంతా వినియోగించే విద్యుచ్ఛక్తికి 12 రెట్లు విద్యుత్తును వీళ్ళు వినియోగిస్తారు; 22 రెట్లు నేల బొగ్గు, 21 రెట్లు పెట్రోలియం, 50 రెట్లు ఉక్కు, 50 రెట్లు సాధారణ సామాగ్రిని వీళ్ళు అదనంగా వినియోగిస్తారు.

ఈ పట్టణంలో నివసించే మిగతా ప్రజల సగటు జీవితం కన్నా 60 మంది అమెరికన్లలో అత్యల్ప ఆదాయ గుంపుకు చెందిన వాళ్ళు మెరుగైన జీవనస్థాయి కలిగి వుంటారు. ఈ పట్టణంలో ఇతర గుంపులకు చెందిన ప్రజలు పూర్తిగా పేదవాళ్ళు; ఆకలి, రోగం, అమాయకత్వాల్లో మగ్గుతూ వుంటూరు. వారిలో సగం మంది నిరక్షరాస్యులు. సగం కన్నా ఎక్కువ మంది క్రీస్తును గూర్చి గానీ, వారి యెడల ఆయన సంకల్పము గూర్చి గానీ ఎన్నడూ వినలేదు . కానీ వారిలో సగం కన్నా ఎక్కువ మంది కార్ల్ మార్క్స్ గూర్చి అనతికాలంలోనే విని వుంటారు'' (అంతర్గత వివరణలో, మాటలు అదనంగా చేర్చబడ్డాయి).

-హెన్రీ స్మిత్ లీపర్

ఇలా ఐతే మన తరంలో ఈ ప్రపంచానికి క్రీస్తు సువార్త ఎలా అందుతుంది? దీనికి జవాబు గమనించండి- తమ సంపూర్ణ హృదయాలతో దేవుని ప్రేమించు స్త్రీ, పురుషులు మరియు తమ సంపూర్ణ హృదయాలతో తమ వలె తమ పొరుగువారిని ప్రేమించు స్త్రీ పురుషులే ఈ కార్యాన్ని చేపట్టి చేస్తారు. అమృత ప్రేమ నుండి ఉబికి వచ్చే భక్తియుత సమర్పణ మాత్రమే ఈ కార్యాన్ని సాధించ గలదు. క్రీస్తు ప్రేమ చేత బలవంతం చేయబడ్డ వారు ఆయన కోసం ఎటువంటి త్యాగమైనా చేసేందుకు వెనుకాడరు. ఆయన యెడల వారి కున్న ప్రేమ కారణంగా లోక సంబంధ లాభాల కోసం ఎన్నడూ చేయని కార్యాన్ని వారిప్పుడు ప్రభువు కోసం చేస్తారు.



పనిలో వారు తమ ప్రాణాల్ని సైతం తమకు ప్రీతికరంగా ఎంచుకోరు. సువార్త వినని ప్రజలు నశించి పోకుండా వుండేందుకు వారు కొంత ఖర్చు చేస్తారు; చివరకు వారే కరిగి పోతారు.

శిలువ వేయబడిన ఓ ప్రభూ,

నీలాంటి హృదయాన్ని నాకనుగ్రహించు!

చనిపోతున్న మానవాత్మల్ని ప్రేమించుటకు నాకు నేర్పించు-

నాహృదయాన్ని నీ స్పర్శకు చేరువగా వుంచు; నాకు ప్రేమను అనుగ్రహించు-

నిర్మలప్రేమ, కల్వరిప్రేమ నశించిన వారిని నీ దగ్గరకు
నడిపించుటకే! -జేమ్స్ ఎ. స్టువర్ట్

అసలు ఉద్దేశము ప్రేమ కాకపోతే దాని కారణము నిరీక్షణారహితమే, అది నిష్ప్రయోజనం కూడా. అంచేత పరిచర్య మ్రోగెడు కంచు, గణగణలాడు తాళం వలె తయారవుతుంది. అయితే ప్రేమ, మార్గ దర్శక నక్షత్రమైనప్పుడు, క్రీస్తు లో భక్తిచేత మనుషులు మండుతూ ముందుకు సాగుతున్నప్పుడు దూసుకుపోయే సువార్త వేగాన్ని భూలోక శక్తి ఏదీ ఆపజాలదు.

అలాంటప్పుడు- యేసు క్రీస్తు కార్యార్థం అమ్ముడు బోయి, క్రీస్తు ప్రేమ చేత నడిపించబడి, మహిమాన్విత సువార్త సందేశకులుగా భూ, సముద్ర మార్గాల గుండా పయనిస్తూ, అవిశ్రాంతంగా నూతన ప్రాంతాలు చేరుకునేందుకు ముందుకు సాగుతూ తమకు తారసపడిన ప్రతి మానవ జీవితం లోనూ బలియైన క్రీస్తు కోసం ఆత్మలను వెదకుతూ, ప్రతీ మానవుడు నిత్యత్వంలో రక్షకుణ్ణి ఆరాధించే వాడుగా వుండాలని

ఆశించే ఓ శిష్య బృందాన్ని ఒక్కసారి ఊహించండి. క్రీస్తును ప్రకటించుట కోసం ఇహలోక సంబంధ వ్యక్తులు వినియోగిస్తున్న విధాన మేమిటి? సువార్త చేత లోకాన్ని సంధించుటకు క్రొత్త నిబంధన రెండు ప్రధాన విధానాల్ను ఆమోదిస్తున్నట్టు కనబడుతుంది. మొదటిది బహిరంగప్రకటన; రెండవది వ్యక్తిగత శిష్యత్వము.

యేసు ప్రభువు, ఆయన శిష్యులు సర్వ సాధారణంగా మొట్టమొదటి విధానాన్ని వినియోగించారు. ఈ విధానంలో-ఎక్కడెక్కడ ప్రజలు సమావేశమవుతారో అక్కడల్లా సువార్త బోధించే అవకాశం లభిస్తుంది. ఫలితంగా సొంత ప్రాంతాల్లోనూ, జైళ్ళలోనూ, సమాజమందిరాల్లోనూ, సముద్రతీర ప్రాంతాల్లోనూ, నదీ తీరాల్లోనూ సువార్త సభలు నిర్వహించబడుతుండటం చూస్తాము. ఈ సందేశానికి గల అతి త్వరిత, విశిష్ట స్వభావం వల్ల ఈ సువార్త ప్రకటన కేవలం సాంప్రదాయ సభా స్థలాలకే పరిమితం కాలేదు.

విడి, విడి వ్యక్తుల్ని వ్యక్తి గతంగా శిష్యత్వం లోకి నడిపించుట క్రైస్తవ విశ్వాస వ్యాప్తి కోసం నిర్దేశితమైన రెండవ విధానం. పన్నెండు మంది శిష్యులకు శిక్షణ ఇచ్చుటలో యేసు ప్రభువు ఈ పద్ధతి ఉపయోగించాడు. తనతో వుండుట కోసమేగాక, తన సువార్త బోధ నిమిత్తం వారిని ప్రపంచంలోకి పంపాలని కూడా ఆయన ఓ చిన్న శిష్యబృందాన్ని పిలుచుకున్నాడు. ఆయన ప్రతీ రోజూ వారికి దైవ సత్యాన్ని నేర్పించాడు, వారి కోసం నియమించబడిన కార్యాన్ని ఆయన వారి ముందుంచాడు. ఎదుర్కోబోతున్న ప్రమాదాలు, క్లిష్ట పరిస్థితుల గూర్చి ఆయన వారికి ముందే తెలియ జేశాడు. వారిని వ్యక్తి గతంగా దైవ



సలహా విధానంలోకి నడిపించి, తనతో పాటు మహిమాన్విత అతి క్లిష్ట దివ్య సంకల్పంలో జత పనివారిగా తయారు చేశాడు. అటు పిమ్మట తోడేళ్ళ మధ్యకు గొర్రెల్లా ఆయన వారిని పంపాడు. వారు పరిశుద్ధాత్మతో నిండుకొన్నవారై సమాధి గెలిచి పునరుత్థానుడై , ఆరోహణమై పరలోకానికి వెళ్ళిన మహిమాన్విత రక్షకుడ్ని గూర్చిన సువార్తను లోకానికి ప్రకటించ నారంభించారు. ఒక కపట శిష్యుడు వెళ్ళపోగా బృందంలోని శిష్యుల సంఖ్య పదకొండుకుదిగింది. ఆశిష్య బృందం యేసు క్రీస్తు ప్రభువు కోసం భూలోకాన్ని తల్లక్రిందులు చేసిన వాస్తవంలో ఈ విధాన ప్రభావాన్ని మనం చూస్తాం.

అపొస్తలుడైన పౌలు ఈ విధానాన్ని తన సొంత పరిచర్యలో అభ్యాసం చేయటమేగాక ఇదే విధానాన్ని పాటించమని తిమోతికి కూడా ఆజ్ఞాపించాడు :''నీవు అనేక సాక్షుల యెదుట నా వలన వినిన సంగతులను ఇతరులకును బోధించుటకు సామర్థ్యముగల నమ్మకమైన మనుష్యులకు అప్పగింపుము''(II తిమోతి **2:2**). అతి జాగ్రత్తగానూ, ప్రార్థనా పూర్వకంగానూ నమ్మకమైన మనుష్యుల్ని ఎన్ను కోవటం మొట్ట మొదటి మెట్టు, వారికి మహిమాన్విత దర్శనాన్ని నేర్పించుట రెండవ మెట్టు. అటు తర్వాత ఇతరుల్ని శిష్యులుగా చేయు నిమిత్తం వీరిని పంపుట మూడవ మెట్టు. **(మత్తయి 28:19)**

ఎక్కువ సంఖ్యలో ప్రజలు రావాలని, గొప్ప సమూహాల కోసం ఆశించి అర్రులు చాచేవారికి ఈ విధానం నిరుత్సాహకరంగానూ, ఆయాసకరంగానూ వుంటుంది. అయితే తానేమి చేస్తున్నాడో దేవునికి బాగా తెలుసు, ఆయన విధానాలు అతిశ్రేష్ట విధానాలు, స్వార్థ

సంతృప్తులైన మతఛాందసుల గొప్ప సైన్యం కన్నా సంపూర్ణ సమర్పణ గల కొంత మంది శిష్యులు దేవుని కోసం అధికంగా కార్య సాధన చేయగలరు.

క్రీస్తు నామంలో బైటికివెళ్ళే ఈ శిష్యులు దైవ వాక్య నిర్దేశితమైన కొన్ని నిర్దిష్ట ప్రాథమిక సూత్రాలను పాటిస్తారు, మొట్టమొదటిదిగా వారు పాములవలె వివేకులు, పావురముల వలె నిష్కపటులుగా వ్యవహరిస్తారు. వారు వెళ్ళవలసిన కష్టతర మార్గంలో జ్ఞానయుక్తమైన దైవవనరుల్ని వారు సంతరించుకుంటారు. అదే సమయంలో తమ తోటి ప్రజలతోసంబంధ బాంధవ్యాల్లో వారు దీనులు, సాత్వికులు గా కూడా వుంటారు. వీరి వల్ల ఎవ్వరూ భౌతిక దౌర్జన్య విషయంలో భయపడవలసిన అవసరం వుండదు; గానీ వారి ప్రార్థనలు, అకుంఠిత సాక్ష్యాలకు మనుషులు భయపడవలసి వుంటుంది.

ఈ శిష్యులు లోక సంబంధ రాజకీయాలకు దూరంగా వుంటారు. ఏ ప్రభుత్వానికి గానీ, రాజకీయ విధానానికి గానీ వ్యతిరేకంగా యుద్ధం చేసేందుకు తాము పిలువ బడినట్టు వారు భావించరు. ఏ ప్రభుత్వం క్రిందనైనా వారు పని చేయగలరు; తమ సాక్ష్యం విషయంలో రాజీపడకుండా తమ ప్రభువును తాము నిర్లక్ష్యం చేయనంతమట్టుకు వారు ఆ ప్రభుత్వానికి నమ్మకంగా వుండగలరు. తమ సాక్ష్యానికి ముప్పు వాటిల్లినప్పుడు ఆ ప్రభుత్వానికి వారు విధేయులు గాక పర్యవసాన పరిస్థితులకు తమ్మునుతాము అప్పగించుకొంటారు. అంతేగాని, వారెన్నడూ మానవ ప్రభుత్వంపై కుట్రలకుగానీ కుతంత్రాలకు గానీ పాల్పడరు. '' నా రాజ్యము ఈ లోక సంబంధమైన దైతే అప్పుడు నా సేవకులు యుద్ధం చేస్తారు'', అని ప్రభుత్వపు చెప్పలేదా? వీరు పరలోక రాయబారులు, అంచేత వీరు ఈ లోకంలో యాత్రికులు గానూ, వింతజనము గానూ దాటిపోతారు.



తమ సంప్రదింపులన్నింటిలోనూ, తాము అత్యంత నమ్మకంగా వుంటారు. తప్పించుకునే వివిధ పన్నాగాలకు వారు బహుదూరంగా వుంటారు. 'అవును' అంటే 'అవును', 'కాదు' అంటే 'కాదు' అన్నట్టుగా వారు జీవిస్తారు. అందరికి తెలిసిన '' అంతమే పరిష్కారము'' అను అబద్ధాన్ని పాటించుటకు వారు నిరాకరిస్తారు. కీడు చేయుట ద్వారా మేలు కలగాలని ఎట్టి పరిస్థితుల్లోనూ వారు కోరుకోరు. వారిలో ప్రతీ ఒక్కరూ మనస్సాక్షితో నిండి వుంటారు; చనిపోవటానికి కూడా వెనుకాడరు గానీ పాపం చేయరు.

స్థానిక సంఘాన్ని కేంద్రంగా పెట్టుకొని వీరు సేవ చేస్తారు; ఇది వీరు తప్పని సరిగా పాటించే మరో సూత్రం. యేసు ప్రభువు నిమిత్తం మారు మనస్సు పొందిన మనుషుల్ని సంపా[illegible]ంచుటలో పంట కోత కోసం వారు లోకం లోకి వెళ్తారు; అటు పిమ్మట ఈ మారుమనస్సు పొందిన మనుషుల్ని వీరు స్థానిక సంఘ సహవాసంలోకి నడిపిస్తారు. అంతమాత్రమే గాక వారిని పరిశుద్ధ విశ్వాసంతో బలపర్చి దృఢ పరుస్తారు. విశ్వాస వ్యాప్తి కోసం భూలోకంలో స్థానిక సంఘమే దేవుని విభాగమనీ, ఈ విధానంలో శ్రేష్టమైన శాశ్వత కార్యం నిర్మిత మవుతుందని నిజ శిష్యులు గుర్తిస్తారు.

చిక్కుల బెట్టు అన్ని రకాల సంబంధాల నుంచి తప్పుకునేందుకు శిష్యులు తెలివిగా మసలుకుంటారు. తమ నడవడి ఉద్యమం ఒక మానవ సంస్థ చేత నడిపించ బడటాన్ని వారు ససేమిరా ఒప్పుకోరు. తమగమనంలో ముందుకు సాగేందుకు తగిన ఆజ్ఞల్ని పరలోకపు ప్రధాన కార్యాలయం నుండి నేరుగా పొందుతారు. తమ స్థానిక సంఘ క్రైస్తవుల

విశ్వాసం, ప్రోత్సాహం లేకుండానే సేవలో ముందుకు సాగుతారని దీనిభావం కాదు. కానీ దీనికి విరుద్ధంగా అటువంటి ప్రోత్సాహం కోసం వారు ఎదురు చూస్తారు. అది దైవ పరిచర్య కోసమై తమకు లభించిన పిలుపుకు ధృవీకరణగా వారు పరిగణిస్తారు. దైవ వాక్య విధేయతతోనూ, దైవ మార్గ దర్శకత్వం తోనూ క్రీస్తును సేవించుట అవశ్యక మని వారు నొక్కివక్కాణిస్తారు.

చివరిదిగా, ఈ శిష్యులు తమను గూర్చిన ప్రచారాన్ని ఇష్టపడరు తమను తాము తెరవెనుక వుంచుకునేందుకు ప్రయత్నిస్తారు. వారి గూర్చి ఉద్దేశం-"యేసు క్రీస్తును మహిమ పర్చుట, ఆయన్ను అందరికీ తెలియ జేయుటే, వారు తమ కోసం గొప్పవాటిని వెదకటంలేదు, తమ పథకాలను శత్రువుకు వెల్లడి కానివ్వరు. అంచేత వారు నిశ్శబ్ధంగా పని చేసుకుంటూ, తమను తాము ఎవ్వరికీ ప్రదర్శించుకోకుండా మానవ పొగడ్తలకు, నిందలకు దూరంగా దైవ సేవలో కొనసాగుతారు. తమ శ్రమకు లభించ బోయే ఫలితాలు తెలుసుకునేందుకు శ్రేష్ఠమైన, భద్రమైన ప్రదేశం పరలోకమే'' నని వారికి తెలుసు.

# శిష్యత్వము- వివాహము

''...పరలోక రాజ్యము నిమిత్తము తమ్మును తామే నపుంసకులుగా చేసుకొనిన నపుంసకులును గలరు; ఈ మాటను అంగీకరింపగలవాడు అంగీకరించును గాక, అని వారితో చెప్పెను''. (మత్తయి 19:12)

ప్రతీ శిష్యుడు ఎదుర్కొనే ముఖ్య ప్రశ్నల్లో ఒకటి ఇది-దేవుడు అతణ్ణి వైవాహిత జీవితం కోసం పిలిచాడా ? లేక అవివాహితుడిగా వుండేందుకు పిలిచాడా? అనేది. ఈ విషయం కేవలం వ్యక్తిగతం; ఇది ప్రభువు నుండి రావలసిన మార్గదర్శకత్వమే. ఎవ్వరూ మరొకరి విషయం నిర్ణయించలేరు; ఇటువంటి శక్తివంతమైన వ్యక్తిగత జీవిత వలయంలో జోక్యంచేసుకోవటం ప్రమాదకరమైన కార్యమే.

వివాహం అనేది మానవ జాతికోసం దేవుడే తన మనసులో అనేక ఉద్దేశాలు కలిగిన వాడై నియమించిన వ్యవస్థగా సర్వసామాన్యంగా బోధించ బడుతుంది:

1. "ఇది సహవాసం, ఆనందం కోసం నియమించబడింది. నరుడు ఒంటరిగా వుండుట మంచిది కాదని'' దేవుడు చూచాడు.

(ఆ.కాం 2:18)

2. ఇది మానవ జాతి ఉత్పత్తి కోసం రూపొందించబడింది. ఇది ప్రభువు ఆజ్ఞలోనే సూచించబడింది, ''మీరు ఫలభరితులై విస్తరించుడి, భూమిని నింపుడి''. (ఆ.కాం. 1:28)

3. కుటుంబంలోనూ, సమాజంలోనూ పవిత్రతను భద్రపర్చేందుకు ఇది నియమించబడింది. '' జారత్వము జోలికి పోకుండునట్లు ప్రతి పురుషుడు తన సొంత భార్యను కలిగి వుండవలెను.''

**(I కొరింథీ 7:2)**

పవిత్రజీవితానికీ, భక్తికీ, క్రీస్తుసేవకూ వివాహం అసమ్మతమని దేవుని వాక్యంలో ఎక్కడా చెప్పబడలేదు. పైగా '' వివాహవము అన్నింటిలో ఘనమైనది, పరుపు పవిత్రమైనది'' (హెబ్రీ **13:4**) అను వాక్యం చేత మనం బలపర్చ బడుతున్నాం. ''భార్య దొరికిన వాడికి మేలు (మంచి) దొరికెను'' (సామె. **18:22**) అని లేఖనాలు చెబుతున్నాయి. చాలా సార్లు ప్రసంగి వాక్యాలు వివాహానికి అన్వయాలు కావచ్చు, '' ఒంటి గాడై వుండుట కంటే ఇద్దరు కూడి యుండుట మేలు'' (ప్రసంగి **4:9**); ప్రత్యేకించి ప్రభువు సేవలో ఇద్దరు కలిసి కట్టుగా పని చేయుటను గూర్చి చెప్పబడింది. ద్వితీయోపదేశ కాండము **32:30** లో బలమైన ఐక్య కార్యసాధన ప్రోత్సహించబడింది; ఒకడు వెయ్యి మందిని తరుమును, ఇద్దరు పదివేల మందిని తరుముదురని చెప్పబడింది.

వివాహం మానవ జాతికి సాధారణ దైవ చిత్తమైనప్పటికీ ప్రతి వ్యక్తి జీవితంలో ఇది ఆయన చిత్తం కానవసరం లేదు. ఇదో సాధారణ హక్కుగా కనిపిస్తూ వుండగా-తనను తానుగా క్రీస్తు సేవ కోసం ఏకాగ్రతతో సమర్పించుకునేందుకు యేసు ప్రభువు శిష్యుడు ఆ హక్కును వదులు కోవచ్చు.

తన రాజ్యంలో తన కోసం నపుంసకులుగా చేయబడిన వారు కొందరు వుంటారని యేసు ప్రభువు చెప్పాడు:''తల్లి గర్భము నుండి నపుంసకులుగా పుట్టినవారుగలరు, మనుష్యుల వలన నపుంసకులుగా



చేయబడిన నపుంసకులును గలరు; పరలోక రాజ్యం నిమిత్తము తమ్మును తామే నపుంసకులనుగా చేసుకొనిన నపుంసకులును గలరు, ఈ మాటను అంగీకరింపగలవాడు అంగీకరించును గాక, అని వారితో చెప్పెను''.

**(మత్తయి 19:12)**

ఇది ఖచ్చితంగా ఒక వ్యక్తి ఈ క్రింది కారణాల ఫలితంగా స్వచ్ఛందంగా చేసే ప్రతిజ్ఞ అయ్యుంటుంది.

1. అవివాహితుడిగా వుండేందుకు దేవుని నడిపింపును గమనించుట.

2. కుటుంబ జీవితానికి సంబంధించిన అదనపు బాధ్యతల భారం లేకుండా తన్ను తాను ప్రభువు కోసం సంపూర్ణంగా సమర్పించుకొనే ఆశ కలిగి వుండుట.

మొదటిదిగా, దైవ పిలుపు గూర్చిన ఒప్పుదల తప్పనిసరిగా వుండి తీరాలి (I కొరింథీ **7:7**). శిష్యుడు కేవలం దీని వల్లనే, తన జీవితంలో ఆత్మనిగ్రహశక్తికి అవసరమైన కృపను ప్రభువు తనకు అనుగ్రహిస్తాడనే హామీ పొందగలుగుతాడు.

రెండవదిగా అది స్వచ్ఛందమైనదై వుండాలి. ఈ బ్రహ్మచర్యము, ఎక్కడెక్కడ ప్రసంగాత్మక బలత్కారం వుంటుందో అక్కడల్లా అపవిత్రత, అవినీతులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా కలిగి వుంటుంది.

ఒక అవివాహితుడైన వ్యక్తి రాజుగారి కార్యార్థమై తన్నుతాను సంపూర్ణంగా సమర్పించుకోగలుగుతాడని అపొస్తలుడైన పౌలు నొక్కి చెప్పాడు:''పెండ్లి కాని వాడు ప్రభువును ఏలాగు సంతోష పెట్టవలెనని ప్రభువు విషయమైన కార్యములను గూర్చి

చింతించుచున్నాడు. పెండ్లియైన వాడు భార్యను ఏలాగు సంతోష పెట్ట గలనని లోక విషయంవైన వాటిని గూర్చి చింతించుచున్నాడు''. **(Iకొరింథీ 7:32,33)**

''ఆ కారణం చేత పెండ్లి కానివారు, విధవరాండ్రు అతనివలె అవివాహితులుగా వుండిపోవాలని అతడు తనకోరికను వ్యక్త పరుస్తున్నాడు''. **(Iకొరింథీ 7:7,8)**

అప్పటికే వివాహితులైన వారికి కూడా అపొస్తలుడు బహుగట్టిగా చెబుతున్నాడు. కాలం సంకుచితంగా వున్నందు చేత సమస్తమును వినియోగించి క్రీస్తును అందరికీ తెలియజేసే గొప్ప కార్యములో నిమగ్నమైపోవాలని ఆయన నొక్కి చెబుతున్నాడు.

''సహోదరులారా, నేను చెప్పిన దేమనగా కాలము సంకుచితమైయున్నది గనుక ఇక మీదట భార్యలు గలిగిన వారు భార్యలు లేనట్టును, ఏడ్చువారు ఏడువనట్టును, సంతోష పడువారు సంతోష పడనట్టును, కొనువారు తాము కొనినది తమది కానట్టును ఈ లోకము అనుభవించువారు అమితముగా అనుభవింపనట్టును ఉండవలెను; ఏలయనగా ఈ లోకపునటన గతించుచున్నది.'' **(Iకొరింథీ 7:29-31)**

అంచేత ఓ వ్యక్తి తన కుటుంబ బాధ్యతల్ని తృణీకరించి, భార్యా పిల్లల్ని విడిచి పెట్టి సువార్తికుడిగా సేవా రంగంలోకి దూకి, అందులో పరుగెత్తాలని దీని భావము కాదు. కానీ అతడు కుటుంబ జీవిత సంబంధమైన సుఖభోగాల కోసం, సంబంధిత సంతృప్తుల కోసమే



జీవించరాదని దీని అసలైన అర్థము, తన భార్యా పిల్లల సాకుతో అతడు క్రీస్తుకు రెండవ స్థానం కేటాయించరాదు.

తాను వివాహ మాడ వలసిన - అంటే తనకాబోయే భార్య ఎప్పుడూ తన గూర్చే ఆలోచిస్తూ ఆమె జీవితంలో క్రీస్తుకు ప్రథమ స్థానం ఇవ్వకుండా జీవిస్తుందేమోనని సి.టి. స్టడ్ భయపడిపోయాడు. ఈ శోధనను తప్పించుకునేందుకు ప్రతిరోజూ ఆమె వల్లించుట కోసమై ఈ క్రింది వాక్యాన్ని ఆమె కోసమై కూర్చాడు:

యేసూ, నిన్ను నేను ప్రేమిస్తున్నాను
నీవు నాకు చార్లీ కన్నా
ఎన్నటికైనా నాతో వుండగల
అతి ప్రియమైన వాడవు.

తమ కుటుంబ వ్యవహారాలన్నింటినీ రాజకీయ విశ్వాసం నిమిత్తం మానవజాతిని మళ్ళించే గొప్ప కార్య సాధనకై వినియోగించాలని కమ్యూనిష్టులు సేర్చుకున్నారు. గార్డన్ ఆర్నాల్డు లాన్స్‌డేల్ దీనికో మంచి ఉదాహరణ. **1960** లో అతడు ఇంగ్లండులో రష్యా గూఢచారిగా పట్టుబడినప్పుడు అతని ఉత్తరానికి తన భార్య వ్రాసిన ప్రత్యుత్తరము- ఆరు పేజీల లేఖ పోలీసులకు దొరికింది. అందులో ఆమె ఇలా వ్రాసింది: ''జీవితం ఎంత అన్యాయం ! నిన్ను నేను పూర్తిగా అర్థం చేసుకున్నాను, నీవు పని చేస్తున్నావు, నీ విధినిర్వహిస్తున్నావు, నీ పనిని నీవు ప్రేమిస్తున్నావు; ఇదంతానీవు నీమనస్సాక్షి ప్రకారం చేయుటానికి ప్రయత్నిస్తున్నావు. అయినప్పటికీ ఓ స్త్రీ సహజ స్వభావాను సారంగా నా ప్రశ్న ఒక రకంగా సంకుచితంగా వుంది; ఇందు వల్ల నేను భయంకర

బాధ అనుభవిస్తున్నాను: నీవు నన్ను ఎలా ప్రేమిస్తున్నావో నాకు ఉత్తరం వ్రాసి తెలియజేయుము, కనీసం అలాగైనా నా బాధ తగ్గుతుందేమో! ''

ఆ ఉత్తరానికి ప్రత్యుత్తరంగా లాన్స్‌డేల్ కొంచెం మాత్రమే రాశాడు:'' నేను చెప్పబోయేదంతా ఏమిటంటే- నాకు ఒకే ఒక జీవితం వుంది- అది అంత సులభతరమైంది కాదు. నేను కోరుకునే దల్లా- వెనుదిరుగుట వలన కలిగే అవమానం ఎదురు కాకుండా జాగ్రత్తగా చూచుకుంటూ నేను నా జీవితాన్ని గడుపుతాను. ...త్వరలో నాకు **39** ఏళ్ళు నిండుతాయి, ఇంకేమైనా ఎక్కువ మిగులుతుందా?'' [1]

''సమయము సంకుచితముగా వున్నది'' అని పౌలు రాశాడు, నిలిచేది ఇదే... భార్యలు ఉన్నవారు లేనట్టుగా వుండాలి...''

క్రీస్తు కోసం అమిత ప్రయోజనాత్మక మార్గం నుండి ఓ యువ శిష్యుణ్ణి ప్రక్క దారి పట్టించేందుకు తొందర పాటుతో గానీ, తప్పుడు మార్గదర్శకత్వంలో గానీ జరిగిన వివాహాన్ని సాతానుడు ఓ సాధనముగా వినియోగించుట విషాద కరమైన విషయం. విజయశీలులైన ఎంతో మంది సేవకులు ఏకాగ్రతతో కూడిన తమ పరిచర్య పదవులను వివాహ వేదికల మీదనే పోగొట్టుకున్నారు. అందరూ ఆయన గూర్చి వినాలి అను క్రీస్తు చిత్త నెరవేర్పుకు వివాహమే పరమ శత్రువు. ''వివాహం దేవుని చేత అనుగ్రహింపబడినది. అయితే అది దైవచిత్తానికి ప్రతి బంధకముగా తయారైనప్పుడు అది ఇక దురుపయోగమైనట్టే. చాలా మంది స్త్రీ,

1. టైం మ్యాగజైన్, ఫిబ్రవరి 17, 1961.



పురుషులు విదేశాల్లో దైవసేవ నిమిత్తం నిర్దిష్టమైన పిలుపున్న వారు ... వారెన్నడూ ఆ ప్రాంతాలు చేరుకోలేదు కారణం- తమ జీవిత సహచరులు వారిని వెనక్కు లాగుట వల్లే... అటువంటి వారి పేర్లు మనం చెప్పొచ్చు.''

ఓ వ్యక్తి జీవితంలో దైవ ఉద్దేశాన్ని ఆటంక పర్చుట ఏదీ, అమాట కొస్తే దైవానుగ్రహమైన జీవిత భాగస్వామి కూడా వొడి కట్ట కూడదు... ఈనాడు క్రీస్తు లేక ఆత్మలు చచ్చి పోతున్నాయంటే దీనికి గల కారణం- సేవకు సమర్పించుకున్న వారి ప్రియులు దైవచిత్తాన్ని దాటి పోవటంచేతనే. [1]

ప్రత్యేకించి విశిష్ట సేవకులకు బ్రహ్మచర్యము కోర తగిందనేది సత్యమేనేమోనని పిస్తుంది.''జీవితావసరతలు, సుఖభోగాలు చట్ట సమ్మతములే ఐనప్పటికీ సేవలో నాయకత్వం వహించు స్త్రీ, పురుషులు తమను తాము తృణీకరించుకోవాల్సిన అవసరముంది. కష్టాలు సహించుట మంచి సైనికులుగా వుండుట, ఐహిక జీవిత విషయాల్లో జోక్యం లేకుండా జీవించుట, ఇతరత్రమైన బరువులు లేని క్రీడాకారులుగా వుండుట అనేవి నాయకుల విధులు ... ఇదో వృత్తి, ఒక పిలుపు, ప్రత్యేక సేవార్థమైన ఓ అభిషేకము''.[2]

ఈ పిలుపు పొంది దానికి స్పందించిన వారికి ఓ మంచి బహుమానము సిద్ధంగా వుంది, **''యేసు ఇట్లనెను-... నానావము**

1. గుస్టాఫ్ సన్, వెస్లీ యల్; పిలువబడ్డాడు కానీ వెళ్ళటంలేదు, చికాగో, ఐ.వి.సి.యఫ్ ప్రెస్, పేజీ 10.
2. కేబుల్ అండ్ ఫ్రెంచి, అంబాసిడర్స్ ఫర్ క్రైస్ట్, చికాగో, మూడీ ప్రెస్.

నిమిత్తము అన్న దమ్ములనైనను, అక్క చెల్లెండ్ల నైనను, తల్లినైనను, తండ్రినైనను, పిల్లల నైనను, భూములనైనను, ఇండ్లనైనను విడిచి పెట్టిన ప్రతివాడు నూరు రెట్లు పొందును. ఇదియు గాక నిత్య జీవమును స్వతంత్రించు కొనును.''

**(మత్తయి 19:29)**

# వెల కట్టుట

యదార్థతా రహితమైన విశ్వాసవృత్తిలోకి లాగేందుకు యేసు ప్రభువు మనుషుల్ని మాయమాటలతో మభ్యపెట్టి వారిని బ్రతిమాలుట కెన్నడూ ప్రయత్నించలేదు. అందరికీ పసందైన ఓ బ్రహ్మాండ సందేశం బోధించి బహుజనసమూహాల్ని తనవైపుకు ఆకర్షించు కొనుటకు ఆయన ఎన్నడూ ప్రయత్నించలేదు.

వాస్తవానికి ప్రజాసమూహాలు తనచుట్టూ మూగినప్పుడు ఆయన వారివైపు తిరిగి కఠినమైన శిష్యత్వ నియమాలు బోధించుటద్వారా వారిని చిన్న గుంపులుగా ప్రత్యేకించుటకు విడ గొట్టాడు.

అటు వంటి ఒకానొక సందర్భంలో మన ప్రభువు తనను వెంబడించు వారి వైపు తిరిగి వారు మొట్టమొదట శిష్యత్వానికి చెల్లించవలసిన వెల లెక్కకట్టుకోవాల్సిందిగా హెచ్చరించాడు. ఆయన ఇలా అన్నాడు:

**''మీలో ఎవడైనను ఒక గోపురము కట్టింపవలయునని వుంటే దాని కొనసాగించుటకు కావలసినది తన యొద్దవున్నదో లేదో అని మొదట కూర్చుండి తగులు బడి లెక్కచూచుకొనడా? చూచుకొనని పక్షమున అతడు దాని పునాది వేసి, ఒక వేళ దాని కొన సాగింపలేక పోయినందున చూచువారందరు-ఈ మనుష్యుడు కట్టమొదలు పెట్టెను గాని కొనసాగింపలేక పోయెనని**

**అతని చూచి ఎగతాళి చేయ సాగుదురు, మరియు ఏరాజైనను మరియొక రాజుతో యుద్ధము చేయబోవునప్పుడు తనమీదకు ఇరువది వేల మందితో వచ్చు వానిని పది వేల మందితో ఎదిరింప శక్తి తనకు కలదో లేదో అని మొదట కూర్చుండి ఆలోచింపడా? శక్తిలేని యెడల అతడింకను దూరముగా వున్నప్పుడే రాయబారము పంపి సమాధానము చేసికొనజూచును గదా!''(లూకా 14:28-32)**

ఇక్కడ ఆయన క్రైస్తవ జీవితాన్ని ఒక గోపుర నిర్మాణానికి, ఒక యుద్ధానికి పోల్చి చెబుతున్నాడు. నిర్మాణాన్ని పరిసమాప్తిజేసేందుకు అవసరమైన ఆర్థిక స్తోమత నీకు లేనప్పుడు ఒక గోపురాన్ని నిర్మించుటకు ఆరంభించుట కేవలం హాస్యాస్పదము. అటువంటప్పుడు అసంపూర్తిగ మిగిలిపోయిన ఆ నిర్మాణము నీ ముందుచూపు లేమికి ఓ ప్రతీకగా నిలిచి పోతుంది.

ఎంత నిజము! ఓ పెద్ద సౌవార్తీక ఊరేగింపులో ఆవేశపూరితంగా క్రీస్తు కోసం ఒక తీర్మానం చేయటం ఒక ఎత్తుతన్ను తాను ద్వేషించుకొని, తన శిలువను ప్రతిదినం ఎత్తుకొని క్రీస్తును వెంబడించుట మరో ఎత్తు. క్రైస్తవుడయ్యేందుకు ఎటువంటి ఖరీదు చెల్లించాల్సిన అవసరం లేనప్పటికీ స్థిరమైన విశ్వాసిగా త్యాగ మార్గంలో నడుచుటకు, ప్రత్యేకించ బడుటకు, క్రీస్తు కోసం శ్రమలు భరించుటకు ఎంతో వెల చెల్లించాల్సి వుంటుంది. అంచేత క్రైస్తవ పందెమును బాగా ఆరంభించుట ఒక ఎత్తు; కానీ దానిని దిన దినం అనుకూల, ప్రతి కూల వాతావరణాల్లోనూ కలిమిలోనూ, లేమిలోనూ, సంతోషంలోనూ, దుఃఖంలోనూ కొనసాగించుట మరో ఎత్తు.



విమర్శనాత్మకమైన ఓ ప్రపంచం క్రైస్తవజీవితాన్ని జాగ్రత్తగా గమనిస్తోంది. క్రైస్తవ జీవితం సమస్తం పొందుటకు యోగ్యమైనది లేదా సమస్తమును పోగొట్టుకొనవలసింది అనే ఓ వింత సహజ ధోరణితో లోకం గ్రహిస్తుంది. బాహాటమైన ఓ యదార్థ క్రైస్తవుని చూచినప్పుడు లోకం అతణ్ణి దూషించవచ్చు; ద్వేషించవచ్చు; అపహాస్యం చేయవచ్చు - అయితే, అదే సమయంలో క్రీస్తుకోసం తన్నుతాను తృణీకరించు కొన్న ఆవ్యక్తిని చూచి లోలోపల గాఢమైన గౌరవాభిమానాలు కలిగి వుంటుంది. కానీ ఓ అర్థహృదయ క్రైస్తవుణ్ణి చూచినప్పుడు లోకం అతణ్ణి చిన్న చూపుచూస్తూ ఎగతాళి చేస్తుంది, ''ఈ మనుష్యుడు కట్టనారంభించెను గానీ దానిని పూర్తి చేయలేక పోయెను'' అంటూ ఎగతాళి చేయనారంభిస్తుంది. ''అతడు మారుమనస్సు పొంది నప్పుడు ఓ గొప్ప ఊపుఊపాడు, అయితే ఇప్పుడు మళ్ళీ మనలో ఒకడై పోయాడు. మహావేగంతో ఆరంభించాడు గానీ ఇప్పుడతని చక్రాలు వంకరలు తిరుగుతున్నాయి.''

అంచేత రక్షకుడిలా చెప్పాడు:''నీవు మొదట కూర్చొని లెఖ్ఖచూచుకొనుట మంచిది!'' ఆయన చెప్పిన రెండో సాదృశ్యం - ఒకరాజు మరో రాజుపై యుద్ధం ప్రకటించ బోవుట గూర్చి చెప్పబడింది. ఆ రాజు తన దగ్గరున్న 10,000 సైనికులకు రెండింతల సైన్యముతో దండెత్తి వస్తోన్న శత్రురాజును ఓడించుటకు తనకు శక్తివుందో లేదో మొదట కూర్చొని లెఖ్ఖచూచుకోవటం మంచిది గదా! మొదట యుద్ధం ప్రకటించి అటు తర్వాత ఇరు పక్షాలసైన్య సమూహాలు యుద్ధరంగంలో ఒక దానినొకటి ఢీకొనేందుకు ముందుకు దూసుకొని వస్తున్నప్పుడు పునరాలోచన చేయటం ఎంత అవివేకమో ఆలోచించండి. ఇక మిగిలిందల్లా తెల్లజెండా ఎగురవేసి, లొంగిపోయేముందు ఓ బృందాన్ని

సంధి కోసం పంపి, భూమీమ్మీదపడి దుమ్ములో ప్రాకుతూ దీనాతి దీనంగా శాంతి సంధి కోసం బ్రతిమాలటమే.

క్రైస్తవ జీవితాన్ని యుద్ధముతో పోల్చుట అతిశయోక్తి ఎంత మాత్రం కాదు. క్రైస్తవుడికి భయంకర శత్రువులున్నారు - లోకము, శరీరము, సాతానుడు - వీటితో పాటు నిరుత్సాహములు, రక్తపాతము, శ్రమలు కూడా వున్నాయి. అలసటతో కూడిన దీర్ఘ అవిశ్రామ ఘడియలు, పగటి కాంతి కోసం ఆరాట పూరిత సమయాలున్నాయి. కన్నీరు, ప్రయాసము, మరియు పరీక్షలున్నాయి. దైనందిన మరణం కూడావుంది.

క్రీస్తును అనుసరించాలని తీర్మానించుకున్న వారెవ్వరైనా గెత్సెమనె, గబ్బతా, గొల్గొతా స్థలాలను గుర్తుంచు కోవాలి. అటు తర్వాత అతడు దానివెల లెఖ్క కట్టి చూచూకోవాలి. ఆది క్రీస్తు కోసం సంపూర్ణ సమర్పణ ఐనా అయ్యుండాలి లేదా అవమానం, అధో స్థానం లాంటి పూర్తిగా లొంగి పోయిన అనుభవమైనా అయ్యుండాలి. ఆవేశంలో అనాలోచితంగా శిష్యులుగా వుండాలని తీర్మానించుకునేతన శ్రోతలను యేసు ప్రభువు ఈ రెండు సాదృశ్యాలతో ముందే హెచ్చరించాడు. బాధలు, శ్రమలు, ఆయాసములను ఆయన వారికి వాగ్దానములుగా అందించాడు. తాము చెల్లించాల్సిన మొత్తం ఖరీదును మొట్టమొదట కూర్చొని లెఖ్క కట్టిచూచు కోవాల్సివుంది.

దానిఖరీదెంత? తరువాయి వాక్యము ఈ ప్రశ్నకు జవాబుగా వుంది: "**ఆప్రకారమే మీలో తనకు కలిగిన దంతయు విడిచి పెట్టనివాడు నా శిష్యుడు కానేరడు**". **(లూకా 14:33)**



దాని ఖరీదు 'సమస్తం' - అంటే మానవుడేమైవున్నాడో, మానవుడి కున్నదంతా. ఇది రక్షకుడికే అర్థవంతంగా మారింది, అంచేత ఆయనను వెంబడించే వారికి ఇదెంత మాత్రం తక్కువ కానేరదు. వర్ణింపనశక్యమైన మహాఐశ్వర్యములుగల ధనవంతుడే పేదవాడుగా మారినప్పుడు ఇక తన శిష్యులు అంత కంటే తక్కువ వెలగల కిరీటం పొందుతారా?

అటు తర్వాత యేసు ప్రభువు తన సందేశాన్ని ఈ క్రింది సారాంశంతో ముగించాడు: **''ఉప్పు మంచిదే గాని, ఉప్పు నిస్సారమైతే దేని వలన దానికి సారము కలుగును?''**
**(లూకా 14:34)**

బైబిలు కాలం నాటి ప్రజలకు - ఈనాడు మన భోజన బల్లల మీద కనిపించే స్వచ్ఛమైన ఉప్పులాంటి ఉప్పులభించేది కాదు. ఆనాడు వారి లభించిన ఉప్పులో ఇసుక, మట్టి వంటి వివిధ మలిన పదార్థాల కలిసివుండేవి, ఏదో ఒక కారణంచేత ఉప్పు నిస్సార మవ్వటం సాధ్యమే ఆటువంటి నిస్సారమైన ఉప్పు నిరుపయోగంగా వుండేది. మట్టిలో కలుపుటకు గానీ, ఎరువుగా వినియోగించుటకు గానీ ఆది పనికిరాదు. ఆయాసమయాల్లో పారవేయబడి పాదాల క్రింద త్రొక్కబడింది ఆవిధంగా అది- **''దేనికీ కొరగానిది గానూ, బైట పారవేయ బడుటకును, మనుష్యుల పాదముల క్రింద త్రొక్కబడునది గాన వుండును'' (మత్తయి 5:13).**

ఈ సాదృశ్యాన్ని అన్వయించుకొనుట అతి స్పష్టము. క్రైస్తవు ఉనికికిగల ఏకైన ఉద్దేశం - దేవుని కోసం పూర్తిగా పారబోయబడి

జీవితంతో దేవుణ్ణి మహిమ పర్చుటే. భులోకంలో ఐశ్వర్యాలను సమకూర్చు కోవటం వల్లనూ, సొంత సుఖసంతోషాలకు అవసరమైన సదుపాయాలను సమీకరించుకోవటం వల్లనూ, లోకంలో కీర్తిప్రతిష్టలు, పరపతి పలుకుబడుల్ని పెంపొందింపజేసుకోవటం వల్లనూ అయోగ్యమైన ఈ లోకంలో తన జీవితాన్ని, తలాంతుల్ని వినియోగించి వ్యభిచరించుట ద్వారానూ క్రైస్తవుడు తన ఉప్పును నిస్సారం చేసుకుంటాడు.

విశ్వాసి తన ఉనికికి కేంద్రమైన గురిని తప్పినప్పుడు వాడు సమస్తం పోగొట్టు కున్నట్టే. అతడు ప్రయోజకుడు కానేరడు, అలంకార యోగ్యుడు కూడా కాడు. ఇక అతని గతి సారహీనమైన ఉప్పులా - మనుషుల చేత దూషణ, అవమానం, అపహాస్యాల్నిభరిస్తూ కాళ్ళ క్రింద త్రొక్కబడినట్టే తయారవుతుంది.

చివరి మాటలు ఇవే :

**"వినుటకు చెవులు గలవాడు వినును గాక!"**

ఎన్నడైనా, ఏదైనా కఠిన సందేశం అందించి నప్పుడెల్లా మన ప్రభువు ఈ మాటల్ని అదనంగా వినియోగించాడు. మానవులందరూ తనను స్వీకరించరనే విషయం ఆయనకు ముందే తెలుసు నన్నట్టుగా వుంది. పదునైన, అధికారయుతమైన తన సందేశాల్ను మొద్దు పోజేసే విధంగా సాకులతో తప్పుకునే కొందరు మానవులుంటారని ఆయనకు తెలుసు.



కానీ అదే సమయంలో తన ఆజ్ఞల్ని శిరసావహించి, ఆయనకు ఆయనే సాటియని భావించే తెరువబడిన హృదయాలు వుంటాయని కూడా ఆయనకు తెలుసు.

అంచేత ఆయన ద్వారం తెరిచివుంచాడు! "వినుటకు చెవులు గలవాడు వినును గాక!" వినువాడు మాత్రమే కూర్చొని లెఖ్కచూచుకొని ఇలా చెబుతాడు:

"యేసును వెంబడించుటకు నేను నిశ్చయం చేసుకున్నాను,
ఎవ్వరూ నాతో రాకపోయినా నేను ఆయణ్ణు అనుసరిస్తాను,
లోకము నా వెనుక వుంది, శిలువ నా ముందు వుంది,
వెనుదిరగేది లేదు, వెను దిరగేది లేనే లేదు."

# హత సాక్షి జీవిత నీడ

ఓ మనిషి వాస్తవంగా తన్నుతాను యేసు క్రీస్తుకు అప్పగించుకున్నప్పుడు అతడు జీవించినా, మరణించినా అది అంతముఖ్యము కాదన్నట్టు గోచరిస్తుంది. మెట్టుకు ప్రభువు మహిమ పొందాలి.

జాన్, బెట్టీ స్టామ్ జీవితాల్లో వారి విజయు వృత్తాంతం చదువుతున్నప్పుడు ఆ గ్రంథ ఆద్యంతము పదేపదే ఒకవిషయాన్ని గమనిస్తాము. అదేమిటంటే - **''... నా బ్రతుకు మూలముగా గానీ, చావుమూలముగా గానీ క్రీస్తు నా శరీరమందు ఘనపర్చబడును''.**

**(పిలిప్పీ 1:19)**

జిమ్ ఎల్లియట్ రచనల్లో కూడా ఇదే భావం కనుగొంటాము. అప్పటికతడింకా వీటన్ కాలేజీలో విద్యార్థిగా వుంటూనే తన డైరీలో ఇలా రాసుకున్నాడు; "ఔసాస్ కోసం మరణించేందుకు నేను సిద్ధంగావున్నాను."

మరో సందర్భంలో అతడిలా రాశాడు: ''తండ్రీ, నా ప్రాణంతీసుకో, అవును ప్రభూ, కావాలంటే నారక్తంతీసుకో, నీ అగ్ని జ్వాలతో దాన్ని దహించు. ఆది ఇక నాది కాదు, అంచేత దాన్ని నా కోసం దాచుకోను. స్వీకరించు ప్రభూ, సంపూర్ణంగా స్వీకరించు. ప్రపంచకోసం నాజీవితాన్ని పానార్పణంగా తీసుకో. నీ బలిపీఠం ముందు ప్రవహించు రక్తం విలువైంది''.

దైవ వ్యవహారాల్లో అసంఖ్యాక దైవ వీరులు ఇదే స్థలానికి చేరుకున్నట్టు కనిపిస్తోంది. వారంతా ఓ సత్యాన్ని గ్రహించారు; **"గోధుమగింజ భూమిలో పడి చావకుండిన యెడల అది ఒంటిగానే వుండును, అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును" (యోహాను 12:24).** ఆగోధుమ గింజగా మారాలని వారంతా ఉబలాట పడ్డారు.

రక్షకుడు శిష్యులకు నేర్పిన వైఖరి సరిగ్గా ఇదే; **''నా నిమిత్తం ఎవడు తన ప్రాణమును పోగొట్టుకొనునో, వాడు దానిని కాపాడుకొనును''. (లూకా 9:24)**

దాని గూర్చి మనమెంత ఎక్కువగా ఆలోచిస్తామో అంత ఎక్కువగా అది మనకు హేతుబద్ధంగా కనబడుతుంది.

అసలు ఏవిధంగానైనా మన జీవితాలు మనవికావు, తనపవిత్ర రక్తంతో వెల కట్టిన ప్రభువుకే అవి చెందివున్నాయి. అలాంటప్పుడు మరొకరికి చెందిన వాటిని పొందుటకు మనం స్వార్థంతో అర్రులు చాద్దామా? సి. టి. స్టడ్ తనకు తానుగా ఈ ప్రశ్నకు సమాధానం వల్లించాడు.

''యేసు నా కోసం మరణించాడని నాకు తెలుసు గానీ ఆయన నా కోసం మరణించినంత మాత్రన - నేను నావాడను కాను అనే విషయాన్ని నేనెన్నడూ అవగతం చేసుకోలేదు. విమోచన అంటే మరోసారి క్రయం చెల్లించుట; అంచేత నేను ఆయనకు చెందిన వాడనైతే- నాది కాని దాన్ని వుంచుకునే దొంగగానైనా వుండాలి లేదా నా సమస్తాన్ని దేవునికి ఇచ్చి వేయాలి.''



రెండవదిగా, ఇంతలో యేసురాకడ రాని పక్షంలో మన మంతా మరణించ బోతున్నామన్నమాట. రాజు గారి సేవ చేస్తూ మరణించుట మనేది విపరీత విషాదమా? అసలది ఓ ప్రమాదంగా పరిగణించ బడుతుందా? ''లాభ సాధకం కాని దాన్ని, నష్టదాయకం కాని దాన్ని ఇచ్చి వేసేవాడు వెర్రివాడేమీ కాడు'', అని జిమ్ ఎల్లియట్ చెప్పిన మాటలు సరైనవి కావా?

మూడవదిగా, యేసు ప్రభువు మన కోసం మరణించినట్లైతే - మనం తిరిగి ఆయన కోసం మరణించుట మన కనీస ధర్మం, అనే మాట జవాబు లేని హేతు బద్ధ జ్ఞానము. సేవకుడు యజమానుడి కన్నా అధికుడు కానప్పుడు యేసు ప్రభువు కన్నా నిరాటంకంగా పరలోకం వెళ్ళేందుకు మనకు గల హక్కు ఏమిటి? ఈ కారణం చేతనే స్టడ్ ఇలా చెప్పాడు: ''యేసు క్రీస్తు దేవుడైతే, ఆయన నా కోసం మరణిస్తే - ఆయన కోసం నేను చేసే ఏత్యాగమైనా ఏమంత గొప్పదేమీ కాదు.''

చివరిదిగా, తృణీకార భావంతో నిర్లక్ష్యం చేయబడ్డ మన జీవితాల ద్వారా ఇతరులకు ఆశీర్వాదాలు ప్రవహిస్తున్నప్పుడు మన జీవితాల్ను మన కోసమే గాఢంగా హత్తుకొని జీవించుట నేరము, మానవులు తమ జీవితాలను తరచుగా వైద్య పరిశోధభివృద్ధికోసం అర్పిస్తుంటారు. మరికొంతమంది కాలి పోతున్న తమ ప్రియుల్ని భవనాల నుంచి రక్షించేందుకు ప్రయత్నించి ప్రాణాలర్పిస్తారు. ఇంకా కొందరైతే తమ దేశాన్ని శత్రుశక్తుల నుండి కాపాడుటకోసం యుద్ధంలో మరణిస్తారు. ఇటువంటి మానవ జీవితాలకు మన దృష్టిలో వున్న విలువ ఎటువంటిది? యఫ్. డబ్ల్యు. ఎచ్. మేయర్స్ తో కలిసి మనం ఈ విధంగాచెప్పగలమా?

''అదిగో, అక్కడున్న జనులందరినీ నేను కేవలం ఆత్మలుగానే చూస్తున్నాను, బంధింప బడ్డవారు విజయులు కావాలి, బానిసలు రాజులు కావాలి, ఓ శూన్య అద్భుతంలో వారు తమ ఏకైక నిరీక్షణను పంచుకోవాలి అసంఖ్యాక వస్తు ప్రదర్శనలతో వారు దుఃఖ పోరాటం సల్పుతారు!''

''అప్పుడు - ఒక్క దూకుతో అసహన ఆతృత ఓ
ఖూర పిలుపులా నాలో వణుకు పుట్టిస్తుంది.
అయ్యో, వీరి రక్షణార్ధమేగదా! వారి రక్షణార్థం
నశించుటకు వారు జీవించుట కోసం మరణించండి,
వారందరికోసం సమర్పించుకోండి!''

అందరూ తమ జీవితాలర్పించి హత సాక్షులు కానవసరం లేదు, వాస్తవానికి మరణస్తంభము, బల్లెము , వధయంత్రము లాంటివి ఏర్పరచబడిన కొద్దిమంది కోసమే సిద్ధపర్చబడ్డాయి. అయినప్పటికీ మనలో ప్రతి ఒక్కరం హతసాక్షుల భావం, ఆసక్తి, భక్తి కలిగి జీవించగలం. ఇప్పటికే క్రీస్తుకు తమ జీవితాల్ను సంపూర్ణసమర్పణ చేసుకున్న వారిలో మనమందరం జీవించగలం.

రోగమైనా, ఆరోగ్యమైనా, శిలువైనా, కిరీటమైనా,
రంగురంగుల వరద గుడియైనా, పిడుగైనా
నేను నా ఆత్మ దేహాలను విసిరివేస్తాను
దేవుడు వాటిని భూమిలో దున్నివేసేందుకు.

# నిజశిష్యత్వానికి బహుమానాలు

యేసు ప్రభువుకోసం తృణీకరించుకున్న జీవితానికి గొప్ప బహుమానం వుంది. ''క్రీస్తును వెంబడించుట అనే యదార్ధ జీవితంలో సంతోషానందాలు పోగొట్టు కొనువాడు దానిని కాపాడుకొనును''. వాస్తవానికి ఆయన చెప్పిన ఇతర సత్యాలన్నింటి కన్నా ఎక్కువ సార్లు ఈ వాక్యం నాలుగు సువార్తల్లో నూ కనబడుతుంది ( మత్తయి **10:39; 16:25**; మార్కు **8:35**; లూకా **9:24,17:33**; యోహాను **12:25** చూడండి). ఎందుకీ వాక్యం ఇన్నిసార్లు చెప్పబడింది ? స్వార్ధాభిలాషతో హత్తుకున్న జీవితం తప్పనిసరిగా నశిస్తుంది, అయితే ఆయన కోసం పానార్పణంగా చేయబడిన జీవితం కాపుదలకు నోచుకుంటుంది, రక్షింపబడుతుంది, సుఖసంతోషాలతో నిత్య కాలం వుంటుంది, అనే ప్రాథమిక సూత్రాల్లో ఒక సూత్రాన్ని ఇదిమన ముందుంచు చున్నందుచేతనేగదా?

అర్ధ హృదయ క్రైస్తవుడికి దౌర్భాగ్య జీవితమేగతి. ఆయన కోసం బాహాటంగా, బహిరంగంగా జీవించటం ఖచ్చితంగా దైవశ్రేష్ఠ ఈవులకు మార్గమే, యేసు క్రీస్తుకు బానిసగా వుంటే నిజశిష్యుడిగా వుండుట స్వచ్ఛమైన స్వాతంత్ర్యం ఆయన పరిచర్యయే అని కనుగొనుట. ''నాయజమానిని నేను ప్రేమిస్తున్నాను, నేను ఖాళీగా వెళ్ళను'' అని చెప్పగలిగిన వారందరూ చేసే తీర్మానాల్లో స్వేచ్ఛా స్వాతంత్ర్యములున్నాయి.

చిన్న చిన్న చిల్లర మల్లర కార్యములచేత శిష్యుడు జారిపడడు. అతడు పరలోక విషయాల్ను మాత్రమే పట్టించు కుంటాడు; హడ్సన్ టేలర్ చేసినట్టు కొన్ని విషయాలు మాత్రమే పట్టించుకోవడంద్వారా సుఖసంతోషాల్ను అనుభవిస్తాడు.

అతడెవ్వరికీ తెలియకపోయినా, అందరికీ బాగా తెలిసిన వాడుగానే వుంటాడు. క్రమక్రమంగా తాను చనిపోతున్నప్పటికీ అడ్డంకులన్నింటినీ ఎదుర్కొంటూ జీవిస్తాడు. అతడు శిక్షింపబడతాడు గానీ చంపబడడు. విషాదంలో కూడా ఆనందం అనుభవిస్తాడు. తనకు తానుగా పేదవాడైనప్పటికీ, అతడనేకుల్ని ధనవంతులుగా చేస్తాడు. తనకంటూ ఏమీ లేని వాడైనప్పటికీ, అన్నీ కలిగిన వాడుగా వుంటాడు (II కొరింథీ **6:9,10**).

ఈ లోకంలో నిజశిష్యత్వ జీవితం విశిష్ట సంతృప్తికర జీవితమని చెప్పగలిగితే భవిష్యజీవితంలో బహుగా బహుమానాలు పొందే జీవితం కూడా ఇదేనని అంతే ఖచ్చితంగా చెప్పొచ్చు; **''మనుష్యకుమారుడు తన తండ్రి మహిమ గలవాడై తన దూతలతో కూడా రాబోవుచున్నాడు; అప్పుడాయన ఎవని క్రియల చొప్పున వానికి ఫలమిచ్చును "(మత్తయి 16:27).**

కాబట్టి నిజంగా ఆశీర్వదించబడిన మనిషి తన జీవిత కాలంలో గానీ, నిత్యజీవితంలో గానీ ఏల్‌వాస్తవ్యుడైన బోర్డెన్‌తో కలసి ఈవిధంగా చెప్పగలుగుతాడు; ''యేసుప్రభూ, నా జీవితం పైనుండి నా హస్తాలుతీసి సుకుంటున్నాను. నా హృదయ సింహాసనంపై నిన్నే కూర్చుండ బెడుతున్నాను. నీవు నన్ను ఎన్నుకున్నావు గనుక నన్ను మార్చు, శుద్ధీకరించు; నన్ను విని యోగించుకో.''

# ఆయనకు ఇష్టం లేదు

''ఎవ్వరూ నశించుట ఆయన కిష్టంలేదు''
మహిమలో యేసు సింహాసనంపై వున్నాడు,
లేమిలో పడివున్న మన విశ్వమును ఆయనచూచాడు,
మన చింతలగూర్చి జాలిపడ్డాడు,
తన జీవితాన్ని మన కోసం ధారపోశాడు, అద్భుతప్రేమ !
నశిస్తున్నారు, నశిస్తున్నారు!
వారు మన మార్గమంతా నిండిపోయారు,
దుర్భర భారాలతో గుండెలు బ్రద్దలవుతున్నాయి;
యేసు రక్షిస్తాడు, అయితే ఇది వారికి చెప్పేవారెవ్వరూ లేరు,
వారి పాపం నుంచి , దుఃఖం నుంచి లేవనెత్తేవారెవ్వరూ లేరు.
ఎవ్వరూ నశించుట ఆయన కిష్టంలేదు
విచారం, బాధలతో నిండిన మన మానవ శరీరాన్ని ధరించి,
నశించిన దాన్ని రక్షించేందుకు ఆయన వచ్చాడు,
ప్రలాపించువారిని ఓదార్చుటకు వచ్చాడు,
విషాదం, అవమానాలతో పగిలిన హృదయాల్ను స్వస్థపర్చటానికి వచ్చాడు,
నశిస్తున్నారు, నశిస్తున్నారు !
కోత కాలం గతించి పోతుంది,
కోసేవారు కొద్దిమంది, రాత్రి సమీపిస్తోంది .

## నిజమైన శిష్యత్వము

యేసు నిన్ను పిలుస్తున్నాడు,
కోత కోసేందుకు త్వరపడు
నీవు ఆత్మలు సంపాదిస్తావు,
ప్రశస్తఆత్మలు సంపాదిస్తావు,
తగిన జీతం పొందుతావు.
సుఖభోగాలకు విస్తారం,
కానీ యేసు కోసం కొంచెమే,
సమయమంతా ఆపదలతో, ఆట బొమ్మలతో
నిండిన లోకం కోసమే,
యేసు పనికి సమయమేలేదు,
ఆకలిగొన్నవారికి ఆహారం ఇవ్వటం,
నశించిన ఆత్మలకు నిత్యానందం అందించటం,
నశిస్తున్నారు, నశిస్తున్నారు !
వారెలా మనల్ని పిలుస్తున్నారో విను,
''మీ రక్షకుడ్ని మాదగ్గరకు తెండి,
అయ్యో ఆయన గూర్చి మాకు చెప్పండి !
ప్రయాసంతో, భారవముతో వేంవు అలసిపోయావు
దీర్ఘవిలాపముతో మా కన్నులు మసగబారిపోయాయి!''

''ఎవ్వరూ నశించుట ఆయన కిష్టం లేదు''
నేనాయన్ను వెండించువాడినా,
నేను నిశ్చింతగా ఎక్కువ కాలం జీవించ గలనా?



## ఆయనకు ఇష్టం లేదు

ఒక్క ఆత్మ క్రిందికి వెళ్తుండగా
నా సహాయం పొంద లేక నశించి పోతుండగా?
నశిస్తున్నారు, నశిస్తున్నారు !
నీకు ఇష్టం లేదు; యజమానుడా, క్షమించు,
మమ్మల్నినూతనంగా ప్రేరేపించు,
మా లౌక్యాన్ని నశింపజేయి,
ఎల్లప్పుడూ నిత్యత్వవిలువల్ని దృష్టిలో వుంచుకొని,
జీవించుటకు మాకు సహాయంచేయి.

\- లూసీ ఆర్. మేయర్

# నీ ధనం ఎక్కడ?

"భూమిమీద..ధనమును కూర్చుకొన వద్దు;..పరలోకమందు... ధనమును కూర్చుకొనుడి. నీధన మెక్కడ వుండునో అక్కడనే నీహృదయమువుండును".

(మత్తయి 6: 19-21)

ధనమున్నచోటనే హృదయముంటుంది, అది భద్రమైన పెట్టెలో వుండొచ్చు! లేదా పరలోకంలోనైనా వుండొచ్చు! కానీ అది రెండు స్థలాల్లోనూ వుండనేరదు.

ఓ వ్యక్తి ఇలా అన్నాడు- "క్రైస్తవుడు తనధనమునైనా విడిచి పెడతాడు లేదా దానికోసం ఆరాటంగా పరుగులైనా తీస్తాడు!"

తనను వెంబడించు వారిని ఈ భూమ్మీద ధనము కూర్చు కొనవద్దని యేసు ప్రభువు చెప్పాడు. వారి హృదయాలు పరలోకంలో వుండాలని ఆయన ఆశించాడు.

అయినప్పటికీ ఈ నాడు క్రీస్తు బోధ మనకు విప్లవాత్మకంగానూ, విపరీతంగానూ గోచరిస్తోంది. ఆయన భావం నిజంగా అదేనా? వృద్ధాప్యంలో సరిపోయేంత ధన సదుపాయం కలుగ జేసుకో మని మానవ ఇంగిత జ్ఞానం మనకు బోధించటం లేదా? ఓ ఆపద్దినం కోసం ధనాన్ని దాచు కోవటంలో జ్ఞానయుక్తంగా వుండమని ఆయన మనల్నికోరటం లేదా? మన ప్రియులక్షేమం పట్టించుకోమని ఆయన మనల్ని ఆశించటం లేదా?

క్రీస్తు అనుచరులమని తమ గూర్చి తాము చెప్పుకునే వాళ్ళు యదార్థంగా, నమ్మకంగా ఎదుర్కోవాల్సిన తక్షణమైన ప్రశ్నలు ఇవి.

పై ప్రశ్నలకు జవాబులు ఏవి? వి శ్వాసి జీవితంలో ధనం గూర్చి బైబిలు ఏమి బోధిస్తోంది? ''వ్యక్తి గత భాగ్యాన్ని దృఢంగానిర్మించుకోవటం తప్పా? అసలు క్రైస్తవ జీవన ప్రమాణ మేమిటి?''

## వ్యాపార జాగరూకత

డబ్బు సంపాదనను బైబిలు నిషేధించటం లేదనే సత్యాన్ని మొట్ట మొదట మనం గ్రహించాలి. తనవ్యక్తిగత అవసరతలు తీర్చు కునేందుకు అపొస్తులుడైన పౌలు గుడారాలు కుట్టువాడిగా పని చేశాడు (ఆపొ. కా. 18: 1-3) (2 థెస్స. 3:8), పని చేయటానికి ఇష్టం లేని సోమరి పోతు పస్తులు వుండాల్సిందేనని ఆయన థెస్సలోనికయ సంఘస్థులకు నేర్పించాడు (2థెస్స. 3:10). తన అవసరతల నిమిత్తం, తన కుటుంబ అవసరతల నిమిత్తం ఓ మనిషి జాగ్రత్తగా పని చేయాలని ఎదురు ప్రశ్న లేని విధంగా నొక్కి చెబుతోంది.

అల్లాంటప్పుడు, ఓ విశ్వాసి తన చేతనైనంత మట్టుకు ఎక్కువ డబ్బు సంపాదించవచ్చా? లేదు, ఈ విషయమై కొన్ని అర్హతలున్నాయి. ఈ క్రింది యోగ్యతల ననుసరించి ఓ విశ్వాసి తనకు సాధ్యమైనంత అధికంగా డబ్బు సంపాయించ వచ్చు.

1. ప్రభువు కార్యాల కన్నా మిన్న యైన ధన్యతను తన సొంత పనికి ఆపాదించటం అనుమతించరాదు, అతని మొట్ట మొదటి కార్యము దేవుని రాజ్యమును, ఆయన నీతిని వెదకుటే (మత్తయి 6:33) వ్యాపార వొత్తిడి వల్ల దైవారాధన, పరిచర్యలు ఎంత మాత్రం దెబ్బతినకూడదు.

2. అతడు తన కుటుంబ బాధ్యతల్లో తప్పిపోరాదు (1 తిమోతి 5:8) సాధారణంగా అధిక డబ్బు సంపాయించే వ్యక్తికి భార్య పిల్లల కోసం అత్యల్ప సమయం మాత్రమే వుంటుంది. అతడు ఈ లోటును

- సుఖభోగాలు, ధనం సంపాయించి పెట్టటంలో తీర్చలేడు, పైగా దీనివల్ల వారిలో ఆధ్యాత్మిక, నైతిక క్షీణత వాటిల్లుతుంది. నిండుగా పొంగి పొర్లే బ్యాంకు ఖాతా కన్నా ఓ దైవ భక్తిగల భర్త లేక తండ్రిలో లభ్యమయ్యే సహవాసం కుటుంబ సభ్యులకు అవసరం.

**3.** నీతిదాయక వ్యాపారంలో మాత్రమే అతడు డబ్బు సంపాదించాలి (సామె **10:16**). ఇది నిర్వివాదాంశము. అనారోగ్య, ప్రమాదాలకు దారితీసే, లేదా నైతిక విలువల్నిదిగ జార్చే పదార్థాల ఉత్పత్తి, పంపిణీ లేదా ప్రచారాలకు పయనిస్తోన్న ప్రజల్ని వినోదంతో నింపుటలోనే ఓ క్రైస్తవుడు తన జీవితాన్ని గడపకూడదు. అతడు చేసే పని నిర్మాణాత్మకంగానూ, అందరికీ మేలు దాయకంగానూ వుండాలి.

**4.** అప్పుడు కూడా విశ్వాసి తన డబ్బును యదార్థంగా సంపాయిస్తున్నట్టు ఖచ్చితంగా చెప్పగలగాలి (సామె **20:17**). అతని వ్యాపారం మంచిదే కావొచ్చుగానీ అతని విధానాలు మోసకరములైవుండొచ్చు. ఉదాహరణకు-

అ) ఆదాయ పన్నువివరాలు తప్పుగా వ్రాయటం (సామె. **12:22**)

ఆ) తూకములు, కొలతల్లో మోసం చేయటం (సామె. **11:1**)

ఇ) స్థానిక తనిఖీ అధికారులకు లంచాలివ్వటం (సామె. **17:23**)

ఈ) ఎటువంటి తేడాలు లేకున్నా వున్నట్టుగా ఉత్పత్తుల గూర్చి తప్పుడు ప్రచారం చేయటం (సామె. **20:6**)

ఉ) తప్పుడు ఖర్చులతో కూడిన లెఖ్ఖలు వ్రాయటం (సామె. **13:5**)



ఊ) సంతవ్యాపారం లేదా వస్తు మారక వ్యాపారాల్లో ఆశలు పెంచుకోవటం ఇది జూదానికి ప్రతిరూపం (సామె. **13:11**)

ఎ) ఉద్యోగులకు చాలీ చాలని జీతాలివ్వటం (సామె. **22:16**). యాకోబు ఈవ్యసనానికి వ్యతిరేకంగా బిగ్గరగా కేకవేసి చెబుతున్నాడు, "ఇదిగో మీచేలు కోసిన పనివారి కియ్యక మీరు మోసముగా బిగ బట్టిన కూలి మొర్రపెట్టుచున్నది. మీ కోత వారి కేకలు సైన్యములకు అధిపతి యగు ప్రభువు యొక్క చెవులలో చొచ్చియున్నవి." (**యాకోబు 5:4**)

**5.** తన సొంత ఆరోగ్యాన్ని నశింప జేసుకోకుండా ఓ క్రైస్తవుడు తన చేత నైనంత అధికంగా డబ్బు సంపాయించవచ్చు. తన దేహమే పరిశుద్ధాత్మకు ఆలయము (I కొరింథీ **6:19**), ధన సంపాదనలో అతడు తన ఆరోగ్యాన్ని భంగం చేసుకోరాదు.

**6.** చివరగా, క్రైస్తవుడు దురాశకులోను గాకుండా తన చేతనైనంత డబ్బు సంపాయించవచ్చు. అతడెన్నటికీ ధనానికి బానిస కాకూడదు (మత్తయి **6:24**). డబ్బు సంపాయించుట సరైనదే గానీ దానిని అమితంగా ప్రేమించరాదు (కీ.(**62:10**).

దీనంతటినీ సంగ్రహపర్చి చెప్పాలంటే, ఓ క్రైస్తవుడు తన జీవితములో దేవునికి ప్రధమస్థానమునిస్తూ, కుటుంబబాధ్యతలు నిర్వహిస్తూ, నిర్మాణాత్మక కార్యాలు చేస్తూ, యదార్థంగా ప్రవరిస్తూ తన ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటూ, దురాశకు దూరంగా వున్నంతకాలం తనకు సాధ్యమైనంత ధనాన్ని సంపాయించవచ్చు.

# ధనం కలిగి వుండొచ్చు గానీ బిగపట్టకూడదు

మనం ఎదుర్కోవలసిన రెండో ప్రశ్న : ''డబ్బు కూడబెట్టుట తప్పా'' క్రొత్త నింబధన బోధ ప్రకారమైతే దీనికి జవాబు "అవును" అని గట్టిగా చెప్పొచ్చు.

ధనవంతుడు గా వుండుటను బైబిలు ఖండించటం లేదు, ఓ వ్యక్తి ఏదైనా ఒక స్వాస్థ్యమును పొందుట ద్వారా రాత్రికి రాత్రే ధనవంతుడై పోవొచ్చు. అయితే సమకూర్చిన ధనంలో మనం ఏమి చేస్తాము? అనే విషయం గూర్చి చెప్పాలంటే చాలా వుంది.

బైబిలు ఈ క్రింది విధంగా బోధిస్తుంది :

1. మొట్టమొదటిగా మనం దేవుని గృహనిర్వాహకులం (I కొరింథీ, 4:1, 2). మనకున్న సమస్తం ఆయనదే గాని మనది కాదని దీని భావము. అయన చేత అనుగ్రహించబడ్డ ధనాన్ని అయన మహిమార్థమే వినియోగించుట మన విధ్యుక్తధర్మము. 90% మన సొంత ఖర్చుల కోసం, మిగతా 10% దేవుని భాగమనే తలంపు నూతన నిబంధన గృహనిర్వాహకత్వపు తప్పుడు భావన. మనకున్న దంతా దేవునికి చెందిందే గదా!

2. రెండవదిగా, మనం ఆహారవస్త్రాలతో సంతృప్తి కలిగి జీవించాలి. ''ఆహార వస్త్రములు కలిగి మనము వాటితో తృప్తి కలిగి యుందము'' (I తిమోతి 6:8). ఇక్కడ చెప్పబడిన 'వస్త్రము' అను



మాటకు కప్పునది లేక పై కప్పు అను భావమున్నది. ఏదో ఒక రకమైన నివాసమును, లేదా వస్త్రధారణను ఇది సూచిస్తోంది. అంచేత జీవితావసరములైన ఆహారము, నివాసము లాంటి వాటితో మనం తృప్తి చెంది వుండాలని వాక్యం ప్రబోధిస్తోంది. మనకు అశ్రయం కల్పించుటలో ప్రభువు తాను ఈ లోకంలో జీవించినప్పటి కంటే అధికముగా మన నివాసముండేలా మనల్ని అనుమతిస్తున్నాడు. తనకైతే తలవాల్చు కొనుటకు కూడ స్థలం లేకుండా పోయింది. **( మత్తయి 8:20)**

సొంత వ్యాపారమున్న క్రైస్తవుడికి స్థిరమైన ధననిధితో పాటు వ్యాపార వినియోగార్థమైన ధననిధి కూడా అవసరం, ముడి పదార్థాలు కొనేందుకు, ఉద్యోగుల జీతాలిచ్చేందుకు, దైనందిన వ్యాపారములో అయా ఆర్థిక అవసరతలు తీర్చుకునేందుకు అవసరమైన ద్రవ్యనిధి కలిగి వుండే విషయంలో బైబిలు క్రైస్తవ వ్యాపారిని ఏ విధంగా నూ నిషేధించుటలేదు.

3. అటుతర్వాత మనం సాధ్యమైనంత మితంగా జీవించాలి; అన్ని రకాల దుబారా ఖర్చులకు దూరంగా వుండాలి. యేసు ఐదు వేల మందికి ఆహారం పెట్టింతర్వాత మిగిలిపోయిన ఆహారాన్ని సమకూర్చమని తన శిష్యులకు ఆజ్ఞాపించాడు (యోహాను 6:12). ఎక్కడెక్కడ సాధ్యమో అక్కడల్లా మనం భద్రపర్చి సమకూర్చాలని ఈ సాదృశ్యం మనకు నేర్పిస్తోంది.

ఎన్నో అనవసరమైన వాటిని మనం కొంటూ ఉంటాం. ప్రత్యేకించి క్రిస్మస్ పండుగ సందర్భంగానైతే ఎంతో డబ్బు వెచ్చించి

ఎందుకూ కొరగాని, అతి త్వరితంగా పాతగిలి పోవు, ఎవ్వరికీ ఎటువంటి ప్రయోజన కరంగా వుండక సామాన్లగదిలో పడివుండే ఎన్నో బహుమానాల్ని కొంటుంటాం.

చౌకగా లభించే వస్తువులతో కూడా అదే ప్రయోజనం పొందగలుగు పరిస్థితుల్లోనూ మనం అతిఖరీదైన వస్తువుల్ని కొంటాం. (చౌకబారు వస్తువుల్ని కొనటం మంచిదని చెప్పటం ఎల్లప్పుడూ నిజం కాదు. ఈ సందర్భంగా మనం - వెల, నాణ్యత, మన్నిక లాంటి విషయాల్ని తూచి చూడాలి).

ఆశించిన వాటన్నింటినీ కొనాలనే శోధనను ఎదిరించుటలో మనల్ని మనం క్రమశిక్షణకు లోను చేసుకోవాలి. మనుష్యకుమారుని నిమిత్తం మితముగా జీవించుటకు మనం అలవాటు చేసుకోవాలి.

**4.** పైచెప్పబడిన మన అవసరతలన్నింటినీ ప్రభువు కోసం క్రియాత్మకం చేయాలి (I తిమోతి 6:8), గుర్తుంచుకోండి!

సమస్తం ఆయన సొంతమే. మనం కేవలం ఆయన గృహ నిర్వాహకులం. మన సామర్థ్యానుసారంగా ఈ భూమ్మీద ఆయన కార్యాన్ని ముందుకు సాగించుటయే మన వ్యాపారం (పని).

ఆహారము, వస్త్రములు, నివాసాలు - వీటిని మించి ప్రతి దానిని ప్రభువు పనిలో వినియోగించుట వెర్రితనం, ముందు చూపు లేని మొండితనం. దూరదృష్టిహీనత అనేది ఆదైవ కార్యానికి అభ్యంతరంగా ఎదురౌతుంది.



అలా చేసిన ఓ వ్యక్తిని గూర్చిన వృత్తాంతము ఉంది. ఆమె ఓ విధవరాలు. ఆమె దగ్గరున్న రెండే రెండు కాసుల్ని కానుకల పెట్టెలో వేసింది. యేసు ఆమెను దూషించలేదు; కానీ ఇలా అన్నాడు : **''ఈ బీద విధవరాలు అందరి కంటే ఎక్కువ వేసానని మీతో నిజముగా చెప్పుచున్నాను. వారందరూ తమకు కలిగిన సమృద్ధిలో నుండి కానుకలు వేసిరి. గానీ ఈమె తన లేమిలో తనకు కలిగిన జీవనమంతయు వేసెనని వారితో చెప్పెను'' (లూకా21:3-4).**

**5 .** మనం భూమ్మీద ధనం సమకూర్చుకొనుట నిషేధించబడింది. దీని గూర్చి లేఖనములు ఎటువంటి దాపరికం గానీ పొరపొచ్చం గానీ లేకుండా బోధిస్తున్నాయి.

**''భూమ్మీద మీకొరకు ధనమును కూర్చు కొనవద్దు ; ఇక్కడ చిమ్మెటయు, తుప్పును తినివేయును, దొంగలు కన్నము వేసి దొంగిలించెదరు. పరలోకమందు మీ కొరకు ధనమును కూర్చకొనుండి. అచ్చట చిమ్మెటయైనను తుప్పైనను దాని తినివేయదు, దొంగలు కన్నము వేసి దొంగిలరు. నీధనమెక్కడ వుండునో అక్కడనే నీ హృదయముండును!''**

**(మత్తయి 6:19 -21)**

మనలో చాలా మందికి ఈ వాక్యాలు బైబిల్లో లేనట్టే వుంటుంది. ఇవి యేసు పలికిన మాటలని మనం నమ్ముతాము. అవి దైవప్రేరితములని కూడా నమ్ముతాము. కానీ ఈ వాక్యాలు మనకు వర్తిస్తాయని మాత్రం భావించము. వాటికి లోబడము. మన మట్టుకైతే యేసు ఈ మాటలెన్నడూ చెప్పలేదన్నట్టుగా వుంటాము.

అయినప్పటికీ - భూమిమీద ధనము సమకూర్చుకొనుట పాపమను సత్యం అలాగే నిలిచి వుంటుంది. ధనము కూడబెట్టుట దైవ వాక్యానికి పరమ విరుద్ధం. ముందుచూపు, జ్ఞానము అని పిలువబడుతున్న ఇవి వాస్తవానికి తిరుగుబాటు, పాపములుగా పరిణమిస్తున్నాయి.

మరో సత్యమేమిటంటే - మనధనం ఎక్కడ వుందో అక్కడే మన హృదయం కూడా వుంటుంది. డా.జాన్సన్ ఓసారి సుఖప్రదమైన సదుపాయాలున్న ఓ భవన సముదాయాన్ని చూడటం తటస్థించింది. భవనం లోపలి భాగమంతా తిరిగి చూచాడు; చాలా బాగా నిర్వహించ బడుతోన్న భూప్రాంగణాన్ని కూడా తిలకించాడు. అప్పుడాయన తన స్నేహితులవైపుకు మళ్ళి ఇలా అన్నాడు; "మనిషిని చావకుండా చేసేవి ఇటువంటివే."

చివరిదిగా - భవిష్యత్తు విషయంలో మనం దేవుణ్ణి మాత్రమే నమ్ముకోవాలి. దేవుడు తన ప్రజల్ని ఓ విశ్వాస జీవితానికి పిలుస్తున్నాడు. ఆయన మనకు ప్రార్థన చేయటం ఎలాగోనేర్పిస్తున్నాడు. **"నేటి దినాహారము మాకు నేడు దయచేయుము."**

**(మత్తయి 6:11)**

"మన్నా గూర్చిన కథ ద్వారా మన అవసరతలు తీరుటకు గాను మనం ప్రతిదినం ఆయన వైపు చూస్తూవుండాలని దేవుడు మనకు నేర్పిస్తున్నాడు." (నిర్గ. **16:14-22**)



మనకు భద్రతగా ఆయనే వుండాలి, ఈలోకసంబంధమైన, తెగిన తంత్రుల మీద మనం ఆనుకోరాదు.

తన ప్రజల యెడల దేవుని చిత్తం ఇదే - మనమాయన గృహనిర్వాహకులమని గుర్తెరగాలి, మన కున్నదంతా ఆయనదేనని ఎరగాలి, జీవితావసరలతో తృప్తి చెందాలనీ, సాధ్యమైనంత మితంగా జీవించాలనీ, మన అవసరతల్ని మించి మనకున్న సమస్తాన్ని ప్రభువు పనిలో వినియోగించాలని, భూమీమ్మీద మనం ధనాన్ని కూడబెట్టుకోరాదని, భవిష్యజీవితవిషయంలో ఆయనన్ను మాత్రమే నమ్ముకొని జీవించాలని మనం గ్రహించాలి.

# అందులో ఉన్న కీడు ఏమిటి ?

ఓ క్రైస్తవుడు ధనం కూడ బెట్టుట, సంపదల్ని సమకూర్చుకొనుట తప్పు ఎలా అవుతుందా?

1. మొట్టమొదట - బైబిలు చెబుతోంది గనుక అది తప్పు (మత్తయి 6:19). ఇది అన్నింటికీ తగిన, సరిగ్గా సరిపోయిన కారణం; మంచి చెడులను తెలియ జేయు వృక్షఫలములు ఆదాము, హవ్వలు తినటం ఎలా తప్పవుతుంది? అదీ తప్పే, ఎందు కంటే దేవుడే చెబుతున్నాడు గనుక మనలో ప్రతి ఒక్క సమస్యను పరిష్కరించేది అదే.

2. ఈ నాటి ప్రపంచ విశాల ఆధ్యాత్మిక అవసరతను ఇది పట్టించుక్కోవటం లేదు గనుక అవిధంగా కూడా ఇది తప్పు. (సామె. **24:11,12**)

కోట్లాది స్త్రీలు, పురుషులు - బాలురు, బాలికలు దైవకృపాసువార్తను వినసేలేదు. కోట్లాది ప్రజలకు బైబిలు గ్రంథం అందుబాటులో లేదు, సువార్త వాఙ్మయం లభ్యం కావటంలేదు. దేవుడు లేకుండా, క్రీస్తులేకుండా, నిరీక్షణా రహితంగా కోట్లాది మంది మరణం పాలవుతున్నారు.

సువార్త వ్యాప్తికి వనరులున్నప్పటికీ వాటిని వినియోగించక పోవటం ఆధ్యాత్మిక సహోదర హత్యకు ప్రతి రూపమే అవుతుంది (యెహె. **33:6**).



ధన సము పార్జన చేసే వ్యక్తి హృదయంలో దైవప్రేమాహీనతకు ఇది అతి బిగ్గర సాక్ష్యము. ఎందు చేత నంటే, **"ఈలోకపు జీవనోపాధిగల వాడైయుండి, తన సహోదరునికి లేమి కలుగుట చూచియు అతని యెడల ఎంతమాత్రమును కనికరము చూపని వానియందు దేవుని ప్రేమ ఏలాగునిలుచును?"**

**(I యోహాను 3:17)**

పాతనిబంధన గ్రంథంలో ఆకలితో అలమటిస్తున్న ఇద్దరు కుష్టురోగులు మహా గొప్ప భోజన రాసుల్ని చూచి కళ్ళు తిరిగి పడిపోయారు. తమ సొంత ఆకలి తీరింతర్వాత వారికి దొరికిన ఈ ఆహారమును ఇతరులకు కూడా పంచి పెట్టుటకు అక్కడి నుండి పరుగెత్తారు (I రాజులు **7:9**). కృపక్రిందున్న క్రైస్తవులు ధర్మశాస్త్రము క్రిందున్న కుష్టురోగుల కన్నాతక్కువ జాలి ప్రదర్శించాలా ?

3. మూడవదిగా - డబ్బు కూడ బెట్టుట తప్పు, ఎంచేత నంటే ఇది ప్రపంచంలోని విస్తార భౌతిక అవసరతలపట్ల కాఠిన్యత ప్రకటిస్తుంది (సామె **3:28, 11:26**). లూకాసువార్త**16** అధ్యాయంలోని ధనవంతుడు తన ఇంటి గుమ్మం దగ్గర పడివున్న బిచ్చగాడిపై ఎటువంటి దయచూపలేదు. ఒకవేళ అతడు కిటికీ తెరిచి చూచి వుంటే అవసరతలో వున్న ఆపేదవాడు కనిపించేవాడే; తన విస్తార డబ్బులో కొంత భాగాన్ని ఓ యోగ్యమైన కార్యంనిమిత్తం ఖర్చు చేసేందుకు సదవ కాశం లభించి వుండేది. అయితే అతడు అసలు పట్టించుకోలేదు.

ఈ నాటి ప్రపంచమంతా లాజర్లతో నిండి పోయింది. వాళ్ళంతా మన గుమ్మముల దగ్గర పడివున్నారు. యేసు మనతో ఇలా చెబుతున్నాడు, ''నిన్ను వలె నీ పొరుగు వానిని ప్రేమించువము!''

(మత్తయి **22:39**)

ఒక వేళ మన మిప్పుడు ఆయన మాట వినేందుకు నిరాకరిస్తే ఒక రోజున ఆయన మనతో ఇలా చెప్తాడేమో, **''నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనం పెట్టలేదు, దప్పిగొంటిని, మీరు నాకు దాహమియ్యలేదు, పరదేశినై యుంటిని మీరు నన్ను చేర్చుకొనలేదు, దిగంబరినై యుంటిని, మీరు నాకు బట్టలియ్యలేదు, రోగినై చెరసాలలో వుంటిని, మీరు నన్ను చూడరాలేదు.. ఈ మిక్కిలి అల్పులైనవారిలో ఒకనికైనను మీరు ఈలాగు చేయ లేదు గనుక నాకు చేయలేదని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను!''** (మత్తయి **25 :42, 45**)

**4.** ఓ క్రైస్తవుడు భూమ్మీద ధనము కూడ బెట్టుట తప్పు - ఎంచేత నంటే దైవ విరోధులు దూషించే అవాకాశముంది (రోమీ. **2:24**). వాల్టేయిర్ ప్రేరేపితుడై ఇలా చెప్పాడు. ''డబ్బు విషయానికొచ్చేసరికి మానవులంతా ఒకే మతానికి చెందిన వాళ్ళే!''. చాలామంది రక్షణ పొందని ప్రజలకు యేసు బోధ బాగా తెలుసు. మనం మన పొరుగు వాడ్ని ప్రేమించాలని ఆయన నేర్పినట్లు కూడా వాళ్ళకు తెలుసు . క్రీస్తును వెంబడిస్తున్నామని చెప్పుకునే వాళ్ళు పెద్ద పెద్ద భవనాలు, సుఖదాయకమైన కార్లు, ఆనందదాయకమైన భోజన పదార్థాలు , ఖరీదైన వస్త్రాలంకరణల్లో మునిగి పోతూవుంటే ఇక అన్యులైన వారు ఎంతో విపరీతమైన లోపాన్ని అనుభవిస్తారు.



అంచేత సంఘం మేల్కోవలసిన సమయం ఇదే ! ప్రపంచ వ్యాప్తంగా విద్యాధికులైన యువతీ యువకులతో దీని గూర్చి మాట్లాడండి! క్రైస్తవ్యాన్ని గూర్చి వారి విమర్శలు వినండి ! యేసు బోధలకు, నీతి తత్వానికి వాళ్ళు వ్యతిరేకులు కాదు గానీ దారిద్ర్యముతో నిండిన ఈలోకంలో క్రైస్తవ సంఘానికీ, క్రైస్తవులకూ వున్న ధనసంపదను వాళ్ళు భయంకరంగా వ్యతిరేకిస్తున్నారు .

ఒకసారి ఓ వ్యక్తి ఇలా అన్నాడు - ''బంగారు చెప్పులే మెట్లుఎక్కుతుంటే ఇక మేకులు కొట్టిన బూట్లు ఎంతో దూరం వెనకబడిలేవు'' - సంఘం ఈ మాట జాగ్రత్తాగా వినాలి !

**5.** అవిశ్వాసులపై బడే ప్రభావాన్ని గూర్చి మాత్రమే మన భారం కాదు, యువక్రైస్తవులపై బడే ప్రభావం గూర్చి కూడా మనం ఆలోచిస్తున్నాం.

వారు తమ పెద్దల జీవితాల్ను ఆదర్శంగా తీసుకొని, గమనిస్తుంటారు. అంచేత మనం చెప్పే మాటల కన్నా అత్యంత ప్రాముఖ్యమైనది మన జీవన విధానమే. ఆదివారాలు మనం అందరి హృదయాల్ను కదిలించే విధంగా వల్లించే సౌవార్తిక ప్రసంగాల్లో మన జీవిత విలువలు కనిపించనే కనిపించవు; సోమవారం నుండి శుక్రవారం దాకా జీవన వైఖరులు వాటి గమ్యముల ద్వారానే బహిర్గతమవుతాయి. మన 'గుడారము' నకు ఖరీదు కట్టుట ద్వారా యువజనులు మన జీవిత యాత్రవాస్తవికతను తేల్చిచెబుతారు. ఒక్క పెన్ను పోటుతో దేవుని సేవావసరతల్ను తీర్చుకునేందుకు అవసరమైన నిధుల కోసం సిద్ధంచేసే వేదనారహిత విన్నపములను యువజనులు అసలు ఒప్పుకోరు.

ధనం కూడ బెట్టుటలో మనమే మన జీవితాల్ను గడిపివేస్తుంటే ఇక యువతీయువకులు మన ఆదర్శాన్ని పాటిస్తే అప్పుడు మనం ఆశ్చర్య పడనవసరం లేదు. యేసు ప్రభువు సెలవిచ్చిన సూచనను మనమెన్నడూ మర్చి పోకూడదు, ''అభ్యంతరములు రాకపోవుట అసాధ్యము కానీ అవి ఎవని వలన వచ్చునో వానికి శ్రమ. వాడు ఈ చిన్నవారిలో ఒకనికి అభ్యంతరము కలుగ జేయుట కంటే వాని మెడకు తిరుగటి రాయి కట్టబడి సముద్రములో పడవేయబడుట వానికి మేలు''. (లూకా **17:1-2**)

**6.** ధనం కూడ బెట్టుట పాపభూయిష్టం అనటానికి మరో కారణం ఏమిటంటే ధనం దేవుణ్ణి దోచుకుంటుంది (మలాకీ **3:8**). మన కున్నదంతా దేవునికి చెందిందేనని మనం ఇప్పటికే చూచాం. దేవుని అభీష్టములను జరిగించుటలో ధనాన్ని నేరుగా మనం వినియోగించ లేనప్పుడు కనీసం ఆపని చేయగల వారికైనా మన ధనాన్ని ధారాళంగా ఇచ్చివేయాలి. అంతే కాని, ధనాన్ని మూట గట్టి దాచటం క్షమించరాని పాపం. (లూకా **19:20-26**)

**7.** ఆర్థిక గృహనిర్వాహ కత్వ విషయంలో ప్రభువుకు విధేయత చూపటంలో తప్పిపోవుట బైబిల్లోని కొన్ని వాక్యభాగాలు మన పట్లమూసి వేయబడ్డట్టే (మత్తయి **6:22,23**). ముఖవిలువలు సులభంగానూ, అతి సామాన్యము గానూ కనిపించే వాక్యభాగాలకు మన దృష్టి అంధత్వంగా మారుతుంది.

పతన స్వభావానికిది ఓ జీవిత వులుపైనప్పటికీ ఇది సత్యమే, ''మన జీవిత కేంద్రాల నుండి, బాధ్యతల నుండి తొలగించబడ్డ అధ్యయనం భౌతికశాస్త్రం, గణిత శాస్త్రాల్లోని ఉదాహరణల్లో - మన



అల్పమైన పాప భూయిష్ట స్వభావ వికృత రూపం మనముగింపును చెడగొడుతుంది, అధ్యయనం మనవ్యక్తిగత బాధ్యతలకు, సృష్టికర్తకు ఎంత సమీపస్థులుగా చేస్తోందో అంత కన్నా ఎక్కువగా మన పాప స్వభావం మనం నమ్మటానికి ఇష్టం లేని సత్యాల విషయంలో మన మనస్సులకు అంధకారం కలిగించేందుకు ప్రయత్నిస్తుంది, అంతమాత్రమే గాక ఆ బాధ్యత నుండి మనల్ని తప్పిస్తున్నట్లుగా కనిపించే ఓ ప్రాకృతిక పద్ధతిని పట్టుకునేలా అది మనల్ని ప్రోత్సహిస్తుంది.''[1]

ఈ సందర్భంగా హారింగ్ టన్ సి. లీస్ ఒకసారి ఇలా వ్రాసాడు: "నాగరిక మానవుని అతిసున్నిత భాగం అతని జేబు, ఒక ప్రసంగి చేయవలసిన భీకర యుద్ధములో ఒకటి ఏమిటంటే, అతని బోధ అక్కడి శ్రోతల జేబుల్ని తాకి తీరాలి.''

సీయోనులో సులభజీవితాలు జీవిస్తున్న మనకు స్వయం - విసర్జన గూర్చిన వాక్యభాగాలు అంతగా ప్రభావితములు కావు. మనకు మనముగా విధేయత చూపని వాక్యభాగాల్ను మనం శక్తివంతంగా బోధించలేమనేది ఖచ్చితమైన విషయం.

కాబట్టి అన్ని విభాగాల్లోనూ అవిధేయతకు సంప్రాప్తమయ్యే శాపాల్లో ఒకటి వెుుండిగా ఖండించబడిన బైబిలు గ్రంధమే. (మతయి **13:14,15**)

1. క్రియేషన్ రివీల్డ్- రచయత : ఫ్రెడ్రిక్ ఎ. ఫిల్బీ లో చెప్పబడింది; లండన్; పికరింగ్ అండ్ ఇంగ్లీష్ లిమిటెడ్; **1964** పేజీ **126**.

**8.** ధనాన్ని అమితంగా కూడబెట్టుట విశ్వాస జీవితాన్ని క్రియాత్మకంగా అసాధ్యపరుస్తుంది. ఎందు చేత? ధనసంపదలు కలిగి వుంటూనే వాటిలో నమ్మకం లేకుండా జీవించుట దుస్సాధ్యవిషయం. డబ్బుగలిగిన మనిషి ఎంతగా దానిపై ఆధారపడి వున్నాడో తెలియకుండా జీవిస్తాడు .

**" ధనవంతునికి వాని ఆస్తి ఆశ్రయపట్టణము వాని దృష్టికి అది ఎత్తైన ప్రాకారవము." (సామె. 18:11)**

తన సమస్యలన్నింటినీ పరిష్కరించుకొనుటకు, ప్రస్తుతవినోదం, భవిష్యభద్రతలను పొందుటకోసం ధనవంతుడు డబ్బుపైనే ఆధారపడతాడు. ఒకవేళ అతడు ఇదంతా హఠాత్తుగా పోగొట్టుకోవాల్సివస్తే అతడప్పుడు నిరాధారుడై దిగులుతోనూ, విభ్రాంతితోనూ నిండిపోతాడు.

అసలు సత్యమేమిటంటే కన్నులతో చూడలేని దేవుని నమ్ముట కంటే కన్నులతో చూడగల బ్యాంకు ధననిధినే ఎక్కువగా మనం నమ్ముతాము. నమ్మేందుకు దేవుడు తప్ప మరెవ్వరూగానీ, మరేదీగానీ అవసరం లేదనే ఆలోచన ఒక్కటి మాత్రమే మననాడీ మండలాన్ని స్తంభింపజేయటానికి సరిపోతుంది. "అయన హస్తాల్లో క్షేమంగా వున్నట్లు మనం భావించము. కానీ మన భాగ్యం మన చేతుల్లోనే వున్నట్లయితే, మార్పులకు - చేర్పులకు - ప్రతికూలతలకు ఎదురునిలిచి సంతృప్తి నిచ్చే భద్రతా నిధులు కలిగి వున్న పక్షంలో మనం తగినంత క్షేమంగా వున్నట్లు భావిస్తాము. ఇది ఖచ్చితం అతి సామాన్య భావన .



తండ్రి లాంటి దేవుని లభ్యత విడిచి ఓ గందరగోళ అపనమ్మకత్వ రూపంలోకి జారి పడే ప్రమాదం మనందరికీ వుంది".

- సామ్యేల్ కాక్స్

దైవ చిత్త మేమిటంటే - అయనపై ఆధారపడటంలో మన జీవితాలు "ఓ శాశ్వత తుది మెరుపు" గా వుండాలి. భూలోకంలో ధనం కూడబెట్టుట వల్ల మనం మన జీవితాల్లో ఆయన చిత్తాన్ని ఓడిస్తున్నా మన్న మాట.

విశ్వాస జీవిత మొక్కటే దేవుణ్ణి సంతోషపెడుతుంది.
**"విశ్వాసము లేకుండా దేవునికి ఇష్టుడైయుండుట అసాధ్యము."**
**( హెబ్రీ 11:6)**

విశ్వాస జీవితమొక్కటే నిజమైన భద్రత గల జీవితం -
**"విశ్వాసము గల వారికి .. అ వాగ్దానము యావత్సంతతికి దృఢముకావలెనని." (రోమా 4:16)**

దేవుని వాగ్ధానము వంటి ఖచ్చితమైనది ఏదీ లేనందు చేత విశ్వాస జీవితమే నిశ్చింత జీవితమని చెప్పబడింది. విశ్వాసము ద్వారా దేవునితో నడుచుట వల్ల కాదు గానీ, ధనసమృద్ధి - వస్తుసంపదల నుండి మాత్రమే నరాల సంబంధమైన ఉద్వేగ బలహీనతలు ఆరంభమవుతాయి.

విశ్వాసజీవితమే దేవునికి సమస్తమహిమ చెల్లించే జీవితం. కను దృష్టి ననుసరించి నడిచినప్పుడు మనం మానవ తెలివి తేటల్ని మాత్రమే మహిమ పరుస్తున్నాం. అవిశ్వాసులతోనూ, ఇతర క్రైస్తవులతోనూ విశ్వాస జీవితం బిగ్గరగా మాట్లాడుతుంది . ప్రార్థనలకు జవాబిచ్చే దేవుడొకడు పరలోకంలో వున్నాడని అది అందరికీ సాక్ష్యమిస్తుంది.

దృష్టికి వ్యతిరిక్తమైనది విశ్వాసము, బాహ్యనేత్ర దృష్టి సహాయంతో నీవు నమ్మలేవు.

ధనాన్ని సమృద్ధిగా సమకూర్చుకొనుటకు విశ్వాస జీవితాన్ని అసాధ్యపరుస్తుంది.

ఒక వ్యక్తి క్రైస్తవుడు కాగానే అతనిలో విశ్వాస జీవితం యాంత్రికంగాకలుగదు. ఈ విషయం లో అతని పక్షంగా బాహాటమైన అభ్యాసం, క్రియ అవసరం. ప్రత్యేకించి ధనాశాపూరితమైన స్వేచ్ఛాసమాజంలో ఇది పరమసత్యం. దేవున్ని నమ్మే విషయంలో విశ్వాసి బలవంత పెట్టబడ్డప్పుడు అతడు తన స్థానంలో తాను వుండి పోవాలి. తనకున్న దంతా అమ్మి, ఆ ధనాన్ని బీదలకిచ్చుట ద్వారా అతడు ఈ కార్యం చేయగలడు. తన నిధులన్నింటినీ విసర్జించి, తప్పుడు ఆధారాలన్నింటి నీ విడిచి పెట్టినప్పుడు మాత్రమే అతడు నిజంగా లోతైన జీవితం లోకి వెళ్ళగలడు.

**9.** అంత మాత్రమే గాక తాను తృణీకరింపబడుతూ, తన సేవకులు శ్రమల పాలవుతున్న ఈలోకంలో మనం రాజుల్లా ఉన్నతాసీనులమై వుండటం ప్రభువుకు అగౌరవం, అవమానకరం. కొరింథు ప్రజలు తమ పట్టణ మహా ప్రాంగణంలో అంత్యంతవిలువైన ఆసనాలపై శిరస్సులపై కిరీటాలు ధరించి, ప్రశస్త వస్త్రవములతో కూర్చున్నట్టు పౌలు చిత్రీకరించాడు. అదే సమయంలో ఆ ప్రేక్షక ప్రాంగణం నడుమ క్రూరమృగాల చేత మ్రింగబడుటకు అపొస్తలులు సిద్ధంగా వున్నట్లు కూడా అతడు వర్ణించాడు.



**"ఇది వరకే మీరేమియు కొదువలేక తృప్తులైతిరి, ఇది వరకే ఐశ్వర్యవంతులైతిరి; మమ్ముల విడిచి పెట్టి మీరు రాజులైతిరి; అవును మీరు రాజులైతే నాకు సంతోషమే, అప్పుడు మేమును మీతో కూడా రాజులమగుదుము గదా? మరణదండనకు విధింపబడిన వారమైనట్టు దేవుడు అపొస్తలులమైన మమ్మును అందరికంటే కడపట ఉంచియున్నాడని నాకు తోచుచున్నది. మేము లోకమునకును, దేవ దూతలకును, మనుష్యులకును వేడుకగా నున్నాము. మేము క్రీస్తునిమిత్తము వెర్రివారము, మీరు క్రీస్తునందు బుద్ధిమంతులు; మేము బలహీనులము, మీరు బలవంతులు, మీరు ఘనులు, మేము ఘనహీనులము, ఈ గడియవరకు ఆకలి దప్పులు గలవారము, దిగంబరులము, పిడిగుద్దులు తినుచున్నాము, నిలువరమైన నివాసము లేకయున్నాము, స్వహస్తములు పనిచేసి కష్టపడుచున్నాము. నిందించబడియు దీవించుచున్నాము; హింసింపబడియు ఓర్చుకొనుచున్నాము. దూషింపబడియు బతిమాలు కొనుచున్నాము. లోకమునకు మురికిగాను అందరికి పెంటగాను ఇదివరకు ఎంచబడి వున్నాము." (1 కొరింథీ 4 :8-13)**

క్రీస్తుకిరీట ధారి కాకముందే కొరింథు ప్రజలు రాజుల్లా ఏలుతున్నారు. అభిషేకోత్సవ కార్యక్రమాల్లో చక్రవర్తికి కిరీట ధారణ చేయకముందు దిగువ స్థాయిలో వున్నవారు తమ శిరోభూషణాలను ధరించుట విపరీత అగౌరవ సూచనగా వుంది.

10. ధనసంపదలు కూడబెట్టుకోవటం యేసు ప్రభువు చూపిన ఆదర్శానికే విరుద్ధం. ''ఆయన ధనవంతుడైయుండినను మీారు తన దారిద్ర్యము వలన ధనవంతులు కావలెనని మీా నిమిత్తము దరిద్రుడాయెను.''

**(II కొరింథీ 8:9)**

నూతన నిబంధన మూల భాషలో 'పేద' అను భావాన్ని అనువదించిన రెండు మాటలున్నాయి. మొదటి మాట భావమేమిటంటే- జీవితావసరతల కన్నా మించి మరేమీ ఆశించని ఒక కష్టజీవి పరిస్థితి. మరో మాట భావమేమిటంటే- నిరాధారుడుగా వుండుట లేదా ఎటువంటి ఆస్తిపాస్తులు లేని నిరుపేదగా వుండుట. యేసు ప్రభువును వర్ణిస్తూ పౌలు ఈ రెండవ మాటను ప్రయోగించాడు.

యేసు ప్రభువును చివరి దాకా అనుసరించేందుకు మనలో ఎంతమందిమి ఇష్టపడుతున్నాము?

11. ధనసమృద్ధిలోని మరో దుష్ట స్వభావము- ధనం ప్రార్థనా జీవితానికి నష్టదాయకము. వస్తు సంబంధిత అవసరతలన్నీ తీర్చబడిన చోట ఇక ప్రార్థించుట ఎందుకు ?

మన సొంత శక్తితో చేసుకోగల కార్యాల్ని కూడా చేసి పెట్టమని దేవుణ్ణి అడుగుటవంటి వేష ధారణ జీవితం మరీ ప్రమాదకరం. ఉదాహరణకు ఎటువంటి జాప్యం లేకుండా ద్రవ్యమును అందించగల స్తోమత స్వయంగావునం కలిగివున్నప్పుడు కూడా కొన్ని సేవా ప్రణాళికలకు నిధులను అనుగ్రహించమని విశ్వాసులమైన మనం చాలా సార్లు దేవుణ్ణి అడుగుతున్నాం, అనేక సార్లు దేవుని సొమ్ము దేవునికే అందుబాటులో వుండటం లేదు.



12. చివరిదిగా క్రైస్తవులు ధనం కూడ బెట్టుట తప్పు, ఎంచేతనంటే - తావు కూడా ధనవంతులు కావొచ్చనే దురాశతో క్రైస్తవులయ్యేందుకు కొందరిని ఇది ప్రోత్సహిస్తుంది.

ఆది విశ్వాసులు అనుభవించిన దారిద్ర్యము వారి ఆస్తియేగాని అప్పు మాత్రం కాదు:

''లోకాన్ని తల్లక్రిందులు చేసిన ఒక మతం, దాని ఆదిబోధకులందరూ పేద వాళ్ళు. వారి అవసరతలన్నీ పరలోకం నుండి తీర్చబడ్డాయి. తమ బోధలు వినటానికి వచ్చిన ప్రజలకు ఇచ్చేందుకు అపొస్తలుల దగ్గర డబ్బు వుండి వుంటే, లేక ప్రజల్ని భయపెట్టి ఒప్పించేందుకు వారుసైన్య సహకారం పొంది వుంటే- అల్లాంటప్పుడు ఆ అపొస్తలుల విజయంలో ఎటువంటి అద్భుతంలేదని ఓ అవిశ్వాసి వారి సేవను తృణీకరించవచ్చు, అయితే మన ప్రభువు శిష్యుల దారిద్ర్యం, అటువంటి అవిశ్వాసుల నుండి ఎదురయ్యే వాదాల్ని ఖండించి వేసింది. ప్రకృతి సిద్ధమైన హృదయానికి సమ్మతం కాని ఓ సిద్ధాంతంతో, ఎటువంటి లంచం గానీ, బలవంత విధేయత ప్రయోగం గానీ లేకుండానే- కొద్దిమంది గలిలయులు భూలోకమును కంపింపజేశారు; రోమాసామ్రాజ్యపు రూపు రేఖల్ని మార్చి వేశారు. ఈ విషయంలో ఒకే ఒక లెక్కవుంది. ఈ మనుషులు ప్రకటించిన క్రీస్తు సువార్త దేవుని సత్యమే''- జె. సి. రైల్

మంగోలియా నివాసి గిల్మొర్ **(GILMOUR)** ఒక సారి ఇలా వ్రాశాడు:

''నేను వారి మధ్యకు ధనవంతుడిగా వెళ్ళిన పక్షంలో వారు నిరంతరం అడుక్కునే వారైపోతారు- బహుశా వాళ్ళు నన్ను ఓ బహుమానాల గనిగా మాత్రమే గౌరవిస్తారేమో గానీ మరో విధంగా కాదు. ఒక వేళ నేను కేవలం సువార్తతో వారి మధ్యకు వెళ్ళితే

వర్ణనాతీతమైన పరలోక వరం మీది నుంచి వారి దృష్టి లగ్నాన్ని ఏదీ తొలగించదు''.

దేవాలయ ద్వారం దగ్గర పేతురు, యోహానులు ఒక కుంటి బిచ్చగాడ్ని కలుసుకున్నారు. అతడు వారిని కొంత సహాయం అడిగినప్పుడు పేతురు ఇలా అన్నాడు, **''వెండి బంగారములు నా వద్ద లేవు గానీ, నాకు కలిగిన దానినే నీ కిచ్చుచున్నాను, నజరేయుడైన యేసు క్రీస్తు నామమున లేచి నడువుము''.**

**(అపొ. కా. 3:6)**

అయితే బోధకులు పేదవారు గా వుండాలిగానీ క్రైస్తవులందరూ పేదలుగా వుండనక్కర లేదని కొందరు అనొచ్చు. బోధకులకు, ఇతరులకు, సువార్త పరిచారకులకు, గృహాల్లో పనులు చేసుకుంటూ వుండేవారికి వేర్వేరు ఆర్థిక ప్రమాణాలు బైబిల్లో ఎక్కడ చెప్పబడ్డాయి?

# ఘనీభవించిన ఆస్తుల పెట్టె

క్రైస్తవుడు ధనం కూడ బెట్టుట ఎంత తప్పో అను సత్యానికి గల ఆయా కారణాల గూర్చి చాలా ఆలోచించాం. ఇప్పుడు మనం-తమ భవిష్యత్తు కోసం, తమ కుటుంబాల భవిష్యత్తు కోసం డబ్బు పొదుపు జేసే విశ్వాసుల్ని సమర్థించే కొన్ని వాదాలపై మన దృష్టి మరల్చుదాం.

1. మొట్టమొదటి వాదం ఇలా వుంటుంది: మన వృద్ధాప్య అవసరతల నిమిత్తం కొంత డబ్బు దాచి పెట్టుకోవటం సమంజసమే. మన మింకెంత మాత్రం పని చేయ జాలని పరిస్థితి ఏర్పడినప్పుడు మనకు జరగబోయే దేమిటి? ఎల్లప్పుడూ మనం ఆపద రోజు ఎప్పుడొస్తుందా అని దాని కోసం కాచుకొని వుండాల్సిందే. మనం మన ఇంగిత జ్ఞానాన్ని వినియోగించుకుంటామని దేవుడు ఆశిస్తాడు.

ఈ హేతువాదం కొంత అంగీకారయోగ్యంగా ధ్వనించినప్పటికీ ఇది విశ్వాస పరమైన భాష మాత్రం కాదు. ప్రభువుతో మనకు వుండాల్సిన నమ్మకానికి ప్రత్యామ్నాయ ప్రక్రియలుగా ధన నిధులు ఆధార కర్రలుగా మారతాయి. మన బాహ్య నేత్రాలతో చూడ గలిగినప్పుడు మనమిక విశ్వాస ముంచ జాలము.

భవిష్యత్తు నిమిత్తం సమకూర్చుకోవాలని మనమొక్కసారి నిర్ణయించు కుంటే చాలు-ఇక మనం ఈ సమస్యల్లో పడిపోయినట్టే. ఎంత ధనమైతే సరిపోతుంది? మనం ఎంత కాలం

బ్రతుకుతాం? ఏదైనా మానసిక చింత కలుగు తుందా? ద్రవ్యోల్బణం తలెత్తుతుందా? విపరీతమైన మెడికల్ బిల్లుల సమస్య వుంటుందా?

భవిష్యత్తులో మనకు ఎంత డబ్బు అవసరమో తెలుసుకోవటం దుర్లభం. కాబట్టి కొన్ని సంవత్సరాల పదవీ విరమణానంతర విరామ కాలం కోసం ధనాన్ని విపరీతంగా కూడ బెట్టుటలోనే మనం మన జీవితాల్ని గడిపివేస్తాం. ఈ మధ్యకాలంలో దేవుడు దోపిడికి గురవుతాడు; దొరకని భద్రత కోసం వెదకులాటలో మన సొంత జీవితాలు వృధాగా గడిచిపోతాయి.

మన ప్రస్తుత అవసరాల నిమిత్తం జాగ్రత్తగా కృషిచేయుట, అమితంగా ప్రభువును సేవించుట, ప్రస్తుత అవసరాలకు మించిన సమస్తాన్ని ప్రభువు పనిలో వినియోగించుట, భవిష్యత్తుకోసం ఆయన్ను మాత్రమే నమ్ము కొనుట ఎంత మేలు! ఆయన్ను ప్రథమ స్థానంలో వుంచుకొను వారికి ఆయన వాగ్దానం చేశాడు.

**"... ఇవన్నియు మీకు అనుగ్రహింపబడును" (మత్తయి 6:33)**. సత్యవాక్య వ్యాప్తి నిమిత్తం ప్రభువు డబ్బును వినియోగిస్తున్న పిలిప్పీయులకు పౌలు ఇలా రాశాడు:

**"నా దేవుడు తన ఐశ్వర్యము చొప్పున క్రీస్తు యేసు నందు మహిమలో మీ ప్రతి అవసరమును తీర్చును."**

**(ఫిలిప్పీ 4:19)**



ఒకడు తన పదవీ విరమణ కాలాన్ని ప్రభువు సేవకు సమర్పించాలని ఆశించితన జీవిత మంతా ధనసంపాదనలో గడుపు ఈ లోకపు తత్వములో చెప్ప జాలనంత విషాదం దాగి వుంది. దాని భావం ఏమిటంటే- విశిష్ట జీవిత భాగాన్ని ఓ సంస్థ సేవకు అర్పించిన పిదప( పనికి మాలిన) జీవితాన్ని యేసుకు సమర్పించుట. ఆ మిగిలిన జీవితాన్ని సమర్పించుట కూడా సందేహాస్పదమే. మనం బైబిలు దుమ్ము దులిపే లోగా ఆ కాస్త జీవితం కూడా గడిచి పోతుంది.

ఆపద్దినమున అవసరతలు తీర్చేందుకు ఇంగిత జ్ఞానమే గతి అన్నట్లుగా వుంది. అయితే వాస్తవ సత్యాన్ని క్యామెరొన్ థామ్సన్ బాగా వివరించాడు: "తమ హస్తాలకేమీ అంటకూడదని ఆశించే వారిపై దేవుడు తన కిష్టమైన ఆశీర్వాదాల్ని క్రుమ్మరిస్తాడు. ఈనాటి ప్రపంచ వేదనను మించిన రీతిగా ఆపద్దినానికే అధిక విలువ నిచ్చే వ్యక్తులు దేవుని నుండి ఎటువంటి ఆశీర్వాదం కూడా పొందరు."

**2.** భూమ్మీద ధననిధుల్ని సమకూర్చుటను సమర్పించేందుకు ఉపయోగించు రెండవ వాదం-I తిమోతి **5:8** పై ఆధారపడి వుంది. **"ఎవడైనను స్వకీయుల్ని మరి విశేషించి తన ఇంటి వారిని సంరక్షింపక పోయిన యెడల వాడు విశ్వాస త్యాగము చేసిన వాడై అవిశ్వాసి కన్నా చెడ్డవాడై యుండును."**

ఈ వాక్యభాగంలో పౌలు సంఘంలో విధవరాళ్ళ సంక్షేమం గూర్చి సంధిస్తున్నాడు. ఓ విధవరాలికి బంధువులైన క్రైస్తవులు, ఆమె సంక్షేమం విషయంలో బాధ్యులని అతడు చెబుతున్నాడు. ఈ

పనిచేయటానికి ఆమెకు బంధువులెవ్వరూ లేనప్పుడు సంఘమే ఆమె సంక్షేమాన్ని చేపట్టాలి.

అయితే ఇక్కడ గమనించాల్సిన ముఖ్య విషయమేమిటంటే- ఎప్పుడో భవిష్యత్తులో చేపట్టవలసిన విధవరాలి సంక్షేమం నిమిత్తం ఇప్పట్నుంచే నిధులను కూడబెట్టమని పౌలు చెప్పటం లేదు. కానీ ఒక విధవరాలు ప్రస్తుతం ఎదుర్కొంటున్న అవసరతల గూర్చి ఆయన మాట్లాడుతున్నాడు. క్రైస్తవులు నిరాధారులైన తమ బంధువులను ప్రతి దినం సంరక్షిస్తూ వారి సంక్షేమాన్ని చేపట్టాలి. వారలా చేయకపోతే- ప్రేమ, ధారాళతలను బోధించే క్రైస్తవ విశ్వాసాన్ని క్రియాత్మకంగా త్రోసి పుచ్చుతున్నారన్న మాట. అవిశ్వాసులు కూడా తమ సొంత వాళ్ళను పోషించుకుంటారు. అంచేత ఈ కార్యం చేయని విశ్వాసి అవిశ్వాసులకన్నా చెడ్డవాడన్నమాట.

భవిష్యత్తు కోసమై ప్రత్యేక నిధులు, శాశ్వత నిధులు ఏర్పాటు గూర్చి గానీ, ధనాభివృద్ధి పథకాల గూర్చి గానీ వాక్యమేమీ చెప్పటం లేదు. కేవలం ప్రస్తుత అవసరాల గూర్చి మాత్రమే వాక్యభాగం చెబుతుంది గానీ భవిష్యత్తు అవసరతల గూర్చి కాదు.

**3.** మూడవ వాదం, రెండవ వాదానికి అతి సన్నిహిత సంబంధం కలిగి వుంది. చాలా మంది క్రైస్తవ తల్లిదండ్రులు తమ పిల్లల కోసం అమితంగా ఆస్తుల్ని సంపాయించి పెట్టాలని ఆలోచిస్తారు. తమ సొంత వాళ్ల కోసం ధనం కూడ బెట్టుట అనే బాధ్యతలో ఇదో భాగమని వారు భావిస్తారు (I తిమోతి **5:8**). తమ పిల్లలు విశ్వాసులా, అవిశ్వాసులా అను



తేడా లేకుండా వారి కోసం ఓ గౌరవ ప్రదమైన ఆస్తిని విడిచి పెట్టుటే వీరి గాఢమైన కోరిక.

తల్లిదండ్రులైన వారు తమ పిల్లల కోసం డబ్బు పొదుపు చేయాలనుటకు II కొరింథీ **12:14** వాక్యభాగం వినియోగించ బడుతుంది. ఆ వాక్యం ఇలా వుంది:

**"... పిల్లలు తలిదండ్రుల కొరకు కాదు తల్లిదండ్రులే పిల్లల కొరకు ఆస్తి కూర్చ దగినది గదా?"**

వెనువెంటనే మనం సంధించాల్సిన విషయం- పౌలు ఆర్థిక వనరులు. పౌలు కొరింథు ప్రజల నుండి డబ్బు ఏమీ తీసుకోలేదు గానీ అతడు కొరింథులో వాక్యాన్ని బోధిస్తూ ఇతర సంఘాలిచ్చిన కానుకలతో పోషించబడ్డాడు (I కొరింథీ **11:7-8**). ఇప్పుడతడు మళ్ళీ కొరింథుకు వెళ్ళేందుకు సిద్ధంగా వున్నాడు గానీ కొరింథీయులకు భారంగా వుండుటకు మాత్రం కాదు; (**12: 4**); అనగా ఆర్థికంగా వారి పోషణపై అతడు ఆధార పడబోవటం లేదని దీని భావం. వారి వస్తు సంపదల్ని తాను పొందాలని అతని ఆశ కాదు గానీ కేవలం వారి ఆధ్యాత్మిక సంక్షేమమే అతని భారము.

ఈ సందర్భంగా అతడు ఈ మాట చెబుతున్నాడు, "... పిల్లలు **తల్లి దండ్రుల కొరకు కాదు, తలిదండ్రులే పిల్లల కొరకు ఆస్తి కూర్చదగినది గదా?"**

ఇక్కడ కొరింథీయులు పిల్లలు గాను, పౌలు తండ్రిగానూ వున్నారు (I కొరింథీ 4:15). ఆయన వారితో ఈ మాట వ్యంగ్యార్థంగా చెబుతున్నాడు- వారు తనను పోషించనవసరం లేదు గానీ, తానే వారిని పోషించవలసి వుందని చెబుతున్నాడు. అతడు అలంకారికంగా ద్వంద్వ భావముతో- వాస్తవానికి తనపోషణకై వారు కానుకలు ఇవ్వవలసి వుంది (I కొరింథీ 9:11, 14); అయితే వారి విషయంలో తాను ఈ హక్కు పోగొట్టుకునేందుకు నిశ్చయించుకున్నాడు.

ఈ వాక్య భాగంలో మనం గమనించాల్సిన ముఖ్య విషయం - భవిష్యత్తు కోసం ధన నిధుల్ని కూడ బెట్టు కునే దానికి, పై చెప్పబడిన దానికి ఎటువంటి సంబంధం లేదు. అసలు సమస్య అది కాదు. అది కేవలం ప్రస్తుత అవసరాలకు సంబధించిన విషయం; పౌలు ఇలా అంటున్నాడు, ‘‘ వాస్తవానికి- సర్వసాధారణంగా పిల్లలుతల్లిదండ్రులను పోషించరు; తల్లిదండ్రులే పిల్లలకు అన్నింటినీ అందిస్తారు.’’

తమ పిల్లల కోసం ధనం కూడ బెట్టు అలవాటుకు క్రొత్త నిబంధనలో ఎటువంటి ప్రోత్సాహము లభించుట లేదనుట ఖచ్చితం. తల్లిదండ్రులు పిల్లల కోసం సంపాదించి పెట్టవలసిన అత్యంత గొప్ప స్వాస్థ్యం ఆధ్యాత్మికమైనది, అయితే ఈ స్వాస్థ్యమును విడిచి పెట్టుటను, ధన సంపాదన లో నిమగ్నమగుట భంగ పరుస్తుంది.

క్రైస్తవులు విడిచి వెళ్ళిన ధన స్వాస్థ్యముల నుండి పైగి ఎగిసిన చెడులను గూర్చి ఆలోచించండి.

అ) అనేక మంది యువజనులు హఠాత్తుగా అమితమైన ఆస్తి భారం తమపై పడటం చేత ఆధ్యాత్మికంగా నశించి పోయారు. వారు



వస్తు సంపద, సుఖభోగాలతో మత్తులై, చెడిపోయి క్రీస్తు పరిచర్యకు అనర్హులై పోయారు.

ఆ) వీలునామాలు, స్థిరాస్తుల కారణంగా వాటి ఫలితంగా శాంతియుతమైన కుటుంబాల్లో చెలరేగిన కలహాల గూర్చి ఆలోచించండి. సోదరి తన సొంత సోదరి పై అసూయ ద్వేషాలతో నిండిపోయి వుండగా, సోదరుడు తన సొంత సోదరుడిపై అసూయ ద్వేషాల్ని పెంచుకున్నాడు. జీవితాంతం చేదు కలహాలు కొనసాగాయి.

పిత్రార్జిత ధనాగారం కోసం చెలరేగిన ఓ కుటుంబ తగాదా లూకా 12:13లో లిఖించబడింది. అందులో జోక్యం చేసుకునేందుకు యేసు తిరస్కరించాడు. అటువంటి కార్యాలకోసం ఆయన ఈ లోకానికి రాలేదు గానీ వీలునామాలో తన పేరు లేని సంతోషహీనుడైన ఆ మనిషికి దురాశ విషయమై కఠినమైన హెచ్చరిక ఇవ్వటం కోసం యేసు తగినంత సమయం తీసుకున్నాడు.

ఇ) అటు తర్వాత మనకు ఈ పరిస్థితి ఎదురవుతుంది. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం కొంత ధనం సంపాయించి పెట్టాలని తమ జీవితాంతం కాయ కష్టం చేసి కూడ బెడతారు. అటు తర్వాత వారు వృద్ధులై బలహీనులై కుటుంబానికి భారమైపోతారు. ఇక కృతజ్ఞతా రహితులైన పిల్లలు తల్లిదండ్రుల ఆస్తి పాస్తుల్ని హస్తగతం చేసుకునేందుకు వారి చావు కోసం కని పెట్టుకొని వుంటారు.

ఈ) రక్షణ పొందని పిల్లలకు గానీ, అవిశ్వాసిని వివాహమాడిన క్రైస్తవ కుమారుడు, కుమార్తెకు గానీ లభించిన ధన సంపదలు తరచుగా తప్పుడు సంఘాన్ని బలపరుస్తుంది; ఫలితంగా ఆ డబ్బు సువార్త వ్యాప్తికి బదులు సువార్త ఉద్యమ అణచి వేతకు వినియోగించ బడుతుంది. దీని గూర్చి ఒక్క సారి ఆలోచించండి! విశ్వాసుల ధనం సత్య పోరాటం కోసం ఉపయోగపడాలి గదా!

ఉ) అ తర్వాత- ఆస్తులపై పన్నుల రూపంలో ప్రభుత్వానికీ మరియు చట్టపరమైన సమస్యల పరిష్కారమై పారితోషికముగా న్యాయ వాదులకూ అందుతున్న విస్తారమైన డబ్బు విషయం మనం ఆలోచించి తీరాలి. ఈ డబ్బంతా ఆత్మల రక్షణ కార్యంలో వినియోగించబడి వుంటే ఎంత మేలు!

ఊ) కొంత మంది క్రైస్తవులు వీటిలో కొన్ని విచారకరమైన సమస్యల్ని తొలగించుకునే ప్రయత్నంలో తమ డబ్బును కొన్ని క్రైస్తవ సంస్థలకు విరాళంగా ఇవ్వాలని భావిస్తారు. అయితే వారి డబ్బు ఆ సంస్థలకు చేరుతుందని ఖచ్చితంగా చెప్పలేము. ఇటువంటి వీలునావమాలు చాలా సార్లు వివాదాల్లో చిక్కుకొని వ్యవహారాల్లో భగ్నమై తెగిపోతాయి. అంతేగాక, ఆ విధంగా మీ ధనాన్ని దేని కోసమో విరాళంగా ఇచ్చివేసేందుకు లేఖన పూర్వక ఆధారం కూడా లేదు. వీలునామా, కార్యరూపం దాల్చే సరికి ఆడబ్బును అందుకోవలసిన సేవా సంస్థలు ప్రభువుకూ, దైవవాక్యానికీ ఇంకా నమ్మకంగా, యదార్థంగా వుంటున్నాయో లేదో కూడా ఎవ్వరూ హామీ ఇవ్వలేరు.



ఒక వీలు నావమా ద్వారా తాము సేవ కోసం ఏమి విడిచి వెళ్తున్నారో అను దాని ఫలితంగా విశ్వాసులకు బహుమానాలు లభించవు, వారు మరణించిన మరుక్షణమే తమ డబ్బంతా తమకు చెందకుండా పోతుంది. ఆస్తి అంతా తమ కుటుంబ వశమై పోతుంది.

మానవులు ధనసంపత్తిని కుప్పలుగా కూర్చుకుంటారు గానీ దానిని ఎవరు అనుభవిస్తారో వారికి తెలియదు (కీ. **39:6**), నీ డబ్బు ప్రభువు కోసం వినియోగించబడటం నీవు ఖచ్చితంగా చూడాలనుకుంటే దీనికి గల ఏకైక మార్గం- నీ జీవిత కాలంలోనే నీ ధనాన్ని దేవుని కార్యార్థమై ఇచ్చి వేయుటే. భవిష్యత్తులో బహుమానం పొందటానికి కూడా ఏకైక మార్గం ఇదే.

యేసు ప్రభువు తప్పనిసరిగా తిరిగి రానైయున్నాడని నమ్ముతున్నట్టు మనం చెబుతాం. అల్లాంటప్పుడు ఆయన రాకడ సమయానికి మనం దగ్గరయ్యే కొలది మన వస్తు సంపదతో కూడిన ఆస్తుల విలువ తరుగుతుందని మనం గుర్తెరగాలి. ఆయన వచ్చాక మన ధనసంపత్తి విలువ మనకు గానీ, దేవుని సేవకు గానీ పనికి రాదు; అప్పుడు దానికి విలువ వుండదు. అంచేత ప్రస్తుతమే మన ఆస్తుల్ని యేసు ప్రభువు పనిలో వెచ్చించుట విశిష్టమైన విషయం.

**4.** కానీ అప్పుడు ఈ వాదం తలెత్తుతుంది: ''నిరాడంబర జీవితాన్ని మించి ప్రతి ఒక్కరు ప్రతి విషయాన్ని ప్రభువు పనిలో వినియోగించిన పక్షంలో మేము బ్రతుకటమెలా? ఎవరో ఒకరు గట్టిగా నిలబడాలి గదా!''

మనమెలా జీవించాలి? దీనికి జవాబు-''విశ్వాస మూలంగా ఎక్కువ, భౌతిక దృష్టి మూలంగా తక్కువ!''

ఈ సూత్రం పని చేయదని వాదించుట వల్ల ప్రయోజనం శూన్యం, ఎందు చేతనంటే ఆది సంఘ కాలంలో ఇది మహా శక్తి వంతంగా పని చేసింది.

**''విశ్వసించిన వారందరు ఏకముగా కూడి తమకు కలిగినదంతయు సమిష్టిగా వుంచుకొనిరి. ఇదియు గాక వారు తమ స్థిర, చరాస్థుల్ని అమ్మి అందరికిని వారి వారి అక్కర కొలది పంచి పెట్టిరి''. (అపొ.కా.2:44, 45)**

**''భూములైనను, ఇండ్లైనను కలిగిన వారందరు వాటిని అమ్మి, అమ్మిన వాటి వెల తెచ్చి అపొస్తలుల పాదముల యొద్ద పెట్టుచు వచ్చిరి, వారు ప్రతి వానికి వాని వాని అక్కరల కొలది పంచి పెట్టిరి గనుక వారిలో ఎవనికిని కొదువ లేకపోయెను'' (అపొ.కా. 4:34,35).**

పౌలు కొరింథీయులకు వ్రాస్తూ- మన ధన సంపత్తి, వస్తు సంపద ద్రవ రూపంలో ప్రవహించేది గా వుండాలి గానీ, ఘన రూపంలో గడ్డకట్టిపోకూడదని నేర్పాడు. ఎక్కడైనా నిజమైన అవసరత వున్నట్టు మనకు తెలిసినప్పుడు, ఈ అవసరం తీర్చేందుకు మన ధన నిధులు ఆ దిశగా ప్రవహించాలి. మన సొంత జీవితాల్లో అవసరత చోటు చేసుకున్నప్పుడు కూడా అదే విధంగా నిధులు మనవైపు ప్రవహిస్తాయి. ఇలా దేవుని ప్రజల మధ్య నిత్యం సమానత్వము ప్రబలుతుంది.



**''ఇతరులకు సుఖమును మీకు కష్టమును కలుగవలెనని ఇది చెప్పుటలేదు గాని- నిండు గా కూర్చుకొనిన వానికి ఎక్కువ మిగుల లేదనియు కొంచెముగా కూర్చు కొనిన వానికి తక్కువ కాలేదనియు వ్రాయబడిన ప్రకారము అందరికి సమానముగా వుండునిమిత్తము ప్రస్తుత మందు మీ సమృద్ధి వారి అక్కరకును (మరి యొకప్పుడు) వారి సమృద్ధి మీ అక్కరకును సహాయమై యుండవలెనని ఈలాగు చెప్పుచున్నాను''.**

**(IIకొరింథీ 8:13-15)**

మరో విధంగా చెప్పాలంటే, ఒక వ్యక్తి నిజంగా ప్రభువు నందు భక్తి పరుడై జీవిస్తూ ఆస్తులకు గృహ నిర్వాహకత్వం నెరపుటలో నమ్మకస్థుడుగా వున్నట్లయితే- ఒక వేళ అతనికి అవసరత కలిగినప్పుడు ఇతర తోటి విశ్వాసులు సహాయ పడేందుకు సంతోషంగా ముందుకు రావాలి.

మనలో మనం యదార్థంగా వున్నప్పుడు ఇతరులపై ఆధారపడుట అనే ఆలోచన మనకు సమ్మతమేనని ఒప్పుకొని తీరాలి. మన స్వాతంత్ర్యమును బట్టి మనం గర్విస్తున్నాం. కానీ ఇది స్వార్థ జీవిత అతిశయమే గాని మనలోని యేసు ప్రభుని జీవితం కాదు గదా?

I తిమోతి **5:3-13** లో విధవ రాళ్ళ సంక్షేమార్థమై పౌలు ఇచ్చిన హెచ్చరికల ప్రకారం సంఘంలోని మన హృదయాలు దైవ ప్రేమా తర్పణాలుగా మారాలని అక్కడి పరిశుద్ధులు పరస్పరం ఇచ్చి పుచ్చుకునే అభ్యాసం కలిగి వుంటారని, నిజమైన అవసరత వున్న చోట డబ్బు స్వేచ్ఛగానూ, ఉచితంగానూ ప్రవాహంలా అందుతుందని తెలియజేస్తుంది.

ఈ సూత్రం ఆది సంఘంలో పని చేసి గానీ ఈ నాటి సంఘంలో పని చేయదనే వాదానికి ఒక వేళ ఎవరైనా దిగితే దానికి తేలికైన జవాబు ఇదే. ఈ సూత్రం ఈనాడు కూడా పని చేస్తుంది. ఇటు వంటి విశ్వాస జీవితం జీవిస్తున్న క్రైస్తవులున్నారు, వారి జీవితాల్లో శక్తి మత్వం, ఆకర్షణ, రెండూ వున్నాయనుట సర్వ సమ్మతం.

5. అయితే ఎవరైనా ఈ విధంగా అభ్యంతరం వెలిబుచ్చొచ్చు. **"దీన స్థితిలో వుండనెరుగుదును, సంపన్న స్థితిలో నుండ నెరుగు దును," అని పౌలు చెప్పలేదా? (పిలిప్పీ 4:12).** ఇలా ప్రశ్నించువాడు దీన స్థితిలో వున్న పౌలు దారి లేని ఎడారిలో తిరుగు లాడుతూ ఆకలితో, దప్పికతో, అలసటతో, దిగంబరిగా, అనారోగ్యముతో ఆల్లాడుతున్నట్టు చిత్రీకరిస్తాడు. ఆ తర్వాత సంపన్న స్థితిలో వున్న పౌలు ఇత్తడి వంటి దృఢ చిత్తం గల యువకుడిగా ఒకానొక సముద్ర తీర విశ్రాంతి ప్రదేశంలో తన బహుళార్థ ధారూఢుడై అధునాతన కుట్టు పనితో కూడిన ప్రశస్త వస్త్రాలు ధరించి, అమెరికా విధానంలో అప్పటికే రెండు వారాలుగా సుఖభోగాలు అనుభవిస్తున్నట్టుగా కనబడుతున్నాడు. మరో మాటలో చెప్పాలంటే అతడు కష్టపడగలడు, ఉన్నతంగా జీవించగలడు కూడా.

అయితే పిలిప్పీయులకు వ్రాసిన పత్రికలో పౌలు చెబుతున్నది ఇది కాదు. మనం ఒక్క విషయం జ్ఞాపకముంచుకోవాలి. ఆ ఉత్తరం చెఱసాల నుండి వ్రాయబడింది గానీ, సముద్రతీర విరామ ప్రదేశం నుంచి మాత్రం కాదు. చెరసాల నుండి వ్రాస్తూ పౌలు ఇలా అంటున్నాడు :



**"నాకు సమస్తమును సమృద్ధిగా కలిగి వున్నది, మీరు పంపిన వస్తువులు ఎపఫ్రొదితు వలన పుచ్చు కొని ఏమియు తక్కువ లేక యున్నాను ...." (పిలిప్పీ 4:18)**

పౌలు లెఖ్ఖల పుస్తకం ప్రకారం చెరసాలలో వుంచబడుట అనేది దీన స్థితి క్రింద పరిగణించ బడిందని మనం ఆలోచిస్తాం, కానీ పౌలు ఆ అనుభవాన్ని సంపన్న స్థితి గా లెఖ్ఖిస్తున్నాడు. అంచేత మనం సుసంపన్న సుఖభోగ జీవితాల్ను సమర్థించుటకు పిలిప్పీ **4:12** వినియోగించుట సరిగాదు. ఆ వాక్యం నేర్పించేది అది కాదు.

6. బాగుంది గదూ! అటువంటప్పుడు-సుఖంగా అనుభవించుటకు **దేవుడు మనకు సమస్తమును ధారాళముగా దయ చేసెను (I తిమోతి 6:17)** అను వాక్యం విషయమేమిటి? విశ్వాసి " జీవితంలో విశిష్టమైన వాటిని" అనుభవించాలని చెప్పుటకు రుజువుగా ఈ లేఖన వాక్యం ఉపయోగించ బడుతుంది; విశ్వాసి అధునాతన, విశిష్ట సుఖానుభవాల్లో పాలు పొందితే ఫరవాలేదు అని దీని భావం, "దేవుని ప్రజలకు ఏదీ అంత మంచిది కాదు" అనేది ఇటువంటి ప్రశ్న అడిగే వారి నినాదం.

అయితే అతడు మళ్ళీ సందర్భం మర్చి పోతున్నాడు. వాక్యం ఎలా ఆరంభమవుతున్నదో గమనించండి: **"ఇహమందు ధనవంతులైన వారు గర్విష్ఠులు కాక అస్థిరమగు ధనమునందు నమ్మికయుంచక ..... దేవుని యందే నమ్మిక యుంచుడని అజ్ఞాపించుము".** మరో మాటలో చెప్పాలంటే స్వయం-జోక్యానికి ఓ సాకుగా గాక ధనవంతులైన వారికి కఠినమైన అజ్ఞగా ఈ భాగంలోని వాక్యాలు కనబడుతున్నాయి.

కానీ-''సుఖముగా అనుభవించుటకు దేవుడు మనకు సమస్తమును ధారాళముగా దయచేసెను'' అను వాక్యభావమేమిటి? దీని భావమేమిటంటే-వీటన్నిటిని దేవుడు మనకు అనుగ్రహించింది రాసులుగా దాచుకునేందుకు కాదు గానీ, వీటిని ఇతరులతో పంచుకొనుట ద్వారా మనం ఆనందించాలని ఆయన కోరుతున్నాడు.

ఈ క్రింది రెండు వాక్యాల్లో ఈ భావం అతి స్పష్టంగా కనబడుతున్నది:

''వారు వాస్తవమైన జీవమును సంపాదించు కొనను నిమిత్తము రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసి కొనుచు మేలుచేయు వారును సత్క్రియలు అను ధనము గల వారును ఔదార్యము గలవారును (తమ ధనములో) ఇతరులకు పాలివారునై యుండవలెనని వారికి ఆజ్ఞాపించుము."

**(Iతిమోతి 6:18, 19)**

ఆస్తుల్ని కూడ బెట్టు కోవటంలో ఆనందం లేదుగానీ వాటిని దేవుని మహిమార్థం, ఇతరుల మేలు కోసం ఉపయోగించటంలోనే వుంది.

**7.** అబ్రహాము బహుధనవంతుడనీ (ఆ.కాం. **13:2**) అయినప్పటికీ అతడు స్నేహితుడుగా పిలువబడ్డాడని (యాకోబు **2:23**) మనం తరచుగా గుర్తు చేయబడుతున్నాం. ఇది నిజమే, ఐనప్పటికీ, అబ్రహాము పాత నిబంధన కాలంలో జీవించిన వాడనీ, ఆకాలంలో ప్రభువుకు విధేయులైన వారికి ధన సంపద, వస్తు సంపద వాగ్ధానం చేయబడ్డాయని మనం గుర్తుంచుకోవాలి. ఆ కాలంలో ధనసంపత్తి దైవాశీర్వాద సూచనగా వుండేది.



కానీ దేవుని కృపాయుగంలో కూడా ఇది నిజమా? దీనికి ప్రతికూలతే ఈ యుగ ఆశీర్వాదమని చెప్పుట సరైనది.

లాజరు, ధనవంతుడు గూర్చిన ఉపమానంతో (లూకా **16:19-31**) పాత నిబంధన ప్రమాణాలు తారు మారయ్యాయి. ధనవంతుడు తన ధనాన్ని ఇతరుల కోసం విని యోగించటంలో తప్పిపోయి కేవలం తన కోసమే దాచుకున్నందుకు శిక్షించబడ్డాడు.

**8.** చీమ కూడా మనకు పాఠం నేర్పిస్తుంది గదా!

''సోమరీ చీమల యొద్దకు వెళ్ళుము, వాటి నడతలు కనిపెట్టి జ్ఞానము తెచ్చు కొనుము, వాటికి న్యాయాధి పతి లేకున్నను, పై విచారణ కర్త లేకున్నను, అధిపతి లేకున్నను అవి వేసవికాలమందు ఆహారము సిద్ధపర్చు కొనును, కోతకాలమందు ధాన్యము కూర్చుకొనును.''

**(సామె 6:6-8)**

భవిష్యత్తు కోసం ఆహారం సిద్ధపర్చు కోవటం ఈ వాక్యంలో ప్రదర్శిత మవుతుందా? ఈ విషయంలో మనం కూడా అలాగే అనుసరించాలని నేర్చు కోవటం లేదా? అవును, అయితే చీమ భవిష్యత్తు ఈ లోకం మటుకేనని, కానీ క్రైస్తవుని భవిష్యత్తు పరలోకంలో వుందని గుర్తుంచుకోవటం అతి ముఖ్యము. విశ్వాసి ఈ లోకంలో యాత్రికుడు, బాటసారి; అతని నిత్య గృహం పైలోకంలో వుంది. అంచేత ఆ ఉజ్వల భవిష్యత్తు నిమిత్తం అతడు ధనం సమకూర్చుకోవాలి.

అయితే ఇక్కడ ఈ లోక జీవితానికి సంబంధించినంత వరకు అతడు రేపటి గూర్చి చింతించుట నిషేధించ బడింది-అతడు ఏమి తినాలో, ఏమి ధరించుకోవాలో అను చింత (మత్తయి **6:25**). పైగా

క్రైస్తవుడు ఆకాశ పక్షుల్నిఅనుసరించాలని చెప్పబడింది; అవి తమ గూళ్ళకు ప్రక్కన ధాన్యపు కొట్లునిర్మించుకోవు; అయినా మన పరలోక తండ్రి వాటిని పోషిస్తున్నాడు. ఇక్కడ తలెత్తే వాదమేమిటంటే, దేవుడు పక్షుల విషయంలో అంత జాగత్త వహిస్తే ఇక మన గూర్చి ఎంత అధికంగా జాగ్రత్త వహిస్తాడో గదా!

9 ధనవంతుల్ని సంధించేందుకు ఒక ధనవంతుడు కావాలి అనేది చిట్టచివరి వాదము. ఆది సంఘ క్రైస్తవులు దీనిని గుర్తించలేదు. '' చరిత్రను గమనించి చూస్తే ఆది క్రైస్తవుల్లో అనేకులు ప్రతీ చోట క్రీస్తు సువార్తను అందించాలనే ఆతృత తో అన్యుల్లో గొప్ప వారి గృహాల్లోనూ ప్రవేశించి వారందరికీ యేసు ప్రేమను, రక్షణను ప్రచారం చేసేందుకు తమను తాము సేవకులు గానూ, బానిసలు గానూ అమ్మివేసుకున్నారు'' (''మీరు ప్రత్యేకించ బడి రండి''- జె. ఆర్. మిల్లర్ నుండి సంగ్రహించబడింది).

## బైబిలు ఏమి చెబుతోంది?

అవినీతికి ఆలవాలమైన దారిద్ర్యము ప్రబలుతోన్న ఈ లోకంలో ధనసంపత్తితో తులతూగుతున్న క్రైస్తవుల్ని సమర్థించుటకు ఉపయోగించు ప్రధాన వాదములను ఇంత వరకు మనం చర్చించాము.

ఇటువంటి కొన్ని బలహీన వాదాలకు విపరీత విరుద్ధంగా దైవ వాక్యంలో అనేక భాగాలు- ధనం వల్ల వాటిల్లే నష్టాల గూర్చి మనల్ని హెచ్చరిస్తున్నాయి.

1. **'' నమ్మకమైన వానికి దీవెనలు మెండుగా కలుగును, ధనవంతులగుటకు ఆతురపడువాడు శిక్షనొందకపోడు.''**

**''చెడు దృష్టి గలవాడు ఆస్తి సంపాదించుటకు ఆతుర పడును, తనకు దరిద్రత వచ్చునని వానికి తెలియదు.'' (సామెతలు 28:20,22)**

దేవుని పోలిక చొప్పున ఆయన స్వరూపంలో సృష్టించబడ్డ ఓ మానవుడు ధనసంపత్తుల కోసం తీవ్రంగా వెతుకులాడటం అతని యోగ్యతే.

2. **''ఎవడును ఇద్దరు యజమానులకు దాసులుగా నుండ నేరడు; అతడు ఒకని ద్వేషించి మరియొకని ప్రేమించును; లేదా ఒకని పక్షముగా నుండి మరి యొకని తృణీ కరించును. మీరు దేవునికిని, సిరికిని దాసులుగా నుండనేరరు.'' (మత్తయి 6:24)**

ఇక్కడ దేవుడు, డబ్బు- ఇరువురు యజమానులుగా కనబడుతున్నారు. వీరిద్దరి ఆశలు, ఆశయాలు పరస్పర విరుద్ధంగా వుంటాయి. అంచేత ఇద్దరినీ సేవించుట దుస్సాధ్యము. రెండు లోకాల కోసం జీవించుట, ఇప్పుడు- అప్పుడు కూడా ధనవంతులుగా వుండాలని ఆశించుట, క్రింది లోకంలో ధనసుఖాన్ని అనుభవించి పైలోకంలో కూడా ధనం నిమిత్తం బహుమానాలు పొందాలను బలీయమైన కోరికకు ఇదో చావు దెబ్బ. నీవు ఈ రెంటినీ పొందనేరవు; ఏదో ఒక దాన్ని మాత్రమే ఎన్నుకోవాలి అని యేసు చెప్పాడు.

3. ''యేసు తన శిష్యుల్ని చూచి- ధనవంతుడు పరలోక రాజ్యంలో ప్రవేశించుట దుర్లభమని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను, ఇదియు గాక ధనవంతుడుపరలోక రాజ్యములో ప్రవేశించుట కంటే సూది బెజ్జములో ఒంటె దూరుట సులభమని మీతో చెప్పుచున్నాననెను. శిష్యులు ఈ మాట విని మిక్కిలి ఆశ్చర్యపడి- ఈ లాగైతే ఎవడు రక్షణ పొంద గలడని అడుగగా యేసు వారిని చూచి- ఇది మనుష్యులకు అసాధ్యమేగాని దేవునికి సమస్తమును సాధ్యమని చెప్పెను''. **(మత్తయి 19:23-26)**

యేసు చెప్పిన ఈ మాటల్ని మనం తగినంత తీక్షణంగా ఆలోచిస్తున్నామా? అని నేను ఆశ్చర్యపోతున్నాను. ఒక ధనికుడు దైవ రాజ్యంలో ప్రవేశించుట దుర్లభమని ఆయన చెప్పలేదు; అది మానవ రీతిగా అసాధ్యమని మాత్రమే ఆయన చెప్పాడు.

సూది బెజ్జమనగా పట్టణ గుమ్మం దగ్గరున్న ఓ చిన్న ద్వారమని కొందరు వివరిస్తారు. దాని ద్వారా పోవాలంటే ఒక ఒంటె బాగా క్రిందికి



వంగి దానిలోకి దూరాల్సిందే. అయితే ఇక్కడ చెప్పబడిన సూది బట్టలు కుట్టే సూది, ఈ సూది బెజ్జం గుండా దూరుట బహుదుర్లభము.

కేవలం ఓ ప్రత్యేక దివ్యశక్తిమయమైన ఓ అద్భుతం మాత్రమే ఒక ధనవంతుణ్ణి పరలోక రాజ్యంలో ప్రవేశించేలా చేయగలదు. మానవుడి నిత్య సంక్షేమానికి ఇంతటి అవరోధమైన దీన్ని మనమెందుకు బలపరుస్తున్నాం?

4. ''అయ్యో ధనవంతులారా, మీరు ఆదరణ మీరు పొందియున్నారు''. **(లూకా 6:24)**

పరిశుద్ధుడైన దైవకుమారుడు ధనవంతులపై ఓ శాపవచనాన్ని ఇక్కడ పలుకుతున్నాడు. ఈ పదాన్ని మనం అక్షరార్థంగా తీసుకోవాలి. 'ధనవంతము' అనే భావం కన్నా మించి మరో భావం దీనికి లేదు. అటువంటప్పుడు దేవుడు ఆశీర్వదించని వారిని మనమెందుకు ఆశీర్వదించాలని ఆశిస్తున్నాము?

5. ''మీకు కలిగిన వాటిని అమ్మి ధర్మము చేయుడి, పాతగిలని సంచులను పరలోకమందు అక్షయమైన ధనమును సంపాదించు కొనుడి; అక్కడికి దొంగరాడు, చిమ్మట కొట్టదు, మీ ధన మెక్కడ వుండునో అక్కడనే మీహృదయము ఉండును''.

**(లూకా 12:33-34)**

ఈ మాటలు శిష్యులనుద్దేశించి చెప్పబడ్డాయి (**22**వ వచనం చూడండి). కానీ మనం ఇవి మనకోసం ఉద్దేశించబడినవి కావులే అన్నట్టు తప్పుకునేందుకు ప్రయత్నిస్తాం. అవి మన కోసం ఎందుకు కాకూడదు?

అటువంటి వాక్యాలను నిరాకరించుట ద్వారా మనం ఆశీర్వాదాల్ను అడ్డుకుంటున్నామన్నమాట.

ఈ కృపాయుగానికి అనుగుణంగా మన సమస్త విశిష్ట వస్తు సంపద - అంటే రత్నాలు, హేమ భూషణాలు, చిత్ర విచిత్ర పటాలు, పురాతన గృహోపకరణాలు, వెండి, సేకరించ బడ్డ తపాలా బిళ్ళల సముదాయాల్ని అమ్మివేసి, వచ్చిన సొమ్మును విశ్వ వ్యాప్తంగా జరుగుతోన్న ఆత్మల రక్షణ కార్యంలో వెచ్చించుట ఎంతో భాగ్యం.

అయితే మన హృదయం ఎక్కడుంది? స్థానిక బ్యాంకు ఖజానా లోనా? పరలోకం లోనా? ''నీధనమెక్కడ వుండునో, నీ హృదయము కూడా అక్కడే వుండును.''

6. **''యేసు విని- నీ కింక ఒకటి కొదువగానున్నది, నీకు కలిగిన వన్నియు, అమ్మి బీదల కివ్వుము, అప్పుడు పరలోకమందు నీకు ధనము కలుగును. నీవు వచ్చి నన్ను వెంబడింపుమని అతనితో చెప్పెను. అతడు మిక్కిలి ధనవంతుడు గనుక ఈ మాటలు విని మిక్కిలి వ్యసన పడెను''. (లూకా 18:22-23)**

ఆ ధనవంతుడైన యువ అధికారి అనుభవం ఓ ప్రత్యేక విషయమనీ, సమస్తమును అమ్మివేయమను ఆజ్ఞ ఎంత ఊహించినప్పటికీ అందరికీ వర్తితం కాదనీ మనం సతతం వింటుంటాం. ఒక వేళ అది అలా కాక పోయినా ఇంతకు ముందు మనం గమనించిన వాక్య భాగానికి పోల్చిచూచినట్లయితే మొత్తానికి విభిన్నమైతే కాదు (లూకా **12:33, 34**).



7. **''సంతుష్టి సహితమైన దైవ భక్తి గొప్ప లాభ సాధనమైయున్నది. మనమీలోకములోనికి ఏమియు తేలేదు. దీనిలో నుండి ఏమియు తీసుకొని పోలేము. కాగా అన్న వస్త్రములు గల వారమై యుండి వాటితో తృప్తిపొందియుందము. ధనవంతులగుటకు అపేక్షించు వారు శోధనలోను, ఉరిలోను, అవివేక యుక్తములును, హానికరములునైనఅనేక దురాశలలోను ముంచివేయును. ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకుమూలము, కొందరు దానిని ఆశించి విశ్వాసము నుండి తొలగిపోయి నానా బాధలతో తమ్మును తామే పొడుచు కొనిరి. దైవ జనుడా, నీవైతే వీటిని విసర్జించి నీతిని భక్తిని విశ్వాసమును ప్రేమను ఓర్పును సాత్వికమును సంపాయించు కొనుటకు ప్రయాసపడుము'' (1తిమోతి 6:6-11).**

డబ్బును ఆశించిన వారు నానా బాధల చేత తమ్మును తామే పొడుచు కొన్నారని పౌలు హెచ్చరించాడు, అతడు సూచించిన బాధలు ఏమిటి?

అ. మొదటిదిగా- ధనాన్ని ఎప్పుడూ అంటి పెట్టుకొని వుండాలనే చింత **''అయితే ఐశ్వర్య వంతులకు తమ ధన సమృద్ధిచేత నిద్రపట్టదు''** (ప్రసంగి **5:12**). భద్రత కల్పించవలసిన ఐశ్వర్యములు వాస్తవానికి వ్యతిరేక ఫలితాల నిస్తాయి; దొంగలు దోచుకుంటారనే నిరంతర భయం, వ్యాపారంలో నష్టం వస్తుందేమోనను భయం, ద్రవ్యోల్బణము కలుగుతుందేమోనను భయం, ఇంకా ఇతర భయాలు కూడా వున్నాయి.

ఆ) అత్యధిక సమృద్ధ వస్తు సంపద చేత తమ పిల్లలు ఆధ్యాత్మికంగా పతనమైపోవుట చూడటం రెండో విచారం, కానీ కొద్దిమంది ధనవంతులైన తల్లిదండ్రులకు పుట్టిన పిల్లలు ప్రభువు కోసం పరిచర్యలో ముందుకుసాగుతున్నారు.

ఇ) అటుపిమ్మట- అత్యవసర పరిస్థితుల్లో ఐశ్వర్యాలు నిస్సహాయకములుగా మారునటు వంటి చేదు అనుభవము కూడా వుంది.

ఈ) తన కెంత మంది స్నేహితులున్నారో ధనవంతుడికి తెలియదు. సామెతలు **14:20** ప్రకారం ఇది బహు విరుద్ధంగా కనిపించవచ్చు; ''దరిద్రుడు తన పొరుగు వారికి అసహ్యుడు; ఐశ్వర్య వంతుని ప్రేమించు వారనేకులు''; అయితే వారు నిజమైన స్నేహితులా? లేక తమ సొంత స్వార్థం నిమిత్తం నటించే పాత్ర ధారులుగా వున్నారా?''

ఉ) ''ఐశ్వర్యములు మానవుని హృదయమునకు సంతృప్తి కలిగించవు (ప్రసంగి **2:8,11**), కానీ ఇంకా ఎక్కువ ఐశ్వర్యాల కోసం ఎడతెగని ఆరాటాన్ని సృష్టిస్తాయి'' (ప్రసంగి **4:8; 5:10**).

ఊ) చివరిదిగా - ధనం తరచుగా ఓ వ్యక్తి ప్రవర్తన పై విరుద్ధ ప్రభావాన్ని చూపెడుతుంది; ఉదాహరణకు-గర్వాన్ని ఉత్పత్తి చేస్తుంది (సామె. **28:11**), దుష్ప్రవర్తన (సామె. **18:23**; యాకోబు **2:5-7**).



వ్యాత్యాహెన్రీ మనకిలా తెలియజేస్తున్నాడు, '' ఐశ్వర్యములు అను మాటకు హెబ్రీ భాషలో 'బరువైనది' అను పదం సూచనగా వుంది. అంటే ఐశ్వర్యములు భారములుగా వుంటున్నాయన్నమాట. వాటిని పొందే విషయంలో అపేక్షభారముంది; వాటిని కాపాడుకునే విషయంలో భయంతో కూడిన భారముంది. అంతే గాక శోధనభారము, విచార భారము, లెఖ్ఖల భారాలు కూడా వున్నాయి''.

8. ''ఇహ మందు ధనవంతులైన వారు గర్విష్ఠులు గాక అస్థిరమైన ధనము నందు నమ్మిక యుంచక సుఖముగా అనుభవించుటకు సమస్తమును మనకు ధారాళముగా దయచేయు దేవుని యందే నమ్మికంచుడని ఆజ్ఞాపించుము. వారు వాస్తవమైన జీవమును సంపాదించు కొను నిమిత్తం రాబోవు కాలమునకు మంచి పునాది తమ కొరకు వేసి కొనుచు మేలు చేయువారును సత్క్రియలు అను ధనము గల వారును, ఔదార్యము గలవారును (తమ ధనముతో) ఇతరులకు పాలివారై యుండవలెననియు వారికి ఆజ్ఞాపించుము.''

**I తిమోతి 6:17-19)**

ఈ వాక్యభాగంలో-'' ధనవంతులైన వారికి ఆజ్ఞాపించుము'', అని మనకు చెప్పబడింది. అయినప్పటికీ ఎంత మంది దైవ సేవకులు ఈ ఆజ్ఞనెరువేరస్తున్నారు? ఎంతమంది ధనవంతులను మనం ఆజ్ఞాపించాం? మనలో చాలామంది ఈ వాక్య భాగం మీద కనీసం

ఒక్క సందేశమైనా వినలేదు. అయినప్పటికీ విప్లవాత్మక సందేశం అత్యవసరమైన సమయ సందర్భాలు బహుశా మనకెన్నడూ తటస్థించలేదేమో.

సందేశం బోధించే ముందు మొట్టమొదట మనమట్టుకు మనం దానికి విధేయులమవ్వాలి. మనమే విశ్వాసంతో గాక బాహ్యదృష్టితో జీవిస్తున్నప్పుడు భూమ్మీద ధనమును కూడబెట్టవద్దని మనం ఇతరులకు చెప్పలేం. జీవితం మన పెదవుల్ని కదప కుండా చేస్తుంది.

ప్రమాద పరిస్థితుల్లో కూడా నిర్భయంగా దైవ వాక్యాన్ని బోధించే ప్రవక్తల్లాంటి మానవుల కోసం దేవుడు వెదకుతున్నాడు. అమోసు లాంటి వ్యక్తులు బిగ్గరగా కేకలు వేశారు.

**''షోమ్రోను పర్వతమున నున్న బాషాను ఆవులారా, దరిద్రులను బాధపెట్టుచు బీదలను నలుగ గొట్టు వారలారా -మాకు పానము తెచ్చి ఇయ్యుడని మీ యజమానులతో చెప్పు వారలారా, యీమాట ఆలకించుడి. ప్రభువైన యెహోవా తన పరిశుద్ధతతోడని చేసిన ప్రమాణమేదనగా ఒక కాలము వచ్చుచున్నది, అప్పుడు శత్రువులు మిమ్మును కొంకుల చేతను, మీలో శేషించిన వారిని గాలముల చేతను పట్టుకొని లాగుదురు, ఇటు అటు తొలగ కుండ మీరందరు ప్రాకారపు గండ్ల ద్వారా పోవుదురు, హెర్మోను మార్గమున వెళ్ళ వేయబడుదురు; ఇదే యెహోవా వాక్కు'' (ఆమోసు 4:1-3).**



హగ్గయి లాంటి ప్రవక్తలు ఉరివవారు: **''- ఈ మందిరము పాడైయుండగా మీరు సరంబీవేసిన ఇండ్లలో నివసించుటకు ఇది సమయమా?'' (హగ్గయి 1:4).**

ప్రవక్తలు మెప్పు పొందిన వారు కారు, ఆకాలంలో జీవించిన తమ సమకాలికులకు వారి ఉనికియే ఇబ్బందికరంగా మారిపోయింది. వారు ఆర్థిక అణచివేతకు గురయ్యారు; సాంఘిక వెలివేతకు గురయ్యారు. ఆయా సమయాల్లో శ్రమలపాలయ్యారు. ఇక మరేదీ వారి నోళ్ళుమూయించనప్పుడు వారు మరణవాత పడ్డారు, అయినప్పటికీ అది వారికో లెక్కకాదు; జీవించి అబద్ధం పలుకుటకు బదులు చచ్చి సత్యం చెప్పారు.

సంఘంలో ఈనాడు ధన సంపద, వస్తు సంపదలు ఆధ్యాత్మిక ప్రవాహానికి నిరోధకాలుగా వున్నాయి, విశ్వాసులు రాజుల్లా సింహాసనాసీనులై పరిపాలిస్తుంటే ఉజ్జీవం ఎన్నటికీరాదు, విశ్వాసత్యాగ జీవితాలకు దేవుని ప్రజల్ని తిరిగి పిలుచువారెవరు? వాస్తవజీవితాన్ని ఎలా సంపాయించుకోవాలో ప్రజలకు ఎవరు చూపుతారు?

**(Iతిమోతి 6:19)**

నిత్యజీవపువెలుగులో జీవించుటే వాస్తవమైన జీవితం- నిత్య నివాసములైన పరలోక భవనాలపై దృష్టిని కేంద్రీకరించి దైవ మహిమ వ్యాప్తి నిమిత్తం మన సమస్తాన్ని వినియోగించుటే, కేవలం ఇది మాత్రమే తక్షణ ప్రతిజ్ఞాయుత జీవితం''-సి. హెచ్. మ్యాకిన్‌టోష్.

9. ''ఏలయనగా ఇతడు గడ్డిపువ్వువలె గతించి పోవును, సూర్యుడుదయించి వడగాలిగొట్టి గడ్డిని మాడ్చివేయగా దాని పువ్వురాలును, దాని స్వరూప సౌందర్యమును నశించును; అలాగే ధనవంతుడును తన ప్రయత్నములలో వాడి పోవును'' (యాకోబు **1:10-11**). జీవితాన్నిదిగ జార్చే ఎటువంటి ఐశ్వర్యాల్లోనూ ధనవంతుడు ఆనందించ వలసిందిగా హెచ్చరిక పొందటం లేదు, ఎందుచేత? ఐశ్వర్యాలు గడ్డిలా నశిస్తాయి, గానీ ఆధ్యాత్మిక అనుభవాలు, పాఠాలు, అత్యంత శాశ్వత విలువ కలిగి వుంటాయి.

10. ''ఇదిగో, ధనవంతులారా, మీ మీదికి వచ్చెడి ఉపద్రవములను గూర్చి ప్రలాపించి ఏడువుడి. మీ ధనవు చెడిపోయెను, మీ వస్త్రములు చిమ్మటలు కొట్టినవాయెను. మీ బంగారమును మీ వెండియు తుప్పు పట్టినవి, వాటి తుప్పు మీ మీద సాక్ష్యముగా వుండి అగ్నివలె మీ శరీరములను తిని వేయును; అంత్య దినముల యందు ధనము కూర్చుకొంటిరి. ఇదిగో మీ చేలు కోసిన పనివారికియ్యక మీరు మోసముగా బిగ బట్టిన కూలి మొఱ్ఱ పెట్టుచున్నది. మీ కోతవారి కేకలు సైన్యములకు అధిపతియగు ప్రభువు యొక్క చెవులలో జొచ్చియున్నవి. మీరు భూమి మీద సుఖముగా జీవించి భోగాసక్తులై వధ దినమందు మీ హృదయములను పోషించు కొంటిరి. మీరు నీతి మంతుడైన వానికి



శిక్షవిధించి చంపుదురు, అతడు మిమ్మును ఎదిరింపడు.''

(యాకోబు **5:1-6**)

ధనం కూడ బెట్టుట కోసం (**3**వచనం) పనివారికి సరైన కూలి ఇవ్వకుండా చేసే అక్రమ డబ్బు సంపాదన (**4**వచనం), సుఖభోగ జీవితం (**5**వచనం) ఎదిరించుటకు శక్తి లేని అమాయకుల్ని ఆసరాగా తీసుకొనుట వంటి అకృత్యాలకు వ్యతిరేకంగా ఇక్కడ పరిశుద్ధాత్మ దేవుడు బిగ్గరగా కేక వేస్తున్నాడు (**6** వచనం). ఈ వాక్యాలు విశ్వాసుల కోసం వ్రాయబడ్డాయా లేక అవిశ్వాసుల కోసం వ్రాయబడ్డాయా ? అనే వాదం అనవసరం, మనం ఏ వర్గానికి చెందిన వాళ్ళమో మనం సులభంగా తెల్సుకోగలం.

11. ''నీవు దౌర్భాగ్యుడవును దిక్కు మాలిన వాడవును దరిద్రుడవును గ్రుడ్డి వాడవును దిగంబరుడవు యున్నావని ఎరుగక-నేను ధనవంతుడను ధనవృద్ధి చేసికొని యున్నాను నాకేమియు కొదువ లేదని చెప్పుకొను చున్నావు. నీవు ధనవృద్ధి చేసుకొనునట్లు అగ్నిలో పుటము వేయబడిన బంగారమును, నీ దిస మొల సిగ్గు కనబడకుండునట్లు ధరించు కొనుటకు తెల్లని వస్త్రములను, నీకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు కాటుకను నా యొద్ద కొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను. నేను ప్రేమించు వారి నందరిని గద్దించి శిక్షించు చున్నాను కనుక నీవు ఆసక్తి గలిగి మారు మనసు పొందుము.''

(ప్రక. **3:17-19**)

ఇది సంఘాలకు ప్రభువు అందించిన ముగింపు సందేశం. ఇవి లవొదికయ సంఘస్థులతో ప్రభువు పలికిన కర్కష పలుకులు. వీటిని మరింత వివరించ నవసరం లేదు. వీటి భావం మనకు తెల్సు. మన కోసం ఇవి నిర్దిష్ట వర్తితములని కూడా మనకు తెలుసు. ఈ మాటలకు మనం విధేయులమైతే చాలు.

# సోమరి పోతులకు ఓ హెచ్చరిక !

ఇటు వంటి పత్రిక సోమరి తనానికి ఒక సాకుగా వినియోగించబడే ప్రమాదం ఎల్లప్పుడూ వుంది. పనిచేయటానికి ఇష్టంలేని ఒక సోమరి దీన్ని చదివి ''నేనెప్పుడూ నమ్మింది ఇదే'' అని చెప్పొచ్చు కూడా.

సోమరిపోతులకు గానీ, ఈ లోకమే (సంఘము) తమకు పోషణ కల్పించాలని భావించే వారికి గానీ ఈ సందేశం అనువైంది కాదు, ఆలాంటి వారికి దేవుడు విభిన్న సందేశాన్ని అందిస్తున్నాడు: **''పడక నుండి లేచి పనికి వెళ్ళు''.** (IIథెస్స. **3:6-12** చూడండి)

తీవ్ర ఆలోచనా పరులకు, కృషి సల్పువారికి, శ్రమించి పని చేయు వారికి ఈ సందేశం యోగ్యమైనది. ప్రస్తుత కుటుంబ అవసరాల్ని తెలివిగా తీర్చుకొనువారు ప్రభువు ప్రథమముగా యేసుప్రభుని కార్యంలో ఆసక్తి ప్రదర్శించు వారు భవిష్యత్తు విషయంలో దేవుణ్ణి నమ్మగలరు.

## తీర్పు తీర్చు కార్యానికి వ్యతిరేక హెచ్చరిక !

తప్పించవలసిన మరో ప్రమాదం కూడా ఇక్కడుంది. తమకున్న వస్తు సంపద కారణంగా వ్యక్తుల్ని శిక్షకు పాత్రులుగా చేసి వారిని ఖండించే ప్రమాదం. మనం ఇతరులకు తీర్పు తీర్చకూడదు; ప్రభువు యెడల వారికున్న భక్తిని ప్రశ్నించకూడదు.

ఐశ్వర్యములు అను అంశం పై దైవ వాక్య సూత్రాలను ప్రకటించుట ఒక విషయమైతే, ఓ క్రైస్తవుని కుటుంబ వ్యక్తిగత విషయాల్లో తలదూర్చి అతని అసలు విలువను దుడుకుగా మనసులో బేరీజు వేసి అటు పిమ్మట అతణ్ణి నిందిస్తూ అతని వేపు వ్రేలు పెట్టి చూపుట మరో విషయం.

మన సొంత జీవితాల్లో దేవుని మాటలను వర్తింప జేసుకోవటం మనందరి బాధ్యత. ఓ పెద్ద కుటుంబ దైనందిన అవసరతలు, ఓ ఏకాకి జీవితావసరతల కన్నా అధికంగా వుంటాయి. దేవుని ఆజ్ఞలకు విధేయత చూపట మంటే ఏమిటో మనం మరెవ్వరికీ చెప్పజాలము. గృహనిర్వాహకులంగా మనలో ప్రతీ ఒక్కరం లెఖ్ఖ దేవునికి అప్పగించాల్సివుంది గానీ ఇతరుల గూర్చి మాత్రం కాదు.

అంచేత ఇతరుల యెడల కఠిన, విమర్శనాత్మక, తీర్పు తీర్చు స్వభావం నుంచి ప్రభువు మనకు విడుదల అనుగ్రహించు గాక !

# ముగింపు

ఆహారము, దుస్తులు, నివాసముల వంటి వాటిలో విశ్వాసులు సంతృప్తిగా జీవించాలనీ, తమ దైనందిన కుటుంబ అవసరతల్ని కృషి ద్వారా తీర్చు కోవాలని వీటికి అదనంగా లభించిన సమస్తాన్ని దైవ కార్యంలో వినియోగించాలని దైవ వాక్యంలో మనకు అతి స్పష్టంగా కనబడుతోంది. భవిష్యత్తు భద్రత నిమిత్తం తమ సొంత ప్రయత్నాలు మానుకొని దాని కోసం ప్రభువును మాత్రమే నమ్ము కోవాలి. యేసు క్రీస్తు ప్రభువును సేవించుటే తమ జీవిత మహాధ్యేయంగా వారి ముందుంచు కోవాలి; దీనికిమినహాయించిన సమస్తం రెండవ స్థానం క్రిందికే వచ్చి తీరాలి.

సువార్తల్లో బోధించింది, అపొస్తలుల కార్యాల్లో అభ్యాసం చేసింది, పత్రికల్లో వివరించబడింది ఈ జీవితమే. దీనంతటికీ ప్రధాన ఆదర్శమూర్తి సాక్షాత్తు యేసు ప్రభువే:

అయితే ఇప్పుడొక ప్రశ్నతలెత్త వచ్చు, ''నా సొంత జీవితంలో దీనిని నేనెలా క్రియాత్మకం చేసుకోగలను? అందుకు నేనేమి చేయాలి?''

1) మనల్ని మనం ప్రభువుకు సమర్పించుకొనుట మనం చేయవలసిన మొట్టమొదటి కార్యం ( I కొరింథీ 8:5). ఎప్పుడు ఆయన మనపై అధికారం కలిగివుంటాడో అప్పుడాయన మన యావదాస్తులపై కూడా అధికారిగా వుంటాడు.

2) మన జీవిత వివిధ భాగాలపై ప్రభువు తన వ్రేలు వుంచినప్పుడు మనం వెంటనే స్పందించాలి. బహుశా ఖరీదైన హోటళ్ళలో తినుట విషయంలో ఆయన మన హృదయాల్లో గందరగోళం సృష్టిస్తాడేమో ! ఖరీదైన క్రీడా సాధనాలపై డబ్బు వెచ్చించు విషయంలో మన హృదయాల్లో ఆయన తీవ్రమైన బాధ కలుగ జేస్తాడేమో ! అత్యాధునిక, అత్యంత ఖరీదైన కారుపై మన దృష్టి లగ్నమై వున్నప్పుడు మనకు అన్ని విధాల సరిపోయే సాధారణ కారు కొనుటకు, ఫలితంగా మిగిలిన డబ్బును సువార్త వ్యాప్తి కోసం వినియోగించు మార్గాన్ని ఆయన మనకు చూపించ వచ్చు, అనేకులు దైవనీతి వస్త్రధారణ చేసేలా ఆయన మన వస్త్ర ధారణలో విప్లవాత్మకమైన మార్పు తీసుకురావొచ్చు, అల్పగిరాకీ, తక్కువ లాభదాయకమైన ఉద్యోగ మార్పును ఆయన సూచించ వచ్చు, ఒక వేళ ఖరీదైన మేడ విషయంలో మన మోజు తగ్గు తుందేమో, తత్ఫలితంగా నిరాడంబరమైన చిన్న ఇంటికి మన మకాం మారుస్తామేమో.

ఈ విషయాలపై దేవుడు మనతో మాట్లడనారంభించినప్పుడు మనకు తెలిసిపోతుంది. దాన్ని తిరస్కరించుట అవిధేయత మాత్రమేనని స్పష్టమవుతుంది.

3) ఇక మూడో విషయం: "**ఆయన మీతో చెప్పునది చేయుడి!" (యోహాను 2:5)**. స్నేహితులు నిన్ను అపార్థం చేసుకోవచ్చు. బంధువులు నిన్ను విడిచి పెట్టొచ్చు. ప్రతికూలతలు, సమస్యలు ఎదురవుతాయి కూడా. కానీ యేసును మాత్రమే అనుసరిస్తూ పర్యవసానాల్ని ఆయనకు వదిలేయ్.



4) దైనందిన జీవితావసరాల్ని మించి సంపాయించిన సమస్తాన్ని దైవకార్యంలో వినియోగించు. మార్గదర్శకత్వం కోసం ప్రార్థించు, మీ సహాయాన్ని ఎవరికి ఎక్కడికి పంపాలో ఆయన్ను అడిగి తెల్సుకో. తప్పనిసరిగా ఆయన నీకు తెలియ జేస్తాడు !

ఇటువంటి క్రైస్తవ భక్తి జీవితానికి మనం మళ్ళునట్లు మన జీవితాల్లోనూ, మన తరంలోనూ అటువంటి అనుభవం పొందేలా ప్రభువు అనుమతించు గాక! జాన్ వెస్లీ ఒక సారి ఇలా ప్రార్థించాడు:

"అయ్యో, నేను ఆశించిన దానిని దేవుడు నా కనుగ్రహిస్తాడు! నేను వెడలిపోయి మళ్ళీ ఎన్నడూ కనిపించకముందే దేవునికి సంపూర్ణంగా సమర్పించుకొని లోకం విషయంలో వారు, వారి విషయంలో లోకం శిలువ వేయబడ్డ ఓ గొప్ప ప్రజాసమూహాన్ని నేను చూడాలి. దేహము, ఆత్మ, ప్రాణం, సమస్తమును దేవుడికి యదార్థముగా సమర్పించుకున్న ఓ జనసమూహాన్ని నేను చూడాలి ! అలా జరిగినప్పుడు నేను ఆనందంతో ఇలా అంటాను, **ఇప్పుడు నీ దాసుడ నైన నన్ను సమాధానముగా పోనిమ్ము**".

# ప్రభువా, నన్ను విరువు !

"తండ్రి హస్తానికి ఎదురు తిరగని, విరువబడిన ఆత్మీయ స్వభావమే ఆత్మల ఉత్పత్తి కార్యంలో దైవ కార్యార్థమైన ప్రధానమూలకము. ఆయన మన నుండి బలాన్ని కోరటం లేదు గానీ బలహీనతనే కోరుతున్నాడు; ఎదురునిలిచే, తిరుగు బాటు చేసేశక్తిని కాదు గానీ ఆయనకు మనల్ని మనం అప్పగించుకునే స్వభావాన్నే కోరుతున్నాడు. సర్వశక్తి సంపన్నత ఆయనదే; బలహీనతలోనే ఆయన బలం పరిపూర్ణ మగుచున్నది".

-సంకలితము

# ముందు మాట

ఆండ్రూ ముర్రే ''క్రీస్తులో నివసించు'' అను గ్రంథాన్ని రచించిన ముప్పై ఏళ్ళ తర్వాత ఇలా అన్నాడు : '' ఒక సేవకుడు గానీ, క్రైస్తవ గ్రంథకర్తగానీ తన అనుభవాన్ని మించి చెప్పే విషయంలో తరచుగా నడిపించ బడతాడని మీరు తెల్సుకోవాలని నేను ఆశిస్తున్నాను. ''క్రీస్తులో నివసించు'' అను గ్రంథాన్ని రచించినప్పుడు అందులో నేను వ్రాసిన వాటన్నిటినీ నా జీవితంలో క్రియాత్మకంగా అనుభవించ లేదు. అయితే, ఇప్పుడైనా వాటన్నిటినీ నేను సంపూర్ణంగా అనుభవించానని కూడా చెప్పలేను.''

అపొస్తలుడైన పౌలు కూడా ఇదే భావముతో వ్రాశాడు గదా!;

**''ఇది వరకే నేనం గెలిచితినని యైననం, ఇది వరకే సంపూర్ణసిద్ధి పొంది తిననియైనను నేను అనుకొనుట లేదు గాని నేను దేని నిమిత్తము క్రీస్తు యేసు చేత పట్టుబడితినో దాని పట్టుకొన వలెనని పరుగెత్తుచున్నాను''. (పిలిప్పీ 3:12)**

''**ప్రభువా, నన్ను విరుచుము!**'' అను ఈ అంశం విషయంలో కూడా అదే భావాన్ని నేను మీతో పంచుకొనుచున్నాను. వీటిని వ్రాయాలనే దైవిక భారం నాపై వుంది. నేను సంపూర్ణంగా అనుభవాత్మకం చేసుకోనందువల్ల సులభంగా ప్రక్కకు పెట్టవలసినంతగా సత్యము- అత్యంత స్పష్టము గానూ, అత్యావసరముగానూ వుంది. నేనెంత వరకు తప్పిపోయినా, నేను రాసిన విషయాల్ను నా హృదయాశయంగా చేస్తున్నాను''- **విలియం మెక్ డొనాల్డు**

## విరిగిన వాటికి దేవుడు విలువ ఆపాదిస్తాడు

సాధారణంగా ఏవస్తువైనా పగిలి పోయినప్పుడు దాని విలువ తరుగుతుంది. అసలు వున్న విలువను పూర్తిగా కోల్పోతుంది. పగిలి పోయిన పాత్రలు, సీసాలు, అద్దాలు, సర్వసామాన్యంగా బైట పారవేయబడతాయి. మనం వాడుకునే సామాగ్రిలో చిన్నపగులు లాంటిది లేక వస్త్రములో ఒక చిరుగు కనిపించినా వాటిని తిరిగి అమ్మేవిలువ అత్యంతంగా తగ్గుతుంది.

కానీ ఆధ్యాత్మిక విధానంలో అలా కాదు. విరిగిన వాటి మీద, ప్రత్యేకించి పగిలిన ప్రజలమీద దేవుడు తన విలువను ముద్రిస్తున్నాడు. అంచేత దీనికి సంబంధించిన వాక్యాలను ఇలా చదువుతాం :

**"విరిగిన హృదయముు గలవారికి యెహోవా అసన్నుడు. నలిగిన మనస్సు గలవారిని ఆయన రక్షించును" (కీ. 34:18).**

**"విరిగిన మనస్సే దేవుని కిష్టమైన బలులు, దేవా విరిగి నలిగిన హృదయమును నీవు అలక్ష్యము చేయవు" (కీ. 51:17).**

గర్వాంధులను ఎలా ఎదుర్కోవాలో దేవుడికి బాగా తెలుసు, అయితే ఆయన విరిగి నలిగిన హృదయాలతో దీనులైన వారిని ఎన్నడూ ఎదిరించ లేడు. **"దేవుడు అహంకారులను ఎదిరించి దీనులకు కృప అనుగ్రహించును". (యాకోబు 4:6)** విరిగిన మన స్వభావములతో దేవుని జాలిని, శక్తిని కదిలించేది ఏదో ఒకటి వుంది.



అంచేత మనం పగిలి పోవటమనేది మన జీవితాల్లో దైవాద్భుత ఉద్దేశంలో ఓ భాగం-హృదయంలో పగిలిన అనుభవం, ప్రాణంలో విరిగిన అనుభవం, శరీరంలో కూడా పగిలిన అనుభవమే (II కొరింథీ **4:16-18**).

## మారు మనసు పొందుట విరువబడిన అనుభవము

పాపం విషయంలో పరిశుద్ధాత్ముడు మనల్ని ఒప్పింప జేసే కార్యాన్ని అరంభించినప్పుడు మారుమనసు పొందకముందే ఈ విరుగగొట్టు విధానానికి మనం పరిచయమయ్యాం. మనం నశించిన వారమని. అయోగ్యులమని, నరకపాత్రులమని మనం ఒప్పుకునే స్థితికి ఆయనమనల్ని తెస్తాడు. ఈ మార్గంలో అడుగడుగునా పోరాటం సల్పుతాం. అయితే మన గర్వం చెదిరిపోయి, డంబాలు పలికే మన నాలుక నిశ్శబ్ధమై పోయి, మనలోని తిరుగుబాటు స్వభావం సమసిపోయే దాకా ఆయన మనతో పోరాటం సల్పుతూనే వుంటాడు. శిలువ దిగువ భాగాన దీనంగా పడిపోయి మనం చిట్టచివరకు ఇలా పలుకుతాం; ''యేసు ప్రభూ, నన్ను రక్షించు !'' దేవ దూషకుడిప్పుడు సాధువు గా చేయబడ్డాడు; పాపికి ప్రభువుదొరికాడు, యువ గుర్రం ఇప్పుడు విరువబడింది.

అవును, నిజమే, యువ గుర్రం విరువబడింది. సహజ సిద్ధంగానే యువ గుర్రం దుష్ట స్వభావి, అదుపు ఆజ్ఞలేని జీవి; కళ్ళెమును తగిలించేందుకు ఏ కొంచెం ప్రయత్నించినా వెంటనే అది తిరస్కరిస్తుంది సకిలిస్తుంది, దూకుతుంది, తన్నుతుంది కూడా, చూడ్డానికది అందమైన, అన్నివిధాల దీటైన జంతువే కావొచ్చు కానీ పరిచర్యకు అవసరమైనంతవుట్టుకు దాని స్వభావం విరువ బడే దాకా అది నిరుపయోగంగానే వుండి పోతుంది. అయితే అటు పిమ్మట గుర్రపు స్వచిత్తాన్ని వంచుటకు గాను బాధకరమైన దీర్ఘ విధానం చోటు చేసుకుంటుంది. ఫలితంగా గతకాలంనాటి సహజ స్వభావం



సాధుచేయబడి విధేయత చోటు చేసుకుంటుంది. ఉన్నతమైన చిత్తం చేత గుర్రపు సహజస్వభావం ఒక్కసారి అణచి వేయ బడ్డాక ఆజంతువు తన జీవిత పరమార్ధాన్ని కనుగొంటుంది.

ఈ సందర్భంగా నజరేయుడైన యేసు ఒక వడ్రంగి అని గుర్తు చేసుకోవటం మనకు మంచిది; ఆరోజుల్లో ఆయన కర్రతో కాడులను తయారు చేసి వుండొచ్చు. యేసు వడ్రంగి దుకాణం ముందు తలుపు మీద ఏదైనా బోర్డు వుంటే అది - 'నా కాడులు సరిగ్గా సరిపోతాయి' అని వ్రాసి వుంటుందని ఓ వ్యక్తి బాగా చెప్పాడు, అయితే మనం తెల్సుకోవాల్సిన ముఖ్య విషయమేమిటంటే- మన పరలోకపు దివ్య ప్రభువు ఇంకా కాడులు తయారు చేసేవాడుగానే వున్నాడు; ఆయన ఇలా అంటున్నాడు :

**''నేను సాత్వికుడను, దీనమనసు గలవాడను గనుక మీ మీద నా కాడి ఎత్తుకొని నా యొద్ద నేర్చు కొనుడి; అప్పుడు మీ ప్రాణములకు విశ్రాంతి దొరుకును. ఏలయనగా నాకాడి సుళువు గాను నా భారవము తేలిక గాను వున్నవి''. (మత్తయి 11:29,30)**

ఏది ఏమైనప్పటికీ విరిగి నలిగిన విధేయులైన వారికే కాడులు అవసరము. మనం ఆయన దగ్గర నేర్చుకోకముందు మన స్వచిత్తాలు జయించబడాలి, ఆయనకు అప్పగించబడాలి. మనం ఆయన వలె మారాలి, అలా చేయటం ద్వారానే మనం మన హృదయాల్లో విశ్రాంతి పొందగలం.

## విరిగిన అనుభవ గురుతులు

ఓ ప్రాథమిక ప్రశ్న మనకు ఎదురవుతుంది; " నిజమైన విరువబడిన అనుభవ మంటే ఏమిటి?" అది విశ్వాసి జీవితంలో ఎలా వ్యక్త మవుతుంది? తత్సంబంధిత ప్రాథమిక గుర్తులేవి?"

**1) పశ్చాత్తాపం, ఒప్పుకోలు, క్షమాపణ :**

దేవుని దగ్గర పాపం ఒప్పుకొనుట, మనం ఎవరి యెడల తప్పిదం చేశామో వారి ఎదుట ఒప్పుకొనుటకు సిద్ధపడుట అనేవి మనతలంపుకు వచ్చే మొట్ట మొదటి విషయాలు కావొచ్చు. విరిగిన అనుభవం పొందిన వాడు పశ్చాత్తాప పడుటకు త్వరపడతాడు. అతడు తన పాపాన్ని కనబడకుండా పరుపు క్రిందికి ఊడ్చివేసే ప్రయత్నం చేయడు, "కాలమే అన్నింటినీ మాన్పుతుంది", అనే సాకుతో పాపాన్ని మర్చిపోయేందుకు ప్రయత్నించడు. అతడు దైవసన్నిధికి పరుగెత్తి " నేను పాపం చేశాను" అని బిగ్గరగా విలపిస్తాడు. అటు పిమ్మట అతడు తన దుష్కార్యముల వల్లబాధింపబడ్డ వారి దగ్గరకు వెళ్ళి, " నాదే తప్పు, నేను విచారిస్తున్నాను, మీరు నన్ను క్షమించాల్సిందిగా కోరుతున్నాను", అని మనవి చేస్తాడు. ఒకవైపు క్షమాపణ కోరుట అనే ఈ కార్యం తీరని అవమానక్రియ అని తెల్సినా, మరోవైపు ఇందువల్ల మహానిర్మల మనస్సాక్షితో పాటు వెలుగులో నడిచే అనుభవం పొందు ఎరుక కలిగి వుంటాడు.



వాస్తవ ఒప్పుకోలు పాపాన్ని దాచుకోదు; లేక వాస్తవికతను మార్చివేయదు. విరువబడని అనుభవం లేని ఓ గౌరవనీయురాలు ఓ రకమైన దర్పంతో ఇలా అన్నదట, " ఒకవేళ నేనేదైనా తప్పు చేసివుంటే, క్షమించబడేందుకు నేను సిద్ధంగా వున్నాను;" నిజమైన ఒప్పుకోలు ఇలాంటిది కాదు. అసలైన ఒప్పుకోలు ఇలా చెబుతుంది; " నేను తప్పు చేశాను, నేను ఆ విషయమై విచారిస్తున్నాను, అని చెప్పటానికే నేనిక్కడి కొచ్చాను".

దావీదు జీవితం-పాపము, అపజయాలతో మేఘావృతమై పోయింది, కానీ తన గాఢ పశ్చాత్తాపవైఖరి అతణ్ణి దేవుని హృదయానికి సన్నిహితం చేసింది. కీర్తనలు **32 :51** లో అతని పాపాలు, అపరాధాలు మరో సారి మనం గమనిస్తాం. పశ్చాత్తాప పడేందుకు ఇష్టం లేని సమయంలో అతడు తన జీవితంలో భౌతిక మానసిక, ఆధ్యాత్మిక బలహీన తలతో దౌర్భాగ్యుడుగా కనబడతాడు. జీవితంలో ఏదీ సరిగ్గా జరగలేదు. సమస్తం సరైన సంబంధం లేనట్టు గానే కనిపించింది. చివరకతడు పగిలిపోయాడు. అతడు ఒప్పుకున్నాడు, దాంతో దేవుడు క్షమించాడు, అప్పుడు మళ్ళీ గంటలు మ్రోగనారంభించాయి; పోగొట్టుకున్న తన పాటను దావీదు తిరిగి పొందాడు.

నూతన నిబంధనలో పౌలు, విరువబడిన అనుభవానికి ఓ సాదృశ్యం చూపిస్తున్నాడు. అది తాను యెరూషలేంలో ప్రధాన యాజకుల ముందు, సెన్హెడ్రీన్ సభముందు హాజరైన సమయం, తాను ఎల్లప్పుడూ మంచి మనస్సాక్షితోనే జీవించానని పౌలుచెప్పినప్పుడు ప్రధాన యజకుడు కోపంతో మండిపడి మాట్లడుతున్న ఆ బంధీనోటిపై కొట్టుమని ఆజ్ఞజారీ చేశాడు. ఈ ఆజ్ఞను వ్యతిరేకిస్తూ అపొస్తులుడు ఎదురుమాట్లడాడు, -

“సున్నము కొట్టిన గోడా, దేవుడు నిన్ను కొట్టును, నీవు ధర్మ శాస్త్రము చొప్పున నన్ను విమర్శింప కూర్చుండి ధర్మశాస్త్రమునకు వ్యతిరిక్తముగా నన్ను కొట్ట నాజ్ఞాపించుచున్నావా ? అనెను”. (అపొ.కా. **23:3**) తీక్షణమైన, బాధకరమైన పౌలు గద్దింపుకు పరిచారకులు అదిరిపోయారు. తాను ప్రధాన యాజకుడితో మాట్లాడుతున్నట్టు అతనికి తెలియదా? వాస్తవానికి అపోస్తలుడికి ఆ విషయం తెలియదు, బహుశా అననీయ తన అధికారిక దుస్తులు ధరించిలేడేమో, లేక తన సాధారణ అధికారిక పీఠముపై కూర్చొని లేడేమో; లేక పౌలు బలహీన కనుదృష్టి ఫలితమేమో, కారణమేదైనప్పటికీ చట్టపరంగా నియమించబడి, అధికారంలో వున్న అధిపతిని అతడు ఉద్దేశ పూర్వకంగా దూషించలేదు, అంచేత అతడు త్వర పడి తాను పలికిన మాటల విషయంలో నిర్గ. **22:28** వాక్యభాగం వల్లిస్తూ క్షమాపణ కోరుకున్నాడు, **“నీవు న్యాయాధిపతిని నిందింప కూడదు, నీ ప్రజలలోని అధికారిని శపింప కూడదు,”** అపోస్తలుడు కూడా అల్పమైన విరుబడిన స్థాయికి చేరుకున్నాడు. తన ఆధ్యాత్మిక పరిపక్వతను ప్రదర్శిస్తూ ఇలా చెప్పటానికి సిద్ధపడ్డాడు, **“ నాది తప్పే, ఆ విషయంలో నేను విచారిస్తున్నాను.”**

## 2) సముద్ధరణ :

పిలువబడ్డ ప్రతిచోటా ఈ ప్రథమ ఉద్దేశమైన విరువబడిన అనుభవానికి గల అతి సన్నిహిత సంబంధం- సరైన సముద్ధరణే. ఒక వేళ నేను దొంగిలితే, దేనినైనా భంగం చేస్తే, ఎవరినైనా గాయపర్చి, నా దుష్ప్రవర్తన వల్ల ఎవరినైనా నేను నొప్పిస్తే ఆ విషయంలో నేను క్షమాపణ కోరుట మాత్రమే



సరిపోదు; నష్టపరిహారం కూడా చెల్లించ బడాలని న్యాయం కోరుతుంది. నా ముందు జీవితానికి, అటుతర్వాత రాబోవు జీవితానికి కూడా మారు మనస్సు విషయమై వర్తిస్తుంది.

జక్కయ్య యేసు ప్రభువును స్వీకరించాక, ఒక సుంకపు గుత్త దారుడిగా తానేమి కపట యుక్తులు పన్నాడో గుర్తు చేసుకున్నాడు. ఈ తప్పులన్నీ వెంటనే సరిచేయబడాలని అతనికి నేర్పింది ఒక దివ్య భావమే. అంచేత అతడు ప్రభువుతో ఇలా అన్నాడు; **“..... నేనెవరినైనా మోసము చేసిన యెడల, అతనికి నాలుగంతలు తిరిగి ఇచ్చెదను”**, ఇక్కడ వినియోగించబడిన ‘యెడల’ అనుమాటలో ఎటువంటి సందేహం గానీ తీర్మాన రాహిత్యం గానీ అగుపించదు. దీని అసలు భావమేమిటంటే-“ నేను ఎక్కడెక్కడ, ఎవరెవరికి, ఏమేమి మోసం చేశానో దానికి నాలుగింతలు తిరిగి ఇచ్చివేస్తాను”, సముద్ధరించబడుటకు తాను చేసిన నిర్ణయం అతడు పొందిన మారుమనస్సు ఫలితమే. “నాలుగంతలు” అనేది అతని నూతన జీవిత శక్తికి ప్రామాణికము.

సముద్ధరణకు అసాధ్య సమస్యలుకూడా వున్నాయి, లెఖ్కల పత్రాలు ధ్వంసం చేయుబడుట, కాలగమనంలో ఖచ్చితమైన డబ్బు వివరాలు విస్మరింప బడుటలాంటివి. ఇవన్నీ దేవుడికి బాగా తెలుసు. ప్రతి సందర్భంలోనూ సాధ్యమైనంత మట్టుకు మనం తిరిగి చెల్లించాలని దేవుడు ఆశిస్తున్నాడు.

అయితే ఈ కార్యాన్ని ఎల్లప్పుడూ యేసు ప్రభువు నామంలోనే చేయాలి. “నేనే ఈ వస్తువును దొంగిలించాను, ఇందును బట్టి నేను

చింతిస్తున్నాను, కానీ ఇప్పుడు నేను దీని ఖరీదు తిరిగి నీకు చెల్లించాలనుకుంటున్నాను,'' అని మాత్రమే చెప్పి అలా చేయక పోతే అందులో దేవునికి ఎలాంటి మహిమ వుండదు. ''ఇటీ వలనే నేను యేసు ప్రభువు నందు విశ్వాసముంచి క్రైస్తవుడనయ్యాను. ఐదు సంవత్సరాల క్రితం మీ దగ్గర నేను దొంగిలించిన కొన్ని సామానుల గూర్చి ప్రభువు నాతో మాట్లాడుతున్నాడు. దీని గూర్చి క్షమాపణ అడిగి వాటిని తిరిగి మీకు ఇచ్చి వేసేందుకు మీ దగ్గర కొచ్చాను'', అను మాటలతో క్రియాత్మక సాక్ష్యము అవశ్యకము. ఓ క్రైస్తవుడు చేసే ప్రతి నీతి కార్యం, దాక్షిణ్యా కార్యం రక్షకుడికోసం సాక్ష్య భరితమై అది తనకు గాక దేవునికి మాత్రమే మహిమకరంగా వుండాలి.

**3)** క్షమించే స్వభావం :

> మన యెడల తప్పిదం చేసిన వారిని క్షమించుటకు ఇష్టపడుట విరువబడిన అనుభవంలో ముఖ్యమైన లక్షణము. చాలా సందర్భాల్లో ఇది క్షమించుటకు గానీ, సముద్ధరించుటకు గానీ ఎంతో కృపను వెచ్చిస్తుంది.

నిజానికి ఈ విధానం ప్రకారం ఇతరుల్ని క్షమించుట గూర్చి మనకు హెచ్చరికల నివ్వటంలో నూతన నిబంధన అద్భుతంగా వివరిస్తుంది.

అసలు ఒక వ్యక్తి మన యెడల ఎన్నిసార్లు తప్పిదం జరిగించినప్పటికీ మన హృదయాల్లో అతణ్ణి వెంటనే క్షమించి వేయాలి. (ఎఫెసీ **4:32**) మనం అతని దగ్గరకు వెళ్ళి అతణ్ణి క్షమించినట్టుగా చెప్పం గానీ వాస్తవానికి మన హృదయాల్లో అతణ్ణి క్షమించి వేశాం.



''ఒకడు నా యెడల తప్పు చేసినప్పుడే నేనతణ్ణి క్షమించి వేయాలి. అప్పుడే నా ఆత్మ స్వేచ్ఛగా వుండగలదు. ఒక వేళ ఆతప్పిదాన్ని నేను అతనిపై మోపితే నేను వ్యతిరేకంగా పాపం చేస్తున్నాను, అంతేగాక ఆ వ్యక్తికి వ్యతిరేకంగా పాపం కూడా చేస్తున్నాను; నా యెడల దేవుని క్షమాపణను ప్రమాదంలో ఇరికిస్తున్నాను ఆ వ్యక్తి పశ్చాత్తాపపడినా, కొన్ని మార్పులు చేర్పులతో నా క్షమాపణ కోరినా, కోరకపోయినా ఫరావాలేదు. నేనైతే అప్పటికప్పుడే అతణ్ణి క్షమించి వేశాను. తన తప్పుకు తానే దేవుణ్ణి ఎదుర్కోవాలి; అది అతడికీ దేవుడికీ మధ్య జరగాల్సిన కార్యం కానీ దానితో నా కెలాంటి సంబంధం లేదు. మత్తయి **18:15** మరియు ఇతర వాక్యభాగాల ననుసరించి నేనతనికి సహాయ పడాల్సి వుంది. అయితే ఇది విజయ కారకమైనా, కాకున్నా- అసలిది ఆరంభం కాకముందే నేనతణ్ణి క్షమించి వేయాలి (లెన్సికీ)''.

వెనువెంటనే క్షమించి, మర్చిపోగల కోటాను కోట్ల తప్పిదాలున్నాయి, ఆలా గనక మనం చేయగలిగితే అది నిజంగా విజయమే. ''ప్రేమ... అపకారమును మనసులో వుంచుకొనదు; ఇతరుల దుర్నీతి విషయములో సంతోషించదు'' **(Iకొరింథీ 13:7)**. ఒక సారి ఓ క్రైస్తవ స్త్రీని మరో స్త్రీ ఇలా అడిగింది, '' ఆ దుర్మార్గురాలు ఎంత నీచంగా మాట్లాడిందో నీకుగుర్తు లేదా? దాని కామె ఇలా జవాబిచ్చింది;'' ''ఆమె మాటలు నాకు గుర్తులేవు, అంతే కాదు వాటిని మర్చి పోయినట్టు కూడా నాకు బాగా గుర్తుంది''.

నీ యెడల చేసిన తప్పిదం అధికంగా తీవ్రమైన దైనప్పుడు దానినలా పోనిచ్చుట నీతి దాయకం కాదని నీవు భావిస్తే అప్పుడు నీవు తీసుకోవాల్సిన చర్య ఏమిటంటే- తప్పిదం చేసిన వ్యక్తి దగ్గరకు వెళ్ళి ఆ

విషయం గూర్చి మాట్లాడుటే (మత్తయి 18:15). అతడు పశ్చాత్తాపపడితే నీవతణ్ణి క్షమించాలి. **"...అతడు ఒక దినమున ఏడు మారులు నీకు తప్పితము చేసి ఏడు మారులు నీవైపు తిరిగి- మారుమనసు పొందితినని యెడల అనిన అతని క్షమింపవలెను" (లూకా 17:4)**, తప్పనిసరిగా క్షమించుటకు ఇష్టపడుటే సరైన కార్యము. మనం కూడా అనేక సార్లు అలాగే చేసి, లెఖ్ఖలేనన్ని సార్లు క్షమాపణ పొందాం.

తప్పిదం చేసినవాని తప్పిదం గూర్చి అందరికీ చెప్పుకుంటూ వెళ్ళుట మంచిది కాదని నీవు గమనించు (సామాన్యంగా మనం చేసేది అదే). **"నీవు వెళ్ళి అతని తప్పు గూర్చి చెప్పుము, అది నీకూ అతనికి మధ్య మాత్రమే వుండవలెను"**. విభేదాల్ను సాధ్యమైనంత గుప్తంగా వుంచుట తప్పని సరి.

తప్పిదం చేస్తున్న సోదరుడు తన తప్పు ఒప్పుకోగానే నీవతణ్ణి క్షమించినట్టు అతనికి చెప్పు. అప్పటికే నీవు అతన్ని నీ హృదయంలో క్షమించావు; అయితే ఇప్పుడు నీవు క్షమాపణ వ్యక్త పరుస్తున్నావు.

అయితే ఒకవేళ అతడు పశ్చాత్తాప పడుటకు నిరాకరిస్తే అప్పుడు మత్తయి 18:16 ప్రకారం చేయాలి; **" ఇద్దరు ముగ్గురు సాక్షులనోట ప్రతి మాట స్థిరపరచ బడునట్లు నీవు ఒకరిద్దరిని వెంట బెట్టుకొని పొమ్ము"**.

ఇద్దరు ముగ్గురు సాక్షులతో కూడా వినుటకు అతడు నిరాకరిస్తే అప్పుడా సమస్యను స్థానిక క్రైస్తవ సహవాసం ముందుంచాలి. దీని ఉద్దేశమంతా కక్ష సాధింపు గానీ, శిక్షించుట గానీ కానే కాదు. నొప్పించిన సోదరుణ్ణి సముద్ధరించటమే.



ఇక ఈ చిట్టచివరి ప్రయత్నం కూడా విఫలమైనప్పుడు అతడిక అన్యుడిగానూ, సుంకరిగానూ పరిగణించ బడాల్సిందే. మరో రీతిగా చెప్పాలంటే అతన్ని నీవెంత మాత్రం స్థానిక సంఘ సహవాస సభ్యుడిగా పరిగణించవు. అతడొక క్రైస్తవుడిలా ప్రవర్తించుటలేదు గనుక అతని సొంత జీవితాన్ని బట్టి నీవు అతన్ని అంగీకరిస్తావు. నీవతణ్ణి ఒక అవిశ్వాసిగా లెఖ్ఖిస్తావు. అయితే అతడు పశ్చాత్తాపపడితే వెను వెంటనే నీవతన్ని క్షమించి వేస్తావు ; ఫలితంగా సంపూర్ణసహవాసం తిరిగి నెల కొంటుంది.

క్షమించ లేని స్వభావాన్ని, మరణ పర్యంతం కక్షల్ని మనసులో వుంచుకోవాలనే తీర్మానాన్ని, గతాన్ని మర్చి పోకుండుట లాంటి వాటిని దేవుడు ద్వేషిస్తాడు. రుణగ్రస్థుడైన దాసుని ఉపమానంలో ఈ సత్య తీవ్రత మనకు తెలుస్తుంది (మత్తయి 18:23-35). తాను స్వయంగా అప్పుల్లో తలమునకలై దివాలా తీసిన సమయంలో రాజుగారు అతణ్ణి లక్షల అప్పు నుంచి క్షమించి వేశాడు. అయితే ఇప్పుడతడు అతి కొంచెం అప్పుపడిన తనతోటి సేవకుడ్ని క్షమించుటకు ఇష్టపడటం లేదు. ఇందులోని పాఠం అతి స్పష్టం. తలకు మించిన భారంగా వున్న మన రుణాన్ని దేవుడు క్షమించగా మనకు అత్యల్పముగా అచ్చివున్న ఇతరుల్ని మనం క్షమించాలి.

**4) ప్రతీకారం చేయకుండా తప్పిదాన్ని భరించాలి:**

విరువ బడిన అనుభవానికి ఇతర స్వభావాలు కూడా వున్నాయి, సరైనది చేస్తూ, ప్రతీ కారం చేయకుండా వుండే దీన స్వభావము వాటిలో ఒకటి, ఇక్కడ ప్రభువే దీనికి మౌళిక ఉదాహరణ.

''ఆయన దూషింప బడియు బదులు దూషింప లేదు. ఆయన శ్రమ పెట్టి బడియు బెదిరింపక న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్నుతాను అప్పగించుకొనెను'' (Iపేతురు 2:23).

మనమందరం ఇటువంటి జీవితానికి పిలువబడ్డాం.

''ఎవడైనను అన్యాయముగా శ్రమ పొందుచూ దేవుడు చూచుచున్నాడని ఎరిగి దుఃఖము సహించిన యెడల అది హిత మగును, తప్పిదముకైకై దెబ్బలు తినినప్పుడు మీరు సహించిన యెడల మీకేమి ఘనము? మేలు చేసి బాధపడునప్పుడు మీరు సహించిన యెడల అది దేవునికి హితమగును. ఇందుకు మీరు పిలువబడితిరి'' (Iపేతురు 2:19-20).

'' కృప నుండి మహిమకు''[1] అను తన గ్రంథంలో ముర్డోక్ క్యాంప్ బెల్ వ్రాస్తూ జాన్‌వెస్లీ భార్య గూర్చి ప్రస్తావించాడు. ఆమె తన భర్త జీవితాన్ని అగ్ని గుండంగా మార్చి వేసింది. ఆమె అతణ్ణి అక్షరాలా వెంట్రుకలు పట్టి గది చుట్టూ గంటల కొలది లాగేదట. మెథడిస్టు సిద్ధాంత స్థాపకుడైన ఈయన ఎన్నడూ ఒక్క పరుషపు మాటైనా ఆమెకు వ్యతిరేకంగా పలుకలేదు.

ఓ పర్వత ప్రాంతానికి చెందిన దైవభక్తి గల పరిచారకుడి గూర్చి కూడా క్యాంప్ బెల్ చెప్పాడు. '' అతడొక కఠినాత్మురాలైన స్త్రీని

1. లండన్: సత్యధ్వజము సంస్థ; 1970 పేజీ 149.



వివాహమాడాడు. ఒకరోజతడు తన గదిలో కూర్చొని బైబిలు చదువు కుంటున్నాడు. తటాలున తలుపు తెరుచుకుంది, అతని భార్య గదిలో ప్రవేశించి తన చేతిలోని గ్రంథాన్ని బలవంతంగా లాగి మంటల్లో పడేసింది, అతడామె ముఖంలోకి చూస్తూ నెమ్మదిగా ఇలా అన్నాడు; '' ఇంత కన్నా అధికమైన వేడి మంట దగ్గర నేనెన్నడూ కూర్చోలేదు''. ఈ జవాబు ఆమె కోపాన్ని త్రిప్పి కొట్టింది. అప్పట్నుంచి ఓ నూతన దయాజీవితం ఆమెలో ఆరంభమైంది. అతని పాలిటి యెజెబెలు ఇప్పుడు లుదియగా మారిపోయింది. ముల్లు ఒక పుష్పముగా మారింది''.

ఓ గొప్ప దైవజనుడిలా అన్నాడు-''మనం నిష్కారణంగా ఖండించబడి, శిక్షింపబడుతూ, మౌనంగా వుండుట లోతైన అత్యంత దీన త్వానికి ప్రతీక. అవమానము, తప్పిదాల అడుగున మౌనంగా వుండుట అతి విశిష్టమైన మన ప్రభుని అనుసరించుటే, ''అయ్యో, ఓ నా ప్రభువా! నిష్కారణముగా నీవెన్ని విధాల శ్రమలు పొందావో నేను గుర్తు చేసుకొన్నప్పుడు నన్ను నేను సమర్థించుకుంటూ, సాకులు చెబుతూ వుండటంలో నేనెంత త్వరపడుతున్నానో, నా జ్ఞానేంద్రియాలు ఎక్కడున్నాయో నాకు తెలియటం లేదు. నీ గూర్చి ఎన్నో చెడుమాటలు,చెడు విషయాలు చెప్పినప్పుడు, భావించినప్పుడు- ఇక నా గూర్చి ఎవరైనా ఏదైనా మంచి చెప్పాలనీ, ఆలోచించాలనీ నేను కోరుకొనుట సాధ్యమా?''

(సహన జీవితం, జె. అల్లెన్ బ్లెయిర్, పుట 353,4)

**5) మంచి తనం తో దుష్టత్వానికి చెల్లుబడి :**

విరువబడిన జీవన విధానంలో ఒక అదనపుటడుగు- తప్పిదాన్ని సహనంతో భరించుటే గాక ప్రతి తప్పిదాన్ని దయతో బహూకరించుట.

**"కీడుకు ప్రతి కీడు ఎవనికిని చేయవద్దు, మనుష్యులందరి దృష్టికి యోగ్యమైన వాటిని గూర్చి ఆలోచన కలిగి వుండుడి". "...నీ శత్రువు ఆకలిగొనియుంటే అతనికి భోజనము పెట్టుము, దప్పిగొని యుంటే దాహమివ్వుము. ఆలాగు చేయుట వలన అతని తల మీద నిప్పులు కుప్పగా పోయుదువు. కీడువలన జయింప బడక మేలు చేత కీడును జయించుము".**

**(రోమా 12:17, 20,21)**

భారత దేశపు వీధిలో ఒక ఏనుగు తన యజమానుడి చేత నడిపించబడుట నాకెప్పుడూ జ్ఞాపకమొస్తుంది. ఆ మదపుటేనుగు తన ఇష్టానుసారంగా తిరుగ కుండా వుండేలా దాన్ని తన చిత్తానుసారంగా నడిపించేందుకు మావటివాడు పదునైన ఉక్కు అంకుశాన్ని పట్టుకున్నాడు. ఉన్నట్టుండి పట్టు తప్పిన తన చేతిలోని అంకుశం కాస్తా టంగుమని క్రింద పడిపోయింది. అప్పుడు దీర్ఘశాంతం నేర్చుకున్న ఆ ఏనుగు, చుట్టూ తిరిగి పడి పోయిన అంకుశాన్ని వెదికి తన తొండముతో అందుకొని దాన్ని మళ్ళీ తన యజమానుడికి అందించింది. ఒక వేళ ఏనుగులు క్రైస్తవులైతే ఆ ఏనుగు తప్పని సరిగా ఓ క్రైస్తవుడి వంటిదే.

**6) తన కన్నా అధికంగా ఇతరులను గౌరవించుట:**

విరిగిన స్వభావ అనుభవంలో- తన కన్నా అధికంగా ఇతరుల్ని గౌరవించు లక్షణమున్నది (పిలిప్పీ **2:3**). అబ్రహాం



జీవితంలో జరిగిన ఓ సంఘటన ద్వారా దీన్ని మనం దృష్టాంతంగా చూస్తున్నాము (ఆ.కాం. **13:1-13**). అతడు లోతుతో కలిసి ఐగుప్తు నుంచి నెగెబుకు, అటుపిమ్మట అక్కడ్నుంచి బేతేలుకు తమ కుటుంబాలతో ఆస్తిపాస్తులతో చేరుకున్నాడు. అబ్రహాం లోతులు ఇద్దరికీ అపారమైన గొర్రెల మందలు, పశుసంపద వుంది. త్వరలోనే పచ్చిక బయళ్ళ విషయంలో వారి జీతగాళ్ళ మధ్య కలహం చెలరేగింది. ఈ కారణంగా అబ్రహాం ఇప్పుడు ఒక్క అడుగు ముందుకు వేసి అన్నాడు; "లోతూ, ఇటు చూడు,- కొద్ది పాటి పచ్చిక కోసం బంధుత్వం భగ్నం కాకూడదు. నీ కిష్టమైన పచ్చిక బయలు భూభాగాన్ని నీవు కోరుకో; నేను నామందల్ని మరోచోటికి నడిపించుకుంటాను". ఫలితంగా లోతు యొర్దాను లోయలోని తన కంటికి ఇంపైన పచ్చని పచ్చిక బీళ్ళను ఎన్నుకున్నాడు- అవి సొదమకు అతి సమీపంగా వున్నాయి. విశాల హృదయుడైన అబ్రహాము కానాను ప్రాంత అంతర్భాగానికి వెళ్ళాడు. అంచేత పాత నిబంధన కాలానికి సంబంధించిన ఓ భక్తుడు పెంతెకొస్తు అనుభవానికి ఆవల వుంటూ పౌలు చెప్పిన భావాన్ని క్రియాత్మకంగా మనకు ప్రదర్శించాడు:

**"సహోదర ప్రేమ విషయంలో ఒకని యందొకడు అనురాగము గలవారై ఘనత విషయంలో ఒకనినొకడు గొప్పగా ఎంచుకొనుడి". (రోమా 12:10)**

7) సరైన విధేయత:

ఇది ఇంతటితో ముగియటం లేదు. తన చిత్తాన్ని అంగీకరించుటలోనూ, విధేయత చూపుటలోనూ మనం విరిగి నలిగిన అనుభవం లోకి రావాలని దేవుడు ఆశిస్తున్నాడు. కీర్తన కారుడు దీన్ని ఇలా సంక్షిప్తీకరిస్తున్నాడు:

**''బుద్ధి జ్ఞానము లేని గుర్రమువలెనైనను, కంచరగాడిద వలెనైనను మీరు ఉండకుడి, అవి నీ దగ్గరకు తేబడునట్లు వాటినోరు వారుతోనూ, కళ్ళెము తోనూ బిగింపవలెను''.**

**(కీ. 32:9)**

బలమైన గుర్రం దూకుడు స్వభావము కలిగి వుంటుంది; గాడిద మొండి తనానికి, నిరాకరించు తిరుగు బాటు స్వభావానికి గుర్తుగా వుంది. అంచేత దేవుని చిత్తం విషయంలో మనకు రెండు ప్రమాదాలున్నాయి. స్పష్టమైన గమ్యం లేకుండా ముందుకు సాగుట, పంపబడకుండానే పరుగెత్తుట అనే రెండూ సాధ్యములే. అంత మాత్రమే కాదు, స్పష్టమైన దేవుని నడిపింపును బుద్ధిపూర్వకంగా ఎదిరించుట కూడా సాధ్యమే.

దీనికి యోనా మంచి ఉదాహరణ. దేవుడతనికి చేయమని చెప్పిన పనిలో ఎటువంటి పొర పొచ్చము లేదు. నినెవె పట్టణానికి వెళ్ళి అక్కడి ప్రజలకు మారుమనసు గూర్చి ప్రకటించుట కోసం అతడు పిలువబడ్డాడు, గానీ అతడింకా విరువ బడిన అనుభవం పొందలేదు. అంచేత అతడు మరో దిశగా వెళ్తున్న ఓడ ఎక్కాడు. తిమింగలం గర్భంలో పీడకల లాంటి అనుభవం తర్వాత అతడు అసలు దేవుని చిత్తమనేది మంచిది, అంగీకార యోగ్యము, పరిపూర్ణమైనదని రుజువు చేసేందుకు ముందుకు సాగి వెళ్ళాడు. **(రోమా 12:2)**



యేసు అధిరోహించి యెరుషలేము లోకి వెళ్ళిన గాడిద గూర్చి మనం విరిగిన స్వభావం విషయంలో అద్భుతమైన భావ దృశ్యాన్ని చూడగలం (లూకా **19:29-35**). అప్పటి దాకా ఏ మనుష్యుడు ఆ జంతువు పై ఎక్కి స్వారీ చేయలేదు; అంచేత ఎవరైనా ఎక్కడానికి ప్రయత్నించినప్పుడు అది కోపంతో ఎదురు తిరిగి మొండికి వేసే సూచనలున్నాయి. అయితే ఎప్పుడైతే రక్షకుడు దాన్ని సమీపించాడో అప్పటి కప్పుడే అది విరిగిన స్వభావ అద్భుతాన్ని అనుభవించింది. గాడిద స్వభావం సంపూర్ణగా మారిపోయింది, తన సృష్టికర్త చిత్తానికి లోబడే తత్వాన్ని సంతరించుకుంది.

విరిగిన స్వభావం గూర్చి చర్చించుటకు గాను మట్టిముద్దను సాదృశ్యంగా ఉపయోగించుట మిశ్రిత అలంకారికము కావొచ్చు. అయినప్పటికీ కుమ్మరి వాడి చేతిలోని మట్టిముద్ద, దేవుని చేతిలో వున్న విరిగి నలిగిన మనిషికి మంచి సాదృశ్యము-అది అన్నివిధాల వంగు స్వభావము, ఆయన వ్రేళ్ళు వొత్తిడికి అనుగుణంగా స్పందించు విధేయత కలిగి వుంటుంది. అంచేత విధేయుడైన భక్తుని జీవితంలో దైనందిన ప్రార్థన ఈ విధంగా వుంటుంది:

నీ మార్గమే ఓ ప్రభూ ! నీ మార్గమే !

నీవు కుమ్మరివి; నేను మట్టిముద్దను;

నీ చిత్తాను సారంగా నన్ను మల్చుము; తయారుచేయుము
నేను వేచి వున్నాను, అప్పగించుకున్నాను,

స్థిరంగా వున్నాను.

నీ మార్గమే ఓ ప్రభూ ! నీ మార్గమే !

నన్ను పరిశోధించు, పరీక్షించు నాయకా ఈ రోజే

హిమము కంటే తెల్లగా ప్రభూ, ఇప్పుడే నన్ను కడుగు నీ సన్నిధిలో నేను దీనుడనై వంగి వున్నాను.

నీ మార్గమే ఓ ప్రభూ ! నీ మార్గమే !

గాయపడ్డాను, అలసి పోయాను-సహాయం చేయి,

ప్రార్థిన్నాను! శక్తి - సర్వశక్తి - నిరభ్యంతరంగా నీదే! నన్ను స్పృశించి, స్వస్థపర్చుము- దివ్యరక్షకా!

నీ మార్గమే ఓ ప్రభూ ! నీ మార్గమే !

నా బ్రతుకును నీ స్వాధీనంలో పెట్టుకో !

అందరూ చూచే దాకా నీ ఆత్మతో నింపు,

క్రీస్తు మాత్రమే, ఎల్లప్పుడు నాలో జీవిస్తున్నాడు !

**8) ప్రజల అభిప్రాయానికి చచ్చి పోవాలి :**

విరిగిన స్వభావంలో ఇంకా ఎన్నో లక్షణాలున్నాయి. ఉదాహరణకు- ప్రపంచ ప్రజల పొగడ్తలకు, ఆశ్చర్య జనిత దృష్టికి చచ్చిన స్థితికి మనం రావాలి. డబ్ల్యు. పి. నికొల్సన్ రక్షణ పొందిన అనంతరం అతడొక రక్షణ సైన్య సంస్థకు చెందిన అధికారి క్రింద పనిచేయాల్సి వచ్చింది. ఒక రోజు ఆ అధికారి నికొల్సన్ ను పిలిచి ''నీవు నిజంగా దేవుని విషయంలో తీవ్రంగా వున్నట్లయితే- మన పట్టణ కేంద్రంలో ఈ బోర్డు ధరించి కొన్ని



గంటలు నిలబడాలి'', అని చెప్పాడు. ''ప్రజల అభిప్రాయానికి నేను చచ్చిపోయాను'' అని పెద్ద అక్షరాలతో ఆ బోర్డు పై వ్రాసి వుంది. ఈ అనుభవం ద్వారా నికొల్సన్ జీవితంలో క్రీస్తుసేవా విషయమై ధైర్యసాహసాలు, నిర్భయ ప్రభావం చోటు చేసుకున్నాయి.

**9) ఇతరుల పాపాలను మన పాపాలుగా ఒప్పుకొనుట :**

దేవుని ప్రజల పాపాలను మన పాపాలుగా ఒప్పుకునే విధంగా మనం విరుగగొట్ట బడాలి. దానియేలు చేసిన కార్యం ఇదే (దానియేలు **9:3-19**). అతడు జాబితాగా వల్లించిన పాపాల్లో చాలా మట్టుకు తాను అపరాధిగా ఎంచబడలేదు. అయితే అతడు తన ప్రజల పాపాలు తన పాపాలుగా ఎంచుకునేంతగా ఇశ్రాయేలు దేశంతో తన్నుతాను అతి సన్నిహితంగా గుర్తించుకున్నాడు. ఈ అనుభవం ద్వారా అతడు- ''మన పాపములను, అపరాధములను, చింతలను తీసి వాటిని తన పాపములుగా ఎంచుకొని మోసిన వ్యక్తిని'' మనకు గుర్తు చేస్తున్నాడు. ఇతర విశ్వాసుల్ని విమర్శిస్తూ, వారివైపు వ్రేలుచూపుటకు బదులు మనం వారి పాపాలను మన పాపాలుగా ఒప్పుకోవాలను పాఠము ఇందులో వుంది.

**10) ఆపదలో నెమ్మదిగా వుండుట :**

జీవితంలో చోటు చేసుకునే ఆపదల్లో నెమ్మది, శాంతిస్వభావము కలిగి వుండుట- విరువ బడిన అనుభవంలో చిట్టచివరి లక్షణము. అనివార్య జాప్యం జరిగినప్పుడు దాని

గూర్చి రుస రుస లాడటమే మన సహజ ప్రతి చర్య. దైనందిన జీవితంలో నిరోధకాలు చోటు చేసుకున్నప్పుడు మామూలుగా కోపము, అసహనము కలుగుతుంటాయి. యంత్రాలు చెడి పోవటం, ప్రమాదాలు అతి సులభంగా మన మనసుల్ని పాడు జేసి మనలో ఉద్వేగ జ్వాలల్ని రేపుతాయి. కాలమాన పట్టిలో మార్పులు, జీవితంలో నిరుత్సాహ జనకముల వంటివి మనలో నిక్షిప్తమైయున్న పనికి మాలిన స్వభావాన్ని వెలికి తెస్తాయి, ఇంకా కుదించి చెప్పాలంటే కోపావేశం, అసహనం, గందరగోళం, ఉద్వేగం లాంటివి క్రైస్తవ సాక్ష్యానికి పతన కారణాలు. ఇటువంటి సమస్యాత్మక ఆపదలు సంభవించినప్పుడు దేవుడు తన సొంత ఉద్దేశాల కారణంగా జీవన పరిస్థితుల నన్నింటినీ పరిపాలిస్తున్నాడని ఎరిగి నెమ్మదిగా వుండటమే విరువబడిన అనుభవానికి మార్గము. దారిలో కారు టైర్ పంచరైతే అదో రకమైన ఆశీర్వాదమే కావొచ్చు; రహదారిపై ప్రమాదం నుంచి తప్పించుటకు అది దోహదమై వుండొచ్చు. నీవు ఆశించిన ఓ అతిథి నీవు చేస్తున్న ప్రభువు సేవను నిరోధిస్తే - వాస్తవానికి దీని ద్వారా ఇప్పుడు నీవు చేస్తున్న ప్రాముఖ్యమైన సేవను దేవుడు నీకు అనుగ్రహించ బోతున్నాడేమో. బహుబాధాకరము, ప్రతికూలము, ధననష్టము కలిగించు ప్రమాదం సువార్త స్వీకరించుటకు పరిశుద్ధాత్మ చేత సిద్ధపర్చ బడిన అనేకులతో నీవు కలిసేందుకు దోహదం చేయవచ్చు. ఇటు వంటి పరిస్థితులన్నింటిలోనూ మనం అసహనానికి బదులు శాంతం, తిరుగుబాటుకు బదులు విరుగ గొట్టబడిన అనుభవంతో వెంటనే ప్రతి చర్య చేయాలని ప్రభువు మనల్ని కోరుతున్నాడు.



విరుగగొట్ట బడుట అనే అనుభవానికి గల భావానికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. ఈ జాబితా సలహాత్మకమే గాని, ఇదే సమస్తం కాదు. ప్రభువు సహవాసంలో మనం నడుస్తుండగా శిలువ దిగువభాగాన మనం విరిగి నలిగిన అనుభవాన్ని పొందవలసిన మన జీవిత విభాగాలను దేవుడే చూపిస్తాడు. అటువంటి ప్రతి విధమైన ప్రత్యక్షతలోనూ ఆయన మనకు అవసరమైన కృపను అనుగ్రహిస్తాడు.

**''ఈ విషయంలో మీరు ఇచ్ఛయించుటకును, కార్యసిద్ధికలుగ జేసి కొనుటకును తన దయా సంకల్పము నెరవేరుటకై మీలో కార్య సిద్ధి కలుగ జేయుద వాడు దేవుడే'' (పిలిప్పీ 2:13).**

## విరువ బడుటలో వున్న భావ రాహిత్యము

విరువ బడుటకు గల లక్షణాలను గమనించిన తర్వాత ఈ పదానికి గల భావరాహిత్యమేమిటో కూడా మనం వివరించాలి. ఓ వ్యక్తి పిరికి పందగానూ, మడ్డిమొఖంతో మొద్దబ్బాయిగానూ, వెన్నెముక లేని చేపగానూ తయారవుతాడని దీని భావము కాదు. అతడొక శక్తిహీనమైన సున్నాగానూ, తన చుట్టురా వున్న వారిపై ఎటువంటి ప్రభావం చూపని పనికి మాలిన వాడుగానూ మారతాడని కూడా దీనిభావం కాదు. దీనికి వ్యతిరిక్తమైనది ఏదైనా వుంటే అదే సత్యము. బలమైన సత్ప్రవర్తనకు గల అతి విశిష్ట స్వభావాల్లో విరువబడు అనుభవం ఒకటి. విరువబడని ఏ క్రమ శిక్షణనూ ఇది అనుమతించదు. దీనికి వ్యతిరిక్తముగా అన్ని సహజ లక్షణాలు లేచినప్పుడు క్రీస్తును పోలి వుండేందుకు ఎటువంటి స్వయం-నిగ్రహం కావాలో !

విరువబడిన అనుభవం వున్నవారు వాద ఫలితంగా ఒప్పించే స్వభావం గలవారు. మరో లోకానికి చెందిన బలంతో ఆపలేని మహాశక్తి చేత వారు ప్రజల్ని మౌనంగా ప్రభావితం చేస్తారు. అది స్వయం-విరుద్ధంగా కనిపిస్తుంది; అది ఇలా వుంటుంది; **''నీ మృదుత్వము నన్ను గొప్పవాడిగా చేసెను''. (కీ. 18:35)** అవసరమొచ్చినప్పుడు వారు కోపపడగల సమర్థులు, దీనిని మన ప్రభువు జీవితంలో చూస్తాం. కొరడా పట్టుకొని దేవాలయంలో అక్రమ డబ్బు మార్పిడి వ్యాపారం చేస్తోన్న వారిని ఆయన బైటికి పారద్రోలాడు. ఆయనకు వ్యక్తిగతంగా తప్పిదం చేసినందుకు కాదు గానీ, తన తండ్రి



గృహం అగౌరవ పర్చబడినందుకే ఆయన కోపాగ్ని రగిలింది. ''దేవుని కోసం ఆయన సింహం, తనకోసమైతే గొర్రెపిల్ల'' అని చెప్పబడిందిగదా! హతసాక్షుల్లోనూ, సంస్కర్తల్లోనూ చాలామంది నిజంగా విరిగి నలిగిన హత సాక్షుల్లోనూ, సంస్కర్తల్లోనూ చాలామంది నిజంగా విరిగి నలిగిన అనుభవం గలవారే అయితే వారు బలహీనులని, ప్రభావ రహితుని ఎవ్వరూ వారి గూర్చి చెప్పనే చెప్పరు.

# తరాల అంతరం

సంతానం-తల్లిదండ్రులు అనే సంబంధంలో విరుగ గొట్ట బడిన అనుభవాన్ని అభ్యాసం చేయుట అతి కష్ట తరమైన విషయంగా కనిపిస్తోంది. పడిపోయిన మానవ స్వభావపు తప్పు దారి వింత పోకడల వల్ల మనం మన సొంత సన్నిహిత సంబంధులనే ప్రేమించని వారముగా అగుపిస్తాము. తల్లులపై తమకున్న శత్రు భావం చేత చాలామంది క్రైస్తవ అమ్మాయిలు తమలో తాము తీరని పోరాటం సల్పుతుంటారు. అ సంఖ్యాక క్రైస్తవ అబ్బాయిలు తమ తల్లిదండ్రుల యెడల చాలా కాలంగా మర్యాదగా ప్రవర్తించరు. తరాల అంతర ఉనికిని ఎవ్వరూ కాదనరు; వాస్తవానికిదో అంతు లేని అగాధం. తల్లి దండ్రులు తమను అర్థం చేసుకోవటం లేదని, తమను అన్ని విధాల అణచి వేస్తున్నారని, కాలాను గుణంగా ప్రవర్తించటంలేదని, వారు తమపై పెత్తనం చెలాయిస్తున్నారని యువజనులు ఎప్పుడూ ఫిర్యాదు చేస్తూ వుంటారు. ఇదే గాక చాలా మంది యువజనులు పైవైఖరుల్ని అధిగమించినట్టు తమ జీవితాల్లో అగుపించలేక తమ చుట్టూ వున్న ప్రజల్లో మార్పు రావటం కోసం ఏదోపైపైకి మాత్రమే క్రైస్తవుల్లా నటిస్తున్నామనే అపరాధభావం, సిగ్గు, బిడియాలతో కృంగి పోతుంటారు. తమ తోటి వారితోనూ, ఇతర పెద్దల తోనూ తామెంతో ప్రియంగా, సన్నిహితంగా ప్రవర్తిస్తూ అదే సమయంలో తమ సొంతకుటుంబాల్లో చల్లబడిపోయి, కఠినంగా మారుట విపరీత ఓటమిగా వారు గుర్తిస్తారు. తమ తల్లిదండ్రులు చచ్చిపోతే బాగుండునని తాము తరచుగా ఆశించుట వల్ల తమ్మును తామే ద్వేషించు కుంటారేగాని ఈ వైఖరిని బ్రద్ధలు కొట్టి పశ్చాత్తాప పడుట అనేది అతిచేదైన మాత్రగా మారిపోయింది.



దేవుడు ఇశ్రాయేలు ప్రజలకు పది ప్రాథమిక ఆజ్ఞలు జారీ చేయటం ఉద్దేశ రహిత కార్యం కాదు. వీటిలో ఒకటి ప్రత్యేకించి ఈ కష్టతరమైన, అతి సున్నిత మానవ సంబంధ బాంధవ్యాన్ని సంధిస్తుంది.

''నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీతండ్రిని, తల్లిని సన్మానించుము''. **(నిర్గ 20 :12)**

పౌలు నూతన నిబంధనలో మళ్ళీ ఇదే ఆజ్ఞను పేర్కొంటున్నాడు :

''పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి, ఇది ధర్మమే నీకు మేలు కలుగునట్లు నీ తండ్రిని తల్లిని సన్మానింపుము, అప్పుడు నీవు భూమి మీద దీర్ఘాయుష్మంతుడవగుదువు; ఇది వాగ్దానంతో కూడిన ఆజ్ఞలలో మొదటిది''. **(ఎఫెసీ . 6:1-3)**

తల్లిదండ్రులను సన్మానించి, విధేయత చూపట మంటే వారు చెప్పినట్టు వినటం మాత్రమే కాదు గానీ వారిని గౌరవించటం, నమ్రతగా ప్రవర్తించటం, అవసరమైతే వారి సంక్షేమం కోసం పాటుపడటమని భావము. పౌలు నాలుగు హేతువులు చెబుతున్నాడు :

'' • అది సరైనది

• అది యువజనుల మంచి కోసమే

• అది వాక్యాను సారమైనది

• అది దీర్ఘాయుష్షును కలిగిస్తుంది''.

కానీ ఇది ఇతరుల జీవితాల్లో సాధ్యమేమెా గానీ తమ సొంత జీవితాల్లో మాత్రం అసాధ్యమని ఎంతో మంది యువకులు ఒప్పుకుంటారు. తమ తల్లిదండ్రులు మరీ నియంతలుగా మారిపోయారనీ, మరింత విపరీత యదార్థ వర్తను లైపోయారని వారు వాపోతారు.

ఇప్పుడు కావాల్సిందల్లా- విరిగిననలిగిన స్వభావమే, దాని భావమేమిటంటే- తండ్రి దగ్గరకు గానీ, తల్లి దగ్గరకు గానీ లేదా ఈ ఇరువురి దగ్గరకు గానీ వెళ్ళి ''చూడండి అమ్మానాన్నలూ, నేనింతకాలం మీతో సరైన సంబంధం లేకుండా వ్యతిరిక్తంగా ప్రవర్తించినందుకు చింతిస్తున్నాను. నా కోసం మీారు చేసిన సమస్తం విషయంలో నేను మీకు వందనాలు కూడా చెప్పలేదు; కానీ ఆ పని ఇప్పుడు చేయాలనుకుంటున్నాను. మన మధ్య తిరుగుబాటు అడ్డుగోడల్ని నేనే నిర్మించాను; మీరు నన్ను క్షమించండి-దేవుని సహాయంతో ఇక భవిష్యత్తులో పరిస్థితులు గతానికి భిన్నంగా వుండాలని నేను కోరుకుంటున్నాను'' అని చెప్పటమే.

ఈ తరాల అంతరానికి అవసరమైన వంతెన నిర్మాణానికి కాలాతీత సాదృశ్యం తప్పిపోయిన కుమారుడి కథే. కృతజ్ఞతా హీనుడైన ఈ కుమారుడు తండ్రి మరణం దాకానైనా వేచి వుండలేకపోయాడు. తనకు కావాల్సిన ఆస్తి ఇప్పుడే కావాలని పట్టు పట్టాడు. సరే, ఆస్తి తీసుకున్నాడు, దూర దేశం వెళ్ళి ఆ ధనంతో బ్రతుకుతున్నాడు. అటు పిమ్మట అర్థరాత్రి విందులు, త్రాగుడు, అల్లరిపనులు, లైంగిక అత్యాచారాలు, ఇంకా ఎన్నోఇతర వ్యసనాలన్నీ అతని వెంటబడ్డాయి. చివరకు డబ్బు మొత్తం అయిపోయింది; డబ్బుతో పాటు స్నేహితులు కూడా వెళ్ళిపోయారు. ఒకప్పుడు విచ్చల విడిగా డబ్బు ఖర్చు చేసిన



ఇతడికిప్పుడు బ్రతుకు దుర్భరమైపోయింది. తన తండ్రి ఇంటిలో నిశ్చింతగా మెరుగైన జీవితాలు జీవిస్తున్న జీతగాళ్ళ గూర్చి అతడుఆలోచింపసాగాడు. అతడెంత మూర్ఖుడు ! ఇల్లు విడిచి వచ్చేటప్పుడు నిండుగావున్న ఇతడు, ఇప్పుడు ఖాళీగా తిరిగి వెళ్తున్నాడు. అప్పుడు హక్కుల కోసం పోరాడు బైటికి వెళ్ళాడు; ఇప్పుడేమెా కృపకోసం అడుక్కుంటూ తిరిగి వస్తున్నాడు. తలెత్తుకొని ఇల్లుదాటి వెళ్ళాడు; అయితే ఇప్పుడు తలదించుకొని విరిగి, నలిగిన వాడిగా నేల ప్రాకుతూ ఇంటికి తిరిగి వస్తున్నాడు.

''నాన్నా'', అతడు ఆక్రందనం చేస్తున్నాడు, ''నేను పాపం చేశాను, దేవునికి వ్యతిరేకముగా, నీకు వ్యతిరేకముగా పాపము చేశాను; నీ కుమారుడిగా వుండుటకు నేను యోగ్యుడను కాను ...'' తండ్రి దగ్గర ఒక సేవకుడిగా ఉద్యోగం కోసం అడుక్కునేందుకు, అనేక విధాలుగా, అభ్యర్థించుటకు ప్రయత్నించడు. కానీ అప్పటికే తండ్రి, కుటుంబ సభ్యులందరికీ ఆజ్ఞలు జారి చేస్తున్నాడు. అనతి కాలంలోనే ఈ కుమారుడు నూతన వస్త్రాలు ధరించాడు. అందమైన వ్రేలి ఉంగరం లభించింది; క్రొత్త పాదరక్షలు ధరించి ఇతర భూషణాలంకృతుడె రుచికరమైన క్రొవ్విన దూడ మాంసముతో పాటు పుష్టికరమైన పదార్థాలు పుష్కలముగా వున్న అహారపదార్థాలతో నిండిన గొప్ప విందులో పాల్గొన్నాడు. ఈ అంతరము 'విరిగిన స్వభావం' అను వంతెన నిర్మాణంతో కలుపబడింది. మొట్టమొదట పశ్చాత్తాప హృదయంతో, ఒప్పుకోలుతో కూడిన విరిగి నలిగిన అనుభవం లేకపోతే ఆ కుమారుడు ఎన్నడూ తండ్రి ముద్దును ఎరిగి వుండే వాడు కాడు.

అటువంటి అవమానపూరిత క్షమాభిక్ష తప్ప మరేది ఒక వ్యక్తి యొక్క తిరుగుబాటు స్వభావాన్ని, శత్రుభావాన్ని సరిచేయనేరదు, తల్లిదండుల్ని ఆగౌరవ పర్చేశోధన మరోసారి తనకు ఎదురైనప్పుడు ఆ కుమారుడు వెంటనే తాను పొందిన సిగ్గుకరమైన విరిగినలిగిన అనుభవాన్ని గుర్తు చేసుకుంటాడు. ఇదొక శక్తివంతమైన నిరోధకంగా పని చేస్తుంది.

## వైవాహిక అంతరం

వాస్తవమైన విరిగి నలిగిన స్వభావాన్ని ప్రదర్శించుటకు అతిక్లిష్టమైన రెండవ క్షేత్రం బహుశా భార్య భర్తల సంబంధం కావొచ్చు. ఇది కూడా మనం మన అత్యంత సన్నిహితుల యెడల అ మర్యాదగా ప్రవర్తిస్తూ అదేసమయంలో మనకు అంతగాపరిచయంలేని వారి యెడల అతి గౌరవ మర్యాదల్ను ప్రదర్శించు కార్యంలా వుంది. అనేకసార్లు మనం ఇంట్లో దయ్యాలం, వీధిలో భక్తులం గా కనబడుతుంటాం- ఇది మనం ఒప్పుకోవాల్సిన సత్యం.

వివాహ బంధంలో కలహ కంపనలు సంభవించే అవకాశముందనే సత్యాన్ని బోధిస్తుంది. ఈ సందర్భంగా మనం ప్రత్యేకించి కొలస్సీ. **3:19** గమనిద్దాం;

**"భర్తలారా, మీ భార్యలను ప్రేమించుడి, వారిని నిష్ఠుర పెట్టకుడి"**, భర్తలో భార్యపట్ల పెచ్చు పెరిగి పోయే చేదు భావం ఎన్నడూ అధిగమించరానంత లోతైనది. తరచుగా అతడు అన్ని ప్రయత్నాలు మాని అందులో నుంచి బైట పడుటకు గాను ఎడబాటు లేదా విడాకులు కోరుకుంటాడు.

జానో, జింక్స్ అనే భార్య భర్తల గూర్చిన కథ గమనించండి. మొట్ట మొదటి సారి వారివురు కలుసుకున్నప్పుడు తాము ఒకరి కోసం మరొకరు చేయబడ్డారని తెలుసుకున్నారు. అటుపిమ్మట అవకాశం లభించినప్పుడెల్లా వారిరువురు నెలల తరబడి కలుసుకుంటూనే వున్నారు.

ఆరు నెలల్లో ప్రధానంలో పెండ్లి నిశ్చయమైంది, అటు తర్వాత నాలుగు నెలల్లో వారి వివాహం జరిగి పోయింది.

బంధుమిత్రుల సహకారంతో వివాహం వైభవంగా జరిగింది. వారి దాంపత్య జీవితం ఒక సంవత్సరం వరకు ఆనందంగా సాఫీ గానే సాగింది. అటు తర్వాత ఒకానొక రోజు వాళ్ళ మధ్య భయంకర కలహం చెలరేగింది; తనలో తాను జానో పట్ల అణచుకున్న అమర్యాద, వివాహానికి ముందు జరిగిన వృత్తాంతములను జింక్స్ బైటికి కక్కింది. అతడు కూడా అలాగే చేశాడు. దాంతో ఆకుటుంబ గోడలు బీటలు వారాయి, కిటికీలు బైట ఊడిపడ్డాయి. అటు తర్వాత వారి వైవాహిక జీవితం నిరీక్షణారహిత శిథిలావస్థలో వున్నట్టు కనిపించింది. భార్యపై తనకున్న ప్రేమకన్నా ఆమె పట్ల తనకున్న ద్వేషము, చేదు భావమే అధికంగా వున్నట్టు జానో గ్రహించాడు. (IIసమూ. 13:15)

ఎవరైనా ఓ క్రైస్తవ వివాహ సలహా దారుణ్ణి గానీ మార్గదర్శకుణ్ణి గానీ సంప్రదించమని కొందరు స్నేహితులువారికి సలహా ఇచ్చారు; వారు ఆ ప్రకారం చేశారు కూడా. అయినప్పటికీ అంతరంగంలో దీనత్వం, తగ్గింపు లేని కారణంగా వారి స్వభావాలు కఠినత్వంతో నిండిపోయాయి.

చివరకు జానో విడాకులు కోరాడు కానీ కోర్టులో కేసువేయక ముందే ఓ క్రైస్తవ స్నేహితుడు 'విరిగిన స్వభావ అనుభవం'ను ప్రయత్నించి చూడమని సలహా ఇచ్చాడు. అదే సమయంలో ఆ స్నేహితుడి భార్య జింక్స్ దగ్గరకు వెళ్ళి అదే సందేశాన్ని అందించింది. మీరు ప్రభువు సన్నిధిలో ఒకరి ఎదుట మరొకరు ఎందుకు విరువబడకూడదు? గతాన్ని క్రీస్తు రక్తం క్రింద వుంచి నూతన ఆరంభాన్ని ఎందుకు కోరుకోకూడదు?



వారు ఆ సలహాను పాటించారు; వారు తమ జీవితాల్లో ఎన్నడూ చేసి ఎరుగని కఠిన కార్యమిది. వారిద్దరూ ఏకగ్రీవంగా ఓ సంపూర్ణ ఒప్పుకోలు తీర్మానం చేసుకున్నారు. అక్కడ వారికి ఎటువంటి అడ్డులు గానీ స్వార్థచింతనలు గానీ లేనే లేవు. అది ఆశించదగిన యదార్థ పశ్చాత్తాపమే. వివాహానికి ముందుజీవితంలో తమ పాప కార్యాలకు తామే బాధ్యులని వారివురు సమ్మతించారు. కన్నీటి పశ్చాత్తాపంతో ప్రభువు సన్నిధిలో సమస్తం ఒప్పుకొని మళ్ళీ ఇటువంటిపాపాల కారణంగా ఎన్నడూ పరస్పరం గొడవపడకూడదని ఒక నిబంధన చేసుకున్నారు. పిమ్మట క్షమాపణ పొందినట్టు వారు దైవవాగ్దానాన్ని ఆశ్రయించారు: (Iయోహాను 1:9). అన్ని విషయాల్లోనూ వారు ఆనందంగా పరస్పరం క్షమించుకున్నారు. అంతేగాక తమను తాము క్షమించుకోవాలని కూడా నిశ్చయించుకున్నారు. తమ మోకాళ్ళమీది నుంచి లేస్తూ వుండగా ఓ గొప్ప భారం వారి మీది నుంచి తొలిగిపోయింది. తమ జీవితాల్లో సర్దుబాటుకు అవసరమైన సమయం ఇంకా వుంటుందని వారు గ్రహించారు. అయినప్పటికీ ద్వేషంతో కూడిన కారుమేఘాలు, కలహ భావాలు అదృశ్యములయ్యాయి. కుటుంబ భవిష్యత్తులో ఇంకెన్నడైనా సమస్యలు తలెత్తినప్పుడు విరిగి నలిగిన అనుభవంలో కొనసాగుట అవసరమని వారు గుర్తెరిగారు.

కొన్ని నెలలయ్యాక జానో సాయంకాల వార్తాపత్రిక చాదివి ఇలా చెప్పాడు- ప్రజలు తమ డబ్బు, సమయాల్ని వైవాహిక సలహాదారులు, మానసిక వైద్యులు, ఇతర ఖరీదైన చికిత్సల కోసం అనాలోచితంగా ఖర్చు చేస్తారు గానీ విరిగి నలిగిన స్వభావ అనుభవమార్గాన్ని మాత్రం అసలు ప్రయత్నించారు. ఇదిచాలా వింతైన విషయం, అయినప్పటికీ విరువ బడిన తత్వం లేకుండా మిగతా విషయాలన్నీ ప్రభావరాహిత్యాలే.

## మనమందరం విరువబడాలని దేవుని కోరిక

కానీ పిల్లలు-తల్లిదండ్రుల సంబంధ బాంధవ్యం, భార్యా భర్తల అనుబంధ బాంధవ్యములలో మాత్రమే గాక ఇతర జీవిత విభాగాల్లో కూడా మనం విరుగ గొట్ట బడాలని ప్రభువు కోరుతున్నాడు. ఈ విషయమై దేవుడు పెనూయేలు దగ్గర యాకోబుతో ఎలా పెనుగు లాడాడో అదే విధంగా మనతో కూడా పెనుగులాడతాడు. మన గర్వం, స్వయం చిత్తం, క్షమించలేని స్వభావం, మొండితనం, వదరుబోతుతనం, కొండెములు చెప్పు స్వభావం, లోకసంబంధ ప్రవర్తన, అపవిత్రత, కోపతాపాలు, శరీర కార్యాల వంటి వాటన్నింటినీ విరుగ గొట్టుటకు ఆయన ప్రయత్నిస్తాడు. మన నామధేయమును యాకోబు నుండి ఇశ్రాయేలుగానూ, మోసగాడి నుండి రాజకుమారుడి గానూ, బలహీన పన్నాగాలు పన్ను వాడి నుండి దైవ మానవ శక్తులతో నిండిన వాడిగానూ మార్చాలని దేవుడు ఎదురు చూస్తున్నాడు. ఉదయం అయ్యేదాకా ఆయన మనతో పోరాడి ఎదురు చూస్తున్నాడు. తెల్లవారు పర్యంతం దాకా ఆయన మనతో పోరాడి మన తొడల్ని విరగ్గొడతాడు. అప్పుడే మనం దేవుని చేత వినియోగించబడే ఓ విరిగిన మనిషిలా మన శేషజీవితమంతా కుంటితనంతోనే జీవిస్తాం.

మనం నిందారహితులంగా వుండాలని దేవుడు కోరుతున్నాడు. మనమందరం నిందారహితులుగా వుండాలంటే మనలో ఎవ్వరం పాపరహితులం కాదు. తాను ఏదైనా తప్పు చేసినప్పుడు వెంటనే దానిని సరిచేసుకొను వాడే నిందారహితుడు. తన కోపాన్ని సూర్యాస్తమయ సమయం దాట నివ్వడు. ఒప్పుకోలు, క్షమాపణలతో తన సహవాస సంభాషణల ద్వారాల్ని అతడు దేవునికీ, తోటి మానవులకూ తెరిచి వుంచుతాడు. స్థానిక సంఘ పెద్ద '**నిందారహితుడై**' వుండాలి. (I తిమోతి **3:2**); కానీ క్రైస్తవులందరూ అలాగే వుండాలి.

## ఫలితాల గూర్చి ఆలోచించండి

మనం విరుగగొట్ట బడవలసిన విధంగా విరుగ గొట్ట బడితే, మన వ్యక్తిగత జీవితాల్లో, కుటుంబాల్లో, స్థానిక సంఘాల్లో, వ్యాపార ప్రపంచంలో పరిస్థితి ఎలా వుంటుందో ఒక్కసారి ఆలోచించండి.

మన సొంత జీవితాల్లో అది గొప్పశక్తి, మహాసంతోషం, మెరుగైన ఆరోగ్యంగా వుంటుంది. ఇతరులపై మహా ఆధ్యాత్మిక ప్రభావం చూపిన వారు దీనత్వంలోనూ తగ్గింపులోనూ, క్రీస్తుతో జతచేయబడిన వారు. దేవుని సేవించుటలో వీరు గొప్ప నెరవేర్పును, విశ్రాంతిని కనుగొన్న వారు, ఆధ్యాత్మికంగా మనకు ఏది అవసరమో, ఏదిమంచిదో అది మన శరీర ఆరోగ్యానికి కూడా మంచిదే. ''ఆత్మ నుండి సంపూర్ణముగా తొలగించబడిన మానవశరీర భాగమంటూ ఏదీ లేదు'' అని బ్రిటిష్ వైద్యశాఖ పత్రిక ఓ సారి ప్రకటించింది. నెలల తరబడి రక్తహీనత జబ్బుతో బాధపడ్డ ఓ రోగిని గూర్చి డా. పాల్ టర్నియర్ పై విధంగా చెప్పాడు. దాంతో ఆ బలహీనత అద్భుతంగా వ్యాన వాతీతంగా అదృశ్యమైపోయింది; ఆమె రక్తం మళ్ళీ మామూలు స్థితికి చేరుకుంది. ఆమెలో ఒక ఆధ్యాత్మిక సమస్య వుండేదనీ, అది ఒక దీర్ఘకాలిక పగ అనీ, అమె ఇప్పుడు దాన్ని క్షమించిందని పరిశోధనలు తెలిపాయి, అవును, విరిగినలిగిన స్వభావ అనుభవం ఆరోగ్యానికి మంచిది.

సభ్యులందరూ పరస్పరం సరైన రీతిగా, సన్నిహితంగా ప్రవర్తిస్తూ జీవిస్తోన్న ఓ కుటుంబం గూర్చి ఆలోచించండి. ఆయా సమయాల్లో కొన్ని అపార్థాలు చోటు చేసుకోవచ్చు. అయితే అవి తీవ్ర సంక్షోభం

చెలరేగ జేసేలా వాటిని మనం అనుమతించరాదు. ముద్దు పెట్టుకొను పవిత్ర కళ, అలంకరణ విధానాన్ని ఆ కుటుంబం నేర్చుకుంది. అది యేసు నివసించుటకు ఇష్టపడే కుటుంబంగా వుంటుంది.

స్థానిక సంఘంలో నలిగిన విరిగిన అనుభవం ఉజ్జీవ మార్గం. ఆధ్యాత్మిక వలయంలో ఆశీర్వాద వర్షానికి ముందు సూచనగా విరిగి నలిగిన బాష్పబిందువులు వుంటాయను శాసనం నియమించబడింది. నూతన భవనం, నూతన ప్రచార సభలు, నూతన విధానాల వంటి వాటన్నిటినీ సాధారణంగా మనం మొట్టమొదట ప్రయత్నిస్తాం; అయితే దేవుడు పశ్చాత్తాపం, అవమానాన్ని భరించుట లాంటి వాటి కోసం కనిపెట్టి చూస్తున్నాడు.

**"నా నామము పెట్టబడిన నా జనులు తమ్మును తాము తగ్గించుకొని ప్రార్థన చేసి నన్ను వెదకి తమ చెడు మార్గములను విడిచిన యెడల పరమండలము నుండి నేను వారి ప్రార్థన విని వారి పాపమును క్షమించి వారి దేశమును స్వస్థపరచుదును."**

**(IIది.వృ 7:14)**

ఇక వ్యాపార ప్రపంచంలో "విరిగి నలిగిన స్వభావము"ను ప్రదర్శించుట వలన క్రైస్తవులు ఎటువంటి ముద్ర పొందుతారో ఆలోచించండి. లోకంలోని మానవులు విరిగి నలిగిన వారు కారు; వారుతమ వంటి వారి పై తమ బలమంతటినీ రుద్దాలను కుంటారు. అయితే వారు-కో పాతిరేకంతో ప్రతి చర్య చేయక, తప్పు తమదేనని ఒప్పుకొని,



క్షమాపణ కోరుకుంటూ, యేసుప్రభుని కృపను ప్రదర్శించు వారిని చూచినప్పుడు అబ్బుర పడిపోతారు. తీవ్ర సంక్షోభానికి గురైపడిపోయే పరిస్థితిలో వున్న ఈ నాటి ప్రపంచ వ్యాపార సరళిలో ఇటువంటి సహజాతీత జీవితం క్రీస్తునిమిత్తం బిగ్గరగా మాట్లడుతుంది.

# ప్రభువా, నన్ను విరుచుము !

కొన్ని సంవత్సరాల క్రితం ఓ **మిషనరీ ప్రార్థనా సమావేశం** లో ఆసక్తిపరుడైన ఒక యువ విశ్వాసి ప్రార్థన చేస్తుండగా నేను విన్నాను, ‘‘ ప్రభువా, నన్ను విరుచుము’’. ఆ ప్రార్థన నన్ను కుదిపి వేసింది. అప్పటిదాకా నా జీవితంలో నేనెన్నడూ అటువంటి ప్రార్థన చేయలేదు. అప్పటికైనా అటువంటి ప్రార్థన చేసేందుకు నేను సిద్ధంగా వున్నానో లేదో నాకు తెలియటం లేదు, కానీ ఆ యువ శిష్యుడి హృదయం నుండి ఖుసలు కొడుతూ ప్రవహిస్తోన్న ఆ మాటలు నా జీవితం లో విరిగి నలిగిన అనుభవానికి గల మహత్తర అవసరత విషయంలో నన్ను మేల్కొలిపాయి, ఆధ్యాత్మిక వలయంలో ఇదో బ్రహ్మాండమైన శక్తి వంతమైన విభాగమని ఆమాటలు నాలో ఒక విధమైన అప్రమత్తతను సృష్టించాయి. ఓ ఆశ గల హృదయానికి ఆ మాటలిప్పుడు ఎడతెగని ప్రార్థనగా మారిపోయాయి;

## ‘‘ప్రభువా, నన్ను విరుచుము !’’